www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శుక్రవారం | 10-10-2025 | పేజీలు: 16 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 175 | శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజమాసం, బహుళపక్షం, తిథి: చవితి రా.7:39 తదుపరి పంచమి, నక్షత్రం: కృత్తిక సా.5:31 తదుపరి రోహిణి, వర్జ్యం: ఉ.6:46-8:12, దుర్ముహూర్తం: ఉ.8:31-9:18, మ.12:25-1:12, అమృతఘడియలు: మ.3:22-4:48, రాహుకాలం: ఉ.10:30-12:00, సూర్యోదయం: 6:10, సూర్యాస్తమయం: 5:53 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru


Chintasasidhar Foundation

VISHWA SAMUDRA
CHALLENGE IT. CHANGE IT.

NANDHA GOKULAM
Life School

ప్రభుత్వ-ప్రైవేట్, ప్రజల భాగస్వామ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహోన్నత 'జీరో పావర్టీ - P4' కార్యక్రమానికి అనుగుణంగా



- పిల్లలను ఉపాధి పొందగలిగే, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం
- రైతుల నూకలు (బ్రోకెన్ రైస్) కొనుగోలు చేసి, వారికి ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం
- ఎడ్లు మరియు రైతుల కోసం స్థిరమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడం


శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి

అక్టోబర్ 10, 2025, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో

ప్రారంభంకానున్న సంస్థలు

నంద గోకులం లైఫ్ స్కూల్







- ఆర్థికంగా వెనుకబడిన, మేధస్సు (High IQ) కల బాలుర కోసం రెసిడెన్షియల్ పాఠశాల.
- నంద గోకులం ప్రాంగణంలోని 19 ఎకరాల్లో క్యాంపస్.
- ప్రపంచ స్థాయి మౌలిక వసతులు; సాంకేతిక సామర్థ్యంగల Wi-Fi క్యాంపస్.
- పూర్తిగా ఎయిర్-కండిషన్డ్ పాఠశాల; అర్థవంతంగా రూపొందించిన బోధనా స్థలాలు.
- గోవులు, ఎడ్ల మధ్య ప్రకృతి సహజ బాల్యం.
- సేంద్రీయ వ్యవసాయంలో పాల్గొనడం.

విద్యతో జీవితాల అభ్యున్నతి

నంద గోకులం సేవ్ ద బుల్ కాజ్





- 280 ఎకరాల విస్తీర్ణంలో 400కు పైగా ఎద్లు, ఆవులు, దూడలకు ఆశ్రయం.
- అంతరించిపోతున్న దేశీయ ఎడ్ల జాతుల పునరుద్ధరణ.
- 'నంది పవర్' - ప్రత్యేకంగా రూపొందించిన ఎడ్ల ట్రెడ్మిల్; సుమారు 5 KW విద్యుత్ ఉత్పత్తి, తద్వారా రైతుకు ఎడ్ల పోషణకై సరిపడ ఆదాయం.
- డిజిటల్ బుల్ అడాప్షన్ - ఎవరైనా వర్చువల్‌గా ఎద్దును దత్తత తీసుకుని రైతులకు మద్దతు ఇవ్వగలరు.
- అడాప్షన్ లింక్: https://nandhagokulam.com/adopt

ఎడ్లను సంరక్షించి, దేశీయ జాతులను పునరుజ్జీవింపచేసే కార్యక్రమం

vishwasamudragroup.com • vishwasamudra.in • chintasasidharfoundation.com • nandhagokulam.com • nglifeschool.com • vsbio.in

Chinta Sasidhar Foundation

VISHWA SAMUDRA
CHALLENGE IT. CHANGE IT.

NANDHA GOKULAM
Life School



ప్రభుత్వ-ప్రైవేట్,
ప్రజల భాగస్వామ్యం

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన
మహోన్నత 'జీరో పావర్టీ - P4'
కార్యక్రమానికి అనుగుణంగా

- పిల్లలను ఉపాధి పొందగలిగే, బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడం
- రైతుల నూకలు (బ్రోకెన్ రైస్) కొనుగోలు చేసి, వారికి ఆర్థిక తోడ్పాటు ఇవ్వడం
- ఎద్దు మరియు రైతుల కోసం స్థిరమైన ఆర్థిక వ్యవస్థను సృష్టించడం

శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి

అక్టోబర్ 10, 2025, నెల్లూరు, ఆంధ్రప్రదేశ్‌లో

ప్రారంభంకానున్న సంస్థలు

**విశ్వ సముద్ర బయో ఎనర్జీ
ఇథనాల్ ప్లాంట్**





- 24 ఎకరాల్లో బయో-ఎథనాల్, కార్బన్ డయాక్సైడ్ (CO_2), డ్రైడ్ డిస్టిల్లర్స్ గ్రెయిన్స్ విత్ సాల్యూబుల్స్ (DDGS) ఉత్పత్తి.
- ఈ ప్రాంతంలో 15,000 టన్నులకుపైగా నూకలు (బ్రోకెన్ రైస్) కొనుగోలు (250 కి.మీ పరిధిలోని 300కు పైగా రైస్ మిల్లుల నుంచి).
- నూకలను (బ్రోకెన్ రైస్) ఫీడ్‌స్టాక్‌గా ఉపయోగించి రోజుకు 200 KLPD ఎథనాల్ ఉత్పత్తి చేసే సామర్థ్యం.
- భారత ప్రభుత్వ ఎథనాల్ బ్లెండింగ్ ప్రోగ్రామ్ (EBP) ద్వారా పెట్రోల్‌లో 20% మిశ్రమ లక్ష్యానికి మద్దతు.

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రైతు-హిత
హరిత కార్యక్రమం**

vishwasamudragroup.com • vishwasamudra.in • chintasasidharfoundation.com • nandhagokulam.com • nglifeschool.com • vsbio.in

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI



హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్నహోర్కైకు సాహిత్య నోబెల్ 2

శుక్రవారం | 10-10-2025
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru
విజయవాడ సిటీ**



జనవరిలో మరో డీఎస్సీ

నోటిఫికేషన్ తర్వాత మార్చిలో రాత పరీక్షలు
ఈ ఏడాది నవంబరులో 'టెట్' నిర్వహణ
విద్యా శాఖ అధికారులకు మంత్రి లోకేశ్ ఆదేశాలు
ఏటా డీఎస్సీ నిర్వహణకు కట్టుబడి ఉన్నామని వెల్లడి

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అభ్యర్థులకు మరో శుభవార్త! మెగా డీఎస్సీ ద్వారా ఇప్పటికే 16 వేలకు పైగా ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసిన కూటమి ప్రభుత్వం.. వచ్చే ఏడాది జనవరిలో మరో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చేందుకు సిద్ధమైంది. అదే ఏడాది మార్చిలో రాత పరీక్షలు నిర్వహించి, రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసేలా చర్యలు తీసుకోవాలని విద్యా శాఖ మంత్రి లోకేశ్ అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఈ ఏడాది నవంబరు చివరి వారంలో టెట్ పరీక్ష నిర్వహించాలని ఆదేశించారు. పాఠశాల

మిగతా 11వ పేజీలో...

పోలీసు ఖాళీలు 11,639

భర్తీకి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి డీజీపీ లేఖ

ఖండాలు దాటిన కల్తీ కథ!





కామెరూన్‌లో రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్‌కు సీల్ వేస్తున్న అధికారులు

ఆఫ్రికాలో జగన్ సోదరుల మద్యం దందా

- జగన్ హయాంలో జరిగిన మద్యం దందా గురించి అందరికీ తెలిసిందే. చాలామందికి తెలియని విషయం ఏంటంటే.. జగన్ సోదరులు వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి ఈ 'ఖ్యాతి'ని ఖండాంతరాలు దాటించారు. ఆఫ్రికాలోని కామెరూన్‌లో రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరిట ఏపీ మార్క్ జే బ్రాండ్లు ఉత్పత్తి చేశారు. ఆ దేశంలో అనేక మంది వీటిని తాగి చనిపోయారు.
- కల్తీ మద్యం ఉత్పత్తి ఆపాలంటూ కామెరూన్ దేశ ప్రజలు రోడ్డెక్కారు. దేశం కాని దేశంలో జగన్ సోదరుల ఆటలు సాగలేదు. వారి కంపెనీని కామెరూన్ మంత్రి స్వయంగా పరిశీలించారు. కల్తీ మద్యం తయారు చేస్తోందని ప్రకటించి, కంపెనీని మూసివేయించారు.
- జగన్ సోదరులు మద్యం దందాను ఒక్క కామెరూన్‌తోనే సరిపెట్టలేదు. ఆఫ్రికా ఖండమంతా తమ వ్యాపారాలను విస్తరించారు. పలు దేశాల్లో మద్యం, మైనింగ్, ఇతరత్రా వ్యాపారాలు చేపట్టారు. ఇదీ.. జగన్, ఆయన సోదరుల 'ఘనత'. కానీ చిత్రంగా ఇప్పుడు రాష్ట్రంలో నకిలీ మద్యం అంటూ ఆయన పార్టీ గగ్గోలు పెడుతోంది.


కామెరూన్‌లో ఏపీ మార్కు జే బ్రాండ్లు
ఇష్టారాజ్యంగా కల్తీ ఆల్కహాల్ ఉత్పత్తి
రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరిట వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి తయారీ
మద్యం తాగి అనేక మంది మృతి
ఉత్పత్తి ఆపాలంటూ ఆ దేశ ప్రజల ఉద్యమం
డిస్టిలరీ మూసేసిన కామెరూన్ ప్రభుత్వం
ఆఫ్రికా అంతా విస్తరించిన రెడ్డీస్ ఇండస్ట్రీస్

గుట్టువిప్పిన కట్టా రాజు!

నకిలీ మద్యం సొమ్ము ఎవరికి చేరిందో వాంగ్మూలం
జనార్దన్‌రావు కోసం బెంగళూరు ఎయిర్‌పోర్టులో రెండు ప్రత్యేక బృందాలు
జయచంద్రా రెడ్డి కోసమూ వేట

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికి వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి వరసకు సోదరులు. వారిద్దరూ మద్యం స్కాంలో అనుమానితులు. మద్యం వ్యాపారాన్ని ఆఫ్రికా ఖండంలోని పలు దేశాలకు విస్తరించారు. వారి కంపెనీ రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ ప్రమాణాలు పాటించకుండా కల్తీ మద్యం తయారుచేస్తోందని, ఆ దేశాల ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతోందని అక్కడి మీడియాలో పెద్దఎత్తున కథనాలు వచ్చాయి. కల్తీ మద్యం ఉత్పత్తిని ఆపాలంటూ ప్రజలు ఉద్యమం కూడా చేపట్టారు. ఆఫ్రికాలో జగన్ సోదరులు చేసిన మద్యం దందా గురించి ఇన్నాళ్లు ఇక్కడ పెద్దగా తెలియదు. తాజాగా

మిగతా 14వ పేజీలో...



పదిహేనేళ్ల పరుగు

సీఎంగా చంద్రబాబు అరుదైన రికార్డు

ప్రజా జీవితంలో 15 ఏళ్లు సీఎం హోదాలోనే
దక్షిణాదిలో కరుణానిధి, రంగస్వామికే ఈ ఘనత
నేటితో ఆ మైలురాయి దాటుతున్న చంద్రబాబు
ఉమ్మడి ఏపీకి అత్యధిక కాలం సీఎంగా ఉన్న ఘనత
నవ్యాంధ్రకు రెండోసారి సీఎంగా బాధ్యతలు

'నారా చంద్రబాబు నాయుడు' అనే ఆయన ఒకప్పుడు సామాన్యుడు! కానీ... ఆయనది అసామాన్య ప్రస్థానం! 'ఒక్క చాన్స్' అని ప్రజలను వేడుకుని గద్దెనెక్కుతున్న రోజుల్లో... ఆయన 'వన్స్‌మోర్' అంటూ మళ్లీమళ్లీ సీఎం అయ్యారు. ముఖ్యమంత్రిగా 15 సంవత్సరాల మార్కు దాటిన అసాధారణ నేతగా సరికొత్త రికార్డు సృష్టించారు. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టడం ఇది నాలుగోసారి! ఎన్టీఆర్‌తో విభేదించి 1995 సెప్టెంబరు 1న చంద్రబాబు తొలిసారి సీఎం అయ్యారు. ఇప్పటిదాకా ఆయన పదవీకాలాన్ని లెక్కిస్తే.. నేటితో సీఎంగా ఆయన 15 సంవత్సరాలు పూర్తి చేసుకుంటారు. 13

కాకినాడ జిల్లా ఉప్పాడ బహిరంగ సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్



వంద రోజుల్లో పరిష్కరిస్తా

న్యాయం చేయలేకపోతే రాజకీయాలకు గుడ్‌బై

వైసీపీలా పరిశ్రమలను భయపెట్టం.. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలి
3 రోజుల్లో సముద్రంలోకి వెళ్తా.. పారిశ్రామిక వ్యర్థ జలాలను పరిశీలిస్తా
నక్కపల్లి, కాకినాడ సెజ్‌లు, దివీస్, అరబిందో, డెక్కన్.. వైఎస్ హయాంలోనివే
వాటి కాలుష్యంపై ఆడిట్ చేయిస్తా.. ఉప్పాడలో రక్షణ గోడ నిర్మాణం
రూ.323 కోట్లు ఇచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం సానుకూలం

ఉప్పాడ మత్స్యకారుల సభలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

కాకినాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ మత్స్యకారుల సమస్యలన్నీ అర్థం చేసుకున్నానని, వాటిని పరిష్కరించడానికి వంద రోజులు గడువు కావాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వారిలో ఒకడిగా భావించి సమస్య పరిష్కరిస్తానని, న్యాయం చేయలేకపోతే రాజకీయాలు వదిలి

మిగతా 12వ పేజీలో...

జగన్.. అదే తీరు!

అడుగడుగునా షరతుల ఉల్లంఘనలు

రోడ్డుషోలా సాగిన మాజీ సీఎం పర్యటన
50కి పైగా వాహనాలతో కదిలిన కాన్వాయ్
60 కి.మీ. ప్రయాణానికి 6 గంటల సమయం
దారిపొడవునా వాహనం ఆపి వినతుల స్వీకరణ
ట్రాఫిక్ జామ్‌లో చిక్కుకున్న అంబులెన్స్
పట్టించుకోకుండా కార్యకర్తలకు అభివాదాలు

(ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్)
మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అనకాపల్లి జిల్లా పర్యటనలో అడుగడుగునా నిబంధనలను ఉల్లంఘించారు. విశాఖపట్నం విమానాశ్రయం నుంచి సుమారు 63 కిలోమీటర్ల దూరంలో ఉన్న మాకవరపాలెం చేరుకునేందుకు దాదాపు 6గంటల సమయం

మిగతా 13వ పేజీలో...



విశాఖ గోపాలపట్నం పెట్రోల్‌బంకు జంక్షన్‌లో జగన్ రోడ్‌షో.. ట్రాఫిక్‌లో నిలిచిపోయిన అంబులెన్స్



2

నెల్లూరు జిల్లా ఈదగాలి వద్ద నిర్మించిన విశ్వసముద్ర బయో ఇథనాల్ పరిశ్రమ

విశ్వసముద్ర ఇథనాల్‌కు నేడే ప్రారంభం

నెల్లూరుకు సీఎం చంద్రబాబు.. పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం

డేటా సెంటర్లలో ప్రపంచంలోనే ఏపీ టాప్!



విశాఖలో మూడున్నర గిగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు చేయనున్న టీసీఎస్, రైడెన్ ఇన్ఫో, సిఫీ
ఐదేళ్లలో లక్షన్నర మందికి ఉద్యోగావకాశాలు
ముఖ్యమంత్రిని కలిసిన టీసీఎస్ ప్రతినిధులు
14న ఢిల్లీలో రైడెన్ ఇన్ఫో సంస్థ ప్రకటన
హాజరు కానున్న అశ్వినీ వైష్ణవ్, చంద్రబాబు, లోకేశ్ 2

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

పలువురు అధికారులకు పోస్టింగులు.. సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా చక్రధరరావు
వ్యవసాయ డైరెక్టర్‌గా జిలానీ.. సమాచార శాఖకు కె.ఎస్.విశ్వనాథన్
ఢిల్లీరావుకు పౌరసరఫరాల ఎండీ బాధ్యతలు.. ఒకే రోజు 29 మందికి స్థానచలనం, పోస్టింగులు.. ఏడు జిల్లాలకు కొత్త జేసీలు
ప్రసన్న వెంకటేశ్, ఎస్.భరణికి అదనపు బాధ్యతలు 12

ఓఎంసీ అక్రమాలపై జస్టిస్ సుధాంశు కమిటీ

సుప్రీం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు 13

నేటి నుంచి వైద్య సేవలు బంద్! 14

సమ్మెలోకి నెట్‌వర్క్ ఆస్పత్రులు.. సేవలు కొనసాగించండి.. మంత్రి వినతి

'మద్యం' బెయిల్ పిటిషన్లపై విచారణ ఆపండి

మా తుది నిర్ణయం వరకు ఆగండి.. ఏసీబీ కోర్టుకు హైకోర్టు సూచన 14

భారత్-యూకే భాగస్వామ్యం.. ప్రపంచ సుస్థిరతకు మూల స్తంభం!



బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో ప్రధాని మోదీ

ఇరు దేశాల మధ్య బంధం నమ్మకమైనది
ప్రతిభ, సాంకేతికతతో ముందుకెళ్తోంది
బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో చర్చల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు
భారత వృద్ధి పథంలో భాగస్వాములవ్వండి
అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు పిలుపు
రక్షణ రంగంలో ఇరుదేశాల మధ్య రూ.4,151 కోట్ల ఒప్పందం 2
భారత్‌లో కొత్తగా 9 బ్రిటన్ వర్సిటీలు



థాయ్‌లాండ్ అడవుల్లో వేంకటేశ్వరుడు!

వివరాలు నవ్య పేజీలో..

ఇదిగో 'శాంతి'.. ఏదీ బహుమతి?



ట్రంప్ శాంతి ప్రణాళిక తొలిదశ అమలుకు ఇజ్రాయెల్, హమాస్ ఓకే
నోబెల్ శాంతి బహుమతి ఆశతో ఇరువర్గాలపై ట్రంప్ తీవ్ర ఒత్తిడి!
చర్చల తర్వాత పలు అంశాలపై స్పష్టత
పరస్పరం బందీల విడుదలకు ఏర్పాట్లు
ఇక గాజాలో శాశ్వత శాంతి: ట్రంప్
దేవుడి దయతో మా వాళ్లు తిరిగొస్తున్నారు: నెతన్యాహూ
ఒప్పందాన్ని ఇజ్రాయెల్ పాటించేలా చూడాలి: హమాస్
ట్రంప్‌తో మాట్లాడి అభినందించా: మోదీ 2

హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్జ్నహోర్కైకు సాహిత్య నోబెల్

స్టాక్‌హోం, అక్టోబరు9: ప్రముఖ హంగేరియన్ రచయిత లాస్లో క్రాస్జ్నహోర్కై ఈఏటి సాహిత్య నోబెల్ పురస్కారానికి ఎంపికయ్యారు. ఎర్నెస్ట్ హెమింగ్వే, అల్బర్ట్ కామూ, టోనీ మారిసన్ వంటి దిగ్గజ రచయితల అడుగుజాడల్లో నడిచిన లాస్లో శైలి.. కఠినంగా, పాఠకులను పరీక్షించేలా ఉంటుందని సాహితీ ప్రియులు అంటారు. ప్రపంచాన్ని ఒక్క సత్యం, ఒక్క తత్వం, ఒక్క కథనంలో కట్టిపడేయలేమని.. అనేక సత్యాలు ఉంటాయని, ప్రతిదీ దాని దృక్కోణంలో నిజమని చెప్పే లోతైన తాత్విక దృష్టి ఆయన రచనల్లో ఉంటుందని.. పతనం దిశగా కదిలే మనుషులపై ఆసక్తి ఆయన రచనల్లో కనపడుతుందని వారు పేర్కొంటారు. తాత్వికతను, విషాదంతో కూడిన హాస్యాన్ని మేళవించిన నవలలతో సుప్రసిద్ధుడయ్యారాయన. 1954లో హంగరీలోని జులా పట్టణంలో ఓ మధ్యతరగతి యూదు కుటుంబంలో జన్మించిన లాస్లో తొలుత ఫ్రీలాన్స్ రైటర్‌గా కొన్నాళ్లు పనిచేశారు. 1985లో తన తొలి నవల 'శాటాన్ టాంగ్' రాశారు. మొదటి నవలతోనే హంగరీ సాహితీ ప్రపంచంలో తనదంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. ప్రముఖ హంగేరియన్ ఫిలిం మేకర్ బెలా టారో ఆ నవల చదివి ముగ్ధుడై.. దాన్ని ఎలాగైనా తెరకెక్కించాలనే పట్టుదలతో 1994లో ఏడున్నరగంటల సినిమాగా రూపొందించారు. లాస్లో రాసిన 'ద మెలాంకలీ ఆఫ్ రెసిస్టెన్స్' నవలను బెలా టారో తెరకెక్కించారు. లాస్లో నవలల్లో కనిపించే ప్రత్యేకత.. పొడవాటి వాక్యాలు. కొన్ని వాక్యాలైతే పేజీ.. పేజీన్నర ఉంటాయి.

ట్రంప్‌నకు 'శాంతి' లేదా?

అమెరికా అధ్యక్షుడికి నోబెల్ పురస్కారం దక్కే అవకాశాల్లేవనేది నిపుణుల అంచనా

- నోబెల్ కమిటీ సమావేశాల్లో ఆయన పేరు చర్చకు వస్తుందా? అనే విషయమ్మీద స్పష్టత కరువు
- ట్రంప్ వ్యక్తిగత రికార్డే మైనస్?

స్టావెంజర్ (నార్వే), అక్టోబరు 9: ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతిని ఎవరికి ఇవ్వనున్నారు? ఈ పురస్కారం తనకే దక్కాలన్న పట్టుదలతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విశ్వప్రయత్నాలు చేస్తుండటంతో ఇది మరింత ఆసక్తిగా మారింది. నార్వే పార్లమెంటు కమిటీ నియమించిన ఐదుగురు సభ్యుల నోబెల్ కమిటీ రహస్య సమావేశాల్లో ట్రంప్ పేరు చర్చకు వస్తుందా? అనే విషయంపై స్పష్టత కరువైంది. గతంలో ఈ పురస్కారానికి ట్రంప్ అనేకసార్లు నామినేట్ అయ్యారు. ఇజ్రాయెల్, పలు అరబ్ దేశాల మధ్య సంబంధాలను సాధారణస్థితికి తీసుకురావడంలో ట్రంప్ చేసిన కృషికిగాను ఆయన్ను 2025 సంవత్సరానికి నోబెల్ శాంతి పురస్కారం కోసం సిఫారసు చేస్తున్నట్లు గత డిసెంబరులో అమెరికా ప్రభుత్వ ప్రతినిధి క్లాడియా టెన్నీ ప్రకటించారు. నోబెల్ నామినేషన్లకు గత ఫిబ్రవరి 1వ తేదీతో గడువు ముగిసిన తర్వాత ట్రంప్ పేరును ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ, పాకిస్థాన్ ప్రధాని షాబాజ్ షరీఫ్ నోబెల్ కమిటీకి సిఫారసు చేశారు. అయితే ఈసారి ఏడాది కూడా ఆయనకు శాంతి పురస్కారం లభించే అవకాశాలు లేవని నిపుణులు అంచనా వేస్తున్నారు. తొలిసారి అధ్యక్ష బాధ్యతలు చేపట్టినప్పటి నుంచే శాంతి బహుమతి కోసం ఆయన నోబెల్ దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. భారత్-పాక్ యుద్ధం సహా ఏడు యుద్ధాలను తాను ఆపానని అనేకసార్లు చెప్పుకొన్నారు. గత నెలాఖరులో. ఐరాస వేదికగా కూడా "నాకు నోబెల్ శాంతి బహుమతి దక్కాలని అంతా కోరుకుంటున్నారు" అని తనకు తాను గొప్పలు పోయారు. శాంతి పురస్కారం కోసం పలువురు దేశాధినేతల మద్దతును ట్రంప్ కూడగట్టుకున్నప్పటికీ ఆయనకు బహుమతి దక్కే చాన్స్ లేకపోవొచ్చునని అంటున్నారు. ఇందుకు ట్రంప్ వ్యక్తిగత రికార్డే ఆయనకు మైనస్ అయ్యే అవకాశం ఉందని చెబుతున్నారు. ఉమ్మడి ప్రయోజనాలను కాంక్షిస్తూ పలు సమస్యల పరిష్కారం కోసం పలుదేశాలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన సంస్థల పట్ల సానుకూలంగా లేకపోవడం, వాతావరణ మార్పులపై ప్రపంచవ్యాప్తంగా వ్యక్తమవుతున్న ఆందోళలను అస్సలు పట్టించుకోకపోవడం వంటివి ట్రంప్‌నకు మైనస్ అవుతాయని చెబుతున్నారు. శాంతి పురస్కారం కోసం.. ఎలాంటి ప్రచార ఆర్భాటాలు లేకుండా అంతర్జాతీయంగా శాంతి, సౌభ్రాతృత్వాల కోసం కృషి చేస్తున్న సంస్థలపై నోబెల్ కమిటీ దృష్టి పెట్టే అవకాశాలున్నాయని నిపుణులు చెబుతున్నారు.



ఇదిగో 'శాంతి'.. ఏదీ బహుమతి?



వాషింగ్టన్, అక్టోబరు 9: గాజాలో రెండేళ్లుగా కొనసాగుతున్న మారణహోమానికి తెరపడేందుకు రంగం సిద్ధమైంది. నోబెల్ శాంతి బహుమతిపై ఆశతో గాజాలో శాంతి నెలకొల్పేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీవ్రస్థాయిలో చేసిన ప్రయత్నాలు ఓ కొలిక్కి వచ్చాయి. ట్రంప్ ప్రతిపాదించిన శాంతి ప్రణాళిక తొలిదశ అమలుకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ప్రస్తుతానికి యుద్ధాన్ని నిలిపివేసి, పరస్పరం బందీలను విడుదల చేసేందుకు ఏర్పాట్లు ప్రారంభించాయి. దీనిపై ట్రంప్ గురువారం ఉదయం (అమెరికా కాలమానం ప్రకారం బుధవారం సాయంత్రం) 'ట్రుత్' సోషల్‌లో పోస్టు పెట్టారు. "గాజాలో శాంతి ప్రణాళిక మొదటి దశకు ఇజ్రాయెల్, హమాస్ అంగీకరించాయి. ఇరువర్గాలు తమ వద్ద ఉన్న బందీలను త్వరలోనే విడుదల చేస్తాయి. ఇజ్రాయెల్ తమ సైన్యాన్ని వెనక్కి తీసుకుంటుంది. గాజాలో శాశ్వత శాంతి దిశగా ఇదొక ముందడుగు. ఈ వ్యవహారంలో అందరినీ సమానంగా చూస్తాం.." అని ట్రంప్ పేర్కొన్నారు. అనంతరం ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహూ, హమాస్ కూడా శాంతి ప్రణాళిక తొలిదశ అమలుపై ప్రకటనలు చేశాయి. అంతకుముందు ఈజిప్ట్‌లో జరిగిన శాంతి చర్చల్లో అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్, ట్రంప్ అల్లుడు జేరేడ్ కుష్నర్, ఈజిప్ట్, టర్కీ, ఖతార్ దేశాల ప్రతినిధులు, ఇజ్రాయెల్ ప్రధాని సలహాదారు రాన్ డెర్మర్ పాల్గొన్నారు. ఆ సమయంలో ట్రంప్ వైట్‌హౌజ్‌లో ఓ సమావేశంలో ఉన్నారు. ఆ సమయంలో విదేశాంగ మంత్రి మార్కో రూబియో ట్రంప్ వద్దకు వెళ్లి ఒక నోట్ చూపించి, శాంతి ఒప్పందం విషయం చెప్పారు. తర్వాత ట్రంప్ ఈ అంశంపై పోస్టు పెట్టారు. కాగా శాంతి ప్రక్రియ మొదలైందని, హమాస్ వద్ద బందీలుగా ఉన్న తమవారు దేవుడి దయతో తిరిగివస్తున్నారని నెతన్యాహూ పేర్కొన్నారు. మరోవైపు గాజాలో యుద్ధాన్ని ముగించే ఒప్పందానికి అంగీకరించామని హమాస్ ప్రకటించింది. ఇక ఇజ్రాయెల్ దళాల ఉప సంహరణ, బందీల విడుదల, గాజాకు మానవతా సాయం కోసం మార్గాలను తెరవడానికి ఒప్పందం కుదిరిందని తెలిపింది. అయితే శాంతి ఒప్పందంలోని షరతులను ఇజ్రాయెల్ కచ్చితంగా అమలు చేసేలా చూడాలని ట్రంప్‌కు, మధ్యవర్తిత్వం వహించిన దేశాలకు హమాస్ విజ్ఞప్తి చేసింది. కాగా, శాంతి ఒప్పందంపై బ్రిటన్, ఇటలీ ప్రధానులు స్టార్మర్, జార్జియా మెలోని.. తుర్కియే, ఈజిప్ట్, ఫ్రాన్స్ అధ్యక్షులు ఎర్డోగాన్, అబ్దెల్ ఎల్‌సిస్సి, మేక్రాన్ హర్షం వ్యక్తం చేశారు. శాంతి ఒప్పందం పూర్తిస్థాయిలో అమలయ్యేలా ఐక్యరాజ్యసమితి సహకరిస్తుందని.. పాలస్తీనా ప్రజలకు మానవతా సాయంతోపాటు గాజా పునర్నిర్మాణానికి తోడ్పడుతామని ఐక్యరాజ్యసమితి సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్ ప్రకటించారు. చైనా, జోర్డాన్, సౌదీ అరేబియా, లెబనాన్, నెదర్లాండ్స్ కెనడా, అర్జెంటీనా, ఆస్ట్రేలియా, జపాన్ తదితర దేశాలు కూడా ఒప్పందంపై హర్షం వ్యక్తం చేశాయి.

బందీల విడుదల.. సైన్యం వెనక్కి..

శాంతి ప్రణాళిక తొలిదశలో భాగంగా హమాస్ తమ వద్ద బందీలుగా ఉన్న 20 మంది ఇజ్రాయెలీలను విడుదల చేస్తుంది. మరోవైపు ఇజ్రాయెల్ వద్ద బందీలుగా ఉన్న సుమారు 2 వేల మంది పాలస్తీనీయులను వదిలిపెట్టనుంది. అందులో ఇజ్రాయెల్ గతంలోనే అరెస్టు చేసి దీర్ఘకాలిక శిక్షలు వేసినవారు 250 మందికిపైగా ఉండగా, మరో 17 వందల మంది గత రెండేళ్లలో అదుపులోకి తీసుకున్నవారు ఉన్నట్టు హమాస్ వర్గాలు తెలిపాయి. ఇక శాంతి ఒప్పందంలో భాగంగా గాజా సిటీ, ఖాన్ యూనిస్, రఫా నగరాల నుంచి ఇజ్రాయెల్ సైన్యం వెనక్కి వెళుతుంది. శాంతి ప్రణాళికలో భాగంగా.. ఇక ముందు హమాస్ ఆయుధాలు వదిలేయడం, గాజా పరిపాలనను పాలస్తీనా అథారిటీకి అప్పగించడం వంటి చర్యలు అత్యంత కీలకంగా మారాయి. కాగా, ఐక్యరాజ్యసమితి శాంతి దళాలకు అమెరికా ఇచ్చే నిధులను గణనీయంగా తగ్గించడంతో.. శాంతి పరిరక్షణ దళాలను 25శాతం మేర తగ్గించుకుంటున్నట్టు ఐక్యరాజ్యసమితి సీనియర్ అధికారి ఒకరు తెలిపారు.

'శాంతి'కి రాకుంటే.. నరకం చూపిస్తానని..

ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలను నివారించానని చెప్పి శాంతి బహుమతి పొందాలని ట్రంప్ ఎప్పటినుంచో తహతహలాడుతున్నారు. ఈ క్రమంలోనే పలు దేశాల మధ్య వివాదాలను పరిష్కరించడంలో భాగస్వామి అయ్యారు. ఉక్రెయిన్, రష్యా మధ్య సంధికోసమూ ప్రయత్నించారు. గాజాలో ఇజ్రాయెల్ దాడులపై ప్రపంచవ్యాప్తంగా నిరసనలు వస్తున్న వేళ... తమ మిత్రదేశమే అయినా ఇజ్రాయెల్‌ను కట్టడి చేసి శాంతిని నెలకొల్పిన పేరు పొందాలని ట్రంప్ భావించారు. పలు ముస్లిం దేశాలను కలుపుకొని ఇజ్రాయెల్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఇజ్రాయెల్ తీరుకు వ్యతిరేకంగా ఇస్లామిక్ దేశాలన్నీ ఒక్కటవుతున్నాయని చెప్పి నెతన్యాహూ దిగివచ్చేలా చేశారు. అదే సమయంలో శాంతి ఒప్పందానికి రాకుంటే నరకం చూపిస్తామని తీవ్రస్థాయిలో బెదిరించి హమాస్‌ను కూడా దారికి తెచ్చారు. అంతేకాదు శుక్రవారం (ఈ నెల 10న) నోబెల్ శాంతి బహుమతి ప్రకటన ఉన్న నేపథ్యంలో.. శాంతి ఒప్పందాన్ని వేగవంతం చేయాలని ఇజ్రాయెల్, హమాస్‌లపై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. ఈ క్రమంలో శాంతి ఒప్పందంపై గురువారమే ప్రకటన రావడం గమనార్హం.

గాజాలో శాశ్వత శాంతి నెలకొంటుంది: మోదీ

ఇజ్రాయెల్, హమాస్ ఒప్పందంపై ప్రధాని మోదీ హర్షం వ్యక్తం చేశారు. "ట్రంప్ శాంతి ప్రణాళిక తొలిదశ అమలు ఒప్పందాన్ని స్వాగతిస్తున్నాం. ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ గొప్ప నాయకత్వానికి ప్రతీక ఇది. బందీల విడుదల, గాజా ప్రజలకు మానవతా సాయం సాఫీగా సాగాలని.. శాశ్వత శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తున్నా" అని గురువారం మధ్యాహ్నం ఎక్స్‌లో పోస్టు చేశారు. అందులో ట్రంప్‌పై ఎలాంటి ప్రశంసలు చేయలేదు. కానీ గురువారం రాత్రి మోదీ మరో ట్వీట్ చేశారు. "నా స్నేహితుడు ట్రంప్‌తో మాట్లాడాను. గాజా శాంతి ప్రణాళికపై అభినందించాను. భారత్, అమెరికా మధ్య వాణిజ్య ఒప్పందం చర్చల పురోగతిపైనా చర్చించాం. తరచూ సంప్రదింపులు జరుపుతూ ఉండాలని నిర్ణయించాం" అని మోదీ పేర్కొన్నారు. అలాగే ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూకు కూడా ఫోన్ చేసి అభినందించానని తెలిపారు. కాగా, మోదీ ఫోన్ చేసినప్పుడు కీలక కేబినెట్ భేటీలో ఉన్న నెతన్యాహూ.. దాని ఆపి వెళ్లి మరీ మోదీతో మాట్లాడారని నెతన్యాహూ కార్యాలయం పేర్కొంది.

హరియాణా డీజీపీపై కేసు

- సీఎంకు దళిత ఐపీఎస్ అధికారి పూరన్ కుమార్ భార్య, ఐఏఎస్ అమనీత్ లేఖతో ఎట్టకేలకు కేసు
- తన భర్త ఆత్మహత్యకు డీజీపీ శత్రుజీత్ కపూర్, ఎస్పీ నరేంద్రలే కారణమని అమనీత్ ఆరోపణ

చండీగఢ్, అక్టోబరు 9: హరియాణా దళిత ఐపీఎస్ అధికారి వై పూరన్ కుమార్ ఆత్మహత్య కేసులో ఆ రాష్ట్ర డీజీపీ శత్రుజీత్ సింగ్ కపూర్‌తో పాటు రోహతక్ ఎస్పీ నరేంద్ర బిజార్నియాపై కేసు నమోదైంది. తన భర్త బలవన్మరణానికి డీజీపీ, ఎస్పీలే కారణమని కుమార్ భార్య, ఐఏఎస్ అధికారిణి అమనీత్ ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు చండీగఢ్ ఎస్ఎస్పీ ధ్రువీకరించారు. భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)తో పాటు ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద కేసు పెట్టారు. పలువురు సీనియర్ అధికారుల కుల వివక్ష, మానసిక వేధింపులు భరించలేక కుమార్ మంగళవారం చండీగఢ్‌లోని ఇంట్లో సర్వీసు రివాల్వర్‌తో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. తనను ఎవరెవరు ఎలా వేధించిందీ అవమానించిందీ కుమార్ 8 పేజీల సూసైడ్ నోట్‌లో రాశారు. అందులో కొందరు రిటైర్డ్ అధికారుల పేర్లు కూడా ఉన్నాయి. కుమార్ ఆత్మహత్య చేసుకున్న సమయంలో జపాన్ పర్యటనలో ఉన్న అమనీత్.. వెంటనే చండీగఢ్ బయలుదేరి వచ్చారు. బుధవారం రాత్రే ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. డీజీపీ, ఎస్పీలను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో ఆమె గురువారం సీఎం నాయబ్ సింగ్ సైనీకి ఘాటు లేఖ రాశారు.

దాంతో ఎట్టకేలకు కేసు నమోదు చేశారు. తన భర్త సూసైడ్ నోట్ ఉన్నా.. తాను ఫిర్యాదు చేసినా నిందితులు శక్తిమంతులు కావడంతో కేసు నమోదు చేయలేదని అమనీత్ తన లేఖలో విమర్శించారు. దళితుడివంటూ కుమార్‌ను సూటిపోటి మాటలతో అవమానించేవారని ఆమె పేర్కొన్నారు. తన కుటుంబానికి ముప్పు ఉందని, రక్షణ కల్పించాలని సీఎంను కోరారు. 2001 బ్యాచ్ హరియాణా క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన కుమార్ ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు. అమనీత్ కూడా 2001 బ్యాచ్‌కే చెందిన ఐఏఎస్ అధికారిణి.

విశ్వసముద్ర ఇథనాల్ ప్లాంట్ సిద్ధం

- నేడు నెల్లూరు జిల్లాలో ప్రారంభించనున్న సీఎం

నెల్లూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): నెల్లూరు జిల్లాలో విశ్వసముద్ర సంస్థ ప్రతిష్ఠాత్మకంగా నిర్మించిన బయో ఇథనాల్ ప్లాంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు శుక్రవారం ప్రారంభించనున్నారు. వెంకటాచలం మండలం ఈదగాలి గ్రామం వద్ద 200 ఎకరాల విస్తీర్ణంలో రూ. 315 కోట్లతో విశ్వసముద్ర సంస్థ బయో ఇథనాల్ ప్లాంట్‌ను నిర్మించింది. ఈ పరిశ్రమ వల్ల ప్రత్యక్షంగా 150 మందికి, పరోక్షంగా 300 మందికి ఉపాధి లభించనుంది. బియ్యం నూకతో బయో ఇథనాల్‌ను తయారు చేస్తారు. ఈ పరిశ్రమ ద్వారా ఉత్పత్తి అయ్యే ఇథనాల్ ఇంధనానికి అవసరమైన మార్కెటింగ్ సౌకర్యం కేంద్ర ప్రభుత్వం కల్పిస్తుంది. నెల్లూరు జిల్లాలో వరి విస్తారంగా సాగవుతుంది కాబట్టి ఈ పరిశ్రమను స్థాపించడానికి అనువైన ప్రాంతంగా ఎంచుకున్నారు. ఈ పరిశ్రమకు బియ్యం నూక ప్రధాన ముడిసరుకు కావడం వల్ల అది పరోక్షంగా రైతులకు మేలు చేస్తుందని భావిస్తున్నారు. దీనివల్ల నాసిరకం ధాన్యానికి కూడా మంచి ధర లభిస్తుందని అంచనా వేస్తున్నారు. అదే గ్రామంలో ఆర్థికంగా వెనుకబడిన మెరిట్ విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన నందగోకులం లైఫ్ స్కూల్‌ను కూడా సీఎం ప్రారంభిస్తారు. అక్కడ విద్యార్థులతో కొంతసేపు ముచ్చటిస్తారు. అక్కడ సమీపంలోని గోశాలకు హాజరై నంది పవర్ బ్రీడ్ మిల్క్ మిషన్‌ను, అంతరించిపోతున్న దేశీయ ఎడ్లజాతి సంరక్షణకు ఏర్పాటు చేసిన నందగోకులం 'సేవ్ ద బుల్ ప్రాజెక్టు'లను ప్రారంభిస్తారు.

మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు

- కర్ణాటక క్యాబినెట్ నిర్ణయం

బెంగళూరు, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మహిళా ఉద్యోగులకు ఒక రోజు వేతనంతో కూడిన 'నెలసరి' ఐచ్ఛిక సెలవు ఇవ్వాలని కర్ణాటక మంత్రిమండలి నిర్ణయించింది. సీఎం సిద్దరామయ్య అధ్యక్షతన గురువారం జరిగిన మంత్రిమండలి సమావేశంలో పలు నిర్ణయాలు తీసుకున్నారు. ఆ వివరాలను శాసనసభ వ్యవహారాల మంత్రి హెచ్‌కే పాటిల్ మీడియాకు వివరించారు. ఇప్పటికే పలు రాష్ట్రాల్లో నెలసరి సెలవు అమలులో ఉందని, రాష్ట్రంలోనూ మహిళా ఉద్యోగులకు ఈ సౌకర్యాన్ని కల్పిస్తామని చెప్పారు.

2022కి ముందే సరగసీ ప్రారంభించినవారికి వయసు నిబంధన వర్తించదు: సుప్రీం

న్యూఢిల్లీ, అక్టోబరు 9: సరగసీకి (అద్దెగర్భం) సంబంధించి సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పునిచ్చింది. 'సరగసీ (నియంత్రణ) చట్టం, 2021' ప్రకారం సరగసీ విధానంలో పిల్లలను పొందాలనుకునే దంపతుల్లో మహిళల వయసు 23నుంచి40 ఏళ్లలోపు.. పురుషుల వయసు 26నుంచి55 ఏళ్లలోపు ఉండాలి. అయి తే.. ఆ చట్టం 2022 జనవరి 25నుంచి అమల్లోకి వచ్చినందున.. అంతకుముందు సంతానం కోసం సరగసీ ప్రక్రియను ఆశ్రయించినవారికి, అండాలను భద్రపరచుకున్నవారికి ఈ వయసు నిబంధన వర్తించదని జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం తాజాగా స్పష్టం చేసింది. సరగసీలో సంతానాన్ని పొందేందుకు 2022 జనవరి25కు ముందే అండాలు భద్రపరచుకున్న మూడు జంటలు దాఖలు చేసుకున్న పిటిషన్లపై విచారణ జరిపిన ధర్మాసనం.. ఈ చట్టం గతానికి కూడా వర్తిస్తుందన్న కేంద్రం వాదనను తోసిపుచ్చింది.

భారత్-యూకే భాగస్వామ్యం.. ప్రపంచ సుస్థిరతకు మూల స్తంభం!

- ఇరుదేశాల మధ్య బంధం నమ్మకమైనది
- ప్రతిభ, సాంకేతికతతో ముందుకెళ్తోంది
- బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో చర్చల అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలు



బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో ముచ్చటిస్తున్న మోదీ

ముంబై, అక్టోబరు 9: భారత్, యూకే సహజ భాగస్వాములని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చెప్పారు. అంతర్జాతీయంగా అనిశ్చితి పరిస్థితులు నెలకొన్న ప్రస్తుత తరుణంలో ఇరు దేశాల మధ్య బంధాలు మరింత వృద్ధి చెంది.. ప్రపంచ సుస్థిరతకు, ఆర్థికాభివృద్ధికి మూల స్తంభంగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. భారత్‌కు వచ్చిన బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో గురువారం మోదీ భేటీ అయ్యారు. నేతలిద్దరూ వివిధ అంశాలపై చర్చలు జరిపారు. అనేక రంగాల్లో బంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. అనంతరం మీడియాకు సంయుక్త ప్రకటన విడుదల చేశారు. భారత్, యూకేల భాగస్వామ్యం అత్యంత నమ్మకమైందని.. ఇది ప్రతిభ, సాంకేతికతతో ముందుకు వెళ్తోందని మోదీ చెప్పారు. ఇరు దేశాల ప్రజల ఉజ్వల భవిష్యత్తు కోసం స్టార్మర్, తాను కలిసి పనిచేస్తామన్నారు. ఇరుదేశాల మధ్య కుదిరిన స్వేచ్ఛాయుత వాణిజ్య ఒప్పందాన్ని స్టార్మర్ గొప్ప ముందడుగుగా అభివర్ణించారు. ఈ ఒప్పందంతో సుంకాలు భారీగా తగ్గిపోతాయన్నారు. 2028 కల్లా ప్రపంచంలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మారాలన్న లక్ష్యంతో పనిచేస్తున్న మోదీకి అభినందనలు తెలిపారు. వివిధ రకాల లక్ష్యాలను ఛేదించగల తేలికపాటి క్షిపణి వ్యవస్థలను భారత సైన్యానికి సరఫరా చేయనున్నట్లు బ్రిటన్ అధికారులు చెప్పారు. అలాగే భారత నౌకాదళానికి అవసరమైన ఎలక్ట్రిక్ ప్రొపల్షన్ వ్యవస్థలను సంయుక్తంగా అభివృద్ధి చేయాలని కూడా నిర్ణయించినట్లు వెల్లడించారు. రూ.4151 కోట్ల ఒప్పందం జరిగినట్లు తెలిపారు.

భారత్‌లో 9 వర్సిటీ క్యాంపస్‌లు

భారత్‌లో కొత్తగా తొమ్మిది బ్రిటన్ యూనివర్సిటీల క్యాంపస్‌లను ఏర్పాటు చేయనున్నట్లు స్టార్మర్ ప్రకటించారు. ఇటీవలే గురుగ్రామ్‌లో యూనివర్సిటీ ఆఫ్ సౌతాంప్టన్ క్యాంపస్‌ను ప్రారంభించగా.. ఇప్పుడు యూనివర్సిటీ ఆఫ్ లాంకెస్టర్, యూనివర్సిటీ ఆఫ్ సర్రే క్యాంపస్‌లు కూడా ప్రారంభించనున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాదిలో యూనివర్సిటీ ఆఫ్ యార్క్, అబెర్డీన్, బ్రిస్టల్, లివర్‌పూల్, క్వీన్స్ యూనివర్సిటీ బెల్‌ఫాస్ట్, యూనివర్సిటీ ఆఫ్ కొవెంట్రీలు క్యాంపస్‌లను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.

భారత వృద్ధిలో భాగస్వాములు కండి

భారతదేశ అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలకు మోదీ పిలుపునిచ్చారు. గురువారం ముంబైలో జరిగిన గ్లోబల్ ఫిన్‌టెక్ ఫెస్ట్ 2025లో, సీఈవో ఫోరం సమావేశంలో స్టార్మర్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ సాంకేతికత అంటే సౌకర్యం మాత్రమే కాదని, అది సమానత్వానికి ప్రతీక అని చెప్పారు. భారత్ ఇతర దేశాలతో టెక్నాలజీని మాత్రమే పంచుకోవడం లేదని, దాన్ని అభివృద్ధి చేయడంలో సాయపడుతోందన్నారు. యూకే సహా అంతర్జాతీయ పెట్టుబడిదారులందరినీ ఆహ్వానిస్తున్నామని.. భారత అభివృద్ధి పథంలో భాగస్వాములు కావాలని మోదీ పిలుపునిచ్చారు. భారత్-యూకేల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం ఇరుదేశాల పరస్పర పురోగతికి మార్గసూచీ అని పేర్కొన్నారు. భారత్‌లోని ప్రతిభ, భారీ అవకాశాలు, యూకేలోని పరిశోధన, అభివృద్ధి, నైపుణ్యాలు కలిస్తే ఫలితాలు చాలా గొప్పగా ఉంటాయని మోదీ చెప్పారు.

తుజే దేఖా తో యే జానా సనమ్..

బ్రిటన్ ప్రధాని స్టార్మర్ విశేష ప్రజాదరణ పొందిన బాలీవుడ్ పాటను వింటున్న వీడియోను యశ్‌రాజ్ ఫిలిమ్స్ గురువారం ఎక్స్‌లో పోస్ట్ చేసింది. సూపర్ హిట్ సినిమా దిల్‌వాలే దుల్హానియా లే జాయేంగేలోని 'తుజే దేఖా తో యే జానా సనమ్' పాటను స్టార్మర్ విన్నారు. తమ స్టూడియోను సందర్శించిన సందర్భంగా ఆయన ఈ పాట విన్నట్లు యశ్‌రాజ్ ఫిలిమ్స్ తెలిపింది.

ప్రజాస్వామ్యంలో తీవ్రవాదానికి చోటు లేదు

బ్రిటన్ ప్రధాని స్టార్మర్‌తో భేటీ సందర్భంగా ప్రధాని మోదీ ఖలిస్థానీ తీవ్రవాదుల అంశాన్ని కూడా ప్రస్తావించినట్లు విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ తెలిపారు. ప్రజాస్వామ్య దేశాల్లో తీవ్రవాదం, హింసకు చోటు లేదని మోదీ స్పష్టం చేశారన్నారు. ఖలిస్థానీ తీవ్రవాదంపై నేతలిద్దరూ సమగ్రంగా చర్చించినట్లు చెప్పారు. అలాంటి తీవ్రవాదులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని మోదీ తేల్చిచెప్పారన్నారు.

డేటా సెంటర్ సామర్థ్యంలో ప్రపంచంలో ఏపీ టాప్!

- విశాఖలో మూడున్నర గిగావాట్ల డేటా సెంటర్లు
- ఏర్పాటు చేయనున్న టీసీఎస్, రైడెన్ ఇన్ఫో, సిఫీ
- ఐదేళ్లలో లక్షన్నర మందికి ఉద్యోగావకాశాలు
- ముఖ్యమంత్రిని కలసిన టీసీఎస్ ప్రతినిధులు
- 14న ఢిల్లీలో రైడెన్ ఇన్ఫో సంస్థ ప్రకటన
- హాజరు కానున్న అశ్వనీ వైష్ణవ్, బాబు, లోకేశ్

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయంగా డేటా సెంటర్ల సామర్థ్యంలో ఏపీ టాప్‌గా నిలవనుంది. ప్రస్తుతం వర్జీనియాలోని 1.3 గిగావాట్ సామర్థ్యంతో కూడిన డేటా సెంటర్ మాత్రమే టాప్-1లో ఉంది. కానీ.. ఇప్పుడు విశాఖలో టీసీఎస్ రెండు గిగావాట్లు.. గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫో ఒక గిగావాట్.. సిఫీ 450 మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్లు ఏర్పాటు చేయనున్నాయి. దీంతో విశాఖలో ఏకంగా మూడున్నర గిగావాట్ల డేటా సెంటర్ల సామర్థ్యంతో రాష్ట్రం అంతర్జాతీయంగా నంబర్ వన్‌గా నిలువనున్నదని ఐటీ శాఖ చెబుతోంది. ఈ డేటా సెంటర్ల ద్వారా రానున్న ఐదేళ్లలో లక్షన్నర మందికి ఉద్యోగావకాశాలు లభించనున్నాయి. ఈ నెల 14వ తేదీన ఢిల్లీలో కేంద్ర ఐటీ, కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్, ముఖ్యమంత్రి చంద్రబాబు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి లోకేశ్ సమక్షంలో కీలక ప్రకటన చేయనున్నారు. గూగుల్ ప్రతినిధులు, గూగుల్ అనుబంధ సంస్థ రైడెన్ ఇన్ఫో ప్రతినిధులు విశాఖలో గిగావాట్ సామర్థ్యంతో నెలకొల్పబోయే డేటా సెంటర్‌పై అధికారికంగా ప్రకటన చేయనున్నారు. ఈ సంస్థ రూ.87,520 కోట్లతో విశాఖ సమీపంలోని అచ్యుతాపురం, అడవివరం, తుర్లవాడల్లో 500 ఎకరాల్లో మూడు దశల్లో డేటా సెంటర్లను ఏర్పాటు చేయనున్నది. రైడెన్ ఇన్ఫో పెట్టుబడులపై శుక్రవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలుపనున్నది. కాగా, ఈ నెల 11వ తేదీన విశాఖలో సిఫీ 450 మెగావాట్ల డేటా సెంటర్, కేబుల్ ల్యాండింగ్ స్థాపనకు భూమి పూజ జరగనున్నది. టీసీఎస్ ప్రతినిధులు గురువారం వెలగపూడి సచివాలయంలో సీఎం చంద్రబాబును కలసి విశాఖలో రెండు గిగావాట్ సామర్థ్యంతో డేటా సెంటర్‌ను స్థాపిస్తామని తెలిపారు. ఈ నిర్ణయాన్ని ముఖ్యమంత్రి ఆహ్వానించారు.

తిరుమల ఔన్నత్యం పెంచేందుకు కృషి చేస్తా

» టీటీడీ ఢిల్లీ అడ్వైజరీ చైర్మన్ సుమంత్ రెడ్డి


చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సుమంత్‌రెడ్డి

న్యూఢిల్లీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానానికి, భక్తులకు అనుసంధానంగా వ్యవహరించి, తిరుమల ఔన్నత్యాన్ని పెంచేందుకు కృషి చేస్తానని టీటీడీ ఢిల్లీ లోకల్ అడ్వైజరీ చైర్మన్ ఏడుగుండ్ల సుమంత్ రెడ్డి చెప్పారు. సుమంత్‌రెడ్డి గురువారం ఢిల్లీలోని శ్రీవారి ఆలయంలో కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, ఏపీ బీజేపీ చీఫ్ పీవీఎన్ మాధవ్ సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ శ్రీవారికి సేవ చేసే భాగ్యం కలగడం పూర్వజన్మ సుకృతమన్నారు. తనకు ఈ పదవి వచ్చేందుకు కృషి చేసిన సీఎం చంద్రబాబు, మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి, పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబటి, జగన్ పత్రిక, టీవీకి లీగల్ నోటీసులు

» అసత్య ప్రచారం చేశారని ఎమ్మెల్యే ధూళిపాళ్ల ఆగ్రహం

పొన్నూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): తనపై అసత్య ప్రచారాలకు పాల్పడిన వైసీపీ పొన్నూరు ఇన్‌చార్జి అంబటి మురళీకృష్ణ, జగన్ పత్రిక, టీవీకి పొన్నూరు ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ల నరేంద్ర కుమార్ గురువారం లీగల్ నోటీసులు పంపారు. అమరావతి కోసం పొన్నూరును ముంచివేశారని, కొండవీటి వాగు నీరు అప్పాపురం, గుంటూరు చానల్ ద్వారా పొన్నూరుకు మళ్లించడం ద్వారా రూ.మూడు వేల కోట్లు దోచుకున్నారని మురళీకృష్ణ ఆరోపించారని నోటీసులో పేర్కొన్నారు. అలాగే చేబ్రోలులోని కొమ్మమూరు కాలువ బ్రిడ్జి నిర్మాణ కాంట్రాక్టర్ నుంచి తాను రూ.5 కోట్ల కమీషన్ డిమాండ్ చేసినట్టు తప్పుడు ప్రచారం చేశారని నోటీసులో తెలిపారు. ఈ అసత్య ప్రచారాలకు క్షమాపణ చెప్పి రూ.5 కోట్ల పరిహారం చెల్లించకుంటే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తానని ధూళిపాళ్ల స్పష్టం చేశారు.

పట్టిసీమ నుంచి 708 క్యూసెక్కుల నీరు విడుదల

పోలవరం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఏలూరు జిల్లా పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు గురువారం 708 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు అధికారులు తెలిపారు. కృష్ణా డెల్టా ఆయకట్టు అధికారుల సూచన మేరకు రెండు పంపుల ద్వారా నీటి విడుదల ప్రారంభించారు.

జగన్ తప్పిదాలు సరిదిద్దాల్సిందే!

పోలవరం గైడ్‌బండ్‌ను పునర్నిర్మించాల్సిందే: విదేశీ నిపుణులు

» దానికి మరమ్మతులు సాధ్యం కాదు
» కొత్త డయాఫ్రం వాల్ 7 నెలల్లోనే సగం పూర్తయింది
» మార్చికల్లా మొత్తం అయిపోతుంది
» ఆ తర్వాత పాత వాల్‌ను మూసేయాలి
» దిగువ కాఫర్ డ్యాం సీపేజీని నిలువరించేలా చర్యలు చేపట్టాలి
» 2027 నాటికి పోలవరం పూర్తి కావాలంటే పనులను రోజువారీ పరిశీలించాల్సిందే
» రిపోర్టులో నిపుణుల స్పష్టీకరణ


పోలవరం ఎడమ స్పిల్‌వేకు పగుళ్లు వచ్చి కుంగిన గైడ్‌బండ్ (ఫైల్)

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పోలవరం ప్రాజెక్టు పనులు సజావుగా సాగాలంటే.. 2019-24 మధ్య నాటి సీఎం వైఎస్ జగన్ హయాంలో జరిగిన విధ్వంసాన్ని సరిదిద్దాల్సిందేనని నలుగురు సభ్యులతో కూడిన అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్ స్పష్టం చేసింది. నాడు కుంగిపోయిన గైడ్‌బండ్‌ను మరమ్మతు చేయడం సాధ్యం కాదని తేల్చిచెప్పింది. కొత్తగా పునర్నిర్మించాల్సిందేనని.. ఇందు కోసం డిజైన్లను తయారు చేయాలని పేర్కొంది. దిగువ కాఫర్ డ్యాం సీపేజీని నివారించేందుకు రోజువారీ పరిశీలన చేయాలని సూచించింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా ధ్వంసమైన డయాఫ్రం వాల్‌కు సమాంతరంగా నిర్మిస్తున్న కొత్త వాల్ పనులు ఏడు నెలల్లోనే 50 శాతం మేర పూర్తయ్యాయని కితాబిచ్చింది. దీనిని ఈ డిసెంబరుకే పూర్తి చేస్తామని జలవనరుల శాఖ చెబుతున్నా.. కాంట్రాక్టు సంస్థ బావర్ మాత్రం వచ్చే ఏడాది మార్చికి పూర్తి చేస్తామని చెబుతోందని తెలిపింది. మొత్తంగా ప్రాజెక్టు ప్రధాన డ్యాం పనుల్లో నాణ్యతా ప్రమాణాలు బాగున్నాయని వెల్లడించింది. ఎర్త్ కం రాక్‌ఫిల్ (ఈసీఆర్ఎఫ్) డ్యాం నిర్మాణం కోసం సేకరిస్తున్న మెటీరియల్‌లో నాణ్యత ఉందని సంతృప్తి వ్యక్తం చేసింది. ఈ మేరకు పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ)కి గత వారం (2న) నివేదిక సమర్పించింది. జగన్ 2019లో అధికారంలోకి వచ్చాక పోలవరం పనులను నిలిపివేయడం.. కేం ద్రం వద్దన్నా కాంట్రాక్టు సంస్థను తొలగించడం.. రివర్స్ టెండరింగ్ పేరిట దాదాపు ఏడాదిన్నర పాటు పనులు చేపట్టకపోవడం.. 2020లో గోదావరి నదికి వచ్చిన వరదకు డయాఫ్రం వాల్ దెబ్బతినడం, ఆ తర్వాత గైడ్‌బండ్ కుంగిపోవడం, కాఫర్ డ్యాంలో సీపేజీ తదితర నష్టాల నేపథ్యంలో ప్రాజెక్టు భవితవ్యంపై కేంద్ర జలశక్తి శాఖ తీవ్ర ఆందోళన చెందింది. భవిష్యత్ నిర్మాణాలను చేపట్టేందుకు తగిన సలహాలు ఇవ్వడానికి వీలుగా పీపీఏ సూచనల మేరకు అంతర్జాతీయ సాగునీటి ప్రాజెక్టుల నిపుణులు డేవిడ్ బి.పాల్, జియాస్ ఫ్రాంకో డి సిస్కో (అమెరికా), రిచర్డ్ డొనెల్లీ, ఎస్.హించ్ బెర్గర్ (కెనడా)లతో కూడిన అంతర్జాతీయ నిపుణుల ప్యానెల్‌ను కేంద్ర జలశక్తి శాఖ నియమించింది. ఈ బృందం ఇప్పటికి ఐదు సార్లు ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించింది. చివరిగా ఈ ఏడాది ఆగస్టు నెలాఖరులో వచ్చినప్పుడు.. కొత్త డయాఫ్రం వాల్, ఇతర పనులను అధ్యయనం చేసింది. దానిపై తమ అభిప్రాయాలతో పీపీఏకి రిపోర్టు అందజేసింది. 2027 డిసెంబరు నాటికి ప్రధాన ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని నిర్మాణ సంస్థలు ధీమా వ్యక్తం చేస్తున్నాయని.. అయితే ఇది జరగాలంటే ఆయా పనులను సాంకేతికంగా నిత్యం పరిశీలించాలని సూచించింది. మరోసారి ప్రాజెక్టు ప్రాంతంలో పర్యటించేందుకు సంసిద్ధత వ్యక్తంచేసింది. నవంబరులో 1, 15 తేదీల్లో, డిసెంబరులోనూ 1, 15 తేదీల్లో అందుబాటులో ఉంటామని పీపీఏకి తెలియజేసింది.

నిపుణుల కీలక సూచనలివీ..

- కొత్త డయాఫ్రం వాల్ పూర్తయ్యాక.. దెబ్బతిన్న పాత డయాఫ్రం వాల్‌ను తొలగించాలి. ఇందుకోసం ఒక వర్క్‌షాపు నిర్వహించాలి. వాల్ నిర్మాణ పనుల ప్రగతి సంతృప్తికరంగా ఉంది. కేంద్ర జలశక్తి శాఖ వినియోగిస్తున్న 'ప్రైమావీరా' సాఫ్ట్‌వేర్ ద్వారా డయాఫ్రం వాల్ పనులను రోజువారీగా పరిశీలించాలి.
- దెబ్బతిన్న గైడ్‌బండ్ స్థానంలో కొత్తది నిర్మించాలి.
- సీపేజీ ఉన్న దిగువ కాఫర్ డ్యాంను కూడా రోజువారీ పరిశీలన చేయాలి. సీపేజీ నివారణకు చర్యలు చేపట్టాలి.
- స్పిల్‌వే సంబంధిత పనులన్నీ 2027 డిసెంబరుకు పూర్తి చేయాలి.
- గ్యాప్-2 ఈసీఆర్ఎఫ్ డ్యాం కార్యాచరణను నవంబరు నాటికి సిద్ధం చేయాలి.

ఆర్టీసీ సిబ్బందిపై దాడులను అరికట్టాలి:ఈయూ

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో స్త్రీ శక్తి పథకాన్ని విజయవంతం చేయడంలో రాత్రింబవళ్లు కష్టపడుతోన్న కండక్టర్లు, డ్రైవర్లపై తరచూ దాడులు చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎంప్లాయీస్ అసోసియేషన్(ఈయూ) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పలిశెట్టి దామోదర్ రావు, నరసయ్య డిమాండ్ చేశారు. సిబ్బందిపై దాడులకు తెగబడటం హేయమైన చర్య అన్నారు. ప్రభుత్వ పెద్దలు ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకుని దాడులు చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

నేడు, రేపు వర్షాలు

» 16 లేదా 17న ఈశాన్య రుతుపవనాల రాక

విశాఖపట్నం/అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): దక్షిణ ఒడిశా నుంచి ఏపీ, తమిళనాడు మీదుగా కొమరిన్ ప్రాంతం వరకు ఉపరితల ద్రోణి విస్తరించింది. దీనికితోడు రాష్ట్రంలో ఎండ తీవ్రంగా ఉంది. దీంతో వాతావరణ అనిశ్చితి నెలకొని గురువారం కోస్తా, రాయలసీమల్లో పలు చోట్ల క్యుములోనింబస్ మేఘాలు ఆవరించి పిడుగులు, మెరుపులు, ఉరుములతో వర్షాలు కురిశాయి. తిరుపతి జిల్లా పూలతోటలో 6.8, హస్తకావేరిలో 5.3, అనకాపల్లి జిల్లా లక్ష్మీనారాయణనగర్‌లో 5.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తాలో అనేక చోట్ల, రాయలసీమలో పలుచోట్ల వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. శుక్ర, శని వారాల్లో ఉత్తరకోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. కాగా, శుక్రవారం అల్లూరి జిల్లాతో పాటు రాయలసీమలో పిడుగులతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. ఇక, ఈనెల 16 లేదా 17వ తేదీన దేశం నుంచి నైరుతి రుతుపవనాలు నిష్క్రమించనున్నాయని, అదే సమయంలో ఈశాన్య రుతుపవనాలు దక్షిణ భారతంలోకి ప్రవేశించి వర్షాలు పెరుగుతాయని వాతావరణ శాఖ తెలిపింది.

తిరుమలలో జోరు వాన.. కొండపై పెరిగిన చలి

తిరుమల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): తిరుమలలో గురువారం జోరున వాన పడింది. దీంతో తిరుమల క్షేత్రం మొత్తం తడిసి ముద్దయ్యింది. ఉదయం 30 నిమిషాల పాటు వర్షం దంచికొట్టింది. తిరిగి మధ్యాహ్నం మరో గంట సేపు వాన కురిసింది. శ్రీవారి దర్శనానికి వెళ్లేవారితోపాటు, దర్శనం చేసుకుని ఆలయం వెలుపలకు వచ్చిన భక్తులు కూడా తడిసి ముద్దయ్యారు. ఇక సాయంత్రం నుంచి తిరుమలలో చలి పెరిగింది. సర్వదర్శనం కోసం క్యూలైన్‌లో ఉన్న భక్తులు చలికి ఇబ్బంది పడ్డారు.

టీటీడీ చైర్మన్‌పై అభ్యంతరకర పోస్ట్

» మహ్మద్ రఫీక్ అనే వ్యక్తిపై కేసు నమోదు

తిరుమల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): టీటీడీ చైర్మన్, సిబ్బందిని తప్పుడుబడుతూ సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన మహ్మద్ రఫీక్ అనే వ్యక్తిపై తిరుమల వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదయింది. తిరుమలలోని తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద భవనంలో ఓ యువతి చేసిన రీల్స్‌ను రఫీక్ తన ఫేస్‌బుక్ పేజీలో పోస్ట్ చేస్తూ 'ఇది బీఆర్ నాయుడు బాగోతం.. టీటీడీలో చాలా అభ్యంతరకర ప్రవర్తన.. భూమన షాకింగ్ నిజాలు' అని పేర్కొన్నారు. దీనిపై టీటీడీ విజిలెన్స్ విభాగం ఏవీఎస్వో వెంకట నగేష్‌బాబు బుధవారం తిరుమల వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. తిరుమల పవిత్రతను దెబ్బతీసే విధంగా ప్రజల్లో అపోహలు, ద్వేషం రేకెత్తించే ప్రయత్నం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. వన్‌టౌన్ పోలీసులు బుధవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

పస్మాండ ముస్లింల అభివృద్ధే బీజేపీ ధ్యేయం

» మైనార్టీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్దిఖీ
» మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా సయ్యద్ బాషా ప్రమాణస్వీకారం

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): 'దేశంలోని ముస్లింలలో 80 శాతం మంది పస్మాండ వర్గానికి చెందిన వారే ఉన్నారు. గత ప్రభుత్వాలు వారిని ఓటు బ్యాంకుగా వాడుకున్నాయి. నరేంద్ర మోదీ ప్రభుత్వం పస్మాండ ముస్లింల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తోంది' అని బీజేపీ మైనార్టీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జమాల్ సిద్దిఖీ అన్నారు. మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన సయ్యద్ బాషా ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని గురువారం విజయవాడలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సిద్దిఖీ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మైనార్టీల కోసం విద్య, ఉపాధి కల్పించిందని, ట్రిపుల్ తలాక్‌ను రద్దు చేసి మైనార్టీ మహిళలకు భరోసా కల్పించిందని వివరించారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూస్తే ఎన్డీఏ ప్రభుత్వం వారి కోసం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెట్టిందన్నారు.

రాయవరం పేలుడుపై విచారణ కమిటీ

» మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ నేతృత్వం
» బాధ్యుల గుర్తింపు.. పేలుడుకు కారణాలపై దర్యాప్తు
» వారం రోజుల్లో నివేదికకు సీఎస్ ఆదేశం

అమరావతి, కాకినాడ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలంలోని బాణసంచా తయారీ యూనిట్‌లో బుధవారం సంభవించిన భారీ పేలుడు ఘటనపై ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది ప్రాణాలు కోల్పోవడంతో.. పేలుడుకు గల కారణాలను తెలుసుకోవడానికి గురువారం విచారణ కమిటీని నియమించింది. మునిసిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ నేతృత్వంలో కమిటీని నియమించగా, కమిటీ సభ్యుడిగా ఐజీ ఆకే రవికృష్ణను నియమించింది. ఈ కమిటీకి సహకరించాలని కోనసీమ జిల్లా కలెక్టర్ మహేశ్‌కుమార్, ఎస్పీ రాహుల్ మీనాను ఆదేశించింది. ఈ కమిటీతో సమన్వయం కోసం జిల్లాస్థాయిలో ఒక నోడల్ అధికారి కూడా నియమిస్తారు. 'బాణసంచా తయారీ యూనిట్‌లో పేలుడు సంభవించడానికి దారితీసిన కారణాలను గుర్తించడం. ఘటనకు బాధ్యులైన వ్యక్తులను నిర్ధారించడం. ఇలాంటి ప్రమాదాలు మళ్లీ జరక్కుండా అవసరమైన జాగ్రత్తలు, సూచనలను సిఫార్సు చేయడం' ఈ కమిటీ చేయాల్సిన పని. ఈ కమిటీ వారం రోజుల్లో నివేదిక సమర్పించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

పేలుడు ఘటనలో మరొకరి మృతి

జీజీహెచ్ (కాకినాడ): బాణసంచా పేలుడు ఘటనలో తీవ్రంగా గాయపడి కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఒకరు బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత చనిపోయారు. బుధవారం కొమరిపాలెంలోని బాణసంచా గొడౌన్‌లో జరిగిన విస్ఫోటంలో గాయపడిన ముగ్గురు కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో రాయవరం మండలం సోమేశ్వరం గ్రామానికి చెందిన వాసంశెట్టి విజయలక్ష్మి(45) మరణించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

శాంతి కుసుమిస్తుందా?

అమెరికా అధ్యక్షుడి నోబెల్ శాంతి పురస్కార కాంక్ష రెండేళ్ళ యుద్ధాన్ని కొలిక్కితెస్తున్నట్టుంది. పతకం మోజులో ఆయన పాలస్తీనియన్లకు అన్యాయం చేశాడనీ, అయినా, అరబ్, ముస్లిం దేశాలు కక్కలేక, మింగలేక ఆ ఇరవైసూత్రాల శాంతిపథకాన్ని పొగుడుతున్నాయని కొందరు విమర్శిస్తున్నారు. మొదట్లో దోహాలోనూ, శ్వేతసౌధంలోనూ ఒకే రీతిలో ఉన్న ఆ ప్రణాళిక ఆ తరువాత నెతన్యాహూ వైపు బాగా మొగ్గి, ట్రంప్ ఒత్తిళ్ళు, హెచ్చరికలు, లక్ష్మణరేఖల బలంతో బలవంతంగా పట్టాలెక్కిందని అంటున్నారు. ఎవరు చెప్పారు మనకు నష్టం జరుగుతోందని, మన సైనికులు వెనుకడుగువేయాలని, ఊసేలేని పాలస్తీనా రాజ్యాన్ని మనం ఒప్పుకుంటున్నామని? అంటూ హిబ్రూలో బెంజమెన్ నెతన్యాహూ తన ప్రజలకు భరోసా ఇస్తున్నారు. గాజా మీద ఏకపక్ష యుద్ధంలో వేలాది మందిని సంహరించి, లక్షల మందిని నిరాశ్రయులను చేసి, దానిని వల్లకాడుగా మార్చినా కూడా నెతన్యాహూ సాధించలేక పోయినదానిని శాంతిప్రణాళిక పేరిట శ్వేతసౌధం ఆయనకు పళ్ళెంలో పెట్టి ఇచ్చింది. హమాస్ దుంపనాశనం, బందీల విడుదల తన లక్ష్యాలుగా, యుద్ధాన్ని నచ్చినంత కాలం, ట్రంప్ మెచ్చినంతవరకూ పొడిగిస్తూ వచ్చిన ఇజ్రాయెల్ అధినేతకు యుద్ధక్షేత్రంలో దక్కనిది శ్వేతసౌధంలో చిక్కింది. బందీలను వెనక్కు తెచ్చేవరకూ వెనకడుగువేయబోనని శపథం చేసి, అంతిమంగా నిలబెట్టుకున్నాను అని నెతన్యాహూ గర్వపడుతున్నారు. మితవాదులు, మహా జాతీయవాదులు, మత దురహంకారులతో నిండిన ఆయన కూటమి ప్రభుత్వంలోని నాయకులు మాత్రం, గాజాలో ఒక్క పాలస్తీనా ప్రాణి కూడా మిగలకూడదన్న మా లక్ష్యం ఇక నెరవేరదా? అని వాపోతున్నారు.

ప్రకటిత కాల్పుల విరమణ ఒప్పందం కడవరకూ నిలిచి, అన్ని దశలూ పూర్తిచేసుకోవడం ప్రధానం. బందీల అప్పగింతలు, సైనికుల వెనుకడుగుల లెక్కలు రాసుకున్నదానికి అనుగుణంగా సాగినప్పుడే ట్రంప్‌ను ప్రపంచ దేశాధినేతలు కీర్తిస్తున్న ఈ సందర్భానికి అర్థం ఉంటుంది. ఒప్పందం కుదిరిందన్న ప్రకటనతో అటు ఇజ్రాయెల్‌లోనూ, ఇటు గాజాలోనూ వెల్లువెత్తిన హర్షాతిరేకాలు ఇక శాశ్వతంగా నిలవాలి. అనేకసార్లు ఒప్పందాలకు మోకాలడ్డిన నెతన్యాహూను ఇటీవల ఖతార్ మీద చేసిన దాడి ఈమారు ఆత్మరక్షణలో పడవేసింది. శాంతిచర్చలు ముందంజలో ఉండగా, కీలకమైన హమాస్ నేతలను మట్టుబెట్టడం ద్వారా నెతన్యాహూ అత్యుత్సాహం ప్రదర్శించారు. ఆయన తన యుద్ధ కాంక్షను మరోమారు వెళ్ళగక్కడం కంటే, మధ్య ఆసియాలో తనకు అత్యంత కీలకమైన, అతి మిత్రదేశమైన ఖతార్‌లోకి ఇజ్రాయెల్ యుద్ధవిమానాలు చొరబడి బాంబులు కురిపించిన ఆ ఘటనను అమెరికా అధ్యక్షుడు వెనకేసుకురావడం అరబ్ దేశాలను నిర్ఘాంతపరిచింది. దోహాపై దాడిని నెతన్యాహూ తనకు చెప్పే చేశాడని ఒకసారి, తన ప్రమేయంలేదని మరోసారి, అయినా తప్పేనని వ్యాఖ్యానించి ట్రంప్ కూడా పరువుపోగొట్టుకున్నారు. రక్షణకవచంగా ఉంటానన్న అమెరికా అలా భక్షకుడి పక్షాన నిలిచి తమకు ధోకా ఇచ్చినందుకు అరబ్‌దేశాలు ఆగ్రహించడమే కాక, అవన్నీ బలంగా జట్టుకట్టడం మొదలైంది. దీంతో, అప్పటివరకూ తలెగరేస్తూవచ్చిన నెతన్యాహూ మెడలు వంచి శ్వేతసౌధం నుంచే ఖతార్ అధినేతకు ఫోన్‌లో సారీ చెప్పించడం ద్వారా ట్రంప్ కొంత ప్రాయశ్చిత్తం చేసుకున్నారు. ప్రత్యేక ఆదేశాలతో ఖతార్ భద్రతకు మరింత కట్టుబడ్డారు.

అరబ్ దేశాలు చేజారిపోతూ, మరోపక్క పాలస్తీనా రాజ్యాన్నీ, ఇరుగుపొరుగు సిద్ధాంతాన్నీ ఐరోపా అధినేతలంతా బలంగా ముందుకు తోస్తున్న తరుణంలో సమయం మించిపోతున్న సంగతి ట్రంప్ గ్రహించినట్టు ఉంది. తాను అధికారంలోకి రాగానే ఒక్క టెలిఫోన్ కాల్‌తో రష్యా అధ్యక్షుడు పుతిన్ మెడలు వంచగలననీ, ఒక్కరోజులో ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపగలననీ భ్రమసిన ట్రంప్‌ను అసహనం ముంచెత్తుతోంది. ఏడుయుద్ధాలు ఆపినా, బరాక్ ఒబామాను ప్రశంసించిన మాదిరిగా మిగతా ప్రపంచం తనను కీర్తించనందుకు ఆగ్రహం కలుగుతోంది. తనకు నోబెల్ రాకపోతే అమెరికాకే అవమానమని వారం క్రితం కూడా హెచ్చరించిన ట్రంప్, రాజ్యవిస్తరణ లక్ష్యంతో రగిలిపోతున్న నెతన్యాహూను నియంత్రించి, ఒప్పందాన్ని తుదివరకూ నిలబెట్టి, యుద్ధాన్ని ముగించాలి.

ఈ అధర్మదాడికి జవాబుదారీ ఎవరు?





■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్‌పైకి బూటు విసిరిన న్యాయవాది పేరు రాకేశ్ కిశోర్ కాకుండా రహీమ్ ఖాన్ అయి ఉంటే ఏమి జరిగి ఉండేది? ఆసక్తికరమైన ప్రశ్న, సందేహం లేదు. పాల్పడిన అపరాధానికి శిక్షించకుండా అతడిని వదిలివేయడం జరిగేది కాదు. జాతీయ భద్రతా చట్టం, (కశ్మీరీ ముస్లిం అయి ఉంటే) ప్రజా భద్రత చట్టం, బహుశా, చట్టవిరుద్ధ కార్యకలాపాల నిరోధక చట్టం కింద కూడా అతడు తప్పక అభియోగాలను ఎదుర్కోవలసివచ్చేది. నాగరిక సంస్కారం లోపించిన ప్రజాభిప్రాయం నేర న్యాయ విచారణ ప్రక్రియను ప్రభావితం చేయగల విద్వేషపూరిత, సంకుచిత సంఘర్షణలు ప్రబలంగా ఉన్న సామాజిక పర్యావరణ వ్యవస్థపై దృష్టి పెట్టేలా ప్రజలను పురిగొల్పేందుకే నేను ఆ ప్రశ్నను సంధించాను.

సీజేఐపై బూటు దాడికి దారితీసిన ఘటనల క్రమాన్ని నిశితంగా చూద్దాం. ఖజురహోలోని ఒక ఆలయంలో విరిగిన విష్ణుమూర్తి ప్రతిమ నొకదానికి పూర్వ వైభవాన్ని పునరుద్ధరించేందుకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరుతూ దాఖలైన ఒక పిటిషన్‌ను ప్రధాన న్యాయమూర్తి గవాయ్ కొట్టివేశారు. ఆ సందర్భంగా 'ఇది, ప్రచార కండూతితో దాఖలు చేసిన పిటిషన్' అని సీజేఐ వ్యాఖ్యానించారు. 'పిటిషనర్ విష్ణువుకు భక్తవరేణ్యుడు అయితే ఆయనే దేవుడిని ప్రార్థించాలి, కొంచెం ధ్యానం చేయాలి' అని కూడా గవాయ్ అన్నారు. ఒక విధంగా వెటకారం ధ్వనిస్తున్నట్టుగా ఉన్న ఆయన మాటలు పూర్తిగా అనవసరమైనవి. అయితే అవి విచారణలో యథాలాపంగా చేసిన వ్యాఖ్యలు మాత్రమే అని గుర్తుంచుకోవాలి. ఖజురహోలో విష్ణు ప్రతిమ పునః ప్రతిష్ఠాపన కోర్టు పరిధిలోని అంశం కాదని, దానిపై నిర్ణయం తీసుకోవల్సింది భారత పురావస్తు సర్వే అని స్పష్టం చేస్తూ సుప్రీంకోర్టు ఆ పిటిషన్‌ను కొట్టివేసింది.

సర్వోన్నత న్యాయస్థానం సహేతుక తీర్పులు చదివే విజ్ఞత, సామాజిక మాధ్యమాల్లో చెలరేగిపోతుండే రాజకీయ, సైద్ధాంతిక సేనా శ్రేణులకు దురదృష్టవశాత్తు పూర్తిగా కొరవడింది. ఖజురహో విష్ణుమూర్తి విగ్రహంపై సీజేఐ వ్యాఖ్యలు మితవాద రాజకీయ, సైద్ధాంతిక బృందాల నుంచి అనియంత్రిత ఆగ్రహావేశాల ప్రతిస్పందనలను వెల్లువెత్తించాయి. దేశ పాలకుల అండదండలు ఉన్నందునే ఈ మితవాద శ్రేణులు అలా రెచ్చిపోయాయి. వ్యూహాత్మకంగా వెల్లువెత్తిన ఈ 'ప్రజాగ్రహం'తో తన వ్యాఖ్యలపై వివరణ ఇవ్వడం సీజేఐకి అనివార్యమయింది. 'తాను మతాలను విశ్వసిస్తానని, అన్ని మతాల ఆరాధనా మందిరాలను సమరీతి భక్తి ప్రపత్తులతో సందర్శిస్తుంటానని, 'నిజమైన లౌకికవాదం'లో తనకు సంపూర్ణ నమ్మకం ఉందని' గవాయ్ అన్నారు. అయితే ఈ వివరణ సామాజిక మాధ్యమాలలో ఆయనపై తీవ్ర విమర్శలు చేస్తున్న కరడుగట్టిన మితవాదులను సంతృప్తిపరచలేదు. సరికదా మరింత తెగింపుతో మీమ్‌లు, హ్యాష్ ట్యాగ్‌లు, యూట్యూబ్ వీడియోలతో సీజేఐ గవాయ్‌పై తమ దాడిని కొనసాగించారు.

ఈ ఆవేశపూరిత వాతావరణంలో 71 సంవత్సరాల సీనియర్ న్యాయవాది రాకేశ్ కిశోర్, సుప్రీంకోర్టులో సీజేఐ గవాయ్‌పై బూటును విసిరివేయడం ద్వారా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేయదలుచుకున్నాడు. 'సనాతన్ ధర్మ్ కా అప్మాన్, నహీ సహేగా హిందుస్థాన్!' (సనాతన ధర్మానికి అవమానం కలిగితే భారతదేశం సహించదు) అని వ్యాఖ్యానించాడు. తనపై దాడి పట్ల జస్టిస్ గవాయ్ సంయమనంతో వ్యవహరించి, విచారణ విధులు కొనసాగించారు. బూటు విసిరిన సనాతనవాదిపై కేసు దాఖలు చేసేందుకు తిరస్కరించారు. తన అనాగరిక చర్యపట్ల రాకేశ్ కిశోర్‌లో ఎలాంటి పశ్చాత్తాపం లేదు. తనకు లభించిన 'ప్రఖ్యాతి'కి ఆనందిస్తూ 'అటువంటి పని మళ్లీ చేస్తాను' అని కూడా రాకేశ్ కిశోర్ అన్నాడు. ఈ మహాశయుడిపై స్వయంగా చర్య చేపట్టవలసిన ఢిల్లీ పోలీసులు సీజేఐపై బూటు దాడి వ్యవహారంలో జోక్యం చేసుకోకుండా మిన్నకుండిపోయారు. దీంతో కోర్టు ధిక్కారానికి పాల్పడిన న్యాయవాది రాకేశ్ కిశోర్ మరింత నిర్భయంగా ఏవేవో మాట్లాడడం కొనసాగిస్తున్నారు. తన చర్యను సమర్థిస్తున్న వారి నుంచి మరింతగా ప్రశంసలు అందుకుంటున్నారు. సమాజ జీవితం నుంచి బహిష్కరణకు గురికావల్సిన అపరాధికి ఇటువంటి వైభవం లభించడాన్ని ఎలా అర్థం చేసుకోవాలి?

సీజేఐపై దాడిపట్ల న్యాయశాఖ మంత్రి అర్జున్ మేఘ్వాల్ మౌనంగా ఉండిపోయారు. బహిరంగంగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఘటన సంభవించిన ఎనిమిది గంటల అనంతరం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రతిస్పందించారు. 'ఈ ఉదయం సుప్రీంకోర్టు ప్రాంగణంలో భారత ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి పట్ల ప్రతి భారతీయుడూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాడు. మన సమాజంలో ఇలాంటి అనాగరిక చర్యలకు తావులేదు. ఇది పూర్తిగా ఖండించదగినది' అని ప్రధానమంత్రి ట్వీట్ చేశారు. స్వాగతించాల్సిన మాటలు, సందేహం లేదు. అయితే ఈ సందర్భంలో ఒక పాత విషయాన్ని గుర్తు చేసుకోవల్సిన అవసరమున్నది. 2019లో నాథూరామ్ గాడ్సేను బీజేపీ ఎంపీ ప్రగ్యాసింగ్ ఠాకూర్ కొనియాడారు. దీనిపై మోదీ ఆవేదన వ్యక్తం చేస్తూ ఆమెను పూర్తిగా క్షమించలేనని అన్నారు. అయితే ఆ బీజేపీ ఎంపీపై ప్రభుత్వం గానీ, పార్టీ గానీ ఎలాంటి చర్య తీసుకోలేదు. మరింత గందరగోళానికి ఆస్కారమివ్వకుండా ప్రగ్యా ఠాకూర్ తన పార్లమెంటు సభ్యత్వ కాలాన్ని పూర్తిచేశారు. ఆమె హిందూత్వ భావజాల అనుయాయి. కనుకనే గాడ్సేను మెచ్చుకోవడానికి వెనుకాడలేదు. ఆ మాటకు వస్తే సంఘ్ పరివార్ ఇప్పటికీ గాడ్సే ఆరాధన నుంచి తనను తాను దూరం చేసుకోలేదు.

తాను సనాతన ధర్మ 'రక్షకుడు'నని చెప్పుకున్న రాకేశ్ కిశోర్ కూడా సంఘ్ పరివార్ భావజాల వ్యవస్థలో భాగమే కదా. మహాత్ముడిని హతమార్చేందుకు గాడ్సే తుపాకీ పేల్చగా రాకేశ్ కిశోర్ తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసేందుకు సాపేక్షంగా మృదు ఆయుధమైన ఒక బూటును ఉపయోగించుకున్నాడు. ఈ రెండు ఘటనల్లోనూ అసహన మనస్తత్వమే ప్రస్ఫుటమయిందన్న వాస్తవాన్ని ఎవరూ కాదనలేరు. 'హిందువుల మనోభావాలు' దెబ్బతిన్నాయన్న వ్యక్తిగత అవగాహనతోనే నాడు గాడ్సే, నేడు రాకేశ్ కిశోర్ అనుచిత చర్యలకు పాల్పడ్డారు. తమ మనోభావాలకు కలిగిన విఘాతంతో ఇరువురి భావోద్వేగాలు హింసాత్మకంగా పరిణమించాయి. మరి ఈ ప్రచండ హిందూత్వ వాదులు 'San Tan Se Juda' (ఇస్లామ్‌ను దూషించినందుకు శిక్ష శరీరం నుంచి తలను నరికివేయడం) అని నినదించే ఇస్లామిస్టుల నుంచి ఎలా భిన్నమైనవారు? మనోభావాలు దెబ్బతినడం అన్నది ఒక మత సమూహానికే పరిమితం కాక, భిన్న మత సమూహాలలో పరివ్యాప్తమై ఉన్నది. ఇటువంటి పరిస్థితులలో సీజేఐపై బూటు దాడిని మాత్రమే ఖండిస్తే సరిపోదు. మనోభావాల విఘాతానికి హింసాత్మకంగా ప్రతిస్పందించడం సమర్థనీయం కాదు. అది పూర్తిగా గర్హించవలసిన విషయం.

సీజేఐపై బూటు దాడి వ్యవహారంలో మరో సమస్యాత్మక కోణం ఉన్నది. భారత ప్రధాన న్యాయమూర్తి అయిన రెండో దళితుడు జస్టిస్ గవాయ్. నవ బౌద్ధ సంప్రదాయం, అంబేడ్కర్ భావజాలాన్ని విశ్వసించే ఒక రాజకీయ కుటుంబం నుంచి ఆయన ప్రభవించారు. జస్టిస్ గవాయ్ తండ్రి భారతీయ రిపబ్లికన్ పార్టీ ఉద్యమంలో ప్రముఖ నాయకుడు. జస్టిస్ గవాయ్ భారత ప్రధాన న్యాయమూర్తి కావడం సమాజంలోని అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు లభించాలన్న అంబేడ్కర్ స్వప్నసాకారానికి చిహ్నంగా భావించవచ్చు. దళిత ఉద్యమంలో కుటుంబ మూలాల కారణంగా జస్టిస్ గవాయ్ మొదటి నుంచి మితవాదుల దాడులకు గురవుతున్నారు. ఏడాది క్రితం 'బుల్డోజర్ న్యాయం'పై ఆయన తన తీర్పు వెలువరించినప్పుడు మితవాద బృందాల నుంచి తీవ్ర విమర్శలకు గురయ్యారు. 'బుల్డోజర్ న్యాయం'ను అమలుపరచడంలో ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ నేతృత్వంలోని ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం అగ్రగామిగా ఉన్నది. దృఢమైన, రాజీపడని హిందూత్వ ప్రభుత్వమది. మరి 'బుల్డోజర్ న్యాయం'కు వ్యతిరేకంగా తీర్పునిచ్చిన జస్టిస్ గవాయ్‌పై హిందూత్వవాదులు ధ్వజమెత్తడంలో ఆశ్చర్యమేమీ లేదు.

ఈ నేపథ్యంలో సీజేఐపై బూటు దాడి వెనుక ఉన్న లక్ష్యాన్ని అర్థం చేసుకోవాలి. జనసమ్మతంగా ఉన్న రాజ్యాంగబద్ధ పాలనా వ్యవస్థలో 'సనాతన ధర్మ' ఆధిక్యతను నెలకొల్పేందుకు జరిగిన ప్రయత్నమే జస్టిస్ గవాయ్‌పై బూటు దాడి. న్యాయవాది రాకేశ్ కిశోర్ తన బూటు దాడిలో కేవలం జస్టిస్ గవాయ్‌ని మాత్రమే కాకుండా వివేకవంతమైన, న్యాయ బద్ధంగా, వివక్షారహితంగా పని చేస్తున్న న్యాయవ్యవస్థను కూడా లక్ష్యంగా చేసుకున్నారు. ఆ నిష్పాక్షిక న్యాయవ్యవస్థను బెదిరించేందుకు, బలహీనపరిచేందుకు ఉద్దేశపూర్వకంగా చేసిన ప్రయత్నమే ఆ దాడి. న్యాయవాది రాకేశ్ కిశోర్ చర్య ఒక నిర్దిష్ట లక్ష్యాన్ని సాధించేందుకై ఒక పథకం ప్రకారం జరిగిన ప్రయత్నమే ఆ బూటు దాడి. తద్వారా అది ఒక రాజకీయ లక్ష్యాన్ని విస్పష్టంగా ప్రకటించింది. ఆ లక్ష్యమేమిటో ప్రజలు అందరూ గ్రహించాలన్న ధ్యేయంతోనే న్యాయవాది రాకేశ్ కిశోర్ తెంపరితనంతో ఆ చర్యకు పాల్పడ్డాడు. కొన్ని సంవత్సరాల క్రితం అయితే అతడిని మన సమాజంలో అధిక సంఖ్యాకులకు ఆమోద యోగ్యంగా లేని ఒక భావజాల అనుయాయిగా పరిగణించి ఉండేవారు. ఇప్పుడు పరిస్థితి అది కాదు. సమాన పౌరసత్వం ప్రాతిపదికన పని చేస్తున్న రాజ్యాంగబద్ధ పాలనా వ్యవస్థ స్థానంలో హిందూత్వ భావజాలంతో నడిచే పాలనా వ్యవస్థను నెలకొల్పడానికి ఆరాటపడుతున్న మెజారిటేరియన్ ప్రపంచ దృక్పథానికి అతడు ప్రతినిధి. అందుకే ఆ బూటు దాడి చాలా ప్రమాదకరమైనది, సమర్థించరానిది. బహుళ మతాలు విలసిల్లుతున్న సమాజంలో పాలనా వ్యవస్థ మత విశ్వాసాలకు అతీతంగా ఉండాలి. మతపరమైన మనోభావాలకు విఘాతం కలిగిందనే నెపంతో పాల్పడే ఎటువంటి హింసాత్మకచర్యలనైనా ప్రతి ఒక్కరూ నిర్ద్వంద్వంగా ఖండించాలి.

> జనసమ్మతంగా ఉన్న రాజ్యాంగబద్ధ పాలనా వ్యవస్థలో 'సనాతన ధర్మ' ఆధిక్యతను నెలకొల్పేందుకు జరిగిన ప్రయత్నమే భారత ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్. గవాయ్‌పై బూటు దాడి. న్యాయవాది రాకేశ్ కిశోర్ తన చర్యకు కేవలం జస్టిస్ గవాయ్‌ని మాత్రమే కాకుండా వివేకవంతమైన, న్యాయబద్ధంగా, వివక్షారహితంగా పనిచేస్తున్న న్యాయవ్యవస్థనూ లక్ష్యంగా చేసుకున్నాడు. మతపరమైన మనోభావాలకు విఘాతం కలిగిందనే నెపంతో పాల్పడే ఎటువంటి హింసాత్మకచర్యలనైనా ప్రతి ఒక్కరూ నిర్ద్వంద్వంగా ఖండించాలి.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

ట్రంప్ వ్యర్థ ప్రలాపాలు

వాతావరణ మార్పు ఒక 'మహా వంచన' – ఇది, అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వక్కాణించిన మాట. ఐక్యరాజ్యసమితి 80వ సర్వ ప్రతినిధి సభలో ప్రసంగిస్తూ ఆయన ఈ ఆరోపణ చేశారు. ఆయన ఉద్దేశంలో వాతావరణ మార్పును అరికట్టేందుకు తక్షణమే కార్యసాధక చర్యలు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నవారు అందరూ దగాకోరులే సుమా! తన అసంబద్ధ ప్రలాపంలో హరిత ఇంధన పరివర్తనకు ప్రయత్నిస్తోన్న యూరోప్‌ను ట్రంప్ మరీ నిందించారు. శిలాజ ఇంధనాలకు స్వస్తి చెప్పి హరిత ఇంధనాలను మరింతగా వినియోగించుకునేందుకు యూరోపియన్ దేశాలు చేస్తున్న ప్రయత్నాల వల్ల వ్యయాలు పెరుగుతాయి, అభివృద్ధి అంతమవుతుందని ఆయన విమర్శించారు. వాతావరణ మార్పును ధ్రువీకరిస్తున్న వైజ్ఞానిక నిదర్శనాలను ఆయన కొట్టివేశారు. బొగ్గు కాలుష్యరహిత స్వచ్ఛమైన ఇంధన వనరు అని ట్రంప్ నొక్కి చెప్పారు. మీ అవగాహనా సామర్థ్యాన్ని న్యూనపరిచేందుకో, ట్రంప్ వాదనలు ఎంత అహేతుకమో వివరించేందుకో నేను ఇది రాయడం లేదు. వాతావరణ మార్పు ఎంత వాస్తవమో మనకు అనుభవపూర్వకంగా తెలుసు. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ వైపరీత్యాలు పెచ్చరిల్లిపోతూ అపార ఆర్థిక విధ్వంసానికి, అంతులేని మానవ విషాదానికి కారణమవుతున్నాయి.



■ సునీతా నారాయణ్

మట్టివాసన

ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో ప్రసంగిస్తున్నప్పుడు ట్రంప్ మహాశయుడు నిజంగా ఎవరిని ఉద్దేశించి మాట్లాడారు? అన్నదే అసలు ప్రశ్న. ఈ విషయమై మనం చర్చించి తీరాలి. ఐరాసలో సమావేశమైన ప్రపంచ నాయకులను ఉద్దేశించి ఆయన మాట్లాడలేదు; మీరు, నా లాంటి వాళ్లను ఉద్దేశించి కూడా ఆయన మాట్లాడలేదు. అభివృద్ధి చెందిన దేశాలలో మధ్యతరగతి, శ్రామికవర్గ జనావళిని ఉద్దేశించే ఆయన ఆ ప్రసంగాన్ని వెలువరించారని నేను భావిస్తున్నాను. తమ ఆర్థిక వ్యవస్థలు ప్రపంచీకరణ అవడం వల్ల తాము ఎంతగానో నష్టపోయామని, దగా పడ్డామని ఈ రెండు వర్గాలవారు నమ్ముతున్నారు. తమ దేశాలను దురాక్రమించిన 'వలసకారులు' తమ జీవనాధారాలను కొల్లగొడుతున్నారనే భావం ఈ రెండు వర్గాల ప్రజల మనసుల్లో ఉన్నది. ఆ భావం మరింత ప్రగాఢంగా నాటుకుపోయేలా చేయడమే ట్రంప్ లక్ష్యం. బలహీన ప్రభుత్వాలు వలసకారుల వెల్లువను అనుమతిస్తున్నాయని ట్రంప్ ఆక్రోశిస్తున్నారు. ఈ వలసల కారణంగా జీవన వ్యయాలు పెరిగిపోతున్నాయని, నిజ వేతనాలు తగ్గిపోతున్నాయని, ఈ పరిణామాలు పాశ్చాత్య నాగరికత పతనానికి దారితీస్తాయని ట్రంప్ ఆందోళన చెందుతున్నారు.



కాలుష్య రహిత అభివృద్ధే అన్ని విధాల శ్రేయోదాయకమైనది. పర్యావరణ సమతౌల్యతకు హాని చేసే అభివృద్ధి మన ఉమ్మడి ఆవాసమైన ఈ ధరిత్రిని తప్పక ధ్వంసం చేస్తుంది. ఐక్యరాజ్యసమితిలో ట్రంప్ ప్రసంగం వాతావరణ మార్పు భావన సహేతుకతను నిర్మూలించేందుకు చాలా జాగ్రత్తగా రూపొందించిన వ్యూహం. దీన్ని మనం సమర్థంగా ఎదుర్కోవాలి.

ఈ సందేశాన్ని ప్రపంచమంతటికీ, మరీ ముఖ్యంగా పాశ్చాత్య దేశాలు అన్నిటికీ తీసుకువెళ్లాలన్నది ట్రంప్ ధ్యేయంగా ఉన్నది. తద్వారా పాశ్చాత్య దేశాలలో 'వామపక్ష పిచ్చివాళ్ల' (ఇది ఆయన మాటే, నాది కాదు) పట్ల వ్యతిరేకత ప్రబలిపోయేలా చేయాలని ఆయన సంకల్పించుకున్నారు. సామాజిక న్యాయం, వాతావరణ చర్యకు నిబద్ధమైన ప్రభుత్వాలకు దూరమై 'సరైన' విధానాల పట్ల ప్రజలు ఆకర్షితులయ్యేలా చేసేందుకు జరిగిన రాజకీయ ప్రయత్నంగా ఐక్యరాజ్యసమితిలో ట్రంప్ ప్రసంగాన్ని చూడాలి. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి నేతృత్వం వహించిన, స్వేచ్ఛా విపణి ప్రపంచీకరణ వ్యవస్థను నిర్మించిన పాశ్చాత్య దేశాలలో ప్రజలు తీవ్ర ఆగ్రహంతో ఉన్నారనే విషయాన్ని కూడా మనం విస్మరించకూడదు. ట్రంప్ తన మాటలతో వారిలో ఆ ఆగ్రహం మరింతగా ప్రజ్వరిల్లేలా చేస్తున్నారు. తద్వారా పాశ్చాత్య ప్రపంచ రాజకీయాలలో తాను ఒక మౌలిక మార్పు తీసుకురాగలనని ఆయన విశ్వసిస్తున్నారు.

బహుళ పాక్షిక వ్యవస్థకు, ప్రపంచ సంఘీభావానికి, వాతావరణ మార్పు నిరోధక చర్యలకు వ్యతిరేకంగా ఉన్నవారు అంతిమ విజయం సాధించాలని ట్రంప్ ప్రగాఢంగా అభిలషిస్తున్నారు. ఇది ఇంతకు ముందెన్నడూ చూడని రీతిలో పాలనా వ్యవస్థల మార్పును సంకల్పించడమే. అదే సంభవిస్తోంది మరి. యూరోప్ వాతావరణ విధానాలు ఎదురుగాలులను ఎదుర్కొంటున్నాయి. తదుపరి విడత ఉద్గారాల తగ్గింపు లక్ష్యాల విషయమై ఒక ఒప్పందాన్ని సాధించడంలో యూరోపియన్ కమిషన్ విఫలమయింది. ఈ విధానాలకు ప్రతిఘటన అంతకంతకూ పెరుగుతోంది. ట్రంప్ వలే వాతావరణ మార్పును నిరాకరిస్తున్న రాజకీయ పార్టీల పట్ల అనుకూలత పెరుగుతోంది. ఇది చాలా శోచనీయం.

ఈ మార్పులు మరింత వేగవంతమవ్వాలని ట్రంప్ ఆశిస్తున్నారు. అప్పుడే ప్రపంచం తన పక్షానికి వస్తుందనేది ఆయన భావిస్తున్నారు. ఇదొక రాజకీయ చదరంగం. వాతావరణ మార్పు అనేది ఇందులో ఒక పాచిక. ఇంధన వాణిజ్యంలో ఆర్థిక ప్రయోజనాలే ప్రధాన లక్ష్యంగా ఈ రాజకీయం జరుగుతోంది. ఇందులో భాగంగానే వాతావరణ మార్పు నిరోధక అజెండా అనేది 'వామపక్ష వెర్రి వాళ్లది' అని ట్రంప్ పదే పదే అపహసిస్తున్నారు. వాతావరణ మార్పు విపత్తుతో మానవాళి మనుగడే సంక్షోభంలో పడిందని విశ్వసిస్తున్న, కాలుష్య ఇంధన వ్యవస్థలను నిర్మూలం చేయాల్సిన అవసరముందని భావిస్తున్న వారందరూ ఆయన దృష్టిలో వామపక్ష వెర్రివాళ్లే! ఇటువంటి వైఖరి ప్రజలు ఏదో ఒక పక్షం వైపు మొగ్గేలా చేస్తుంది. కొవిడ్ విలయం కాలంలో ఇదే జరిగింది. యూరోపియన్ యూనియన్ నుంచి వైదొలగాలా లేక అందులోనే కొనసాగాలా అనే విషయమై ఓటింగ్ సమయంలో బ్రిటన్‌లోనూ సంభవించింది కూడా ఇదే కాదూ? సమాజంలో ఇటువంటి చీలికలు సమస్యను మరింత సంక్లిష్టం చేస్తాయి. కులీనులు వెర్సెస్ సామాన్యులుగా సమాజాన్ని చీల్చివేస్తాయి. మరింత ఘోరమైన విషయమేమిటంటే ఈ ధోరణి వైజ్ఞానిక పరిశోధనలనూ కొట్టివేస్తోంది. నిపుణులు వాస్తవాన్ని అర్థం చేసుకోవడం లేదని దుయ్యబడుతున్నది. సామాన్య ప్రజల బాధాకర వాస్తవాలను అర్థం చేసుకోవడం లేదని ఆక్షేపిస్తోంది.

ఈ ప్రమాదకర ధోరణులకు వ్యతిరేకంగా మనం పోరాడాలి. ఐక్యరాజ్యసమితిలో ట్రంప్ అవమానకరమైన మాటల కంటే ఇవి మరింత హానికరమైనవి. భారత్ లాంటి అభివృద్ధి చెందుతున్న దేశాలలో పనిచేస్తున్న పర్యావరణ వాదులను అలా ఆక్షేపించడం వారి కృషిని, నిబద్ధతను తక్కువ చేయడమే అవుతుంది. ట్రంప్ దృష్టిలో వర్ధమాన దేశాలలోని పర్యావరణ వాదులు అభివృద్ధి నిరోధకులే! పర్యావరణం, అభివృద్ధి అనేవి ఒకే నాణేనికి బొమ్మ–బొరుసు లాంటివనే సత్యాన్ని గుర్తించేందుకు ఆయన నిరాకరిస్తున్నారు. ఈ కారణంగానే మేము చాలా జాగ్రత్తగా, ఉద్దేశపూర్వకంగా వాతావరణ మార్పు నిరోధక విధానాలు మా దేశాల అభివృద్ధి వ్యూహాలలో భాగంగా ఉండేలా చేసేందుకు కృషి చేస్తున్నాము. కాలుష్యం లేకుండా సాధించే అభివృద్ధే నిరపాయకరమూ, ప్రయోజనకరమూ అవుతుందని మేము విశ్వసిస్తున్నాం. ఈ సత్యాన్ని మేము ఎప్పటికీ విస్మరించం. పర్యావరణ కాలుష్యాన్ని పెంపొందించే అభివృద్ధి మన ఉమ్మడి ఆవాసమైన ఈ ధరిత్రిని తప్పక ధ్వంసం చేస్తుంది. ఈ దృష్ట్యా ఐరాసలో ట్రంప్ ప్రసంగాన్ని ఆయన చేసిన మరో శబ్దాడంబర భాషణగా తీసివేయకూడదు. వాతావరణ మార్పు భావన సహేతుకతను నిర్మూలించేందుకు చాలా జాగ్రత్తగా రూపొందించిన వ్యూహమది. దీన్ని మనం సమర్థంగా ఎదుర్కోవాలి.

('సెంటర్ ఫర్ సైన్స్ అండ్ ఎన్విరాన్‌మెంట్' డైరెక్టర్ జనరల్, 'డౌన్ టు ఎర్త్' సంపాదకురాలు)

స్వదేశీయే నిజమైన దేశభక్తి

స్వదేశీ వస్తువుల వినియోగం గురించి మహాత్మాగాంధీ నుంచి ప్రధాని నరేంద్ర మోదీ వరకు ఇచ్చిన పిలుపు ప్రతి భారతీయునికీ ఒక దిశానిర్దేశం. వారు చెప్పినట్లు దేశభక్తి అనేది కేవలం సరిహద్దుల వద్ద తుపాకి పట్టుకొని నిలబడడానికే పరిమితం కాదు. దైనందిన జీవితంలో మనం చేసే కొనుగోళ్లలో, మన వినియోగపు అలవాట్లలో అది ప్రతిబింబించాలి. స్వదేశీ ఉత్పత్తులను కొనుగోలు చేస్తే మన రైతుకు తగిన ధర లభిస్తుంది, మన పరిశ్రమలు లాభపడతాయి, మన యువతకు ఉపాధి లభిస్తుంది... ఇలా మన డబ్బు మన దేశంలో తిరుగుతూ మన ఆర్థిక వ్యవస్థకు శక్తినిస్తుంది. అదే విదేశీ ఉత్పత్తులు వాడితే మన సంపద విదేశాలకు వెడుతుంది. ఆ డబ్బుతో వారు తమ దేశాన్ని అభివృద్ధి చేసుకుంటారు. కొన్నిసార్లు మన దేశ ప్రయోజనాలకు విరుద్ధంగానూ వినియోగిస్తారు. మనమే ఇచ్చిన డబ్బు మనకు సమస్యలు సృష్టించేలా మారుతుంది.

మన దేశంలోని వివిధ సంస్థలు కేవలం వ్యాపారం చేయడమే కాదు, సమాజానికి మేలు చేయడంలోనూ ముందుంటాయి. విద్య, వైద్యం, పరిశోధన, గ్రామీణాభివృద్ధి వంటి రంగాల్లో కూడా అవి అపారమైన సేవలు అందిస్తున్నాయి. ఉదాహరణకు టాటా ట్రస్ట్, మహీంద్రా గ్రూప్, ఇన్ఫోసిస్ ఫౌండేషన్, విప్రో–అజీమ్ ప్రేమ్‌జీ ఫౌండేషన్, రిలయన్స్ ఫౌండేషన్, అదానీ ఫౌండేషన్, బజాజ్ ట్రస్ట్, టీవీఎస్ ఫౌండేషన్ వంటివి.

క్యాన్సర్ చికిత్స ఖర్చులు సాధారణ, మధ్యతరగతి కుటుంబాలకు తడిసి మోపెడవుతున్నాయి. పెద్ద ఆస్పత్రులలో చేరాలంటే లక్షల్లో ఖర్చవుతుంది. ఎలాంటి ఆర్థిక సాయం లేక, ఎక్కడ, ఎలా మెరుగైన చికిత్స పొందాలనే సందిగ్ధంలో చాలామంది విలవిలలాడుతున్నారు. బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, టాటా మెమోరియల్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ (ముంబై), టాటా క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్ (తిరుపతి), ఇంకా కొన్ని ఆస్పత్రులు నిస్సహాయులైన వారికి గొప్ప సేవలు అందిస్తున్నాయి. మనం స్వదేశీ సంస్థలకు మద్దతు ఇస్తే, వారు తిరిగి సమాజానికి సేవ చేయగలుగుతారు. ఇలా వ్యాపారం–సేవ–దేశాభివృద్ధి అనే ఒక సుస్థిర చక్రం ఏర్పడుతుంది. స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించడం కేవలం ఆర్థిక లావాదేవీ కాదు, అది నిజమైన దేశభక్తి పథం.

– ఎంజిఆర్ భాస్కర్

ఆయుర్వేద కర్మయోగి

ఆయుర్వేద మార్తాండ, భిషఙ్మణి, బ్రిటన్ మహారాజు 5వ జార్జ్ నుంచి 'వైద్యరత్న' బిరుదు అందుకున్న అపర ధన్వంతరి, వైద్య విజ్ఞాన మణిదీపంగా తెలుగు జాతికి వెలుగునిచ్చిన మహోన్నతుడు పండిత దీవి గోపాలాచార్యులు. భారతదేశంలో ఆయుర్వేదానికి పూర్వ వైభవం తీసుకువచ్చిన మహానుభావుడు. ఆయుర్వేదాన్ని అణచివేయాలన్న బ్రిటిష్ ప్రభుత్వ కుట్రల మధ్య దాని శక్తిని చాటి, పరిరక్షించిన వారు. ఈ వైద్యానికి అంతర్జాతీయ గుర్తింపు తెచ్చిన కర్మయోగి.

1872 అక్టోబరు 10న కృష్ణా జిల్లా దివిసీమ భావదేవరపల్లిలో గోపాలాచార్యులు జన్మించారు. తండ్రి రామకృష్ణమాచార్యులు వైఖానస పండితుడు, ప్రసిద్ధ వైద్యుడు. తల్లి రాజ్యలక్ష్మి సదాచార సంపన్న! మూడు శతాబ్దాలుగా గ్రామంలో రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయం అర్చకత్వం చేస్తున్న వంశం వారిది. తిరుపతి మహంతు పాఠశాలలో సంస్కృతాధ్యయనం చేసిన గోపాలాచార్యులు, మైసూరు మహారాజా ఓరియెంటల్ పాఠశాలలో ఆయుర్వేద విద్యను, దేశమంతా పర్యటించి ప్రఖ్యాత వైద్యుల వద్ద వివిధ వైద్య విధానాల రహస్యాలను అధ్యయనం చేశారు.

23వ ఏట అనిబిసెంట్ ఆహ్వానం మేరకు బెంగళూరులో దివ్యజ్ఞాన సమాజ ఉచిత వైద్యశాల ప్రధాన వైద్యునిగా చేరారు. మైసూరు రాజ్యంలో ప్లేగు మహమ్మారి విస్తరించిన సమయంలో మైసూరు మహారాజా ఆయనను ప్రత్యేక ప్లేగు మెడికల్ ఆఫీసర్‌గా నియమించారు. తక్కువ మోతాదులో, తక్కువ ఖర్చుతో, సులభంగా దొరికే మూలికలతో హైమాది పానకం, శతధౌత ఘృతం అనే రెండు మందులు తయారు చేసి ప్లేగు తీవ్రతను విజయవంతంగా అరికట్టారు. 1899లో దక్షిణ భారతదేశ ఆయుర్వేద మహాసభ అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. 1901లో మద్రాసులో శ్రీ కన్యకాపరమేశ్వరి దేవస్థానం ఉచిత ఆసుపత్రి ప్రధాన వైద్యుడుగా చేరారు. అనంతరం వారితో ఆయుర్వేద వైద్యకళాశాల స్థాపింపచేసి, ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు. బొంబాయి, గుజరాత్, యూపీ, పంజాబ్, సింహళం, ఆంధ్ర, తమిళ, కన్నడ, మలయాళ ప్రాంతాల నుంచి విద్యార్థులు చేరారు. యల్లాప్రగడ సుబ్బారావు సహా శాస్త్రవేత్తలు ఆచార్యులుగా సేవలందించారు.




కన్యకాపరమేశ్వరి దేవస్థానం వారు కళాశాలను మూసివేయాలని నిర్ణయించగా, స్వయంగా 'చెన్నపురి ఆయుర్వేద ప్రచారిణి సభ' స్థాపించి, ఆయుర్వేద వైద్యకళాశాలను ప్రారంభించి విద్యార్థుల చదువుకు అంతరాయం కలగకుండా చూశారు. మద్రాసులో ఆయుర్వేదాశ్రమం ప్రామాణికత–నిర్మాణ పద్ధతుల నిర్ధారణ కోసం మద్రాసు ఆయుర్వేద లేబొరేటరీ స్థాపించారు. అనేకమంది వైద్య విద్వాంసులను పరిశోధకులుగా నియమించారు. 1907లో నాసిక్ నయాజీ ఆయుర్వేద విద్యాపీఠం వారు 'ఆయుర్వేద మార్తాండ', కలకత్తా ఆయుర్వేద సమ్మేళనం వారు 'భిషఙ్మణి' బిరుదులతో గోపాలాచార్యులను సత్కరించారు. 1911లో లాహోరు, 1917లో హరిద్వార్, పూణే, 1918లో తెనాలి, 1919లో తిరువనంతపురంలలో జరిగిన అఖిల భారత ఆయుర్వేద మహాసభలకు అధ్యక్షత వహించారు. 1919లో శ్రీ ధన్వంతరి మాసపత్రికను తన సంపాదకత్వంలో ప్రారంభించారు. లాహోరులోని డీఏవీ ఆయుర్వేద కళాశాలకు గోపాలాచార్యులవారి చేత లాలా లజపతిరాయ్ శంకుస్థాపన చేయించారు.

1917 నవంబర్‌లోనే బెజవాడలో 'ఆయుర్వేద మహామండలి' స్థాపించి, యావదాంధ్ర ఆయుర్వేద వైద్యుల్ని ఏకం చేశారు. వందలాది తాళపత్ర గ్రంథాలను సేకరించి, సంస్కరించి, వాటిలో 40 గ్రంథాలకు తెలుగులో వ్యాఖ్యానాలు రాశారు గోపాలాచార్యులు. భారత గవర్నర్ జనరల్ లార్డ్ హార్డింగ్ అభ్యర్థనపై బ్రిటన్ రాణికి విజయవంతంగా చికిత్స చేయటంతో పంచమ జార్జి చక్రవర్తి ఆయనను 'వైద్యరత్న' బిరుదుతో సత్కరించారు. జాతీయ నాయకుడు బాలగంగాధర్ తిలక్‌కు గోపాలాచార్యులు సన్నిహిత మిత్రుడు. స్వాతంత్ర్యోద్యమంలో చురుకైన పాత్ర పోషించారు. దేశీయ వైద్య ఉద్ధరణను జాతీయోద్యమంలో భాగం చేశారు. పూణేలో ప్లేగు వ్యాపించినప్పుడు తిలక్ అభ్యర్థన మేరకు వైద్యసేవలందించారు.

తెలుగువారు గర్వించదగిన పుణ్యమూర్తి, తెలుగుదనం ఉట్టిపడే వేషధారణ, ఋషి మాదిరి జీవనశైలి వారిది. దేశీయ వైద్య పునరుద్ధరణకు బాటలు వేసిన పండిత దీవి గోపాలాచార్యులు సెప్టెంబర్ 29, 1920న కేవలం 48 ఏళ్ల వయసులో తనువు చాలించారు.

• మండలి బుద్ధ ప్రసాద్
శాసనసభ్యులు, అవనిగడ్డ

(నేడు పండిత దీవి గోపాలాచార్యులు జయంతి, కృష్ణా జిల్లా భావదేవరపల్లిలో విగ్రహ ప్రతిష్ఠ)




కృష్ణా మిల్క్ యూనియన్‌లో... విజయ

చలసాని 'విజయ' ముద్ర



చలసాని ఆంజనేయులు
చైర్మన్, కృష్ణామిల్క్ యూనియన్



ఉత్తమ స్వచ్ఛ భారీ పరిశ్రమల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచిన కామధేను ప్లాంట్.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న కృష్ణామిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు

- విజయాల పరంపరతో సరికొత్త ఒరవడి
- యూనియన్ విస్తరణ..పాల ఉత్పత్తి పెంపు చర్యలు
- పాడిరైతుల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు
- చంద్రబాబు స్ఫూర్తిగా .. గోకులాల ఏర్పాటు
- లక్షా యాభై వేల పాడిరైతుల కుటుంబాలకు మేలు





బాధ్యత కలిగిన కార్యకర్తకు వ్యవస్థని అప్పగిస్తే ఏ విధంగా ఉంటుందో 'కృష్ణా మిల్క్‌యూనియన్'ను చూస్తే అర్థమౌతుంది. చలసాని ఆంజనేయులు.. పరిచయం అక్కరలేని పేరు. ఎన్టీఆర్ ఆశయాలకు ఆకర్షితుడై.. టీడీపీ కార్యకర్తగా .. తెలుగురైతు అధ్యక్షుడిగా ఆయన చేసిన ప్రయాణాన్ని దగ్గరగా గమనించిన చంద్రబాబు 2019లో ఎన్నికలకు ముందు చలసాని ఆంజనేయులును విజయా డెయిరీ చైర్మన్‌గా నియమించారు. అధినేత చంద్రబాబు అప్పగించిన బాధ్యతలను ఆరేళ్ళలో ఎంతో సమర్థవంతంగా నిర్వహించి 'విజయా డెయిరీ'ని రోల్ మోడల్‌గా నిలిపారు.

పాల ఉత్పత్తి పెంపు, పాల సేకరణ పెంపులతో మొదలై పాడిరైతుల సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలు.. డెయిరీ విస్తరణ కార్యకలాపాలతో ఆల్‌టైమ్ రికార్డు టర్నోవర్‌ను సాధించి చిరస్మరణీయ 'విజయా'లను అందించారు. 2003లో నిర్వహించిన తిరుపతి మహానాడులో ఉత్తమ సమన్వయ కర్తగా అధినేత చంద్రబాబు చేతుల మీదుగా తొలి అవార్డును సాధిం చిన చలసాని.. రాష్ట్రంలోని భారీ పరిశ్రమల కేటగిరీలో 'విజయా డెయిరీ'కి సాధించిన స్వచ్ఛ పరిశ్రమ అవార్డును ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా అందుకున్నారు. ఈ సందర్భంగా విజయా డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు 'విజయ' ప్రస్థానంపై ప్రత్యేక కథనం..

దార్శనికత ఉంటే ఏ రంగంలోనైనా 'విజయ'ం తోడౌతుంది. శక్తివంతమైన నాయకత్వం విజయాలను అందిస్తుంది. కృష్ణా మిల్క్ యూనియన్ విజయం వెనుక ఓ దార్శనికుడు ఉన్నారు. ఆయనే.. చలసాని ఆంజనేయులు.. పరిచయం అక్కరలేని పేరు. రైతునాయకుడిగా.. సమైఖ్యాంధ్ర పోరాటంలో రైతుపోరాటం జరిపిన వ్యక్తిగా చిరపరిచితులే ! కృష్ణామిల్క్ యూనియన్ విజయా డెయిరీ చైర్మన్‌గా చలసాని ఎన్నికైన తర్వాత 'విజయా'ల పరంపర కొనసాగుతోంది. దేశంలో మిల్క్ యూనియన్ల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతున్న తరుణంలో . పోటీని తట్టుకోవటమే పెను సవాల్‌గా మారిన పరిస్థితులలో డెయిరీ అభివృద్ధికి బాటలు పరచటంతో పాటు, ఫ్యాక్టరీలను విస్తరించటం, సంక్షేమాభివృద్ధి కార్యక్రమాలతో విజయ పరంపరను కొనసాగించటం చలసానికే చెల్లింది. ఆయన కృషికి నిదర్శనంగా స్వచ్ఛ డెయిరీగా నిలిచింది.

యూనియన్ విస్తరణకు శ్రీకారం

విజయా డెయిరీ చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు అందుకున్న వెంటనే యూనియన్ విస్తరణ కార్యకలాపాలపై దృష్టి సారించారు. డెయిరీ అభివృద్ధి కోసం వినూత్న నిర్ణయాలు తీసుకున్నారు. పాల సేకరణ పెంపుదల లక్ష్యంగా పనిచేశారు. పల్లెకు పోదాం..పాడిని చూద్దాం.. పేరుతో యూనియన్ విస్తరణకు కృషి జరిపారు. ఫలితంగా ఈ రోజున వెయ్యికి పైగా పాల సొసైటీలు ఏర్పడ్డాయి. యూనియన్ విస్తరణ తర్వాత ఈ కార్యక్రమాన్ని 'పల్లెకు పోదాం.. పాడి రైతుకు లాభాలను పెంచుదాం' పేరుతో మరింత విస్తరించారు. చైర్మన్ చలసాని ఆంజనేయులు, అధికారులు పల్లెలకు వెళ్ళి పాడి రైతులను కలుసుకుని వారి సమస్యలను తెలుసుకుని యూనియన్‌ను ఏవిధంగా ముందుకు తీసుకు వెళ్ళాలో అన్నీ చేశారు.

పాడి రైతుల సంక్షేమం దిశగా..

పాడి రైతుల సంక్షేమ కార్యక్రమాలతో యూనియన్‌ను మరింతగా బలోపేతం చేయవచ్చని భావించిన చైర్మన్ చలసాని ఆంజనేయులు 'క్షీరబంధు' కు శ్రీకారం చుట్టారు. పాడి రైతు ఏకారణం చేతనైనా మరణిస్తే అతని కుటుంబానికి రూ. 50 వేల పరిహారం ఇస్తారు. ఇప్పటి వరకు 5 వేల కుటుంబాలకు 'క్షీరబంధు' కింద పరిహారం ఇచ్చారు. ఆ తర్వాత 'కళ్యాణమస్తు' తీసుకు వచ్చారు. పాడి రైతుల కుటుంబంలో వివాహం జరిగితే మంగళసూత్రం కోసం రూ. 20 వేల విలువైన బంగారు నాణాన్ని ఇస్తున్నారు. ఇలా ఇప్పటి వరకు 7 వేల బంగారు నాణాలు ఇచ్చారు. పాడి రైతుల కుటుంబాలలో ప్రతిభావంతమైన పిల్లల ఉన్నతవిద్య కోసం 'ప్రతిభ' పథకం తీసుకు రావటం జరిగింది. పాల ఉత్పత్తిదారుల కుటుంబాలకు విజయ 'హెల్త్‌కార్డులు' వంటివి ప్రవేశపెట్టడం జరిగింది. ఉద్యోగులకు సమగ్ర ఆరోగ్యబీమా పథకం మల్లోకి తెచ్చారు. తానా సహాయంతో చిల్లింగ్ సెంటర్లలో ఉచిత కంటి పరీక్షలు, శస్త్రచికిత్సలు నిర్వహించారు. కార్పొరేట్ హాస్పిటల్స్‌లో ఎంఓయూ చేసుకుని పాడి రైతుల సమగ్ర ఆరోగ్య రక్షణ చర్యలు చేపట్టారు.

ప్రాజెక్టు కామధేనుతో సరికొత్త చరిత్ర

మిల్క్ యూనియన్ భారీ విస్తరణ ప్రణాళికలలో భాగంగా చైర్మన్ చలసాని ఆంజనేయులు ఏకంగా కొత్త ప్లాంట్‌ను స్థాపించాలన్న సంచలన నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆలోచన రాగానే కృష్ణా జిల్లా వీరవల్లి గ్రామంలో 22 ఎకరాల భూమిని కొనుగోలు చేశారు. ఈ భూమిలో అత్యాధునిక అల్ట్రా మోడ్రన్ మిల్క్ ప్రాసెసింగ్ ప్లాంట్‌ను నిర్మింపచేశారు. డిసెంబరు 7, 2023లో ఈ సరికొత్త ప్లాంట్ ప్రారంభమైంది. రూ.160 కోట్ల వ్యయంతో దీనిని పూర్తి చేశారు. రోజుకు 4 లక్షల లీటర్ల పాల నిర్వహణ సామర్థ్యంతో 6 లక్షల లీటర్ల వరకు విస్తరించగలిగేలా అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ ప్లాంట్ పూర్తిగా ఆటోమేటిక్‌గా పనిచేస్తుంది. కంప్యూటర్ ఆధారిత సాంకేతికతతో పనిచేస్తుంది. ఈ ప్లాంట్ వల్ల కాలుష్యం అనేది ఉండదు. మిల్క్ యూనియన్‌కు ప్రాసెసింగ్ ఖర్చులు, యుటిలిటీ ఖర్చులు అనేకం గణనీయంగా తగ్గాయి.

కృష్ణా జిల్లా వీరవల్లిలో ప్రాజెక్టు కామధేనుగా రూ.160 కోట్ల వ్యయంతో కొత్తగా నిర్మించిన అల్ట్రా మోడ్రన్ మిల్క్ ప్రాసెసింగ్ ప్లాంట్



పాలదిగుబడికి ప్రత్యేక కార్యక్రమాలు

పాల దిగుబడి పెంచటానికి అధిక పాల దిగుబడినిచ్చే పశుజాతుల దిగుమతి చేపట్టారు. వీటి కోసం సబ్సిడీలు ఇవ్వటం, వాటికి కూడా బీమా కల్పించటం, 24 గంటలూ పశువుల సంరక్షణ, పశువైద్య సేవలు అందించటం ద్వారా పశువుల జాతిని కూడా అభివృద్ధి చేశారు. 10 పశుసంరక్షణ అంబులెన్స్‌లను కూడా ఏర్పాటు చేశారు. చాఫ్ కట్టర్లు, బ్రష్ కట్టర్లు, పాలు



పితికే యంత్రాలను సబ్సిడీ ప్రాతిపదికన అందిస్తున్నారు.

చంద్రబాబు స్ఫూర్తిగా .. గోకులాల ఏర్పాటు

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రేరణతో పాల విస్తరణ, పాల ఉత్పత్తి నిర్వహణ ఖర్చులను తగ్గించటానికి మెరుగైన పశుగ్రాసాన్ని పండించటానికి యూనియన్ నుంచి ఇటీవలే గోకులాలకు శ్రీకారం చుట్టారు. దీంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో 'భారత్ పశుధన్' కింద లింగ నిర్ధారిత వీర్యాన్ని సబ్సిడీ రూ.100 భరించి ఉమ్మడి కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల్లో వీర్యం డోస్‌ను రూ. 50 లకే అందిస్తోంది.

పాల సేకరణ ధర పెంపు

చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించటానికి ముందు ఆరు సంవత్సరాలుగా పాలసేకరణ ధరలు స్తబ్దుగా ఉన్నాయి. పాడి రైతు తన ఉత్పత్తులకు లాభదాయకమైన ధరను పొందాలన్న ఉద్దేశ్యంతో గత ఆరేళ్లుగా ధరలను పెంచింది. లీటరుకు సమారుగా రూ. 15.40 లను పెంచింది. దేశంలోనే గేదెపాలకు అత్యుత్తమ ధరను విజయా డెయిరీ అందిస్తోంది.

భారీగా రిజర్వులు

గత ఐదేళ్ళుగా డెయిరీని విజయ పథంలోకి తీసుకురావటంతో.. లాభాలు కూడా గణనీయంగా పెరిగాయి. కృష్ణా మిల్క్ యూనియన్ సుస్థిరమైన ఆర్థిక ఫలితాలను చవిచూస్తోంది. 2019 - 20 లో రూ. 104.52 కోట్ల రిజర్వులను సాధించగా.. 2020 - 21 లో రూ.122.13 కోట్లు, 2021- 22లో రూ.148.60 కోట్లు, 2022-23 లో రూ.175.40 కోట్లు, 2023-24 లో రూ.205.65 కోట్లు, 2024- 25 లో రూ. 228.58 కోట్ల రిజర్వులను సాధించింది.

చలసాని హయాంలో వృద్ధిలో పైపైకి..

2018 - 19 నుంచి 2019 - 20 వరకు విజయా డెయిరీ వార్షిక టర్నోవర్ రికార్డు స్థాయిలో 12 శాతం పెరిగింది. 2020 - 21 సంవత్సరంలో 15 శాతం వృద్ధి పెరిగింది. 2021- 22 లో 10 శాతం వృద్ధి పెరిగింది. కోవిడ్ - 19 మహమ్మారి వచ్చినపుడు దేశవ్యాప్తంగా అమ్మకాల తగ్గుదల ఉన్నప్పటికీ చైర్మన్ చలసాని ఆంజనేయులు మంచి నాయకత్వ స్ఫూర్తి కారణంగా గణనీయమైన వృద్ధిని నమోదు చేయటం విశేషం. ఇదే సందర్భంలో పొరుగు జిల్లాలైన గుంటూరు, ప్రకాశం, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి , ఖమ్మం జిల్లాలలో కూడా విజయా డెయిరీ విస్తరించింది. ఈ కారణంగా 2022 - 23 వ సంవత్సరంలో కృష్ణామిల్క్ యూనియన్ రూ.1104 కోట్లకు పైగా టర్నోవర్‌ను నమోదు చేసింది. ఇక ఇక్కడ నుంచి మరింత దూసుకుపోయింది. 2023- 24లో రూ.1200 కోట్లు, 2024-25లో రూ.1211 కోట్ల టర్నోవర్ సాధించింది. బుడమేరుకు వరదలు వచ్చినా 42 రోజుల పాటు చిట్టినగర్‌లోని మిల్క్‌ఫ్యాక్టరీని మూసివేయాల్సి వచ్చినా కూడా వృద్ధి సాధించటం విశేషం.

విప్లవాత్మక స్థాయిలో విజయా డెయిరీ విస్తరణ

చలసాని ఆంజనేయులు నేతృత్వంలో విజయా డెయిరీ వార్షిక టర్నోవర్ 74 శాతం పెరిగింది. కృష్ణామిల్క్ యూనియన్‌ను ముందుకు తీసుకువెళ్ళాలన్న ఉద్దేశ్యంతో ఆయన ఒక ప్రణాళికాబద్ధమైన విధానాన్ని ఎంచుకున్నారు. డెయిరీని విస్తరించాలంటే.. గేదెల కొనుగోలును ప్రోత్సహించాలని, పాల ఉత్పత్తిని పెంచాలని, పాల సేకరణను పెంచాలని, పాడి రైతుల సంక్షేమానికి పెద్ద పీట వేయటం వంటి చర్యలతో పాలసేకరణను విప్లవాత్మక స్థాయిలో ముందుకు తీసుకువెళ్ళారు. క్షేత్ర స్థాయిలో తాను అనుకున్న లక్ష్యాలను సాధించటంతో సొసైటీలను మరిన్ని గ్రామాలకు విస్తరించటంతో పాటు డెయిరీ విస్తరణ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ప్రాజెక్టు కామధేను పేరుతో వీరవల్లిలో సరికొత్త ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. కిందటి బుడమేరు వరదలకు విజయవాడ చిట్టినగర్‌లోని ప్రధాన ప్లాంట్ మునిగిపోతే వీరవల్లి ప్లాంట్ ద్వారా ఉత్పాదకత జరిగింది. దీంతో బుడమేరు వరదలలో ఎన్నో రంగాలు, వ్యవస్థలు పనిచేయకపోయినా కూడా పాల ఉత్పత్తి జరిగింది. చలసాని ఆంజనేయులు దూరాలోచన ఎంతో మేలు చేసింది.



సమైఖ్యాంధ్ర ఉద్యమ స్ఫూర్తితో లక్ష మంది రైతులతో చలసాని ఆంజనేయులు జంక్షన్‌లో గర్జన నిర్వహించారు. ఉద్యోగుల ఉద్యమంగా విమర్శలు చేసిన నాటి తెలంగాణా విమర్శకుల నోళ్ళను మూయించారు. లక్షకు పైగా రైతులతో నిర్వహించిన సమైఖ్యాంధ్ర గర్జన సభ దిగ్విజయమైంది. విమర్శకుల నోళ్ళు మూయించింది. రైతు గర్జనలో ఏపీఎన్‌జీఓ జేఏసీ నేత పీ అశోక్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. చలసాని ఆంజనేయులు స్ఫూర్తిదాయక ప్రసంగం చేశారు. ఆ తర్వాత సమైక్యాంధ్ర ఉద్యమంలో రైతులు పెద్ద సంఖ్యలో భాగస్వాములయ్యారు.



ఉత్తమ సమన్వయకర్తగా నాటి సీఎం చంద్రబాబు నుంచి అవార్డు అందుకుంటున్న చలసాని ఆంజనేయులు

రూ.400 కోట్ల బోనస్ పంపిణీ

దేశంలోనే రైతులకు ప్రతి నాలుగు నెలలకు బోనస్‌ను ముందుగా అందించటం విజయా డెయిరీ ప్రత్యేకతగా చెప్పుకోవచ్చు. రాబోయే కాలానికి వ్యాపారాన్ని ముందుగా అంచనా వేసి పాడి రైతులకు బోనస్ అందించటమనేది ఒక్క 'విజయా డెయిరీ' కే సాధ్యమైంది. దేశంలోనే అత్యధికంగా 10 శాతం బోనస్ ఇచ్చేది కూడా విజయా కావటం గమనార్హం. చైర్మన్‌గా చలసాని ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించాక రూ.400 కోట్ల మేర పాడి రైతులకు బోనస్‌లను ఇవ్వటం విశేషం.

వాడపల్లి క్షేత్రానికి ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులు

బస్టేషన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనానికి వెళ్లే భక్తులకు ఏపీఎస్‌ఆర్టీసీ ప్రత్యేక సూపర్ లగ్జరీ బస్సులను నడుపుతున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. వేకువజామున 4.30 గంటలకు విజయవాడ పండిట్ నెహ్రూ బస్‌స్టేషన్ నుంచి వాడపల్లికి బస్సు బయలుదేరుతుందన్నారు. ఇందుకుగాను ఒక్కొక్కరికి రూ.360 చార్జీ చెల్లించవలసి ఉంటుందన్నారు. భక్తులు తమ టిక్కెట్లను ఆర్టీసీ ఆన్‌లైన్ వెబ్‌సైట్ ద్వారా లేదా తమ సమీప బస్‌స్టేషన్‌లలో, ఆర్టీసీ అధీకృత టిక్కెట్ బుక్కింగ్ ఏజెంట్ల వద్ద బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9959225467 నెంబరులో సంప్రదించవచ్చన్నారు. భక్తులు ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవాల్సిందిగా కోరారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	135,144, 155
చికెన్ విత్ స్కిన్	260
చికెన్ స్కిన్‌లెస్	270

నెక్ కోడిగుడ్ల ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 530

ప్రాచీన వారసత్వ కట్టడాలను పరిరక్షించాలి

● ఇంటాక్ చైర్మన్ అశోక్ సింగ్ ఠాగూర్



ఆంధ్రప్రదేశ్ ఇంటాక్ సభ్యులకు సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న చైర్మన్ అశోక్ సింగ్ ఠాగూర్, రవీంద్రసింగ్ తదితరులు

కృష్ణలంక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉన్న చారిత్రక ప్రాచీన వారసత్వ కట్టడాలను పరిరక్షించేందుకు కృషి చేయాలని ఇంటాక్ చైర్మన్ అశోక్ సింగ్ ఠాగూర్ శిక్షణ పొందిన ఆంధ్రప్రదేశ్ సభ్యులకు పిలుపు నిచ్చారు. ఇంటాక్ (ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్) సభ్యుల కోసం జరిగిన సామర్థ్య నిర్మాణ వర్క్‌షాప్ 3వ రోజు గురువారం చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కెప్టెన్ అరవింద్ శుక్లా కార్యశాలను ప్రారంభించారు. శిక్షణ పొందిన వారికి ఇంటాక్ చైర్మన్ అశోక్‌సింగ్ ఠాగూర్, చాప్టర్స్ డివిజన్ డైరెక్టర్ కార్యదర్శి రవీంద్ర సింగ్ సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఆంధ్రప్రదేశ్ నుంచి అఖిల భారత పంచాయితీ పరిషత్ జాతీయ ఉపాధ్యక్షులు జాస్తి వీరాంజ నేయులు, మేకల రవీంద్రబాబు, ఎన్.సుకీర్తి, కె.ప్రవీణ్, డాక్టర్ రేణుకారాణి, ఎస్.మహిపాల్‌రెడ్డి, ఇ.రమేష్, ఎం.వెంకట సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో అశోక్‌సింగ్ ఠాగూర్ మాట్లాడుతూ దేశవ్యాప్తంగా 241 ఇంటాక్ చాప్టర్లు పనిచేస్తున్నాయని, అనేక చారిత్రక ప్రాచీన వారసత్వ కట్టడాలను పరిరక్షిస్తుందని, ప్రభుత్వ సహాయ సహకారాలతో అనేక కార్యక్రమాలను చేస్తున్నామని తెలిపారు.

12న మట్టి పాత్రల తయారీపై వర్క్‌షాప్

గుణదల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మట్టి బొమ్మలకు ప్రాణం పోసే ప్రాచీన కళలకు పూర్వవైభవం తీసుకురావాలనే ముఖ్య ఉద్దేశ్యంతో ఈనెల 12న నగరంలో వర్క్‌షాప్ నిర్వహించనున్నట్లు ఆర్టిజో సెంటర్ ప్రిన్సిపాల్ స్ఫూర్తి శ్రీనివాస్ తెలిపారు. గుణదల వెంకటేశ్వర నగర్లోని ఆర్టిజో సెంటర్లో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రముఖ పోటరీ ఆర్టిస్ట్ సురేష్ ముఖ్య అతిథిగా హాజరు కానున్నట్లు తెలిపారు. మట్టితో పాత్రలు తయారు చేయడం, వాటికి అందంగా రంగులు దిద్దడంపై శిక్షణ ఇవ్వనున్నట్లు చెప్పారు. వర్క్‌షాప్‌లో 8 నుంచి 60 ఏళ్ల వారు పాల్గొన వచ్చన్నారు. వర్క్‌షాప్‌లో పాల్గొన్న ప్రతి ఒక్కరికీ సర్టిఫికెట్ ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

కాల్వల వెడల్పు పనులు ప్రారంభించండి

నగర కమిషనర్ ధ్యానచంద్ర



అధికారుల నుంచి వివరాలు తెలుసుకుంటున్న నగర కమిషనర్ ధ్యానచంద్ర

భారతీనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వర్షపునీరు రోడ్లపైన నిల్వ ఉండకుండా శాశ్వత పరిష్కారం తీసుకురావాలని నగర కమిషనర్ ధ్యానచంద్ర సూచించారు. గురువారం పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డు, ఆటోనగర్ ప్రాంతాల్లో నగర కమిషనర్ ధ్యానచంద్ర పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్డులో వర్షపు నీరు నిలిచిపోతున్నాయని, డ్రెయినేజీ ప్రవాహానికి అడ్డొచ్చే ఆక్రమణలను, ఇరుకైన మార్గాలను తొలగించి, కాలువలను వెడల్పు చేసే ప్రక్రియ ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా మాన్సూన్ రెస్పాన్స్ టీమ్‌లను అప్రమత్తంగా ఉంచుతూ వర్షపునీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆటోనగర్‌లోని గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను పరిశీలించారు. సర్కిల్ 3 లోని ప్రాంతాలలో సేకరించే వ్యర్థాల క్లాప్ వాహనాలు ఆటోనగర్ గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌లో పార్కింగ్ చేసే చర్యలను త్వరగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ ఆర్.శ్రీనాథ్‌రెడ్డి, పర్యవేక్షణ ఇంజనీర్ పి.సత్యకుమారి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.



యాపిల్ స్వచ్ఛంద సేవా సంస్థకు వాటర్ డిస్పెన్సర్ అందజేస్తున్న గద్దె క్రాంతి కుమార్

యాపిల్ స్వచ్ఛంద సంస్థకు వాటర్ డిస్పెన్సర్ అందజేత

గుణదల, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సంస్థలు అందించే సేవలను అర్హులైన నిరుపేదలు సద్వినియోగం చేసుకోవాలని టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ తెలిపారు. గుణదల గంగిరెద్దుల దిబ్బ వద్దగల యాపిల్ స్వచ్ఛంద సంస్థకు ఆయన రూ. 18వేలు విలువైన వాటర్ డిస్పెన్సర్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిల్లల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని తనవంతు సాయంగా వాటర్ డిస్పెన్సర్‌ను అందజేసినట్లు తెలిపారు. సంస్థ ప్రతినిధి మండాది స్నేహలత తదితరులు పాల్గొన్నారు.

బాలుడికి క్రాంతికుమార్ పరామర్శ

భారతీనగర్: రాష్ట్ర ప్రభుత్వం అందించిన ఆర్థిక సహకారంతో కోలుకుని ఇంటి వద్ద ఉంటున్న 3వ డివిజన్ గణేష్‌నగర్ కాలనీకి చెందిన తురక విజయ్‌కుమార్(14) ఇంటికి గురువారం టీడీపీ యువ నాయకుడు గద్దె క్రాంతికుమార్ వెళ్లి బాలుడి ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఈ సందర్భంగా గద్దె క్రాంతికుమార్ మాక్సిమం ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ అందించిన రూ.25వేల ఆర్థిక సహాయాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. అనంతరం బిల్డింగ్ పనులు చేస్తూ తీవ్రంగా గాయపడిన కామినేనినగర్ డొంక రోడ్డుకు చెందిన గుంజి వెంకటేశ్వరరావు కుటుంబ సభ్యులకు రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో తాడి బాబురావు, గద్దె రమేష్, పాల్గొన్నారు.

జీఎస్టీ సంస్కరణలతో పేదలకు ఎంతో మేలు

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో సుహాసిని

కృష్ణలంక, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీఎస్టీ-2.0 సంస్కరణల వల్ల పేద, మధ్య తరగతి ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. గురువారం తూర్పు పరిధిలోని 20వ డివిజన్ కృష్ణలంక ఎం.హోటల్ ప్రాంతంలో ఎమ్మెల్యే గద్దె పర్యటించారు. స్థానికంగా వున్న ట్రాఫిక్ సమస్యపై స్థానికులు, అధికారులతో కలిసి పరిశీలించారు. సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ పేరుతో ముద్రించిన కరపత్రాన్ని ఎమ్మెల్యే గద్దె ఆవిష్కరించారు. డివిజన్‌లోని జక్క స్వప్నకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన ఎల్‌వోసీని గద్దె అందజేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీ 2.0 సంస్కరణల వల్ల దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరుగుతుందని, దీని ద్వారా ఉత్పత్తుల విక్రయాల మార్కెట్‌లో డిమాండ్ పెరిగి కొత్త పరిశ్రమల స్థాపనకు అవకాశం వుంటుందన్నారు. యువతకు ఉపాధి అవకాశాలు కూడా పెరగడానికి ఈ సంస్కరణలు ఎంతగానో దోహదం చేస్తాయని చెప్పారు. కృష్ణలంక జాతీయ రహదారిలో ట్రాఫిక్ సమస్యపై గద్దె పరిశీలించారు. ఇక్కడి ట్రాఫిక్ సమస్యను పరిష్కరించడానికి అధికారులతో కలిసి మరోసారి సమావేశం నిర్వహిస్తామని గద్దె తెలిపారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అందుబాటు ధరల్లో మందులు

● రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ డాక్టర్ సమరం

విజయవాడ: జీఎస్టీ తగ్గడం వలన సామాన్య ప్రజలందరికీ మందులు అందుబాటు ధరలో లభిస్తాయని రెడ్‌క్రాస్ ప్రెసిడెంట్ డాక్టర్ సమరం తెలిపారు. గురువారం ఐఎంఏ హాలులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్ కార్యక్రమం ఏర్పాటుచేశారు. ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ముఖ్యంగా క్యాన్సర్ వంటి లైఫ్ సేవింగ్ డ్రగ్స్, వైద్య పరికరాలు తక్కువ ధరలో అందుబాటులోకి రావాలని ఎప్పటి నుంచో కోరుతున్నామన్నారు. జీఎస్టీ తగ్గడం వల్ల సామాన్యుల ఆరోగ్య ప్రమాణాలు మెరుగవుతాయని జిల్లా వైద్య శాఖాధికారి డాక్టర్ ఎం.సుహాసిని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ హనుమయ్య, ఎన్టీఆర్ ఆరోగ్య సేవ డీసీ డాక్టర్ సుమన్, ఏడీ డ్రగ్ కంట్రోలర్ అనిల్‌కుమార్, జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ ప్రజ్ఞా రాధిక, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ ఇందుమతి, ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, రిలయన్స్ లైఫ్ ఇన్సూరెన్స్ సభ్యులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో కాల్వలో దూకి యువకుడు ఆత్మహత్యాయత్నం

● రక్షించిన పోలీసులు



యువకుడిని రక్షించి తీసుకొస్తున్న గుణదల పోలీసులు

గుణదల, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో యువకుడు కాల్వలో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మధురానగర్ వంతెన వద్ద గురువారం జరిగింది. బెంగళూరుకు చెందిన రాజేష్ శ్యామ్(22)రైలులో పశ్చిమ బెంగాల్ వెళుతూ దారిలో విజయవాడలో దిగాడు. మద్యం సేవించి స్పృహ తెలియని స్థితిలో రాజేష్ శ్యామ్ బీఆర్టీఎస్ రోడ్డులో నడుచుకుంటూ వచ్చి మధురానగర్ చిన్న వంతెన వద్ద కాల్వలో దూకాడు. ఇది గమనించిన స్థానికులు కాల్వలో కొట్టుకుపోతున్న యువకుడిని కాపాడి ఒడ్డుకు చేర్చారు. కాపాడిన స్థానికులను ఆ యువకుడు వెంటపడి మరీ కొట్టి పరుగులు తీయించాడు. మరో మారు కాల్వలో దూకడంతో సమాచారం అందుకున్న గుణదల పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని యువకుడిని ఒడ్డుకు చేర్చి 108 అంబులెన్స్‌లో ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గుణదల పోలీసులు తెలిపారు.

గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణలు పెంచాలి

● కేవీఐసీ రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గ్రీప్ వెల్లడి



ఖాదీ స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే వాడతామని ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అతిథులు

కానూరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఖాదీ ఉత్పత్తులు, మేక్ ఇన్ ఇండియా ఉపయోగించి గ్రామీణ ప్రాంతాల్లో ఆవిష్కరణలు మరింతగా పెంచాలని ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్ (కేవీఐసీ) రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ గ్రీప్ చెప్పారు. కానూరులోని సిద్ధార్థ డీమ్డ్ యూనివర్సిటీలో కేవీఐసీ సహకారంతో వ్యవస్థాపక అభివృద్ధి ప్రజల విద్యా కార్యక్రమం అనే అంశంపై గురువారం జరిగిన సెమినార్‌లో డాక్టర్ గ్రీప్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. వ్యవస్థాపక అభివృద్ధి, వర్ధమాన వ్యవస్థాపకులకు మద్దతు ఇవ్వడానికి అందుబాటులో ఉన్న కేవీఐసీ పథకాలను ఆయన వివరించారు. జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ ఆర్. వెంకట్రావు, ఏపీ కేవీఐసీ అసిస్టెంట్ డైరెక్టర్ ఎ. ఆనంద్, విజయవాడలోని కేవీఐసీ ఏడీ ఆర్‌ఎల్‌ఎన్ మూర్తి, సిద్ధార్థ వర్సిటీ వీసీ ప్రొఫెసర్ పి. వెంకటేశ్వరరావు, ప్రో. వీసీ ఏవీ రత్నప్రసాద్, డాక్టర్ పాండురంగారావు, డాక్టర్ వి. మల్లికార్జున తదితరులు పాల్గొని ప్రసంగించారు. కాగా ఖాదీ స్వదేశీ ఉత్పత్తులనే మాత్రమే ఉపయోగిస్తామని అతిథులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈసందర్భంగా వ్యాచరచన, చర్చా పోటీల్లో విజేతలైన విద్యార్థులకు అతిథులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఫ్యాకల్టీ సభ్యులు డాక్టర్ ఎన్. మాలతి తదితరులు పాల్గొన్నారు.



ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధను సత్కరిస్తున్న సిద్ధార్థ మహిళా కళాశాల సిబ్బంది

కెరీర్ గైడెన్స్‌పై సూచనలు

విజయవాడ కల్చరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) :శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా జూనియర్ కళాశాలలో గురువారం ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్ ఏఆర్ అనురాధ సందర్శించారు. విద్యార్థులకు కెరీర్ గైడెన్స్, మహిళా సాధికారత, జాగ్రత్తగా బయట ప్రపంచంలో ఎలా వుండాలి, తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి వాటి మీద వారికి సూచనలు ఇచ్చారు. వారితో పై అంశాలన్నింటిపై సంభాషించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.పద్మజ, అధ్యాపకులు పాల్గొన్నారు.

వీధిలైట్లకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



భారతీనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శ్రీరామచంద్ర నగర్ కాలనీ వినాయకుడి రోడ్డులో విద్యుత్‌శాఖ సిబ్బంది విద్యుత్‌లైట్లు మరమ్మతులు చేసి వెలిగించారు. శ్రీరామచంద్రనగర్ కాలనీ వినాయకుడి రోడ్డు, అంతర్గత రోడ్లలో వీధిలైట్లు వెలగడం లేదు అనే శీర్షిక గురువారం ఆంధ్రజ్యోతి కథనంలో ప్రచురితమైంది. దీనిపై స్పందించిన అధికారులు సిబ్బందిని పంపించి ఆ రోడ్డులోని వీధి లైట్లను మరమ్మతులు చేసి సమస్యను పరిష్కరించారు.



విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేస్తున్న జనసేన జిల్లా అధ్యక్షుడు ఉదయభాను

విద్యార్థినికి ల్యాప్‌ట్యాప్ అందజేత

భారతీనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు జనసేన పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు సామినేని ఉదయభాను తెలిపారు. విజయవాడలో ఆటోడ్రైవర్ పొట్నూరి గగన్ కుమార్ కుమార్తె పొట్నూరి దేవికకు పేటేటి నాంచారయ్య ఆర్థిక సహాయంతో కొనుగోలు చేసిన నూతన ల్యాప్‌టాప్‌ను సామినేని ఉదయభాను అందజేశారు. గురునానక్ కాలనీలోని జనసేన పార్టీ క్యాంపు కార్యాలయంలో గురువారం అందజేశారు. జనసేన పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గులాబితోట వాటర్ ట్యాంకు పరిసరాల్లో గంజాయిబాబుల ఆగడాలు

రామలింగేశ్వరనగర్,ఆంధ్రజ్యోతి: పటమట 14వ డివిజన్ గులాబితోట వాటర్ ట్యాంకు పరిసరాలను అసాంఘిక శక్తులు అడ్డాగా చేసుకుని రాజ్యమేలుతున్నాయి. అర్ధరాత్రి గంజాయి, మద్యం మత్తులో చెలరేగిపోతున్నారని ఆ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏ సమయంలో ఏం జరుగుతుందోననే భయంతో బతకాల్సి వస్తోందని, రాత్రి సమయంలో రోడ్డుపై నడవాలంటేనే భయమేస్తోందంటున్నారు. వాటర్ ట్యాంక్‌పైన గంజాయి తీసుకుంటున్న వారిపై సిబ్బంది ఇటీవలే ఫిర్యాదు చేశారు. అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో ఆ ప్రాంత ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గంజాయి మత్తులో యువకులు అటుగా వెళ్లే మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న ఉదంతాలు తరచూ చోటు చేసుకుంటున్నాయని స్థానికులు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ఆ ప్రాంతంలో రెక్కీ నిర్వహించి ఆకతాయిలపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలి



సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న నూకానమ్మ యాదవ్

వన్‌టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ ఇన్‌చార్జి యలగాల నూకానమ్మ యాదవ్ కోరారు. గురువారం సీఎం చంద్రబాబును ఆమె ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఎంకు స్థానిక సంస్థల ఎన్నికలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌లు ఇవ్వాలని, ఇంకా పలు సమస్యల పై వినతి పత్రం అందచేశారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి తగిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.







స్మారక స్థూపం వద్ద ఏర్పాటుచేసిన గాంధీ కాంస్య విగ్రహం

కొండంతా కొత్తగా..

అందంగా అందుబాటులోకి గాంధీహిల్





గాంధీహిల్‌పై కొత్తగా ఏర్పాటుచేసిన మహాత్ముడి భారీ విగ్రహం (ఇన్‌సెట్‌లో) శాంతి శిఖరాగ్రానికి ఏర్పాటుచేసిన లిఫ్ట్, సిటీ వ్యూ పాయింట్

విజయవాడ నగరం మొత్తాన్ని రెప్పపాటు కాలంలో చూసేయాలనుందా..? కృష్ణమ్మ సోయగాలు, ఇంద్రకీలాద్రి అందాలు, ఎత్తయిన అంబేడ్కర్ విగ్రహం, యనమలకుదురు, గుణదల కొండలతో పాటు వన్‌టౌన్ నుంచి టూటౌన్, తాడేపల్లి నుంచి జక్కంపూడి, నున్న వరకు ఒకేచోట చూడాలని ఉందా..? అయితే, గాంధీహిల్‌కు వచ్చేయాల్సిందే. సముద్ర మట్టానికి 550 అడుగుల ఎత్తులో ఉన్న ఈ కొండపైకి చేరితే చాలు.. విజయవాడ మొత్తాన్ని ఒకేసారి చూసేయొచ్చు. గాంధీహిల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ చారిత్రక శాంతి శిఖరాగ్రం అందంగా ముస్తాబు కావడంతో పాటు సరికొత్తగా అందుబాటులోకి వచ్చింది.

- రూ.1.30 కోట్లతో కీలకమైన అభివృద్ధి పనులు
- విజ్ఞాన విస్తరణకు ప్లానిటోరియం, గ్రంథాలయం
- ఆకట్టుకుంటున్న మహాత్ముడి జన్మస్థలం, ఆశ్రమాలు, జంతర్‌మంతర్ నమూనా
- ఒకేచోట నుంచి నగరం మొత్తం విహంగ వీక్షణ



కొండపై వ్యూ పాయింట్

విజయవాడ సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : దాదాపు 18 ఎకరాల్లో గాంధీకొండ విస్తరించి ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం జాతిపిత విజయవాడలో మూడుసార్లు పర్యటించారు. ఆయన గుర్తుగానే టూటౌన్‌లోని గాంధీనగర్, వన్‌టౌన్‌లోని గాంధీహిల్ ఏర్పడ్డాయి. 1964లో అప్పటి ప్రధాని లాల్ బహదూర్‌శాస్త్రి ఈ స్మారక చిహ్నం ఏర్పాటు పనులకు శంకుస్థాపక చేశారు. 1968లో పనులు పూర్తికావడంతో నాటి రాష్ట్రపతి జాకీర్ హుస్సేన్ దీనిని ప్రారంభించారు. ఈ హిల్ నిర్వహణ బాధ్యత 1977లో గాంధీహిల్ ఫౌండేషన్ తీసుకుంది. 2020 వరకు బాధ్యత చూసుకుంది. ఆ తరువాత ఫౌండేషన్ చైర్మన్, మాజీ ఎంపీ గోకరాజు గంగరాజు విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్‌కు అప్పగించారు. ఐదేళ్ల పాటు వీఎంసీ ఆధీనంలో ఉన్న హిల్ కళ కోల్పోయి, అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. ఈ తరుణంలో కలెక్టర్ లక్ష్మీశ చొరవతో గాంధీహిల్ ఫౌండేషన్ ఆధీనంలోకి వచ్చింది. ఈ ఏడాది మే 5న బాధ్యతలు తీసుకున్న ఫౌండేషన్ అభివృద్ధి పనులను మొదలుపెట్టింది. ఇప్పటి వరకు రూ.1.30 కోట్లతో హిల్‌కు సరికొత్త హంగులు అద్దారు.

మహాత్ముడి స్మారకంగా..

కొండ పైభాగాన మహాత్మాగాంధీ కాంస్య విగ్రహంతో పాటు స్మారక చిహ్నం ఉంటుంది. ఈ ప్రదేశానికి చేరుకునే దారిలోనే అరుదైన మొక్కలు ఆహ్లాదంగా పలకరిస్తాయి. చిహ్నంపై చెరగని మహాత్ముడి బోధనలు ముద్రించారు. సూర్యగమనం ద్వారా సమయం తెలుసుకునేలా ఏర్పాటుచేసిన గడియారం పూర్వీకుల మేధోసంపత్తికి నిదర్శనం.

విజ్ఞాన, వినోదాల మేళవింపు

విజయవాడ రైల్వేస్టేషన్ వెస్ట్ బుకింగ్ కౌంటర్ రోడ్డు నుంచి ఈ హిల్ ప్రారంభమవుతుంది. అక్కడ నుంచి బైక్, కారులో కొండపైకి చేరుకునేలా ఘాట్‌రోడ్డు ఉంది. భూమి, అంతరిక్షం, వాతావరణ మార్పుల విశేషాలను తెరపై చూపించే ప్లానిటోరియం ఘాట్‌రోడ్డు ప్రారంభంలోనే కనిపిస్తుంది. స్మారక చిహ్నం దిగువన పార్క్, ఆ పక్కనే హిల్ చుట్టూ తిరుగుతూ మధురానుభూతులను పంచే రైలు, పార్క్‌కు ఎదురుగా ఏర్పాటుచేసిన జంతర్ మంతర్ నమూనా ఆకట్టుకుంటాయి. కొండపైన స్మారక చిహ్నం వద్ద, దిగువన.. గాంధీజీ గుజరాత్, మహారాష్ట్ర, దక్షిణాఫ్రికాలో బస చేసిన శబర్మతి, సేవాగ్రామ్, ఫ్యానిక్స్ ఆశ్రమాల నమూనాలను ఏర్పాటు చేశారు. అలాగే, ఆ ప్రాంతంలోనే గాంధీజీ జన్మించిన పోరు బందరులోని ఇంటి నమూనా తీర్చిదిద్దారు. అక్కడి నుంచే మిగతా 8లో..

సరికొత్తగా ముస్తాబైన గాంధీకొండ రోజూ ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది. మంగళవారం సెలవు. ప్రవేశ ధర ఒకరికి రూ.10 చెల్లించాలి.



అందంగా గ్రీనరీ

సీఆర్‌డీఏ అడిషనల్ కమిషనర్ ప్రవీణ్‌చంద్ బదిలీ

ట్రాన్స్‌కో జేఎండీగా పోస్టింగ్



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాజధాని ప్రాంత అభివృద్ధి సంస్థ (ఏపీ సీఆర్‌డీఏ) అదనపు కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్ బదిలీ అయ్యారు. ఆయన్ను గురువారం రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌కో జేఎండీగా బదిలీ చేసింది. ప్రవీణ్‌చంద్‌కు ప్రభుత్వం మంచి పోస్టింగ్ ఇచ్చినప్పటికీ.. ఆయన స్థానంలో సీఆర్‌డీఏకు అదనపు కమిషనర్‌గా ఎవరినీ నియమించలేదు. ఇంతకుముందు మరో అడిషనల్ కమిషనర్ మల్లారపు నవీన్‌ను కృష్ణాజిల్లా జేసీగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో భార్గవ్‌తేజ వచ్చారు. అదనపు కమిషనర్‌గా పనిచేసిన సూర్యసాయి ప్రవీణ్‌చంద్ తనదైనముద్ర వేశారు. రాజధాని రైతుల సమస్యలపై దృష్టి సారించేవారు. ప్రతి సోమవారం తుళ్లూరులో ఆయన గ్రీవెన్స్ నిర్వహించేవారు. ప్రపంచ బ్యాంకు, ఆసియా అభివృద్ధి బ్యాంకు బృందాలతో జరిగిన సమావేశాల్లో పాల్గొనేవారు. అమరావతిలో ప్రపంచ బ్యాంకు, ఏడీబీల ఆర్థిక సహకారంతో పనులు జరగటానికి సూర్యసాయి కృషి ప్రత్యేకమైనది.

తిరుమల టికెట్ల పేరుతో మోసం

- రూ.12 లక్షలు కొట్టేసిన వ్యక్తి అరెస్టు 8

బందరు గోళం

రెండేళ్లుగా సాగదీత.. ముందుకు సాగని పనులు

విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 విస్తరణకు తికమక డీపీఆర్

- ఎక్కడి నుంచి మొదలుపెట్టాలన్న దానిపై స్పష్టత కరువు
- ఇప్పటికి నాలుగుసార్లు నిర్ణయాల్లో మార్పులు
- పోర్టు అవసరాలు, మెట్రోను దృష్టిలో పెట్టుకోవడమే మంచిది
- వెహికల్ అండర్ పాస్‌ల కంటే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ బెటర్
- కేంద్ర ప్రభుత్వం కూడా అనుమతులిచ్చే అవకాశం



ఇదిగో ఇక్కడి నుంచి.. అదిగో అక్కడి నుంచి.. కాదు కాదు.. అవైపు నుంచి... అది కూడా కాదు.. ఈవైపు నుంచి.. బెజవాడ నుంచి బందరు వరకు 65వ నెంబర్ జాతీయ రహదారి ఆరు వరసల విస్తరణకు సంబంధించి రూపొందిస్తున్న సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) గందరగోళం ఇదంతా. ఇదేం డీపీఆర్ అని ప్రజలు పెదవి విరిచే పరిస్థితి ఏర్పడింది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెండేళ్లుగా విజయవాడ-మచిలీపట్నం ఎన్‌హెచ్-65 ఆరు వరసల విస్తరణ డీపీఆర్ విషయంలో ఎంచుకోవాల్సిన ప్రాంతాలపై కచ్చితత్వం లేకుండాపోయింది. కన్సల్టెన్సీ సంస్థకు స్పష్టత లోపిస్తోంది. డీపీఆర్ రూపకల్పనకు గతంలో ఒకసారి బాధ్యతలను అప్పగించినపుడు ఆటోనగర్ నుంచి మచిలీపట్నం అన్నారు. ఆ దిశగా డీపీఆర్ జరుగుతుండగానే, అర్థంతరంగా ఆగిపోయింది. మళ్లీ ఆరు వరసల విస్తరణకు డీపీఆర్ జరుగుతోంది. బెంజిసర్కిల్ నుంచి మచిలీపట్నం వరకు విస్తరణ అన్నారు. ఆ తర్వాత ఆటోనగర్ నుంచి మచిలీపట్నం అన్నారు. ఈ రెండూ కాదని కానూరు నుంచి మచిలీపట్నం వరకు సర్వే అన్నారు. తాజాగా మళ్లీ బెంజిసర్కిల్ నుంచి మచిలీపట్నం వరకు అంటున్నారు. దీంతో డీపీఆర్ రూపకల్పన ఎలా చేయాలన్న మిగతా 8లో..

భవిష్యత్తు అవసరాలు కూడా ముఖ్యమే..

విజయవాడ-మచిలీపట్నం వరకు ఆరు వరసలుగా జాతీయ రహదారిని విస్తరించాలంటే కచ్చితంగా బెంజిసర్కిల్ నుంచి బందరు వరకు విస్తరణ ఉండాలి. ప్రస్తుత అవసరాలను అధ్యయనం చేయటంతో పాటు భవిష్యత్తును కూడా అధ్యయనం చేస్తూ ఈ విస్తరణ జరగాలి. బెంజిసర్కిల్ నుంచి కానూరు వరకు ఆరు వరసలుగా ప్రస్తుత రోడ్డును విస్తరించాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. రెండువైపులా భారీసంఖ్యలో వాణిజ్య, నివాస భవనాలు ఉన్నాయి. వాటిని కూలగొట్టి రోడ్డును విస్తరించాలంటే.. ఎంతో ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. కోర్టు కేసులను కూడా భారీగా ఎదుర్కోవాలి. దీనిని దృష్టిలో ఉంచుకుని బెంజిసర్కిల్-కానూరు వరకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది.

ఘరానా మోసం వెలుగులోకి

- గొల్లపూడి వెలుగు కార్యాలయంలో రుణాల పేరిట స్వాహాపర్వం
- గ్రామీణ ప్రాంతాలకు ఇవ్వాల్సిన రుణాలు పట్టణ ప్రాంతాల వారి పేరిట..
- గ్రామీణ సభ్యుల స్థానంలో మెప్మా సభ్యులను చేర్చి మోసాలు
- బాధ్యులైన సీసీ, ఏపీఎంల సస్పెన్షన్



గొల్లపూడిలోని డీఆర్‌డీఏ కార్యాలయం

మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు ఉద్దేశించిన డ్వాక్రా రుణాలను కొందరు ఉద్యోగులు పక్కదారి పట్టిస్తున్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే జీతం చాలక గ్రూపు డబ్బు మింగేస్తున్నారు. కొందరు వీవో ప్రెసిడెంట్లతో కలిసి ఏకంగా రూ.కోట్లకు కుచ్చుటోపీ పెడుతున్నారు. చాలాచోట్ల వెలుగు కార్యాలయాల్లో రూ.కోట్లలో కుంభకోణాలకు పాల్పడుతూ అడ్డంగా దొరికిపోతున్నారు. గొల్లపూడిలోని వెలుగు కార్యాలయంలో ఇద్దరు ఉద్యోగులు బ్యాంకు సిబ్బందితో కలిసి చేసిన ఘరానా మోసం తాజాగా వెలుగులోకి వచ్చింది.

ఇబ్రహీంపట్నం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : గొల్లపూడి కేంద్రంగా నడుస్తున్న గ్రామీణ మహిళా సమాఖ్యలో ఓ సీసీ, ఏపీఎంలు కలిసి చేసిన మోసంలో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. మైక్రో క్రెడిట్ ప్లాన్ (ఎంసీపీ) ద్వారా గ్రామీణ ప్రాంతాలకు చెందిన స్వయం సహాయక సంఘాల (డ్వాక్రా) గ్రూపులకు రుణాలు ఇవ్వాల్సి ఉంది. గ్రామీణ ప్రాంతాలకు ఇస్తే దొరికిపోతామనే ఉద్దేశంలో మిగతా 8లో..





వృథాగా పోతున్న నీరు

వృథాగా వేదాద్రి ఎత్తిపోతల


- మరమ్మతు పనుల్లో ఆది నుంచి అవాంతరాలు
- రెండుసార్లు ట్రయల్ రన్స్.. విఫలం
- ఆయకట్టుకు చుక్కనీరు కూడా అందని దైన్యం
- సమగ్ర మరమ్మతులే శరణ్యమంటున్న రైతులు

నందిగామ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి) : వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతు పనుల్లో అడుగడుగునా అవాంతరాలు ఎదురవుతున్నాయి. వారం కిందట వేసిన ట్రయల్ రన్‌తో పాటు గురువారం నాటి ట్రయల్ రన్ కూడా విఫలమై నీరు వృథాగా మిగతా 8లో..

విద్యాశాఖలో అవినీతి దందా!

- ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీలో భారీగా చేతులు మారిన నగదు
- బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలో ఐదు పోస్టుల భర్తీకి అనుమతి
- ఇదే అదనుగా తెరవెనుక చక్రం తిప్పిన కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారులు
- ఒక్కో పోస్టుకు రూ.10 లక్షల చొప్పున వసూలు
- ఎంట్రన్స్ టెస్టు కూడా వేరే వ్యక్తులతో రాయించారనే ప్రచారం
- ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా విద్యాశాఖ వ్యవహారం

విద్యాశాఖలో అవినీతి దందా తారస్థాయికి చేరింది. విజయవాడలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాలలో ఐదు టీచర్ పోస్టుల భర్తీలో పెద్ద మొత్తంలో నగదు చేతులు మారింది. ఒక్కో పోస్టుకు రూ.10 లక్షలు డిమాండ్ చేసి మరీ కృష్ణాజిల్లా విద్యాశాఖ అధికారులు వసూలు చేసినట్టు సమాచారం. ఎంట్రన్స్ టెస్టు కూడా అభ్యర్థులకు బదులు వేరే వారితో రాయించినట్టు ఆరోపణలు వస్తున్నాయి. ఈ మొత్తం వ్యవహారం ఓ కీలక అధికారి నడిపించినట్టు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. విద్యాశాఖ అవినీతిపై కలెక్టరేట్‌లోని ఉన్నతాధికారుల్లో సైతం తీవ్రస్థాయిలో చర్చ నడుస్తోంది.



- కథనం 8లో

జనార్దన్‌పై నిఘా

- దక్షిణాఫ్రికాలోనే ఉన్నాడన్న అనుమానాలు
- లుక్ అవుట్ సర్క్యులర్ జారీ
- అన్ని విమానాశ్రయాలకు సమాచారం
- నేడు కాకినాడ ల్యాబ్‌కు నకిలీ నమూనాలు

ఇబ్రహీంపట్నం కేంద్రంగా నకిలీ మద్యం డిస్టలరీని ప్రారంభించిన అద్దేపల్లి జనార్దనరావు ఇంకా దక్షిణాఫ్రికాలోనే ఉన్నాడా? సొంతగడ్డపై అడుగుపెట్టిన వెంటనే ఎక్సైజ్ పోలీసులకు చిక్కకుండా ఏర్పాట్లు చేసుకుంటున్నాడా? విమానాశ్రయంలో దిగాక ఏయే మార్గాల్లో వెళ్లాలన్న దానిపై అనుచరులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారా? అంటే అవుననే సమాధానాలు వస్తున్నాయి.

(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : అద్దేపల్లి జనార్దనరావు కోసం ఎక్సైజ్ పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. దేశంలోని అన్ని ప్రధాన విమానాశ్రయాలకు లుక్ అవుట్ సర్క్యులర్ పంపారు. జనార్దనరావు ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్నాడని ఎక్సైజ్ మిగతా 8లో..



23న దుర్గమ్మకు గాజుల అలంకారం

8లో

వసతి గృహాల పరిరక్షణకు ప్రత్యేక అధికారులు

- హాస్టల్ విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండి : కలెక్టర్ లక్ష్మీశ 8లో

13 నుంచి షాపింగ్ ఫెస్టివల్

- అధికారులతో సమావేశంలో జేసీ ఇలక్కియా 8లో

జగన్ వైఖరి ఇంకా మారలేదు

- అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనలో టీడీపీ నేత నెట్టెం

23న దుర్గమ్మకు గాజుల అలంకారం

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మకు ఈనెల 23న గాజుల అలంకారం వైభవంగా నిర్వహించనున్నట్టు స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ, ఈవో శీనానాయక్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నట్టు పేర్కొన్నారు. మహోత్సవానికి భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందాలని ప్రకటనలో కోరారు.



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

నిత్యాన్నదానానికి దాతల విరాళాలు

దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి పలువురు దాతలు అధికారులకు విరాళాలు అందజేశారు. స్థానిక అయ్యప్పనగర్‌కు చెందిన టీ ఈశ్వర దుర్గా నాగేంద్ర కుటుంబసభ్యులు రూ.5,89,055 విరాళంగా అందజేశారు. లంబాడీపేటకు చెందిన డీ రంగారావు తండ్రి డీ లక్ష్మయ్య జ్ఞాపకార్థం రూ.2,02,116 విరాళంగా ఇచ్చారు. గుంటూరు జిల్లా పండరీపురం నివాసి గుండ లక్ష్మీనారాయణ, ప్రభావతమ్మ దంపతులు విరాళంగా రూ.1,00,116 అధికారులకు అందజేశారు. సిబ్బంది దాతలకు అమ్మవారి దర్శనం కల్పించారు. అమ్మవారి చిత్రపటంతో పాటు విరాళం రశీదు, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఎల్‌బీసీ కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు, పీఎఫ్‌ఆర్‌డీఏ ఈడీ పేరి వెంకటేశ్వర్లు

ప్రతి పౌరుడికి పెన్షన్ అవకాశం

విజయవాడ రూరల్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులతో పాటు దేశంలోని ప్రతి పౌరుడికి పెన్షన్ అందించాలనే లక్ష్యంతో కేంద్రం అటల్ పెన్షన్ యోజన పథకం తెచ్చిందని స్టేట్ లెవల్ బ్యాంకర్స్ కమిటీ (ఎస్ఎల్‌బీసీ) కన్వీనర్ సీవీఎన్ భాస్కరరావు అన్నారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని స్వప్న ఫంక్షన్ హాల్‌లో అటల్ పెన్షన్ యోజన పథకంపై గురువారం అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన భాస్కరరావు, పేరి వెంకటేశ్వర్లు జ్యోతి వెలిగించి సదస్సును ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ బ్యాంకు ఖాతాదారులకు అటల్ పెన్షన్ యోజన పథకం ప్రయోజనాలను వివరించారు. 18 నుంచి 40 ఏళ్లున్న ప్రతి భారతీయుడు పథకంలో చేరి పెన్షన్ పొందవచ్చన్నారు. 60 ఏళ్లు దాటిన తర్వాత రూ.1000 నుంచి రూ.5వేల వరకు పెన్షన్ పొందవచ్చని, అతి తక్కువ ప్రీమియం చెల్లింపులతో పథకం అమలు చేస్తున్నట్టు తెలిపారు. దేశవ్యాప్తంగా 8.26 కోట్లమంది, ఆంధ్రప్రదేశ్‌లో 40లక్షల మంది సభ్యులుగా నమోదు అయ్యారన్నారు. పీఎఫ్‌ఆర్‌డీఏ సీజీఎం పర్వేష్ కుమార్, ఆర్‌బీఐ జీఎం ఆర్‌కే మహాన, నాబార్డ్ డీజీఎం ఎంఎం. బెహర, లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రియాంక పాల్గొన్నారు.



అధికారులకు వాహనాల తాళాలను అందిస్తున్న కన్నబాబు

సెంట్రల్ నర్సరీ నిర్వహణకు కొత్త వాహనాలు

కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాజధాని ప్రాధికార సంస్థ (సీఆర్‌డీఏ) అమరావతిలోని ఉద్దండరాయునిపాలెంలో 20 ఎకరాల్లో విస్తరించిన సీఆర్‌డీఏ సెంట్రల్ నర్సరీ, అవెన్యూ మొక్కల పెంపకం నిర్వహణకు నూతన వాహనాలు అందజేసింది. నర్సరీ నిర్వహణకు 47 హెచ్‌పీ ట్రాక్టర్, వాటర్ ట్యాంకర్, ట్రైలర్‌ను తాజాగా సీఆర్‌డీఏ కొనుగోలు చేసింది. సీఆర్‌డీఏ కమిషనర్ కే కన్నబాబు అధికారులకు వాహనాల తాళాలను అందజేశారు. ప్రజా రాజధాని అమరావతిలో పచ్చదనం పెంపొందించేందుకు సీఆర్‌డీఏ కట్టుబడి ఉందని కమిషనర్ తెలిపారు. సీఆర్‌డీఏ ల్యాండ్ స్కేప్ అండ్ ఎన్విరాన్‌మెంట్ విభాగ అదనపు డైరెక్టర్ ఎం హరిప్రసాద్, హార్టికల్చర్ డిప్యూటీ డైరక్టర్ టీ జాన్ బెన్నీ, హార్టికల్చర్ అధికారి ఏ శివరామకృష్ణ పాల్గొన్నారు.

జగన్ వైఖరి మారలేదు: నెట్టెం


వన్‌టౌన్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి ఇంకా మారలేదని, ఎన్నికల్లో ఆయనకు 11 సీట్లు ఇచ్చి ప్రజలు బుద్ధి చెప్పినా ఆయన వైఖరి మారలేదని



కేడీసీసీ బ్యాంక్ అధ్యక్షుడు, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు నెట్టెం రఘురామ్ అన్నారు. చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం, దేవలంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసి, దహనానికి వైసీపీ కుట్ర జరిపిన ఘటనకు నిరసనగా నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద గల అంబేద్కర్ విగ్రహం వద్ద గురువారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. తొలుత అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి, పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్డీయే కూటమి ప్రభుత్వంపై నిందలు మోపేందుకు వైసీపీ చేస్తున్న ప్రయత్నాలు దేవలంపేట అంబేద్కర్ విగ్రహం ఘటనతో పరాకాష్ఠకు చేరిందన్నారు. రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ అథారిటీ కార్పొరేషన్ చైర్మన్ శ్యావల దేవదత్, టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు సొంగా సంజయ్ వర్మ ఆధ్వర్యంలో పార్టీ నేతలు దొండపాటి విజయ్, శిరీషా గాంధీ, దోమకొండ రవికుమార్, అన్నేపాక వెంకట దుర్గారావు, కొట్టేటి హనుమంతరావు, పరిశపోగు రాజేష్, కామా దేవరాజ్, బడుగు వెంకన్న, దేవరపల్లి అంజనేయులు, వరకుమార్, దాసరి జయరాజు, రుక్మిణి, బూదాల నందకుమారి, కొట్టేటి సరిత, పల్లెపోగు ప్రసాద్, జీవీ నరసింహరావు, దేవానంద్, గేబ్రియల్, పరిశపోగు విజయ్ పాల్గొన్నారు.

పకడ్బందీగా రీసైక్లింగ్ పాలసీ

● పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ కృష్ణయ్య



లబ్బీపేట అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): దేశంలో సర్క్యులర్ ఎకానమీ, వేస్ట్ రీసైక్లింగ్ పాలసీ (4.0)ని అందిపుచ్చుకుని అమలు చేస్తున్న తొలిరాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ఆవిర్భవించనుందని పొల్యూషన్ కంట్రోల్ బోర్డు చైర్మన్ పీ కృష్ణయ్య తెలిపారు. హోటల్ మురళీ ఫార్చ్యూన్ నందు గురువారం వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, శాఖాధిపతులతో వర్క్‌షాపు నిర్వహించారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రీసైక్లింగ్ పాలసీని రాష్ట్రంలో పగడ్బందీగా అమలు చేయడంతో పాటు సామాన్యులను భాగస్వాములను చేసి లబ్ధి చేకూర్చేలా కృషి చేస్తున్నామన్నారు. పారిశ్రామిక రంగాల నుంచి వచ్చే వ్యర్థాలను రీసైక్లింగ్ చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కే పట్టాభిరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెంబర్ 149 ప్రకారం వేస్ట్ రీసైక్లింగ్ పాలసీని పటిష్ఠంగా అమలు చేసేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. 20 సూత్రాల అమలు కమిటీ చైర్మన్ లంకా దినకరన్, ఎంఎస్ఎంఈ చైర్మన్ టీ శివశంకర్ రావు, సీడాప్ చైర్మన్ జీ దీపక్ రెడ్డి పీ-4 ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు కుటుంబరావు, ఏపీ బయో డైవర్శిటీ బోర్డు చైర్మన్ ఎన్ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

వసతి గృహాల పరిరక్షణకు ప్రత్యేక అధికారులు

● హాస్టల్ విద్యార్థుల విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టిపెట్టండి: కలెక్టర్‌లక్ష్మీశ



వలంటీర్లకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు ప్రత్యేక అధికారులను నియమిస్తున్నామని, విద్యార్థుల సంక్షేమ, విద్య, ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. జిల్లాలోని వసతి గృహాల నిర్వహణపై జిల్లా అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ గురువారం నగరంలోని రైతు శిక్షణ కేంద్రం సమావేశ మందిరంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 34 సాంఘిక సంక్షేమ వసతి గృహాలు, 26 వెనుకబడిన తరగతుల సంక్షేమ వసతి గృహాలు, 3 గిరిజన సంక్షేమ వసతి గృహాలు, 2 మైనార్టీ సంక్షేమ వసతి గృహాల పర్యవేక్షణకు జిల్లా అధికారులను ప్రత్యేక అధికారులుగా నియిమించామన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం లక్ష్మీ నరసింహం, జిల్లా సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ అధికారి ఎం రమాదేవి, మైనార్టీ సంక్షేమ అధికారి అబ్దుల్ రబ్బాని, గురుకుల విద్యాలయ సంక్షేమ అధికారి ఏ మురళీకృష్ణ, వెనుకబడిన సంక్షేమ అధికారి కే లక్ష్మీదేవి, సహాయ సంక్షేమ అధికారులు వీ గణేష్, టీ గాయత్రి, ఎం ఇజ్రాయిల్ వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు, వసతి గృహ సంక్షేమ అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌తో సూపర్ లైఫ్

ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి చొరవతో అందుబాటులోకి వచ్చిన జీఎస్టీ సంస్కరణల ఫలాలతో సామాన్యులకు ఎంతో మేలు జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. నగరంలోని పాత ప్రభుత్వాసుపత్రి వద్ద గురువారం సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీని కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, జీఎస్టీ విజయవాడ జాయింట్ కమిషనర్ ఎస్ ప్రశాంత్ కుమార్, ఇతర అధికారులతో పాటు జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ 2.0తో వివిధ రంగాల్లో భారం తగ్గిందన్నారు. జిల్లా కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు సాధు ప్రసాద్, సెక్రటరీ డీవీఆర్ సాయికుమార్, జీ శ్రీహరిరావు, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, ఔషధ నియంత్రణ పరిపాలన అసిస్టెంట్ డైరక్టర్ కే అనిల్‌కుమార్, జీఎస్టీ గొల్లపూడి సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ ఎస్ పజ్జా రాధిక, ఆసుపత్రి వైద్యాధికారులు, జీఎస్టీ అధికారులు పాల్గొన్నారు.

బాణసంచా నిల్వలు, అమ్మకాలపై నిఘా

బాణసంచా అక్రమ నిల్వలు, అమ్మకాలపై అధికారులు నిరంతరం నిఘా పెట్టాలని, నిబంధనలకు విరుద్ధంగా అక్రమ నిల్వలు, అమ్మకాలు చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ఈనెల 21న దీపావళి పండుగ నేపథ్యంలో బాణాసంచా నిల్వలు, అమ్మకాల పర్యవేక్షణపై గురువారం కలెక్టర్ లక్ష్మీశ కలెక్టరేట్ నుంచి రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక, విపత్తు నిర్వహణ, మున్సిపల్, వైద్య ఆరోగ్యం, పౌరసరఫరాలు, విద్యుత్ తదితర శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు బాణాసంచా కొనుగోలును దృష్టిలో పెట్టుకొని బాణసంచా అమ్మకందారులు అక్రమ నిల్వలు చేసే అవకాశం ఉంటుందని, తనిఖీల అనంతరం మాత్రమే అనుమతులు మంజూరు చేయాలన్నారు. వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర, డీఆర్‌ఎం ఎం లక్ష్మీ నరసింహం, డీసీపీ కేజీవీ సరిత, అగ్నిమాపక అధికారి శంకరరావు, వీఎంసీ అగ్నిమాపక అధికారి నరేష్, ఆర్డీవోలు కే చైతన్య, కే మాధురి, బాలకృష్ణ, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం సుహాసిని, రెవెన్యూ, పోలీసు, అగ్నిమాపక శాఖాధికారులు పాల్గొన్నారు.

రెడ్‌క్రాస్ సేవలు ప్రశంసనీయం

దసరా మహోత్సవాల్లో రెడ్‌క్రాస్ సంస్థ సేవలు ప్రశంసనీయమని కలెక్టర్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీశ తెలిపారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గురువారం జరిగిన వలంటీర్ల అభినందన సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దసరా మహోత్సవాల్లో వృద్ధులకు, దివ్యాంగులకు రెడ్‌క్రాస్ వలంటీర్లు మంచి సేవలందించారని, ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ వలంటీర్లకు కలెక్టర్ ప్రశంసాపత్రాలు అందించారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ సమరం, వైస్ చైర్మన్ వెలగా జోషి, జిల్లా కార్యదర్శి ఈ చిట్టిబాబు, సిద్ధార్థ ఫార్మసీ కళాశాల, కేబీఎన్ కళాశాల, పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలల రెడ్‌క్రాస్ యూత్‌వింగ్ వలంటీర్లు, సమన్వయకర్తలు పాల్గొన్నారు.

13 నుంచి షాపింగ్ ఫెస్టివల్: జేసీ

సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ఈనెల 13 నుంచి 19 వరకు జరిగే విజయవాడ షాపింగ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేసేందుకు అధికారులు కృషి చేయాలని జేసీ ఇలక్కియా తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాలులో జేసీ, జీఎస్టీ జాయింట్ కమిషనర్ ఎస్ ప్రశాంత్‌కుమార్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు.

11 ఏళ్లలో మోదీ చేసిందేమీ లేదు

కేంద్ర మాజీ మంత్రి చింత మోహన్

గాంధీనగర్: ప్రధాని మోదీ తన 11 ఏళ్ల పాలనలో దేశానికి, ప్రజలకు చేసిం ది శూన్యమని మాజీ కేంద్ర మంత్రి చిం త మోహన్ విమర్శించారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడా రు. ఇటీవల దళితుడైన సుప్రీంకోర్టు ప్ర ధాన న్యాయమూర్తి గవాయ్‌పై జరిగిన దాడిని తీవ్రంగా ఖండించారు. ఇది అత్యంత అమానుషమన్నారు. మాజీ సీ ఎం జగన్ మళ్లీ సీఎం కావడం అసాధ్యమన్నారు. ఇప్పటికే 11 సీబీఐ కేసులుండగా, లిక్కర్ స్కామ్ తోడయిందన్నారు.

ఘరానా మోసం వెలుగులోకి..

(7వ పేజీ తరువాయి)

ఏ సంబంధం లేని పట్టణ ప్రాంతాలవారిని చేర్చి రుణాలు ఇచ్చినట్లు నమోదు చేసి రూ.కోట్లు మింగేశారు. గ్రామీణ ప్రాంతాలకు కాకుండా పట్టణ పేదరిక నిర్మూలన పథకం (మెప్మా) సభ్యులకు ఎంసీపీ లేకుండానే రుణాలు ఇచ్చినట్లు నమోదు చేశారు. 2025, ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో విజయవాడ రూరల్ ప్రాంతాలకు సంబంధం లేని అర్బన్ ప్రాంతాలకు రుణాలు ఇచ్చినట్లు ఎస్‌బీఐ గొల్లపూడి బ్యాంక్ నుంచి విడుదలైన జాబితాలో తెలుస్తోంది. సింగ్‌నగర్ 65వ డివిజన్, అజిత్‌సింగ్‌నగర్, 29వ డివిజన్, భవానీపురం, చిట్టినగర్, హౌసింగ్ బోర్డు కాలనీ, ప్రకాష్‌నగర్, వాగు సెంటర్, చిట్టినగర్.. ఇలా చాలా ప్రాంతాల పేర్లను ఎంటర్ చేసి, వీవో పేరు లేకుండా రుణాలు మంజూరు చేశారు. మొత్తం 15 ప్రాంతాలకు గొల్లపూడి సీసీ నుంచి రుణాలు మంజూరైనట్లుగా ఉంది.

సీసీ, ఏపీఎంలను సస్పెండ్ చేశాం: డీఆర్‌డీఏ పీడీ నాంచారరావు

గ్రామీణ ప్రాంతాలకు ఇవ్వాల్సిన రుణాలు పట్టణ ప్రాంతాల గ్రూపుల పేర్లతో ఇచ్చినట్లు నిర్ధారణైంది. ఇలా 4 గ్రూపులకు ఇచ్చినట్లుగా ఉంది. నిధులు స్వాహా చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలడంతో వెలుగు సీసీ చిమటా శ్రీలక్ష్మిని, ఏపీఎం చంద్రశేఖర్‌ను సస్పెండ్ చేశాం. నిధులు ఏ మేరకు దుర్వినియోగమైంది, ఎవరెవరు ఇందులో ఇంకా ఉన్నారనే విషయం విచారణ పూర్తయితేనే తెలుస్తుంది. నిధుల దుర్వినియోగం విషయం సెర్ప్ అధికారులకు నివేదిస్తాం.

కొండంతా కొత్తగా..

(7వ పేజీ తరువాయి)

లిఫ్ట్ ఉంటుంది. కొండపైకి చేరుకోగానే, అద్భుతమైన వ్యూ పాయింట్ కనిపిస్తుంది. ఇక్కడి నుంచి నగర సోయగాలను ఆస్వాదించవచ్చు. తూర్పుదిశలో రైల్వేస్టేషన్ పూర్తిభాగం, గుణదల కొండ, అంబేద్కర్ స్మృతివనం, యనమలకుదురు శివాలయం కనిపిస్తాయి. వీటిని చూస్తూనే దక్షిణం దిక్కుకు తిరిగితే కృష్ణానది, తాడేపల్లి వరకు నగరం మొత్తం, పడమర దిక్కుకు తిరిగితే ఇంద్రకీలాద్రి, వన్‌టౌన్, కాళేశ్వరరావు మార్కెట్ కనువిందు చేస్తాయి. ఉత్తరం దిక్కుకు తిరగగా, జక్కంపూడి, నున్న ప్రాంతాల వరకు చూడొచ్చు.

బందరుగోళం

(7వ పేజీ తరువాయి)

దానిపైనే రెండేళ్ల కాలహరణం గడిచిపోయింది.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవరే బెటర్

బందరు రోడ్డులో పెనమలూరు సెంటర్ నుంచి బెంజిసర్కిల్ మీదుగా పీఎన్‌బీఎస్ వరకు మెట్రో రైల్ కారిడార్ వెళ్తోంది. దీనిని ఖాయంగా చేసుకుని పెనమలూరు సెంటర్ నుంచి బెంజిసర్కిల్ వరకు ఎన్‌హెచ్-65 పై డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్‌ను ప్రతిపాదించటం ద్వారా పైన చెప్పుకొన్న చిక్కుముళ్లను సరిచేసుకునే అవకాశం ఉంది. పైగా కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అంగీకారం తెలిపి నిధులిచ్చే అవకాశముంది. మచిలీపట్నం పోర్టును దృష్టిలో ఉంచుకుని ఎన్‌హెచ్-65ను ఆరు వరసలుగా విస్తరించాలని కేంద్రం కోరుకుంటోంది కాబట్టి నిధులు ఇచ్చే అవకాశం ఉంది.

ఎందుకంటే..

ఎన్టీఆర్ సర్కిల్, హైస్కూల్ రోడ్డు జంక్షన్, ఆటోనగర్ రోడ్డు జంక్షన్, తాడిగడప, కానూరు, పోరంకి, గంగూరు ప్రాంతాల్లో అతిపెద్ద జంక్షన్లున్నాయి. వీటి దగ్గర ట్రాఫిక్ భారీగానే ఉంటుంది. ఇదే ప్రాంతాల్లో ఆరు వరుసలుగా రోడ్డు విస్తరించినా సమస్య అలాగే ఉంటుంది. ఈ సమస్యలు లేకుండా చేయాలంటే దాదాపు ఆరేడు చోట్ల దగ్గర దగ్గరగా వెహికల్ అండర్ పాస్ (వీయూపీ)లు నిర్మించాల్సి ఉంటుంది. ఇవి నిర్మిస్తే రోడ్డు అప్ అండ్ డౌన్‌గా మారుతుంది. కొత్త సమస్యలు వస్తాయని ఇంజనీరింగ్ నిపుణులు చెబుతున్నారు. ఈ ఇబ్బందులన్నింటినీ అధిగమించాలంటే డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ ఒక్కటే ప్రత్యామ్నాయంగా కనిపిస్తోంది. పెనమలూరు సెంటర్ నుంచి వాహనాలు ఫ్లై ఓవర్ మీదుగా వెళ్లిపోతాయి. మెట్రో రైలు ఆ పైన వెళ్లడానికి అవకాశం ఉంటుంది. ఇప్పటికే ఎన్‌హెచ్-16 మార్గంలో నిడమానూరు ఫ్లై ఓవర్‌ను నిడమానూరు జంక్షన్ నుంచి రామవరప్పాడు రింగ్ వరకు డబుల్ డెక్కర్ విధానంలో నిర్మించటానికి కేంద్రానికి డీపీఆర్ పంపారు. కేంద్ర ఉపరితల రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) దగ్గర పెండింగ్‌లో ఉంది. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు అనుమతులు ఇస్తుందా లేదా అన్న దాని కంటే.. కేంద్ర ప్రభుత్వం మచిలీపట్నం పోర్టును దృష్టిలో ఉంచుకుని విజయవాడ-మచిలీపట్నం ఆరు వరసల విషయంలో మాత్రం డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్‌కు అనుమతులు ఇచ్చే అవకాశం ఉంది.

విద్యాశాఖలో అవినీతి దందా!

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం/విజయవాడ: విజయవాడలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల యాజమాన్యం ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరిపి ఐదు టీచర్ పోస్టులను భర్తీ చేసుకునేందుకు అనుమతులు తెచ్చుకుంది. ఉమ్మడి కృష్ణాజిల్లాకు సంబంధించిన విద్యాశాఖ పరిపాలనా వ్యవహారాలన్నీ కృష్ణా జిల్లా విద్యాశాఖ కార్యాలయంలోనే జరుగుతున్నాయి. దీంతో ఈ వ్యవహారాలు చూసేది తామేనని, తమ కనుసన్నల్లోనే ఈ పోస్టుల భర్తీ జరగాలని కీలక అధికారి తనదైన శైలిలో అల్టిమేటం జారీ చేసినట్టు సమాచారం. ఎన్టీఆర్‌జిల్లా విద్యాశాఖ అధికారులను సంప్రదించవద్దని, ఏం జరిగినా తమ కనుసన్నల్లోనే జరగాలని స్పష్టం చేసినట్టు తెలిసింది. దీంతో పాఠశాల యాజమాన్యం కృష్ణా డీఈవో కార్యాలయ అధికారులు చెప్పినట్టుగా నడుచుకుంటామని ముందుకు వచ్చినట్టు సమాచారం. ఈ కీలక అధికారి తన చేతికి మట్టి అంటకుండా ఈ టీచర్ పోస్టుల భర్తీలో మొత్తం వ్యవహారాన్ని గుట్టుచప్పుడు కాకుండా నడిపేలా ఒక డీవైఈవోకు బాధ్యతలు అప్పగించి తెరవెనుక కథ నడిపించారనే ఆరోపణలు ఉన్నాయి.

అభ్యర్థులతో నామమాత్రంగా పరీక్ష రాయించి..

అజరయ్య ఎయిడెడ్ ఉన్నత పాఠశాలలో 5 టీచర్ పోస్టుల భర్తీకి సంబంధించి నోటిఫికేషన్ జారీ, పరీక్ష నిర్వహణ, అభ్యర్థుల ఎంపిక గుట్టుచప్పుడు కాకుండా చేశారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టీచర్ పోస్టు కావాలంటే ఇంత మొత్తంలో నగదు చెల్లించాలని తెర వెనుక బేరం పెట్టి, ఒక్కో పోస్టుకు లక్షలాది రూపాయలను వసూలు చేసినట్లు విశ్వసనీయ సమాచారం. యాజమాన్యానికి ఇంత, విద్యాశాఖ అధికారులకు ఇంత అని విడమరచి చెప్పి మరీ నగదు వసూలు చేశారనే ఆరోపణలు ఉన్నాయి. యాజమాన్యం సంగతి పక్కనపెట్టి ఒక్కో టీచర్ పోస్టుకు కనీసంగా రూ.10 లక్షలకు తగ్గకుండా నగదు సమర్పిస్తేనే అనుమతులు ఇస్తామని విద్యాశాఖ అధికారులు ఖరాఖండిగా చెప్పి వసూళ్లకు పాల్పడ్డారని డీఈవో కార్యాలయ అధికారులే చెప్పుకుంటున్నారు. టీచర్ పోస్టులకు అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహణలోనూ నిబంధనలను తుంగలోతొక్కారనే ఆరోపణలు ఉన్నాయి. టీచర్ పోస్టులు దక్కించుకునేందుకు నగదు చెల్లించిన వారి పేరున హాల్ టికెట్లు ఇచ్చారు. పరీక్ష జరిగే సమయానికి గంట ముందే ఆయా సబ్జెక్టులలో నిష్ణాతులైన ఉపాధ్యాయులతో పరీక్ష రాయించినట్లు విద్యాశాఖ కార్యాలయంలోని అధికారులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. పరీక్ష జరిగిన తర్వాత పేపర్‌లను అసలైన అభ్యర్థులు రాసినట్లుగా తారుమారు చేశారని, ఇది బహిరంగ రహస్యమేనని అధికారులు గుసగుసలాడుకుంటున్నారు. పరీక్షల నిర్వహణకు సంబంధించిన ఎపిసోడ్ మొత్తం విద్యాశాఖ కీలక అధికారి సూచనలతోనే జరిగిందనే ఆరోపణలు ఉన్నాయి. ఎయిడెడ్ టీచర్ పోస్టుల భర్తీలో విద్యాశాఖ అధికారులు ఇంతగా బరితెగించడంతో ఈ విషయం ఆనోటా, ఈనోటా బయటకు వచ్చింది. మచిలీపట్నం కలెక్టరేట్‌లో ఇద్దరు, ముగ్గురు అధికారులు కలిస్తే టీచర్ పోస్టుల భర్తీలో విద్యాశాఖ అధికారులు వ్యవహరించిన తీరుపై చర్చించుకుంటూ కనిపించడం గమనార్హం. తొలుత మూడు పోస్టులను భర్తీ చేసి, కొద్ది రోజుల తర్వాత మరో రెండు పోస్టులను భర్తీ చేశారని విద్యాశాఖ అధికారులు చెప్పుకుంటున్నారు.

అంతా తానై నడిపిన కీలక అధికారి!

కృష్ణాజిల్లా విద్యాశాఖలో పనిచేసే కీలక అధికారి తీరు ఇటీవల కాలంలో వివాదాస్పదమవుతోంది. ప్రతి పనికి ఓ రేటు నిర్ణయించి తనదైన శైలిలో వ్యవహారాలు నడుపుతున్న సదరు అధికారి తన అనుభవాన్నంతటినీ ఉపయోగించి టీచర్ పోస్టుల భర్తీలో పెద్ద మొత్తంలో నగదు వసూళ్లకు పాల్పడ్డారనే అంశంపై జిల్లాస్థాయి అధికారులు బాహాటంగానే చెప్పుకుంటున్నారు. ఇంత జరిగినా ఈ అధికారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడానికి కారణాలు ఏమై ఉంటాయనే అంశంపైనా చర్చ జరుగుతోంది.

వృథాగా

(7వ పేజీ తరువాయి)

పోతుండటంతో ఆయకట్టు రైతులు ఆవేదన చెందుతున్నారు.

జరిగింది ఇదీ..

వేదాద్రి ఎత్తిపోతల పథకం మరమ్మతు పనుల కోసం ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య ఎంతో సహకరించారు. పవర్‌మిక్ సంస్థ పడిలేస్తూ ఈ మరమ్మతులు పూర్తి చేసింది. ఎంపీ కేశినేని తన నిధుల నుంచి రూ.33 లక్షలు కేటాయించారు. అదనపు పనులు కూడా చేసిన పవర్‌మిక్ సంస్థ వారం క్రితం ట్రయల్ రన్ వేసింది. ఆరేళ్లుగా విధ్వంసానికి గురైన ఉన్న ఈ పథకం పైపులైన్లకు లీకులు ఏర్పడి పంప్ నుంచి విడుదలవుతున్న నీరు కాల్వలకు చేరట్లేదు. కొండల మధ్యలోనే వృథాగా పోతోంది. దీంతో ఇంజనీర్లు కొండల మధ్యలో ఉన్న 400 మీటర్ల పైపులైన్లను పరిశీలించి లీకులు అరికట్టారు. తీరా మోటార్లు ఆన్ చేయబోయేలోపు ట్రాన్స్‌కో అధికారులు సరఫరా నిలిపివేశారు. బకాయి ఉన్నందున సరఫరా నిలిపివేసినట్లు ప్రకటించారు. దీంతో ఎంపీ కేశినేని శివనాథ్, ప్రభుత్వ విప్ తంగిరాల సౌమ్య.. విద్యుత్‌శాఖ మంత్రి, ట్రాన్స్‌కో సీఎండీతో మాట్లాడి సరఫరాను పునరుద్ధరించారు. దీంతో నీటి సంఘాల ప్రతినిధులు, రైతులు ఊపిరి పీల్చుకున్నారు. ఆయకట్టులోని 17,500 ఎకరాల భూములకు చెందిన రైతులు వేదాద్రి నీటిని చూసి ఉద్వేగానికి గురయ్యారు. ఈ దశలోనే గురువారం ఇంజనీర్లు మరోమారు ట్రయల్ రన్ నిర్వహించారు. నిర్వహణ లేక బలహీనంగా ఉన్న పైపులైన్లు మరోమారు పగిలిపోయాయి. ఈ దఫా పెద్ద లీకులు ఏర్పడటంతో చుక్కనీరు కూడా కిందకు రావట్లేదు. దీనిపై మూడు నెలలుగా పరిశ్రమిస్తున్న ఇంజనీర్లు, నీటి సంఘాలు నీరసించిపోగా, ఆయకట్టు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఖరీఫ్ చివరిలోనైనా వేదాద్రి నీటిని అందుకోగలమా.. అని ఆశగా చూస్తున్నారు.

సమగ్ర మరమ్మతులు చేయాల్సి ఉంది

వేదాద్రి ఎత్తిపోతల పథకం పూర్తి మరమ్మతులకు రూ.15 కోట్లు ఇస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. అధికారుల నిర్లక్ష్యం, అంచనాల్లో పొరపాట్ల వల్ల నిధుల విడుదలలో జాప్యం ఏర్పడింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించిన నిధులు మంజూరై సమగ్ర మరమ్మతులు చేయిస్తేనే మంచిదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జనార్దన్‌పై నిఘా

(7వ పేజీ తరువాయి)

అధికారులు గుర్తించారు. ఆయన ఇక్కడికి రావడానికి ఏర్పాట్లు చేసుకుంటున్నాడు. ఎవరెవరితో సంప్రదింపులు చేస్తున్నాడు, ఏయే సమయాల్లో చేస్తున్నాడు.. అనే వివరాలను అబ్కారీ శాఖ పరిశీలిస్తోంది. త్వరలోనే విజయవాడ వచ్చి నకిలీ మద్యానికి సంబంధించిన అన్ని వివరాలను వెల్లడిస్తానని మీడియాను ఉటంకిస్తూ జనార్దనరావు సెల్ఫీ వీడియో ద్వారా సందేశాన్ని పంపిన విషయం తెలిసిందే. జనార్దనరావు ఎప్పుడు వస్తాడా.. అని ఎక్సైజ్ అధికారులు ఎదురుచూస్తున్నారు. నకిలీ మద్యం తయారీకి సంబంధించి మొత్తం 2 కేసులు నమోదయ్యాయి. ఒక కేసు అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నమోదు కాగా, మరొకటి భవానీపురం ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. దక్షిణాఫ్రికాలో ఉన్న జనార్దనరావు ఇండియాకు రావడానికి టికెట్ బుక్ చేసుకున్నాడని అధికార వర్గాలు గుర్తించాయి. ఆయన దేశంలో ఏ విమానాశ్రయంలో అడుగుపెట్టినా వెంటనే సంకెళ్లు వేయడానికి ఎక్సైజ్ వర్గాలు సిద్ధంగా ఉన్నాయి. జనార్దనరావును అదుపులోకి తీసుకుంటే మరిన్ని విషయాలు వెలుగులోకి వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

నేడు కాకినాడకు నమూనాలు

ఇబ్రహీంపట్నంలోని నకిలీ మద్యం తయారీ యూనిట్, గోదాములో స్వాధీనం చేసుకున్న సరుకు నమూనాలు కాకినాడలోని ప్రయోగశాలకు శుక్రవారం వెళ్లనున్నాయి. మొత్తం 137 మద్యం సీసాల నుంచి నమూనాలు సేకరించారు. స్పిరిట్, చక్కెర, ఇతర రసాయనాలకు సంబంధించిన నమూనాలను అధికారులు సేకరించిన విషయం తెలిసిందే. వాటిని ప్రయోగశాలకు పంపడానికి వారం గడువు ఉంది. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసినందుకు ఆ నమూనాలను కాకినాడలో ఉన్న ఎక్సైజ్ శాఖ ప్రాంతీయ ప్రయోగశాలకు పంపాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతానికి నకిలీ మద్యంతో ఇబ్రహీంపట్నంలోని ఏఎన్నార్ బార్, విద్యాధరపురంలోని శ్రీనివాస వైన్స్‌లో వ్యాపారం చేశారు. ఈ రెండింటి విషయంలోనూ అధికారుల వద్ద స్పష్టమైన ఆధారాలున్నాయి. అద్దేపల్లి జనార్దనరావును కేసులో ప్రధాన నిందితుడిగా పేర్కొన్నట్టు అధికారులు న్యాయస్థానానికి తెలియజే

తిరుమల టికెట్ల పేరుతో మోసం

రూ.12లక్షలు కొట్టేసిన వ్యక్తి అరెస్టు

ఉయ్యూరు: ఓ వ్యక్తిని మోసగించి రూ.12 లక్షలు తీసుకున్న కేసులో నిందితుడిని గురువారం అరెస్టుచేసి కోర్టుకు హాజరుపరచినట్టు ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు తెలిపారు. ఉయ్యూరులో ట్యాక్స్ కన్సల్‌టెంట్‌గా పనిచేస్తున్న ఓ వ్యక్తి కొత్త ఇల్లు నిర్మించుకుంటున్న క్రమంలో కిటికీలు, తలుపులు, ఇత గృహనిర్మాణ వస్తువులు సరఫరా చేస్తామని విజయదుర్గ యూపీవీసీ విండోస్ అండ్ డోర్స్ పేరుతో షాపు నడుపుతున్న గుడివాడ దామోదర్‌రావు అతడి కుమారుడు గుడివాడ యువకల్యాణ్ పరిచయం పెంచుకున్నారు. బాధితుడు కుటుంబసభ్యులతో తిరుమల వెంకన్న దర్శనానికి వెళుతున్నారని తెలుసుకున్న నిందితుడు ప్రత్యేక దర్శనం, వసతి ఏర్పాటు చేస్తామని నమ్మబలికి బాధితుల నుంచి సుమారు రూ.12 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని కన్పించకుండా పోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు గుడివాడ దామోదర్‌రావును గురువారం పోలీసులు అరెస్టుచేసి కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14 రోజుల రిమాండ్ విధించారు. మరో నిందితుడిని త్వరలో అరెస్టు చేస్తామని, మోసగాళ్లతో జాగ్రత్తగా ఉండాలని సీఐ తెలిపారు.

రేపు దుర్గగుడి ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

ఇంద్రకీలాద్రి: రాష్ట్రంలో రెండో అతి పెద్ద దేవాలయమైన దుర్గగుడికి రాష్ట్ర ప్రభుత్వం నియమించిన ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారం ఈనెల 11న జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం దుర్గగుడి ట్రస్ట్ బోర్డుకు 17 మంది సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులుగా వెలగపూడి శంకర్‌బాబు, మార్తి రామబ్రహ్మం, ఎక్స్‌అఫిషియో సభ్యుడిగా దుర్గగుడి ప్రధాన అర్చకుడు లింగంబొట్ల దుర్గాప్రసాద్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా బొర్రా రాధాకృష్ణ (గాంధీ) ని యమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. ప్రమాణ స్వీకారానికి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ప్రముఖులు హాజరు కానున్నారు. మహామండపం 7వ అంతస్తు సాంస్కృతిక ప్రదర్శనల వేదిక వద్ద జరగనుంది.

23న జిల్లా యువజనోత్సవాలు

భారతీనగర్: యువతలో కళానైపుణ్యం, జాతీయభావం పెంపొందించడంలో భాగంగా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో అక్టోబరు 23న జిల్లాస్థాయి యువజనోత్సవాలు నిర్వహించనున్నట్టు జిల్లా యువజన సంక్షేమాధికారి యూ శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ కొత్తపేట కేబీఎన్ కళాశాలలో యువజనోత్సవాలు నిర్వహిస్తామని 2025, సెప్టెంబరు 1 నాటికి 15-29 మధ్య వయస్సు కలిగి, జిల్లా స్థానికత ఉన్న యువత పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. వికసిత్ భారత్ జిల్లా స్థాయి కల్చరల్ అండ్ ఇన్నోవేషన్ ట్రాక్ విభాగంలో ఫోక్ డ్యాన్స్, స్టోరీ రైటింగ్, పెయింటింగ్, పొయెట్రీ, డిక్లమేషన్, ఇన్నోవేషన్ అంశాల్లో పోటీలు నిర్వహిస్తామన్నారు. ఆసక్తి గల యువత ఆన్‌లైన్‌లో ఈ నెల 22లోపు పేర్లు నమోదుచేసుకోవాలని, లేదా వేదిక వద్ద 23న ఉదయం పేర్లను నమోదు చేసుకోవచ్చునన్నారు. జిల్లాస్థాయి విజేతలు రాష్ట్రస్థాయికి, రాష్ట్రస్థాయి విజేతలు జాతీయపోటీలకు అర్హత సాధిస్తారన్నారు. వివరాలకు 9949522694, 9032115987 నెంబర్లను సంప్రదించాలని యూ శ్రీనివాసరావు తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరి అరెస్టు

రైల్వేస్టేషన్: స్థానిక ప్రధాన రైల్వేస్టేషన్‌లో గురువారం మధ్యాహ్నం 1.45 గంటలకు బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళుతున్న ఎక్స్‌ప్రెస్ జనరల్ కోచ్‌లో తమిళనాడులోని తిరుప్పూర్ జిల్లాకు చెందిన పాండ్యరాజ్ (21) విష్ణుముత్తుకుమార్ (21)ను రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. వీరిద్దరూ బరంపూర్ కొత్తబస్టాండ్ ఏరియాలో కేజీకి రూ.10వేలు చెల్లించి 2 కేజీల చొప్పున గంజాయి కొనుగోలు చేశారు. అక్కడ బిలాస్‌పూర్ నుంచి తిరుపతి వెళ్లే ఎక్స్‌ప్రెస్‌లో ఎక్కి ప్రయాణించారు. గురువారం మధ్యాహ్నం 4వ ప్లాట్‌ఫారంలో దిగారు. అక్కడ తమ వద్ద ఉన్న గంజాయి అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు పట్టుకుని రూ.20 వేలు ఖరీదైన 4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

25 మందితో సీబీఐసీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన కార్యవర్గం

గుంటూరు: ఆలిండియా పెన్షనర్స్ అసోసియేషన్ అఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్స్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ, ఆంధ్రప్రదేశ్ యూనిట్ 25మందితో రాష్ట్ర నూతన కార్యవర్గం ఏర్పడింది. గుంటూరు రింగ్ రోడ్‌లోని కస్టమ్స్, జీఎస్టీ అప్పీల్స్ కార్యాలయంలో గురువారం పెన్షనర్ల సంఘం రాష్ట్రస్థాయి ఎన్నిక, సర్వసభ్య సమావేశం నిర్వహించారు. రాష్ట్ర అధ్యక్ష పదవికి గుంటూరుకు చెందిన టి.వివేకానందను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకోగా, ప్రధాన కార్యదర్శిగా విజయవాడకు చెందిన గద్దె తిలక్ ఎన్నికయ్యారు.ఎన్నికల అధికారులుగా జీఎస్టీ సూపరింటెండెంట్లు కేపీ సాగర్, ఎం గిరిబాబు వ్యవహరించారు. నూతన కార్యవర్గం రెండేళ్లు పనిచేస్తుంది. సెంట్రల్ జీఎస్టీ కమిషనర్ సుజిత్ మల్లిక్, విశ్రాంత చీఫ్ కమిషనర్ బీ హరేరామ్, నూతన కార్యవర్గాన్ని అభినందించారు.

జెన్ కథ


స్వశక్తితోనే సాధ్యం

దాదాపు పన్నెండు వందల ఏళ్ళ క్రితం చైనాలో ఒక జెన్ గురువు ఉండేవాడు. ఆయన పేరు జోషు జుషిన్. ఆయన ఉపన్యాసాల ద్వారా ఎవరికీ, ఏదీ బోధించేవాడు కాదు. జోషు శిష్యులు ఆయనతోపాటే ఉంటూ... ఆయనను నిరంతరం గమనిస్తూ, నిశితంగా పరిశీలిస్తూ నేర్చుకోవాల్సిందే. ప్రశ్నలు వేసి, జవాబులు రాబట్టి, ఉపన్యాసాలు ఏర్పాటు చేసి ఆయన బోధను తెలుసుకొనే వీలు ఉండేది కాదు. ఎవరైనా జోషును ప్రశ్నించినా... ఆయన సూటిగా, అర్థమయ్యేలా సమాధానం చెప్పేవాడు కాదు.

ఒకసారి ఒక సన్యాసి జోషును "కుక్కలో కూడా బుద్ధత్వం ఉంటుందా?" అని అడిగాడు.

జోషు వెంటనే "మూ-మూ" అన్నాడు. అంతేకాని, ఉంటుందని దాన్నే 'శూన్యం' అంటుంది. కుక్కలో 'బ్రహ్మం ఉంటుంది' అన్నా, 'శూన్యం ఉంటుంది' అని అన్నా అర్థం ఒకటే. 'మూ-మూ' అనడంలో జోషు భావం అదే కావచ్చు. ఆయన బోధించే పద్ధతి అలా ఉండేది.

ఒకసారి జోషు నడుస్తూ నడుస్తూ, మంచులో జారిపడ్డాడు. "సహాయం చేయండి, లేపండి" అని గట్టిగా అరిచాడు. ఆ సమీపంలో వెళ్తున్న ఆయన ప్రియశిష్యుడు ఒకడు పరుగుపరుగున వచ్చాడు. "లేపండి, లేపండి" అంటూ తన చేతులు పైకెత్తి అరుస్తున్న జోషు దగ్గరకు చేరుకున్నాడు. ఆయన పక్కనే తాను కూడా పడుకున్నాడు. వెంటనే జోషు నవ్వుతూ పైకి లేచి "శభాష్! నా బోధను బాగా గ్రహించావు. నీవు చాలా తెలివైన శిష్యుడివి. నిన్ను చూసి




కానీ, ఉండదని కానీ నేరుగా చెప్పలేదు. చైనా భాషలో 'మూ' అన్నా, 'వూ' అన్నా 'శూన్యం', 'ఖాళీ' అనే అర్థం ఉంది. శూన్యవాదాన్ని బోధించే బౌద్ధం ప్రకారం... కుక్కలో కూడా బుద్ధత్వం ఉంటుందని అనుకోవాల్సి వస్తుంది. శునకంలోను, దాని మాంసం తినేవాడిలోనూ జ్ఞానులు ఒకే తత్త్వాన్ని చూస్తారని భగవద్గీత చెబుతోంది. హిందూ ధర్మం 'పూర్ణం', 'బ్రహ్మం' అని దేనినైతే అంటుందో, బౌద్ధ మతం సంతోషిస్తున్నా" అన్నాడు.

ఎవరైనా పడిపోతే... వారు తమ స్వశక్తితోనే లేచి నిలబడాలి. ఎవరు పతనమయ్యారో వారే స్వయం శక్తితో తమనుతాము ఉద్ధరించుకోవాలి. అంతేతప్ప ఇతరుల మీద ఆధారపడకూడదు. 'ఉద్ధరేదాత్మనాత్మానాం... ఆత్మను ఆత్మే ఉద్ధరించుకోవాలి' అంటూ భగవద్గీతలో కృష్ణపరమాత్మ ఇదే చెప్పాడు.

• రాచమడుగు శ్రీనివాసులు

ఆధ్యాత్మికతకు మతం అవసరం లేదు!



మన భారతీయ ఆధ్యాత్మిక మూల తత్త్వం ఏమిటి?

మోక్షం. ప్రపంచంలో మరే ఏ సంస్కృతిలోను ఇది లేదు. చాలా మంది మోక్షం అంటే మనిషి చనిపోయిన తర్వాత వచ్చేది అనుకుంటారు. కానీ మనం ఈ ప్రపంచంలో ఉన్నప్పుడు వచ్చే స్వేచ్ఛే మోక్షం. ఒక వ్యక్తి పూర్తిగా అంతర్ముఖుడైనప్పుడే ఈ స్థితి వస్తుంది. ఈ స్థితిలో మన చుట్టూ ఉన్న పరిస్థితులు మనపై ప్రభావం చూపించటం మానేస్తాయి. ఇలాంటి వ్యక్తులు ఒకప్పుడు మన భారత దేశంలో ఉండేవారు. ఇప్పటికీ ఉన్నారు.

సనాతన ధర్మాన్ని మీరు ఎలా నిర్వచిస్తారు?

ధర్మం, అర్థం, కామం, మోక్షం అనే భావనలు అన్ని సంస్కృతులలోనూ ఉన్నాయి. కానీ సనాతన ధర్మంలోని నిష్పాక్షికత ఉంటుంది. జాగ్రత్తగా గమనిస్తే- ప్రకృతి, సూర్యుడు, గాలి, నీరు- ఇవన్నీ నిష్పాక్షికమైనవి. మనలోని ఆత్మ కూడా నిష్పాక్షికమైనదే! దానికి ఎటువంటి రాగద్వేషాలు ఉండవు. ఈ రెండింటినీ అర్థం చేసుకున్నప్పుడు సనాతన ధర్మం అర్థమవుతుంది. భారతీయ సంస్కృతిలో నదులను, పర్వతాలను, ప్రకృతిని ఆరాధిస్తారు, పూజిస్తారు, గౌరవిస్తారు. రక్షించటానికి ప్రయత్నిస్తారు. ఇతర దేశాల్లో ఇలాంటి విధానం ఉండదు. ఇదే విధంగా ప్రతి వ్యక్తికి కొన్ని ధర్మాలు నిర్దేశించారు. పితృ ధర్మం, పుత్ర, పుత్రి ధర్మం ఈ కోవలోకే వస్తాయి. వీటిని ఆచరిస్తే ప్రతి వ్యక్తి తన చుట్టుపక్కల ఉన్న వారిని గౌరవించగలుగతాడు. ఇలా మనకు అంతర్ముఖంగా... బహిర్ముఖంగా ఉన్న వాటన్నింటినీ గౌరవించటమే సనాతన ధర్మం.

> **జీవితంలో ఓటములు ఉండవు. కేవలం అనుభవాలే ఉంటాయి. కొన్నిసార్లు ఓటములు అనుకున్నవే మంచి అనుభవాలను నేర్పుతాయి.**

మనుషుల అవసరాల కోసం ఈ ధర్మం మారుతోందా? ఉదాహరణకు మన అవసరాల కోసం భూమిని, కొండలను, నదులను ఎక్కువగా వాడుకుంటున్నాం కదా...

అవగాహనారాహిత్యం వల్ల ఇలా జరుగుతోంది. ప్రస్తుతం మనం టెక్నాలజీ యుగంలో ఉన్నాం. మన స్వలాభం కోసం, అవసరాల కోసం ప్రకృతిని వాడుకుంటున్నాం. అదే సమయంలో ప్రకృతికి దూరంగా జరుగుతున్నాం. ధర్మం ఎప్పటికీ మారదు. మనిషిలో- ' ఈ ప్రకృతి నాది' అనే భావన పెరిగినప్పుడు ఈ సమస్యలు పెరుగుతాయి. ఒక మనిషి ఈ భూమి మీద 30 వేల రోజులు ఉంటాడనుకుందాం. ఆ తర్వాత ఏదీ అతనిది కాదు కదా! 'నాది', 'నాకోసం', 'నా పిల్లల కోసం' అనే అజ్ఞానం వల్ల సమస్యలు తెచ్చిపెట్టుకుంటున్నాం. పిల్లలలో పోటీతత్వాన్ని, పోల్చుకోవడాన్ని పెంచుతున్నాం. 'ఆనందం నాలోనే ఉంది'- అనే ఆలోచన ప్రతి వ్యక్తికి ఉంటుంది. దానినుంచి దూరం జరిగినప్పుడు ఈ సమస్యలు వస్తాయి. ప్రతి వ్యక్తి ఒక ద్వీపంలా మారుతున్నాడు. ఇతరులకు దగ్గరగా ఉండాలనుకోవటం లేదు. టెక్నాలజీ మనల్ని స్వతంత్రులుగా చేయటం లేదు. బానిసలుగా మారుస్తోంది.

సైన్స్, ఆధ్యాత్మికతల మధ్య ఉన్న మౌలికమైన తేడాలు ఏమిటి?

ఆధ్యాత్మికత ఇతరులకు చెప్పలేని అందమైన అనుభవం. అది మన స్వభావంలో వచ్చిన మార్పుల ద్వారా బయటకు కనిపిస్తుంది. మేధ ద్వారా దానిని అర్థం చేసుకోలేం. జీవితం అంటే ఎనర్జీ అండ్ మేటర్ (శక్తి, పదార్థం)ల కలయిక. చావు అంటే ఎనర్జీ మైనస్ మేటర్. ఇక్కడ శక్తి అనేది స్థిరమైన అంశం. ఇది మనలోనే ఉంటుంది. దీన్ని అర్థం చేసుకోవటమే ఆత్మశోధన. మనలో ఉన్న శక్తితో పాటుగా బయట ఉన్న శక్తిని అనుభవించటమే దైవత్వం. ఇది అనుభవిస్తే కానీ తెలియని విషయం. ఇక సైన్స్- బయట ప్రపంచాన్ని అన్వేషించే ఒక సాధనం. ఇది మేధోపరమైనది. అనుభవించలేనిది. అందుకే ఈ రెండూ వేర్వేరు.

మతం, ఆధ్యాత్మికత- ఈ రెండింటి మధ్య విభజన రేఖను ఎలా గుర్తించాలి?

మతం ఒక విధానం. ఒక వ్యవస్థ. మనుషులను క్రమశిక్షణలో పెట్టే ఒక ప్రక్రియ. ఆధ్యాత్మికత వ్యక్తి ప్రధానం. దీనికి ఎటువంటి మతం అవసరం లేదు. మనిషి ఒంటరిగా పుడతాడు. ఒంటరిగా చనిపోతాడు. ఈ మధ్యలో జరిగే విషయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇస్తే ఆధ్యాత్మికతకు దూరంగా వెళ్లిపోతాం. ప్రపంచం నుంచి ఎంత ఎక్కువ కావాలనుకుంటే- అంత శక్తిహీనులం అవుతాం. ఒకసారి ప్రముఖ సూఫీ కవి రూమి తన గురువు దగ్గరకు వెళ్లి - "నాకు ఆధ్యాత్మికత మార్గాన్ని బోధించండి" అని అడిగాడట. అప్పుడు ఆ గురువు- "నీ పుస్తకాలన్నీ సముద్రంలో పడేసి నా దగ్గరికి రా!" అన్నాడట. ఇక మతాలన్నీ రాజకీయ ప్రేరేపితమైనవే! ఒక సమాజంలోని వ్యవస్థలు సమర్థంగా పనిచేయాలంటే మనుషులు కావాలి. వారిని ఒక క్రమశిక్షణలో పెట్టేదే మతం. దీనిలో దేవుడి పాత్ర తక్కువ. దేవుడి కోసం బయట వెతికితే బొమ్మలు, శిల్పాలు మాత్రమే కనిపిస్తాయి. మన లోపల అన్వేషిస్తే నిజమైన శక్తి అనుభవంలోకి వస్తుంది.

> **రాజయోగను చెప్పటం కష్టం. జ్ఞాన మార్గం, భక్తి మార్గం, కర్మ మార్గం- వాటి నిర్వచనాలను చెప్పగలం. రాజయోగం అంటే మన లోపల ఉన్న శక్తితో మనం అనుసంధానం కావటం. ఇది అనుభవిస్తేనే అర్థమవుతుంది.**

నిజమైన గురువు ఎవరు..

మనం ఎవరితో మమేకం కాగలుగుతామో అతనే నిజమైన గురువు. ఆయన మనకు ఒక మాధ్యమం. ఒక పిల్లవాడిని వాళ్ల నాన్న - "వెళ్లి అగ్గి తీసుకురా" అన్నాడట. ఆ పిల్లవాడు వెళ్లి దీపం తీసుకొచ్చాడు. వాళ్ల నాన్న "ఇది దీపం కదా..." అన్నాడట. అప్పుడు ఆ పిల్లవాడు వెలుగుతున్న కర్పూరాన్ని తీసుకువచ్చాడట. "ఇది కర్పూరం కదా" అన్నాడట. అగ్నిని ఒక మాధ్యమం లేకుండా ఎలా అనుభవించలేమో... దైవత్వాన్ని కూడా మాధ్యమం లేకుండా అనుభవించలేం. ఆ మాధ్యమమే గురువు. చాలామంది- 'నిజమైన గురువు' ఎవరు అని అడుగుతూ ఉంటారు. మనం మమేకం కాగలిగే వ్యక్తే నిజమైన గురువు. అది మన మనసుకు తెలుస్తుంది. చాలామంది రకరకాల మార్గాలు అన్వేషిస్తూ ఉంటారు. ఒక తలుపును తడితే అన్వేషి అవుతాడు. అనేక తలుపులు తడితే బిచ్చగాడు అవుతాడు. అన్వేషి తృప్తిగా జీవితాన్ని జీవించగలుగుతాడు. బిచ్చగాడికి ఇతరులు విదిల్చిన మెతుకులే దక్కుతాయి.


• సీవీఎల్ఎన్ ప్రసాద్

దైవమార్గం

విశ్వాసానికి పరీక్ష

యోబు... దేవుడైన యెహోవాకు అచంచలమైన భక్తుడు. దేవుని ఆదేశాలపట్ల ఎంతో విధేయతతో నడుచుకున్నాడు. దానికోసమే కన్నీటి పాలయ్యాడు. 'మానవుడి జీవితం కష్టాల కడలి. దైవాన్ని నమ్ముకున్నవారికి మరిన్ని కష్టాలు పరీక్షలు ఎదురవుతాయి. చివరకు దైవ విశ్వాసులదే విజయం' అని యోబు కథ స్పష్టం చేస్తుంది.

కనానుకు సమీపంలోని ఊజు దేశంలో యోబు హాయిగా బతికేవాడు. అతని పచ్చటి జీవితం మీద యెహోవా శత్రువైన సాతాను కళ్ళు పడ్డాయి. "నువ్వు యోబుకు అన్నీ ఇచ్చావు. సుఖవంతంగా ఉండేలా ఆశీర్వదించావు. కాబట్టే అతను నీ పట్ల విశ్వాసంతో ఉన్నాడు. కానీ వాటన్నిటినీ తీసేస్తే... అతను అంతే విధేయతతో ఉంటాడా? నిన్ను దూషించకుండా ఉంటాడా?" అని దేవుణ్ణి సాతాను సవాలు చేశాడు.



యోబు అంటే యెహోవాకు గొప్ప నమ్మకం. అందుకే "నీవు వెళ్ళు. యోబుకు ఆ సిరిసంపదలేవీ లేకుండా చెయ్యి. నీవు చేయాలనుకున్నంత కీడు చెయ్యి. అతను నన్ను దూషిస్తాడేమో చూద్దాం. కానీ ఒక్క షరతు... ఎట్టి పరిస్థితుల్లోనూ నా భక్తుణ్ణి చంపకూడదు" అన్నాడు. ఆ షరతుకు సాతాను ఒప్పుకున్నాడు. వెంటనే యోబు మీద వీర విజృంభణ చేశాడు. మొదటగా... యోబుకు చెందిన పశువులు, ఒంటెలు దొంగతనానికి గురయ్యేటట్టు చేశాడు. గొర్రెలు మరణించేలా చేశాడు. ఆ తరువాత తుపాను బీభత్సంలో అతని పది మంది కుమారుల్ని, కుమార్తెల్ని చంపేశాడు. అనంతరం ఒక భయంకరమైన వ్యాధితో యోబును బాధించాడు, వేధించాడు. ఇలా ఎన్నో వేదనలను యోబు అనుభవించాడు. అప్పుడు యోబు భార్య "దేవుణ్ణి దూషించి చచ్చిపో" అని అతనితో అంది. కానీ యోబు అలా చెయ్యలేదు. దైవం పట్ల తన గట్టి నమ్మకాన్ని ఏ పరిస్థితులలోనూ కోల్పోలేదు. యోబు భక్తికి దేవుడు ముగ్ధుడయ్యాడు. భక్తుడి విజయమే తన విజయంగా భావించాడు. అతనికి సోకిన వ్యాధిని బాగు చేశాడు. మళ్ళీ పదిమంది పిల్లలు కలిగేలా ఆశీర్వదించాడు. అతని పశువులను, గొర్రెలను, ఒంటెలను మునుపటికన్నా రెట్టింపు చేశాడు.

దేవునిపై నమ్మకం, ఆత్మవిశ్వాసం ఉంటే సాధించలేనిది ఏదీ లేదు. మనకు సాతానులాంటి పరిస్థితులు ఎదురవుతాయి. అయినా విశ్వాసం వదలకూడదు. పట్టువదలకుండా పోరాడాలి. అటువంటివారికి దైవానుగ్రహం ఎల్లప్పుడూ ఉంటుంది.

• డాక్టర్ యం. సోహినీ బెర్నార్డ్, 9866755024

కొన్ని వేల ఏళ్ల క్రితం హిందూ మతం భారతదేశం నుంచి ప్రస్తుత దక్షిణాసియాలోని పలు ప్రాంతాలకు విస్తరించిందనటానికి అనేక ఆధారాలున్నాయి. థాయ్‌లాండ్‌లోని ఫాంగ్ నాగా అడవుల్లో ఉన్న విష్ణుమూర్తి విగ్రహం దీనికి ఒక పెద్ద ఉదాహరణ. ఈ విగ్రహం ఆ అడవులలోకి ఎలా వచ్చిందో, దాని వెనుక ఉన్న కథ ఏమిటో ఇప్పటిదాకా ఎవరికి తెలియదు. ఈ విగ్రహం వెంకటేశ్వర స్వామిని పోలి ఉండటం ఒక విశేషం. తెలుగు రాష్ట్రాల ప్రజలు, తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) లాంటి సంస్థలు చొరవ తీసుకొని ఈ విగ్రహాన్ని పరిరక్షించాల్సిన అవసరం ఎంతైన ఉంది.

థాయ్‌లాండ్ అడవుల్లో వెంకటేశ్వరుడు!



ఒకప్పుడు శాతవాహనులకు దక్షిణాసియాలోని అనేక దేశాలతో వాణిజ్య సంబంధాలు ఉండేవి. మచిలీపట్నం, చెన్నపట్నం లాంటి రేవుల నుంచి నౌకలు ఇతర దేశాలకు వెళ్తూ ఉండేవి, వస్తూ ఉండేవి. ఈ సమయంలోనే మన దేశంలోని సంస్కృతి, సంప్రదాయాలను, హిందూ మతాన్ని అనేకమంది ఇతర దేశాలలో ప్రచారం చేశారు. ఈ సమయంలోనే దక్షిణ భారత దేశానికి చెందిన కొందరు బ్రాహ్మణులు ప్రస్తుత థాయ్‌లాండ్ ప్రాంతానికి తరలి వెళ్లారు. అక్కడ హిందూ మతాన్ని ప్రచారం చేశారు. దీనికి ప్రత్యక్ష ఉదాహరణ దక్షిణ థాయ్‌లాండ్‌లోని ఫాంగ్ నాగా ప్రాంతంలోని అడవులలో ప్రతిష్ఠించిన విష్ణుమూర్తి విగ్రహం.



బౌద్ధ సన్యాసులు పూజారులు...

ఈ విగ్రహం ఆ ప్రాంతంలో ప్రతిష్ఠించటానికి అనేక కారణాలున్నాయి. ఒకప్పుడు కంబోడియా, బర్మాలకు చెందిన వారు... థాయ్‌లాండ్‌లోని పుణ్యక్షేత్రాల మీద దాడులు చేసేవారు. అక్కడి విగ్రహాలను ఎత్తుకుపోయి తమ వద్ద ప్రతిష్ఠించుకొనేవారు. ఇలాంటి మూకల నుంచి రక్షించటానికి... ఒక చెట్టు తొర్రలో కొన్ని ప్రత్యేకమైన తాంత్రిక ప్రక్రియ ద్వారా ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. ఈ ప్రాంతంలోని స్థలపురాణాల ప్రకారం- కేవలం విష్ణువుపై స్వచ్ఛమైన భక్తి ఉన్నవారు మాత్రమే ఈ విగ్రహాన్ని దర్శించగలుగుతారు. సుమారు 35 సంవత్సరాల క్రితం... బౌద్ధులు ఈ ప్రాంతంలో తమ ఆరామాన్ని నిర్మించుకోవటానికి ప్రయత్నాలు మొదలుపెట్టినప్పుడు చెట్టు తొర్రలో ఈ విగ్రహం దొరికింది. అక్కడ నివసించే ఒక వృద్ధ బౌద్ధ సన్యాసి ఈ విగ్రహం ఎలా దొరికిందో నాకు వివరించారు. "మేము ఆరామం నిర్మించుకోవటానికి అనువైన స్థలం కోసం అడవిలో వెతుకుతున్నాం. ఇంతలో ఒక పిల్లవాడు మా దగ్గరకు వచ్చాడు. ఆ చెట్టు వైపు చూపించాడు. మేమందరం అక్కడికి వెళ్తే మూడు విగ్రహాలు కనిపించాయి. ఒకటి పెద్ద విష్ణువు విగ్రహం. మరొకటి అమ్మవారి విగ్రహం. ఇంకొక విగ్రహం ఏమిటో ఇంకా తెలియదు. ఈ మూడింటిని చూసి బయటకు వచ్చేసరికి ఆ పిల్లవాడు పరిగెత్తుకుంటూ ఒక రాయివైపు వెళ్లాడు. రాయిపై కాలు వేసి అదృశ్యమయ్యాడు. ఇప్పటికీ ఆ రాయి, దానిపై కాలి గుర్తులు మనకు కనిపిస్తాయి. ఆ తర్వాత ఆ పిల్లవాడు నాకు ఎప్పుడూ కనబడలేదు.." అని ఆయన పేర్కొన్నారు. ఈ విగ్రహాలు చూడటానికి చాలా అందంగా ఉన్నాయి కాబట్టి ఆ ప్రాంతంలోనే ఆరామం నిర్మించుకోవాలనుకున్నారు. ఆ చుట్టుపక్కల ఉన్న ప్రాంతాన్ని నివాస యోగ్యంగా మార్చుకున్నారు. ఈ ప్రాంతానికి 'నారాయణ నికరం' అని పేరుపెట్టారు. అప్పటి నుంచి ఈ విగ్రహానికి బౌద్ధ సన్యాసులు తమ వైన పద్ధతుల్లో పూజలు చేస్తూ ఉంటారు.

వెంకటేశ్వరస్వామి విగ్రహమేనా?

తిరుమలలో వెంకటేశ్వర స్వామిని విష్ణుమూర్తి అవతారంగా చాలామంది కొలుస్తారు. వెంకటేశ్వరస్వామికి సంబంధించిన ప్రస్తావన మనకు వరాహ పురాణం, భవిష్య పురాణం, విష్ణు పురాణం, స్కాంద పురాణాలలో కనిపిస్తుంది. స్కాంద పురాణంలో 'వెంకటాచల మహాత్మం' అనే ప్రత్యేక అధ్యాయం కూడా ఉంది. ఇక చోళులు, పల్లవులు... కొన్ని వేల విష్ణు విగ్రహాలను తమదైన ప్రత్యేకమైన రీతిలో చెక్కించారు. అయితే ఈ విగ్రహానికి ఉన్న కిరీటం భిన్నంగా కనిపిస్తుంది. చేతిలో గద కనిపించదు. మిగిలిన రూపమంతా వెంకటేశ్వర స్వామి మాదిరిగానే కనిపిస్తుంది. అయితే ఈ విగ్రహం ఎక్కడ నుంచి వచ్చిందనే విషయం ఇంకా తెలియదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో దీనికి సంబంధించిన శాసనాలు ఏవైనా ఉన్నాయేమో కూడా తెలుసుకోవాలి. మన పూర్వీకులు వైష్ణవ మత ప్రచారంలో భాగంగా అనేక ప్రాంతాల్లో వెంకటేశ్వర స్వామిని పోలిన విగ్రహాలను ప్రతిష్ఠించారు. మధురలో గుప్తుల కాలానికి చెందిన ఒక విగ్రహం, బాదామిలో చాళుక్యుల కాలానికి చెందిన విష్ణువు విగ్రహం... తిరుమలలోని విగ్రహాన్ని పోలి ఉంటాయి. వీటికి కీర్తిమకుటం, శంఖం, చక్రం, కౌస్తుభం ఉంటాయి. థాయ్‌లాండ్‌లోని వాట్ ఫూ, ఫాంథమ్ రంగ్ ప్రాంతాల్లోని దేవాలయాల్లో ఉన్న విగ్రహాలు తిరుమల వెంకటేశ్వరస్వామి మాదిరిగానే కనిపిస్తాయి. చివరగా... 'నారాయణనికరం' లోని విగ్రహాలపై మరింత పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది. ఈ విగ్రహం విష్ణువుదేనని నిర్ధారించుకోవటానికి నాకు సుమారు ఐదేళ్లు పట్టింది. ప్రస్తుతం చుట్టుపక్కల ఉన్న అటవీప్రాంతాల్లో శాసనాల కోసం ప్రయత్నిస్తున్నాను. ఇవి దొరికితే మరికొంత సమాచారం లభించే అవకాశం ఉంది.


• లిదియా లక్ష్మి
ఆధ్యాత్మిక పరిశోధకురాలు, థాయ్‌లాండ్

సందేశం

ఆ గుణం అనర్థం

మనుషుల్లో పలు స్వభావాలు ఉంటాయి. వాటిలో పిసినారితనం ఒకటి. దానం చేయకపోవడం, అవసరమైన చోట ఖర్చు చేయకపోవడం, అల్లాహ్ మనకు ఇచ్చిన సంపదను ఇతరులతో పంచుకోకపోవడం... ఇవి దాని లక్షణాలు. పిసినారితనం అంటే కేవలం డబ్బు దాచుకోవడమే కాదు, ఇతరులకు సాయం చేయాలనే మనసు లేకపోవడం కూడా. పిసినారి వ్యక్తి దగ్గర చాలా సంపద ఉన్నా... అది సమాజానికి ఏమాత్రం ఉపయోగపడదు. నిజానికి పిసినారివ్యక్తి తనకు తానే శాపంగా మిగులుతాడు. 'దానం చేస్తే నా దగ్గర ఉన్నది తక్కువైపోతుందేమో' అనే భయం, ఆందోళన, అలజడి, అనుమానం, అసంతృప్తి, అశాంతి అతనిలో పెరుగుతాయి.

అల్లాహ్ తన అనుగ్రహాన్ని విరివిగా ప్రసాదించినప్పటికీ... పిసినారితనాన్ని చూపితే... ఆ స్వభావం వారికి ఎంతో హానికరం అవుతుందనీ, వారు లోభంతో కూడబెట్టినదే ప్రళయం నాడు వారికి ఉరితాడవుతుందనీ దివ్య ఖుర్ఆన్ హెచ్చరించింది. "పిసినారితనంతో ప్రవర్తిస్తూ, ఇతరులకు కూడా ఆ వైఖరిని నేర్పేవారిని, అల్లాహ్ అనుగ్రహించి ఇచ్చిన దాన్ని దాచిపెట్టేవారిని అల్లాహ్ ప్రేమించడు. అటువంటివారికి భయంకరమైన శిక్షలు ఉంటాయి. కేవలం ప్రజలకు ప్రదర్శించడానికి మాత్రమే సంపదను ఖర్చుపెట్టేవారిని, అల్లాహ్‌ను, అంతిమదినాన్ని హృదయపూర్వకంగా విశ్వసించనివారిని అల్లాహ్ ఇష్టపడు. పిసినారితనం వహించి, దేవునిపట్ల నిర్లక్ష్య వైఖరిని అవలంబించేవారిని కఠినమైన మార్గాల్లోకి వెళ్తారు. అప్పుడు ధనం వారికి ఏమాత్రం ఉయోగపడదు" అని దివ్య ఖుర్ఆన్ స్పష్టం చేసింది.



"ఉదారుడు... అల్లాహ్‌కు, మనుషులకు, స్వర్గానికి దగ్గరగా ఉంటాడు. పిసినారి నరకానికి దగ్గరవుతాడు. పిసినారితనానికి, చెడ్డ నడవడికకు విశ్వాసంతో ఏమాత్రం పొంతన కుదరదు. అతిలోభం (పిసినారితనం), అహంకారం, లౌకికమైన వాటి మీద ఎక్కువగా ఆశలు పెట్టుకోవడం అనే మూడు దుష్ప్రవర్తనల నుంచి దూరంగా ఉండాలి. అలాగే పిసినారికి దూరంగా ఉండాలి. ఎందుకంటే అతనికి సమృద్ధిగా సంపద ఉన్నా... అతని నుంచి మీరు ఏదీ పొందలేరు. మీరు అతనికి వారసులైతే... ఆ సంపదను కాపాడుకోవడానికి అతను చేసిన పనుల వల్ల కలిగే పాపంలో భాగం మీకూ సంక్రమిస్తుంది" అని అంతిమ దైవప్రవక్త మహమ్మద్ వివిధ సందర్భాల్లో చెప్పారు. పిసినారితనం ఈ లోకంలో అపఖ్యాతికి, పరలోకంలో శిక్షకు దారి తీస్తుంది. సదఖా, ఫిత్రా, జకాత్ తదితర దానాలు మనిషి హృదయాన్ని శుభ్రపరుస్తాయి. సమాజానికి వెలుగును ఇస్తాయి. అల్లాహ్ పేరిట చేసిన దానం ఎన్నటికీ వృథా కాదు.

• మహమ్మద్ వహీదుద్దీన్

తెలుసుకుందాం

ఆ ఇద్దరూ వేరువేరు



ఆలయాలకు, ఇళ్ళకు వాస్తులో తేడా ఉంటుంది. రెండూ వాస్తు శాస్త్ర పరిధిలోవే అయినప్పటికీ... వాటికి ఎక్కువగా పొంతన ఉండదు. పరమాత్మతో జీవాత్మ మమేకం అయ్యే ప్రదేశానికి 'ఆలయం' అని పేరు. సమస్త సృష్టికి కారణభూతుడైన పరమాత్మ అనుగ్రహాన్ని పొందడానికి... శాస్త్రానుసారంగా నిర్మించే భగవత్ గృహాన్ని 'దేవాలయం' లేదా 'ఆలయం' అంటారు. ఆలయాల నిర్మాణానికి ఆగమ, శిల్ప శాస్త్రాలు అనేక విధి విధానాలను సూచించాయి. ఆలయాల నిర్మాణానికి ఉపయోగించే కొలతలను పూర్వ ఋషులు అందించిన ప్రత్యేకమైన ప్రాచీన గణితం ద్వారా 'దేవాంగుళాల'లో నిర్ణయిస్తారు. షడయాది, షోడశ ఆయాది, ద్వాత్రింశత్ ఆయాది అనే మూడు విధానాల ద్వారా గర్భాలయం కొలతలను లెక్కిస్తారు. అలా లెక్కించిన సంఖ్యతాలూకు నక్షత్రానికి... అంటే సంఖ్యా నక్షత్రానికి... ఆలయం నిర్మించిన గ్రామ నక్షత్రంతో, ఆ నిర్మాణాన్ని సంకల్పించిన యజమాని నక్షత్రాలతో పొంతనలు చూస్తారు. పొంతన కుదిరిన తరువాత... దేవాంగుళాల సంఖ్యను ప్రస్తుతం వాడుకలో ఉన్న ఆంగ్లేయ పద్ధతిలోని అంగుళాలలోకి మార్చుతారు. ఆ కొలతను గర్భాలయం చుట్టుకొలతగా స్థిరపరిచి, మిగిలిన భాగాలను దానికి అనుగుణంగా నిర్ణయిస్తారు. సకల జనులకు శుభ ఫలితాలను ఇచ్చే దేవాలయ వాస్తు కొలతలన్నిటినీ 'బాహ్య సూత్ర విస్తారం'గా... అంటే నిర్మాణం తాలూకు బయటి కొలతలుగా స్వీకరిస్తారు.

గృహ వాస్తు

భగవత్ సృష్టిలో భాగమైన మానవులు తమ కర్మలను సక్రమంగా నిర్వహించడం కోసం... ఋషులు ప్రవచించిన శాస్త్రాల ప్రకారం గృహాన్ని నిర్మించాలి. వీటికి సంబంధించిన విధులను, నియమాలను తెలిపేదాన్ని 'గృహవాస్తు' అంటారు. దేవాలయంలో జరిగే అర్చన లోక కళ్యాణం కోసం కాబట్టి... 'పరార్థ అర్చన' అనీ, గృహస్థు తన ఇంట్లో చేసుకొనే అర్చన కుటుంబం కోసం కాబట్టి దాన్ని 'స్వార్థ అర్చన' అనీ పిలుస్తారు. గృహం అనేది కేవలం ఆ కుటుంబానికి మాత్రమే చెందినది కాబట్టి... ఆ యజమాని నామ నక్షత్రంలోనే ఆయాది గణితాన్ని లెక్కిస్తారు. నిర్ణయించిన ఆ సంఖ్యను చదరపు గజాలుగా పరిగణించి, గృహ వైశాల్యాన్ని నిర్ణయించడం అనేది ఈ కాలంలో ఆచరణలో ఉంది.

స్థపతి... వాస్తు సిద్ధాంతి

ఆలయ వాస్తుకు సంబంధించిన విషయ పరిజ్ఞానం కలిగిన వ్యక్తిని 'స్థపతి' అంటారు. 'స్థపతీనాం సర్వ శాస్త్ర విశారదః' అనే ఆర్యోక్తి ఉంది. కేవలం దేవాలయ వాస్తు గురించి మాత్రమే కాదు... వేద వేదాంగాలు, ఉపనిషత్తులు, పురాణాలు, ఇతిహాసాలు, వివిధ సంప్రదాయాలు లాంటి అన్నిటి మీదా స్థపతికి స్పష్టమైన అవగాహన ఉండాలి. ఆలయ నిర్మాణానికి సంబంధించిన అన్ని విషయాలనూ అతని ప్రతిపాదన, సలహాల మీదనే ఆచరించాల్సి ఉంటుంది. గృహవాస్తుకు సంబంధించిన విషయ పరిజ్ఞానం ఉన్న వ్యక్తిని 'వాస్తు సిద్ధాంతి' అంటారు. దేవాలయాలు కాకుండా... మానవ సంబంధితమైన ఇతర నిర్మాణాలన్నిటికీ అతను మార్గ నిర్దేశం చేస్తారు. దేవాలయాల నిర్మాణానికి, గృహ నిర్మాణానికి మౌలికమైన ఉద్దేశంలోనే వ్యత్యాసం ఉంది కాబట్టి వాస్తు సిద్ధాంతులు వేరు, స్థపతులు వేరు అని గ్రహించాల్సి ఉంటుంది.

• దగ్గుపాటి నాగవరప్రసాద్ స్థపతి
9440525788

స్పోర్ట్స్

విజయవాడ ● శుక్రవారం 10 అక్టోబరు 2025

క్లీన్‌స్వీప్ లక్ష్యంగా..

బరిలోకి టీమిండియా ● నేటి నుంచి విండీస్‌తో రెండో టెస్టు



ఉదయం 9.30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్‌లో

గంభీర్

గిల్

తుది జట్లు (అంచనా)

భారత్: జైస్వాల్, రాహుల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), ధ్రువ్ జురెల్, నితీశ్ కుమార్, జడేజా, సుందర్, కుల్దీప్, బుమ్రా, సిరాజ్.

వెస్టిండీస్: టి. చందర్‌పాల్, క్యాంప్‌బెల్, అథనజె, బ్రాండన్ కింగ్, షాయ్ హోప్, చేజ్ (కెప్టెన్), గ్రీవ్స్, వారికన్, పియర్, బ్లేడ్స్, సీల్స్

పిచ్, వాతావరణం: ఇక్కడి వికెట్ తొలి రెండు రోజుల పాటు బ్యాటింగ్‌కు అనుకూలించనుంది. ఆ తర్వాత స్పిన్నర్లకు స్లో టర్న్ లభించే అవకాశం ఉంది. విండీస్ బ్యాటర్లు ఈ పిచ్‌ను సద్వినియోగం చేసుకుంటే కాస్త పోటీనివ్వవచ్చు. వర్షం నుంచి ఎలాంటి ఆటంకం ఉండే అవకాశంలేదు.



న్యూఢిల్లీ: వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టును పూర్తి ఏకపక్షంగా మార్చేసి మూడు రోజుల్లోపే ముగించిన టీమిండియా.. ఇప్పుడు క్లీన్‌స్వీప్‌పై కన్నేసింది. శుక్రవారం నుంచి ఇరు జట్ల మధ్య ఆఖరిదైన రెండో టెస్టు జరుగనుంది. గతమెంతో ఘనమైన కరీబియన్ టీమ్ భారత జట్టుతో ఏ విభాగంలోనూ సరితూగే స్థాయిలో లేదు. దీంతో ఈ టెస్టులోనూ గిల్ సేనకు పెద్దగా పోటీ ఉండకపోవచ్చు. అయితే తమ జట్టుకు పూర్వ వైభవం తెచ్చేందుకు ప్రయత్నిస్తున్న దిగ్గజ ఆటగాళ్లు లారా, రిచర్డ్స్, రిచర్డ్‌సన్ మ్యాచ్‌కు ముందు విండీస్ ఆటగాళ్లతో సంభాషించి వారిలో ఉత్తేజాన్ని నింపనున్నారు. తొలి టెస్టులోని రెండు ఇన్నింగ్స్‌లలో కలిపినా విండీస్ బ్యాటర్లు కనీసం 90 ఓవర్లు ఆడలేకపోయారు. అలాగే ఒక్కరు కూడా హాఫ్ సెంచరీ సాధించలేదు. 2002లో భారత్‌పై చివరి విజయం సాధించిన విండీస్ తాజా టెస్టులో ఏమేరకు పోటీనిస్తుందో వేచి చూడాల్సిందే. ఇక అరుణ్ జైట్లీ మైదానంలో భారత్ 1987లో చివరిసారిగా టెస్టు మ్యాచ్‌లో ఓడింది.

మార్పుల్లేకుండానే..: అన్ని విభాగాల్లో పటిష్టంగా కనిపిస్తున్న టీమిండియా తమ తుది జట్టులో మార్పులు చేసే అవకాశం లేదు. అయితే సాయి సుదర్శన్, నితీశ్ కుమార్ బ్యాటింగ్‌పై ఎక్కువగా దృష్టి సారించే అవకాశం ఉంది. తొలి టెస్టులో కేవలం నాలుగు ఓవర్లు మాత్రమే బౌలింగ్ చేసిన నితీశ్‌కు బ్యాటింగ్ చేసే చాన్స్ రాలేదు. అందుకే ఈ టెస్టులో అతడిని ముందుగా పంపే అవకాశం ఉంది. ఇక తొలి టెస్టులో టాపార్డర్‌తో పాటు మిడిలార్డర్ అద్భుతంగా ఆడినా వన్‌డౌన్‌లో సాయి సుదర్శన్ మాత్రం ఏడు పరుగులకే పరిమితమయ్యాడు. రాహుల్, జురెల్, జడేజా శతకాలతో ఫామ్‌ను చాటుకోగా.. గిల్, జైస్వాల్ కూడా రాణించారు. బౌలింగ్‌లో పేసర్లు బుమ్రా, సిరాజ్ అదుర్స్ అనిపించుకున్నారు. కుల్దీప్, సుందర్ స్పిన్‌లో ప్రభావం చూపుతున్నారు.

నితీశ్‌ను మరింతగా పరీక్షిస్తాం..

నితీశ్ కుమార్‌కు క్రీజులో ఎక్కువ సమయం గడిపేలా చూస్తామని భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తెలిపాడు. 'నితీశ్ బ్యాటింగ్‌పై మేం చర్చించాం. అతడిని కేవలం విదేశాల్లోనే ఆడించడం సరికాదు. రోజులో 10-15 ఓవర్లపాటు బౌలింగ్ చేయడంతో పాటు బ్యాటింగ్ కూడా చేయగల ప్లేయర్‌కు మద్దతివ్వాల్సి ఉంటుంది. అందుకే క్రీజులో అతడికి ఎక్కువ సమయం గడిపే అవకాశం ఇవ్వాలనుకుంటున్నాం. ముఖ్యంగా భారత్ పిచ్‌లపై నితీశ్ బ్యాటింగ్‌ను గమనించాల్సిన అవసరం ఉంది' అని గిల్ వివరించాడు. కెరీర్‌లో ఆడిన ఎనిమిది టెస్టుల్లో ఏడింటిని తను విదేశాల్లోనే ఆడగా.. అహ్మదాబాద్ టెస్టులో బ్యాటింగ్‌కు దిగాల్సిన అవసరం రాలేదు.

విరాట్ లేకుండా స్టేడియం నిండేనా?

న్యూఢిల్లీ: స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీకి అభిమాన గణం ఎక్కువే. ఇక అతడి స్వస్థలం ఢిల్లీలో ఆడుతుంటే స్థానిక అరుణ్ జైట్లీ మైదానం పూర్తిగా నిండిపోవాల్సిందే. అతను తొమ్మిది నెలల క్రితం రంజీ మ్యాచ్ ఆడితేనే 12 వేలకు పైగా ప్రేక్షకులు హాజరయ్యారు. అయితే శుక్రవారం నుంచి భారత్-వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టెస్టు ఇక్కడే జరుగనుంది. కానీ తొలిసారిగా విరాట్‌తో పాటు రోహిత్ శర్మ కూడా లేకుండా న్యూఢిల్లీలో భారత్ టెస్టు ఆడబోతోంది. దీంతో ప్రేక్షకులు ఏమేరకు హాజరవుతారోనన్న సందేహం వ్యక్తమవుతోంది. కోచ్ గంభీర్ కారణంగానే తాము ఆరాధించే క్రికెటర్లు ఆటకు వీడ్కోలు పలికారన్న కోపం కూడా ఇద్దరి ఫ్యాన్స్‌లోనూ ఉంది.

భారత్‌కు ఝలక్



డి క్లెర్క్ (84 నాటౌట్)

- మలుపుతిప్పిన డి క్లెర్క్
- 3 వికెట్లతో దక్షిణాఫ్రికా గెలుపు
- రిచా పోరాటం వృథా
- వన్డే వరల్డ్ కప్

విశాఖపట్నం స్పోర్ట్స్ (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో నాడిన్ డి క్లెర్క్ (54 బంతుల్లో 8 ఫోర్లు, 5 సిక్స్‌లతో 84 నాటౌట్) మెరుపు ఇన్నింగ్స్‌తో వరల్డ్‌కప్‌లో దక్షిణాఫ్రికా అద్భుత విజయాన్ని నమోదు చేసింది. గురువారం జరిగిన మ్యాచ్‌లో సౌతాఫ్రికా మూడు వికెట్ల తేడాతో భారత్‌కు షాకిచ్చింది. తొలుత భారత్ 49.5 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌటైంది. రిచా ఘోష్ (77 బంతుల్లో 11 ఫోర్లు, 4 సిక్స్‌లతో 94), ప్రతీక రావల్ (37), స్నేహ్ రాణా (33) పోరాటాలు వృథా అయ్యాయి. ట్రయన్ 3 వికెట్లు.. కాప్, డి క్లెర్క్, ఎంలబా తలో రెండు వికెట్లు సాధించారు. ఛేదనలో సౌతాఫ్రికా 48.5 ఓవర్లలో 252/7 స్కోరు చేసి గెలిచింది. కెప్టెన్ లారా వొల్వార్డ్ (70), ట్రయన్ (49) రాణించారు. డి క్లెర్క్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' దక్కింది.

నిలబడిన లారా..: బ్రిట్స్ (0)ను మూడో ఓవర్‌లోనే క్రాంతి రిటర్న్ క్యాచ్‌తో డకౌట్ చేయడంతో.. ఆరంభంలోనే సౌతాఫ్రికా ఆట గతితప్పింది. లూస్ (5)ను అమన్‌జోత్ స్వల్ప స్కోరుకే వెనక్కిపంపింది. కాప్(20)ను రాణా బౌల్డ్ చేయగా.. బోష్ (1)ను దీప్తి రిటర్న్ క్యాచ్‌తో వెనక్కిపంపింది. జెఫ్టా (14)ను శ్రీచరణి వికెట్ల ముందు దొరకబుచ్చుకోవడంతో సఫారీలు 81/5తో ఇబ్బందుల్లో పడ్డారు. అయితే, ట్రయన్‌తో కలసి లారా ఆదుకొనే ప్రయత్నం చేసింది. కీలక సమయంలో క్యాచ్‌లు చేజార్చిన భారత ఫీల్డర్లు ప్రత్యర్థికి పుంజుకొనే అవకాశం కల్పించారు. చివరి 4 ఓవర్లలో సౌతాఫ్రికా విజయానికి 41 రన్స్ కావాల్సి ఉండగా.. క్రాంతి వేసిన 47వ ఓవర్‌లో డి క్లెర్క్ 6,6,4తో 18 రన్స్ రాబట్టింది. దీంతో సమీకరణం 18 బంతుల్లో 23 రన్స్‌కు దిగివచ్చింది. ఈ దశలో రెండు ఫోర్లు, రెండు సిక్స్‌లు బాదిన డి క్లెర్క్.. మరో ఏడు బంతులు మిగిలుండగానే మ్యాచ్‌ను ఫినిష్ చేసింది.

మంధాన విఫలం..: మరోసారి టాపార్డర్ వైఫల్యంతో కష్టాల్లో పడిన భారత్.. రిచా ఎదురుదాడితో పోరాడగలిగే స్కోరు చేసింది. ఒక దశలో భారత్ 153/7తో కష్టాల్లో పడగా.. రిచా, రాణా ఎనిమిదో వికెట్‌కు 88 పరుగుల భాగస్వామ్యంతో జట్టు స్కోరును 250 దాటించారు. స్మృతి మంధాన (23) మళ్లీ విఫలమైంది. హర్లీన్ డియోల్ (13), ప్రతీక, జెమీమా (0), కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (9), దీప్తి శర్మ (4) పెవిలియన్‌కు క్యూ కట్టడంతో.. భారత్ 47 పరుగుల తేడాతో ఐదు వికెట్లు చేజార్చుకొంది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన రిచా ఎటాకింగ్ ఆటతో మ్యాచ్ గతిని మార్చింది. అయితే, ఆఖరి ఓవర్‌లో డి క్లెర్క్ బౌలింగ్‌లో భారీ షాట్ ఆడే క్రమంలో క్యాచవుటైన రిచా త్రుటిలో శతకం చేజార్చుకొంది.



రిచా (94)

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో
న్యూజిలాండ్ x బంగ్లాదేశ్

స్కోరు బోర్డు

భారత్: ప్రతీకా రావల్ (సి) బ్రిట్స్ (బి) సెఖుఖునె 37, మంధాన (సి) లూస్ (బి) ఎంలబా 23, హర్లీన్ (బి) ఎంలబా 13, హర్మన్ (సి) కాప్ (బి) ట్రయన్ 9, జెమీమా (ఎల్బీ) ట్రయన్ 0, దీప్తి (సి) జఫ్టా (బి) కాప్ 4, అమన్‌జోత్ (సి) లూస్ (బి) ట్రయన్ 13, రిచా (సి) ట్రయన్ (బి) డి క్లెర్క్ 94, రాణా (సి) వొల్వార్డ్ (బి) కాప్ 33, క్రాంతి (నాటౌట్) 0, శ్రీచరణి (సి) వొల్వార్డ్ (బి) డి క్లెర్క్ 0; **ఎక్స్‌ట్రాలు: 25; మొత్తం: 49.5 ఓవర్లలో 251 ఆలౌట్; వికెట్ల పతనం:** 1-55, 2-83, 3-91, 4-92, 5-100, 6-102, 7-153, 8-241, 9-251; **బౌలింగ్:** కాప్ 9-0-45-2, ఖాకా 7-0-47-0, డి క్లెర్క్ 6.5-0-52-2, ఎంలబా 10-0-46-2, సెఖుఖునే 7-0-29-1, ట్రయన్ 10-0-32-3.

సౌతాఫ్రికా: లారా(బి) క్రాంతి 70, బ్రిట్స్ (సి అండ్ బి) క్రాంతి 0, లూస్ (సి) రిచా (బి) అమన్‌జోత్ 5, కాప్ (బి) రాణా 20, బోష్ (సి అండ్ బి) దీప్తి 1, జఫ్టా (ఎల్బీ) శ్రీచరణి 14, ట్రయన్ (ఎల్బీ) రాణా 49, డి క్లెర్క్ (నాటౌట్) 84, ఖాకా (నాటౌట్) 1; **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 48.5 ఓవర్లలో 252/7; వికెట్ల పతనం:** 1-6, 2-18, 3-57, 4-58, 5-81, 6-142, 7-211; **బౌలింగ్:** క్రాంతి 9-0-59-2, అమన్‌జోత్ 5.5-0-40-1, రాణా 10-0- 47-2, శ్రీచరణి 10-1-37-1, దీప్తి 10-0-54-1, హర్మన్ 4-0-15-0.

ఈ మ్యాచ్‌లో 23 పరుగులు చేసిన మంధాన.. ఓ క్యాలెండర్ ఇయర్‌లో అత్యధిక రన్స్ (982) సాధించిన క్రీడాకారిణిగా రికార్డు సృష్టించింది. ఈ క్రమంలో 1997లో ఆస్ట్రేలియా క్రికెటర్ బెలిండా క్లార్క్ 970 పరుగుల రికార్డును స్మృతి అధిగమించింది.

1

8వ నెంబరులో బ్యాటింగ్‌కు దిగి అత్యధిక పరుగులు సాధించిన ప్లేయర్‌గా రిచా (94) సరికొత్త రికార్డు నెలకొల్పింది. ఈ ఏడాది శ్రీలంకతో మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా ప్లేయర్ ట్రయన్ 74 పరుగుల రికార్డును ఘోష్ బద్దలుకొట్టింది.

రో-కో వరల్డ్‌కప్‌లోనూ ఆడతారు:గిల్

న్యూఢిల్లీ: భారత వెటరన్ స్టార్ ఆటగాళ్లు విరాట్, రోహిత్ శర్మల కెరీర్ కొనసాగింపుపై సర్వత్రా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే ఆసీస్ పర్యటనే వారికి చివరిది కావచ్చన్న అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కానీ నూతన వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్ మాత్రం రో-కోపై పూర్తి విశ్వాసం ప్రకటించాడు. ఆ ఇద్దరి సేవలు జట్టుకు ఎంతో అవసరమని తేల్చాడు. 'రాబోయే వన్డే వరల్డ్‌కప్‌లోనూ వారి పాత్ర కచ్చితంగా ఉంటుంది. ఆ ఇద్దరి అపార అనుభవం వెల కట్టలేనిది. విరాట్, రోహిత్‌లకున్న సమర్థత, నైపుణ్యం చాలా తక్కువ మంది క్రికెటర్లకు ఉంటుంది. మెగా టోర్నీ లక్ష్యంగా వారి సన్నద్ధత సాగుతుంది' అని గిల్ స్పష్టం చేశాడు.

ఆధిక్యంలో కాస్పరోవ్

ఆనంద్‌తో లెజెండ్స్ క్లచ్ చెస్



సెయింట్ లూయిస్ (అమెరికా): లెజెండ్స్ క్లచ్ చెస్‌లో భాగంగా దిగ్గజ ఆటగాళ్లు విశ్వనాథన్ ఆనంద్-గ్యారీ కాస్పరోవ్ (రష్యా) మధ్య 12 గేమ్‌ల పోరు గురువారం ఇక్కడ ప్రారంభమైంది. ఆరు గేమ్‌లు ర్యాపిడ్, ఆరు గేమ్‌లు బ్లిట్జ్ విధానంలో జరగనున్నాయి. ఇక..తొలి నాలుగు గేమ్‌లు ముగిసే సరికి కాస్పరోవ్ 2.5-1.5తో ఆధిక్యంలో నిలిచాడు. 1,2,4 గేమ్‌లు డ్రాగా ముగియగా...మూడో గేమ్‌లో కాస్పరోవ్ నెగ్గాడు. 1,2 ర్యాపిడ్ గేమ్‌లు కాగా..3,4 బ్లిట్జ్‌లో జరిగాయి.



చరిత్ర సృష్టించిన భారత జట్టు

కాంస్యం ఖాయం
ప్రపంచ జూ. మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

గువాహటి: కొరియాను ఓడించిన భారత్ ప్రపంచ జూనియర్ మిక్స్‌డ్ టీమ్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. తద్వారా టోర్నమెంట్‌లో కనీసం కాంస్య పతకం ఖరారు చేసుకుంది. తద్వారా బ్యాడ్మింటన్ వరల్డ్ ఫెడరేషన్ జూనియర్ చాంపియన్‌షిప్‌లో తొలి పతకంతో చరిత్ర సృష్టించింది. గురువారం ఉత్కంఠ భరితంగా జరిగిన క్వార్టర్‌ఫైనల్లో ఆతిథ్య భారత్ 44-45, 45-30, 45-33తో కొరియాపై గెలుపొందింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్ ఇండోనేసియాతో భారత్ తలపడనుంది. మరో క్వార్టర్ ఫైనల్లో కొరియా 45-35, 45-35తో తైపీని ఓడించింది.

భారత పారా వాలీబాల్ కెప్టెన్ ప్రశాంత్


మరో ముగ్గురు తెలుగోళ్లకు చోటు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): పారా సిట్టింగ్ వాలీబాల్ వరల్డ్‌కప్‌లో పాల్గొనే భారత జట్టు కెప్టెన్‌గా జి. ప్రశాంత్ నియమితుడయ్యాడు. అమెరికాలోని ఇండియానాలో వచ్చే ఆదివారం నుంచి ఈ పోటీలు జరగనున్నాయి. ప్రశాంత్ స్వస్థలం వరంగల్ జిల్లా ఖైలారం. మొత్తం 14 మందితో జట్టు ప్రకటించగా.. అందులో ప్రశాంత్‌తో కలిపి నలుగురు తెలుగువాళ్లున్నారు. వి. కల్యాణ్ (మంచిర్యాల), ఆర్. నరేష్ యాదవ్ (నల్లగొండ), ఎ.గణేష్ (విశాఖపట్నం)కు జట్టులో చోటు దక్కింది.

టీపీఎల్‌లో అత్యధిక ధర పలికిన రిత్విక్

ముంబై: వచ్చే డిసెంబర్‌లో జరిగే టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) ఆటగాళ్ల వేలంలో హైదరాబాద్ క్రీడాకారుడు బొల్లిపల్లి రిత్విక్ (చెన్నై స్మాషర్స్), తమిళనాడు ప్లేయర్ శ్రీరామ్ బాలాజీ (గుర్గావ్ గ్రాండ్ స్లామర్స్) అత్యధికంగా రూ.12 లక్షల ధర పలికారు. గురువారం జరిగిన వేలంలో లియాండర్ పేస్, సానియా మీర్జా, మహేష్ భూపతి పాల్గొన్నారు. హైదరాబాద్ అమ్మాయి శ్రీవల్లి రష్మికను రూ.8.60 లక్షలకు ఎస్‌జి పైపర్స్ బెంగళూరు దక్కించుకుంది. హైదరాబాద్ స్ట్రయికర్స్ మరో తెలుగు ఆటగాడు జె.విష్ణువర్ధన్‌ను రూ.6 లక్షలకు కొనుగోలు చేసింది.

ముకేశ్ నం. 1



దేశంలోని 100మంది కుబేరుల్లో అంబానీదే అగ్రస్థానం

- గౌతమ్ అదానీ నం.2
- సావిత్రి జిందాల్‌కు 3 వ స్థానం
- ఫోర్బ్స్ జాబితా విడుదల
- లిస్ట్‌లో ఆరుగురు తెలుగువారు

న్యూఢిల్లీ: దేశంలో అత్యంత ధనవంతులైన 100 మంది వివరాలతో ఫోర్బ్స్ విడుదల చేసిన జాబితాలో రిలయన్స్ ఇండస్ట్రీస్ చైర్మన్ ముకేశ్ అంబానీ అగ్రస్థానంలో నిలిచారు. ఆయన ఆస్తి 105 బిలియన్ (10,500 కోట్ల) డాలర్లు. ప్రస్తుత మారకం రేటు ప్రకారం మన కరెన్సీలో రూ.9.32 లక్షల కోట్లు. గత ఏడాదితో పోలిస్తే ముకేశ్ అంబానీ ఆస్తి 12 శాతం తగ్గిందని ఫోర్బ్స్ తెలిపింది. కాగా, అదానీ గ్రూప్ చైర్మన్ గౌతమ్ అదానీ 92 బిలియన్ డాలర్ల (9,200 కోట్ల డాలర్లు=రూ.8.17 లక్షల కోట్లు) సంపదతో రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. ఓపీ జిందాల్ గ్రూప్ చైర్మన్ సావిత్రి జిందాల్ కుటుంబం 40.2 బిలియన్ డాలర్ల (4,020 కోట్ల డాలర్లు=రూ.3.57 లక్షల కోట్లు) నెట్‌వర్త్‌తో మూడో స్థానంలో ఉంది. దేశంలోని టాప్ టెన్ ధనవంతుల్లోని ఏకైక మహిళ ఆమే. భారతీ ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్, హెచ్‌సీఎల్ టెక్ వ్యవస్థాపకులు శివ్‌నాడార్ 4,5 స్థానాల్లో నిలిచారు. తెలుగువారి విషయానికొస్తే, ఈ జాబితాలో ఆరుగురికి చోటు లభించింది. తెలుగు సంపన్నుల్లో దివీస్ ల్యాబ్స్ అధిపతి మురళి దివి అగ్రస్థానంలో ఉన్నారు.

దేశంలో టాప్-10 శ్రీమంతులు

ర్యాంక్	పేరు	కంపెనీ	ఆస్తి (రూ.లక్షల కోట్లు)
1	ముకేశ్ అంబానీ	రిలయన్స్ ఇండస్ట్రీస్	9.32
2	గౌతమ్ అదానీ కుటుంబం	అదానీ గ్రూప్	8.17
3	సావిత్రి జిందాల్ కుటుంబం	ఓపీ జిందాల్ గ్రూప్	3.57
4	సునీల్ మిట్టల్ కుటుంబం	భారతి ఎయిర్‌టెల్	3.03
5	శివ్ నాదార్	హెచ్‌సీఎల్ టెక్	2.95
6	రాధాకిషన్ దమానీ కుటుంబం	డీమార్ట్	2.50
7	దిలీప్ సంఘ్వీ కుటుంబం	సన్ ఫార్మా	2.33
8	బజాజ్ కుటుంబం	బజాజ్ ఆటో	1.93
9	సైరస్ పూనావాలా	సీరమ్ ఇన్‌స్టిట్యూట్	1.90
10	కుమార మంగళం బిర్లా	ఆదిత్య బిర్లా గ్రూప్	1.84

రూ.88.8 లక్షల కోట్లు

- వంద మంది కుబేరుల మొత్తం సంపద ఇది
- ఈ ఏడాదిలో 9% డౌన్

ఈ ఏడాది దేశంలోని టాప్-100 ధనవంతుల మొత్తం సంపద 9 శాతం లేదా 100 బిలియన్ డాలర్లు (10,000 కోట్ల డాలర్లు=రూ.8.88 లక్షల కోట్లు) తగ్గి ట్రిలియన్ డాలర్లకు (1 లక్ష కోట్ల డాలర్లు=రూ.88.8 లక్షల కోట్లు) పరిమితమైంది. రూపాయి పతనం, స్టాక్ మార్కెట్ క్షీణత ఇందుకు కారణమయ్యాయి. దేశంలో అతిపెద్ద ధనవంతుడైన అంబానీ సహా జాబితాలోని మూడింట రెండొంతుల మంది సంపద ఈ ఏడాది తరిగిపోయిందని ఫోర్బ్స్ తెలిపింది. ఈ ఏడాది అంబానీ ఆస్తి ఏకంగా 14.5 కోట్ల డాలర్ల (రూ.1.28 లక్షల కోట్లు) మేర తరిగిపోయింది. అయినప్పటికీ ఆయన దేశంలోని ఏకైక సెంటీబిలియనీర్ (కనీసం 100 బిలియన్ డాలర్ల ఆస్తి కలిగిన వ్యక్తి)గా ఉన్నారు. కాగా, ఈ ఏడాది అత్యధికంగా సంపద పెరిగిన వారిలో భారతి ఎయిర్‌టెల్ చైర్మన్ సునీల్ మిట్టల్ ముందున్నారు. ఈ ఏడాది ఆయన ఆస్తి 3.5 డాలర్ల (రూ.31,080 కోట్లు) మేర పెరిగింది. దాంతో మిట్టల్ ఈసారి జాబితాలో మూడు స్థానాలు ఎగబాకి నాలుగో స్థానానికి చేరారు.

తెలుగు సంపన్నులు వీరే..


ర్యాంక్	పేరు	కంపెనీ	ఆస్తి (రూ.కోట్లు)
25	మురళి దివి	దివీస్ ల్యాబ్స్	88,800
70	పీపీ రెడ్డి, పీవీ కృష్ణా రెడ్డి	మేఘా ఇంజనీరింగ్	37,473
83	గ్రంధి మల్లికార్జున రావు	జీఎంఆర్	33,300
86	ప్రతాప్ సీ రెడ్డి	అపోలో హాస్పిటల్స్	32,412
89	బీ పార్థసారథి రెడ్డి	హెటిరో గ్రూప్	31,080
91	కే సతీశ్ రెడ్డి కుటుంబం	డాక్టర్ రెడ్డీస్	30,636

నాట్కో 'రిస్డిప్లామ్'కు ఓకే

ఢిల్లీ హైకోర్టులో రోష్ కంపెనీకి చుక్కెదురు

న్యూఢిల్లీ: బహుళ జాతి ఔషధ కంపెనీల అడ్డగోలు దోపిడీకి ఢిల్లీ హైకోర్టు చెక్ పెట్టింది. అరుదైన వెన్నెముక కండరాల క్షీణత (ఎస్ఎంఏ) వ్యాధి చికిత్సలో ఉపయోగించే 'రిస్డిప్లామ్' ఔషధాన్ని జెనరిక్ ఔషధ రూపంలో దేశీయ మార్కెట్లో విడుదల చేసేందుకు హైదరాబాద్‌కు చెందిన నాట్కో ఫార్మాకు ఢిల్లీ హైకోర్టు అనుమతినిచ్చింది. దీనికి సంబంధించి ఈ ఏడాది మార్చిలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను జస్టిస్ సీ హరిశంకర్, జస్టిస్ దిగ్‌పాల్‌లతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సమర్థించింది.

కేసు పూర్వాపరాలు: 'రిస్డిప్లామ్' అనే ప్రాణరక్షక ఔషధంపై స్విట్జర్లాండ్ కేంద్రంగా పనిచేసే రోష్ సంస్థకు పేటెంట్ హక్కులు ఉన్నాయి. ప్రస్తుతం ఈ కంపెనీ ఈ ఔషధాన్ని 'ఎరిస్డి' పేరుతో ఒక్కో బాటిల్ రూ.6 లక్షల చొప్పున భారత్‌లో మార్కెట్ చేస్తోంది. నాట్కో ఫార్మా దీనికి జెనరిక్ వెర్షన్‌లో బాటిల్ రూ.15,900కే అందుబాటులోకి తెచ్చేందుకు సిద్ధమైంది. ఇది తమ పేటెంట్ హక్కులను ఉల్లంఘించడమే అవుతుందని రోష్.. ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. అయితే రోష్ వాదనలో పెద్దగా పస లేదని, చిన్నచిన్న మార్పులతో ఎప్పటికప్పుడు కొత్త ఔషధమని చెబుతూ పేటెంట్ గడువు పొడిగించుకుంటోందని నాట్కో కోర్టుకు తెలిపింది. ఈ వాదన విన్న ఢిల్లీ హైకోర్టు సింగిల్ జడ్జి ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నాట్కో చౌకగా తన జెనరిక్ ఔషధాన్ని విడుదల చేసేందుకు అనుమతించారు. దీనిపై రోష్ అభ్యంతరం వ్యక్తం చేస్తూ అప్పీల్ చేసింది. తాజాగా ద్విసభ్య ధర్మాసనం కూడా ఆ తీర్పును సమర్థించడంతో రోష్‌కు చుక్కెదురైంది.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,24,150 ▲	1,13,800 ▲	1,69,000 ▲
విజయవాడ	1,26,800 ▲	1,22,000 ▲	1,69,000 ▲
విశాఖపట్నం	1,26,740 ▲	1,14,000 ▲	1,77,000 ▲
రాజమండ్రి	1,24,150 ▲	1,13,800 ▲	1,56,000 ▲
ప్రొద్దుటూరు	1,28,000 ▲	1,17,700 ▲	1,60,000 ▲
ముంబై	1,22,629 ▲	1,12,328 ▲	1,59,550 ▲

బిజినెస్

టీసీఎస్ లాభం రూ.12,075 కోట్లు

క్యూ2లో 1.4% అప్ ● ఒక్కో షేరుకు రూ.11 మధ్యంతర డివిడెండ్



న్యూఢిల్లీ: ఐటీ సర్వీసుల దిగ్గజం టీసీఎస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (క్యూ2)లో రూ.12,075 కోట్ల కన్సాలిడేటెడ్ నికర లాభం ప్రకటించింది. గత ఏడాది ఇదే కాలంలో ఆర్జించిన రూ.11,909 కోట్లతో పోల్చితే లాభం 1.4% పెరిగింది. బీఎఫ్ఎస్ఐ సహా విభిన్న విభాగాల్లో ఏర్పడిన వృద్ధి లాభం పెరగడానికి దోహదపడిందని టీసీఎస్ వెల్లడించింది. ఇదే కాలంలో కంపెనీ ఆదాయం 2.39% వృద్ధితో రూ.64,259 కోట్ల నుంచి రూ.65,799 కోట్లకు పెరిగింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికంతో పోల్చితే మాత్రం ఆదాయం 3.7% పెరిగినా లాభం 5.3% క్షీణించింది. మొత్తం కాంట్రాక్టు విలువ లేదా టీసీవీ (కాంట్రాక్టు కాలపరిమితిలో సంబంధిత కస్టమర్ నుంచి ఆశిస్తున్న ఆదాయం) రెండో త్రైమాసికంలో వెయ్యి కోట్ల డాలర్లున్నట్టు కంపెనీ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ సమీర్ సెస్కారియా అన్నారు. ఈ త్రైమాసికంలో అన్ని విభాగాల్లోనూ మంచి వృద్ధిని తాము నమోదు చేసినట్టు సమీర్ చెప్పారు.

మధ్యంతర డివిడెండ్: ఒక రూపాయి ముఖ విలువ గల ఒక్కో షేరుపై 11 రూపాయల రెండవ మధ్యంతర డివిడెండును టీసీఎస్ ప్రకటించింది. నవంబరు 4వ తేదీన ఈ డివిడెండును చెల్లిస్తారు. డివిడెండు పొందేందుకు అక్టోబరు 15 రికార్డు తేదీగా నిర్ణయించారు. బీఎస్ఈలో గురువారం టీసీఎస్ షేరు 1.16% లాభంతో రూ.3,061.95 వద్ద ముగిసింది.

డేటా సెంటర్ల కోసం ప్రత్యేక అనుబంధ సంస్థ

ఇన్‌ఫ్రా, టెక్నాలజీ ఆధారిత సేవలందించగల ఏఐ, స్వతంత్ర డేటా సెంటర్ల ఏర్పాటు కోసం పూర్తి యాజమాన్య అనుబంధ సంస్థ ఒకటి ఏర్పాటు చేయనున్నట్టు కంపెనీ ప్రకటించింది. దేశంలో 1 గిగావాట్ సామర్థ్యం గల డేటా సెంటర్ కోసం ఒక ప్రత్యేక వ్యాపార విభాగం ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపింది. అలాగే మార్కెటింగ్ క్లౌడ్, సీఆర్ఎం, డేటా క్లౌడ్, ఏజెంట్ ఫోర్స్, ఏఐ అడ్వైజరీ సర్వీసుల్లో స్పెషలైజేషన్ గల అమెరికాకు చెందిన లిస్ట్ఎంగేజ్ కంపెనీని 7.28 కోట్ల డాలర్లకు కొనుగోలు చేసినట్టు తెలియ చేసింది.

3 నెలల్లో 20,000 మంది ఔట్

మారుతున్న వ్యాపార ముఖచిత్రానికి దీటుగా కంపెనీ పునర్నిర్మాణం పేరిట టీసీఎస్ ఒక్క త్రైమాసికంలోనే (జూలై-సెప్టెంబరు) సుమారు 20 వేల మందికి ఉద్వాసన చెప్పినట్టు కంపెనీ వెబ్‌సైట్‌లోని గణాంకాలు తెలుపుతున్నాయి. జూన్ త్రైమాసికం చివరి నాటికి ఉద్యోగుల సంఖ్య 6,13,069 ఉండగా సెప్టెంబరు చివరి నాటికి 5,93,314 ఉన్నట్లు అందులో ఉంది. అంటే నికరంగా తొలగించిన ఉద్యోగులు 19,755 అయితే .కంపెనీ మాత్రం ఆ సంఖ్యను తగ్గించి చూపుతోందని ఐటీ ఉద్యోగుల యూనియన్ నాసెంట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీస్ సెనేట్ (నైట్స్) ఆరోపించింది. అయితే గురువారం ఆర్థిక ఫలితాల సందర్భంగా కంపెనీ సీహెచ్ఆర్ఓ సుదీప్ కున్నుమల్ మాత్రం తాము తొలగించింది 6,000 మంది మాత్రమేనని చెప్పారు. అయితే బీఎస్ఈకి పంపిన సమాచారంలో మాత్రం కంపెనీ ప్రకటించిన సంఖ్యలో త్రైమాసికం చివరి నాటికి మొత్తం ఉద్యోగుల సంఖ్యను, ఉద్యోగుల వలస సంఖ్యను మినహాయించారని నైట్స్ ఆరోపిస్తోంది. అయితే కంపెనీ వెబ్‌సైట్‌లో మాత్రం పైన పేర్కొన్న గణాంకాలున్నాయని తెలిపింది. టీసీఎస్ వంటి సంస్థ చూపిన గణాంకాల్లోని ఈ వ్యత్యాసం ఏదో పొరపాటు చర్యగా భావించలేమని... రెగ్యులేటర్లు, విధానకర్తలు, ప్రజలను తప్పుదారి పట్టించేందుకు చేసిన ఉద్దేశపూర్వక చర్య అని నైట్స్ వాదిస్తోంది.

హెటిరో ల్యాబ్స్‌కు ఎఫ్‌డీఏ సెగ

ముంబై: హెటిరో లేబొరేటరీస్‌కు అమెరికా ఆహార, ఔషధ నియంత్రణ సంస్థ (యూఎస్ ఎఫ్‌డీఏ) సెగ తగిలింది. ఆంధ్రప్రదేశ్‌లోని నక్కపల్లి ప్లాంట్ ఉత్పత్తి విధానాలపై ఎఫ్‌డీఏ ఆరు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేసింది. డాక్యుమెంటేషన్ ప్రక్రియలో తేడాలతో పాటు ఈ ప్లాంట్‌లో తయారయ్యే ఉత్పత్తులను కంపెనీ ఒక అన్‌రిజిస్టర్డ్ ల్యాబ్‌లో పరీక్షిస్తోందని తెలిపింది. దీంతో ఈ ప్లాంటు నుంచి యాక్టివ్ ఫార్మా ఇన్‌గ్రిడియెంట్స్ (ఏపీఐ), యాంటీ రిట్రో వైరల్ ఔషధాల సరఫరాకు అంతరాయం ఏర్పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. గత నెల 19 నుంచి 26 వరకు ఎఫ్‌డీఏ అధికారులు హెటిరో ల్యాబ్స్‌లో తనిఖీలు చేసినప్పుడు ఈ లోపాలను గుర్తించారు.



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు) 10వ తేదీ			
హైదరాబాద్	520	విజయవాడ	540
వరంగల్	522	గోదావరి	535
చిత్తూరు	538	విశాఖపట్నం	525
		డజను గుడ్లు రూ. 72	



ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	102	విజయవాడ	124
వరంగల్	102	గుంటూరు	114
కరీంనగర్	102	ఒంగోలు	114
మహబూబ్‌నగర్	102	చిత్తూరు	97
కర్నూలు	102	నెల్లూరు	102
విశాఖపట్నం	127	అనంతపురం	102
గోదావరి	124		

ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఐపీఓకి రూ.4 లక్షల కోట్ల బిడ్లు

దేశ ఐపీఓ చరిత్రలో కొత్త రికార్డు
54 రెట్ల ఓవర్ సబ్‌స్క్రిప్షన్

న్యూఢిల్లీ: ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా లిమిటెడ్ పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ) సూపర్ డూపర్ హిట్టయింది. రూ.11,607 కోట్ల సమీకరణ కోసం ఈ కంపెనీ ఐపీఓ ద్వారా 7.13 కోట్ల షేర్లు జారీ చేయగా ఆఖరి రోజైన గురువారానికి 385 కోట్ల షేర్లకు (54.02 రెట్లు) బిడ్స్ వచ్చాయి. అప్పర్ ప్రైస్ బ్యాండ్ ప్రకారం చూస్తే ఇది దాదాపు రూ.4.4 లక్షల కోట్లకు సమానం. భారత పబ్లిక్ ఇష్యూ మార్కెట్ చరిత్రలో ఇప్పటి వరకు మరే ఐపీఓ ఇంత భారీ స్థాయిలో సబ్‌స్క్రైబ్ కాలేదు. గత ఏడాది సెప్టెంబరులో బజాజ్ హౌసింగ్ ఫైనాన్స్ ఐపీఓకు వచ్చిన రూ.3.24 లక్షల కోట్లే ఇప్పటి వరకు రికార్డు. ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ఐపీఓ ఆ రికార్డును తిరగరాసింది.

వెండి ధర రికార్డు స్థాయికి: వెండి ధర రేసు గుర్రంలా పరిగెడుతోంది. గురువారం ఢిల్లీలో కిలో వెండి ధర ఒకే రోజు రూ.6,000 పెరిగి రూ.1.63 లక్షలకు చేరి రికార్డు సృష్టించింది. దీంతో ఈ ఏడాది ఇప్పటి వరకు కిలో వెండి ధర 72 శాతం పెరిగినట్టయింది. మరోవైపు పది గ్రాముల మేలిమి బంగారం ధర మాత్రం రూ.1,236,600 వద్ద స్థిరంగా ఉంది. గత వారం రోజుల్లో ఢిల్లీలో కిలో వెండి ధర ఒకే రోజు ఈ స్థాయిలో పెరగడం ఇదే మొదటిసారి. అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్ (31.10 గ్రాములు) వెండి ధర 50 డాలర్ల పైకి చేరి సరికొత్త రికార్డు నమోదు చేసింది.8

సెన్సెక్స్ 398 పాయింట్లు అప్

కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీ కంపెనీల షేర్ల కొనుగోళ్ల మద్దతుతో ఈక్విటీ మార్కెట్ గురువారం పునరుజ్జీవం సాధించింది. విదేశీ ఇన్వెస్టర్ల కొనుగోళ్లు సైతం సెంటిమెంట్ పుంజుకునేందుకు దోహదపడ్డాయి. సెన్సెక్స్ 398.44 పాయింట్ల లాభంతో 81,172.10 వద్ద ముగిసింది. నిఫ్టీ 135.65 పాయింట్ల లాభంతో 25,181.80 వద్ద క్లోజైంది.

హైదరాబాద్ జీసీసీల అడ్డా

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): రానున్న రోజుల్లో తెలంగాణ నెక్స్ట్ జెన్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ల (జీసీసీ) హబ్‌గా అవతరించనుందని స్పెషాలిటీ స్టాఫింగ్ సంస్థ ఎక్స్‌ఫెనో వెల్లడించింది. గురువారం నాడిక్కడ సంస్థ సహ వ్యవస్థాపకుడు కమల్ కరంత్, సీఈఓ ఫ్రాన్సిస్ పదమదన్ మాట్లాడుతూ.. గడచిన 30 నెలల్లో భారత్‌లో కొత్తగా 300 జీసీసీలు ఏర్పాటు కాగా అందులో 64 ఒక్క హైదరాబాద్‌లో ఏర్పాటయ్యాయన్నారు. ఇదే సమయంలో బెంగళూరులో 52 జీసీసీలు ప్రారంభయ్యాయని తెలిపారు. ప్రస్తుతం హైదరాబాద్‌లో 360 జీసీసీలు ఉండగా వీటిల్లో 3.1 లక్షల మందికి పైగా ఉద్యోగులు పనిచేస్తున్నారని పేర్కొన్నారు. కాగా సంవత్సరాంతం నాటికి మరో 30 వరకు జీసీసీలు హైదరాబాద్‌లో ప్రారంభం కావచ్చని భావిస్తున్నట్లు చెప్పారు.

మధ్యంతర ఉత్తర్వులు వెబ్‌సైట్‌లో పెట్టండి

- మోహన్‌బాబు యూనివర్సిటీ పిటిషన్‌పై ఉన్నత విద్యా కమిషన్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మోహన్‌బాబు యూనివర్సిటీ (ఎంబీయూ) గుర్తింపు రద్దుతో పాటు ఇతర సిఫారసుల అమలు నిలుపుదలకు తామిచ్చిన మధ్యంతర ఉత్తర్వులను అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీహెచ్ఈఆర్ఎంసీ)ను హైకోర్టు ఆదేశించింది. ఈ వ్యవహారంలో ఎంబీయూ వేసిన అనుబంధ పిటిషన్‌ను పరిష్కరించింది. ప్రధాన వ్యాజ్యంపై విచారణను ఈనెల 14కు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ కె.శ్రీనివాస రెడ్డి గురువారం ఉత్తర్వులిచ్చారు. తిరుపతి జిల్లా రంగంపేటలోని తమ యూనివర్సిటీ గుర్తింపు రద్దుతో పాటు ఇతర చర్యల విషయంలో ఉన్నత విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సెప్టెంబరు 17న ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ గతంలో మోహన్‌బాబు వర్సిటీ రిజిస్ట్రార్ పిటిషన్ వేశారు. విచారణ జరిపిన హైకోర్టు.. కమిషన్ ఉత్తర్వులలోని పలు భాగాలపై స్టే విధిస్తూ సెప్టెంబరు 26న మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. విద్యార్థుల నుంచి అదనంగా వసూలు చేసిన రూ.26.17 కోట్లను 15 రోజుల్లో తిరిగి చెల్లించాలని, ఎంబీయూ గుర్తింపు రద్దు చేయాలని, పరిపాలన బాధ్యతలు ఎస్వీయూకు అప్పగించాలని చేసిన సిఫారసుల అమలును నిలుపుదల చేసింది. అయితే మధ్యంతర ఉత్తర్వులు జారీ తర్వాత కూడా ఆ ప్రొసీడింగ్స్‌ను ఏపీహెచ్ఈఆర్ఎంసీ అధికారిక వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ ఎంబీయూ అనుబంధ పిటిషన్ వేసింది. ఇది గురువారం విచారణకు రాగా యూనివర్సిటీ తరఫున న్యాయవాది ఓ.మనోహర్‌రెడ్డి వాదనలు వినిపించారు. కోర్టు మధ్యంతర ఉత్తర్వుల అనంతరం కూడా ఆ ప్రొసీడింగ్స్‌ను ఏపీహెచ్ఈఆర్ఎంసీ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసిందన్నారు. ఈ విషయాన్ని అన్ని పత్రికలు ప్రముఖంగా ప్రచురించాయని చెప్పారు. కమిషన్ చర్యలతో యూనివర్సిటీ పరపతి దెబ్బతిందన్నారు. ప్రొసీడింగ్స్‌ను వెబ్‌సైట్ నుంచి తొలగించాలన్న తమ అభ్యర్థనను కమిషన్ పట్టించుకోలేదన్నారు. మధ్యంతర ఉత్తర్వులను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని కోరారు. ఈ దశలో న్యాయమూర్తి జోక్యం చేసుకుంటూ తాము స్టే ఉత్తర్వులు ఇచ్చిన తరువాత ప్రొసీడింగ్స్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం ఏమిటని కమిషన్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించారు. ఏపీహెచ్ఈఆర్ఎంసీ తరఫున సీనియర్ న్యాయవాది పి.వీరారెడ్డి బదులిస్తూ.. కమిషన్ అన్ని ప్రొసీడింగ్స్‌ను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని హైకోర్టు డివిజన్ బెంచ్ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. ఈ ఆదేశాలకు అనుగుణంగా ఎంబీయూ గుర్తింపు రద్దు సిఫారసు ప్రొసీడింగ్స్‌ను సెప్టెంబరు 18నే అప్‌లోడ్ చేశామన్నారు. ప్రొసీడింగ్స్‌ను వెబ్‌సైట్‌లో ఉంచడం వెనుక దురుద్దేశం లేదన్నారు.

రేపు రైతులతో ప్రధాని మోదీ వర్చువల్ భేటీ

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కేంద్రం అమలు చేస్తున్న వ్యవసాయ, రైతు సంక్షేమ పథకాలు, ఇతర కార్యక్రమాలపై ప్రధాని మోదీ ఈ నెల 11న దేశవ్యాప్తంగా కొందరు రైతులతో వర్చువల్‌గా మాట్లాడనున్నారు. ఇందుకు రాష్ట్రంలోని అన్ని ఈనామ్ మార్కెట్ యార్డులు, మండీల్లో ప్రధాని సందేశాన్ని ప్రత్యక్ష ప్రసారం చేయడానికి స్క్రీన్లు ఏర్పాట్లు చేస్తున్నారు. వెబ్ కాస్ట్, లైవ్ స్ట్రీమింగ్ ద్వారా స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులు, ఇతర వ్యవసాయరంగ వాటాదారులను భాగస్వామ్యం చేయాలని పీఎంవో రాష్ట్ర మార్కెటింగ్‌శాఖను ఆదేశించింది.

నేడు క్యాబినెట్ సమావేశం

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి మండలి సమావేశం శుక్రవారం జరగనుంది. సచివాలయంలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఈ సమావేశం నిర్వహించనున్నారు. ఏపీలో అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి క్యాబినెట్‌లో ఆమోదం తెలపనున్నారు. రూ.87,520 కోట్లతో విశాఖలో ఏర్పాటు చేయనున్న రైడెన్ ఇన్ఫోటెక్ డేటా సెంటర్‌కు క్యాబినెట్ ఆమోదం తెలపనుంది. రాజధాని అమరావతిలో నిర్మించనున్న రాజ్‌భవన్ నిర్మాణానికి, నాలుగు కన్వెన్షన్ సెంటర్లకు క్యాబినెట్‌లో ఆమోదం తెలుపుతారు.

నేడు 'విదేశీ సంపర్క్'

- మిగిలిన రాష్ట్రాలకు భిన్నంగా ఆంధ్రలో నిర్వహిస్తున్న ప్రభుత్వం
- ప్రవాసీయులకూ భాగస్వామ్యం

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

తెలంగాణతో సహా దేశవ్యాప్తంగా మొక్కుబడిగా జరిగిన విదేశీ సంపర్క్ కార్యక్రమం ఆంధ్రలో శుక్రవారం జరగనుంది. ఈ కార్యక్రమాన్ని భిన్నంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించింది. ప్రవాసీయులను, సంబంధిత వర్గాలను భాగస్వాములను చేసింది. విదేశీ వ్యవహారాల శాఖ నిర్వహించే ఈ కార్యక్రమంలో విదేశాలకు వెళ్లే వారు దేశంలో, విదేశాల్లోని ప్రవాసీయులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్రానికి విశదీకరించే ప్రయత్నం చేస్తుంది. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమంపై రాష్ట్ర, విదేశాల్లోని తెలుగు వారిలో ఆశలు రేకెత్తాయి. దేశంలో ఎక్కడా లేని విధంగా ఆంధ్రప్రదేశ్ నుండి మాత్రమే పారిశుధ్య పనులు చేసే నిరక్షరాస్య మహిళల నుండి సాంకేతిక పరిజ్ఞానం కల్గిన ఉన్నత స్థాయి నిపుణుల వరకూ విదేశాలకు వెళ్తున్నారు. గల్ఫ్, అమెరికాకు వెళ్లే క్రమంలో, వెళ్లిన తర్వాత వీరు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తోంది. అయితే అంతర్జాతీయ దౌత్య నియమాల కారణంగా ఫలితం ఉండట్లేదు. దేశం లోపల సమస్యలను విదేశాంగ శాఖకు వివరిస్తూ పరిష్కారానికి ప్రభుత్వ వర్గాలు ప్రయత్నిస్తున్నాయి.

గల్ఫ్ దేశాల్లోని భారతీయ ఎంబసీల సంక్షేమ విభాగాల్లో తెలుగు మాట్లాడే, మహిళ ఉద్యోగులను నియమించాలనే డిమాండ్ ఉంది. గల్ఫ్ దేశాల ఉపాధి, నివాస వీసాల జారీకి వెళ్లే వారికి వైద్య పరీక్షలు తప్పనిసరి. గల్ఫ్ దేశాల మండలి ఆమోదిత వైద్య కేంద్రాలు (గామా సెంటర్లు) ధ్రువీకరించిన అనంతరం మాత్రమే వీసా జారీ అవుతుంది. ఆంధ్రలో ఎక్కడా ఈ కేంద్రాలు లేవు. ఏపీకి మంజూరైన కేంద్రాలనూ హైదరాబాద్‌లో నిర్వహిస్తుండడంతో అక్కడకు వెళ్లాల్సి రావడం ఇబ్బందికరంగా మారుతుంది. అధిక డబ్బును వసూలు చేసే ఉద్దేశ్యంతో అభ్యర్థులను పదేపదే ఫెయిల్ చేస్తున్న పరిస్థితి. కొందరు వీసాల గడువు ముగిసి ఉపాధి అవకాశాలు కోల్పోతున్నారు. ఈ కేంద్రాలపై రాష్ట్రానికి చెందిన కొందరు ఎంపీలు కేంద్రానికి ఫిర్యాదు చేశారు. రాయలసీమ నుండి పెద్ద సంఖ్యలో వలసలు ఉన్నా అక్కడ పూర్తిస్థాయి పాస్ పోర్టు కార్యాలయం లేకపోవడంతో వివిధ సవరణల కోసం విజయవాడకు రావడం ఇబ్బందికర పరిణామం. వివిధ ప్రాంతాల్లో తరచూ పాస్‌పోర్టు అదాలత్‌లను నిర్వహించడం ద్వారా సమస్యలను వేగవంతంగా పరిష్కరించాలని కోరుతున్నారు. విదేశాల్లో ఉద్యోగాలు కోల్పోయి స్వదేశానికి తిరిగి వస్తున్న వారికి పునరావాసం కల్పించాలి. ఆ దిశగా తిరిగి వచ్చే వారి వివరాలను సేకరించాలని, పునరావాసానికి అవసరమైన నిధులను ఇవ్వాలని రాష్ట్రం డిమాండ్ చేస్తుంది. వరకట్నం, గృహ హింస, ఇతర కేసులకు సంబంధించి వారెంట్ల అమలులో రాష్ట్ర స్థాయి పోలీసులతో, విదేశీ మంత్రిత్వ శాఖ ప్రత్యేక ఏర్పాటు చేయాలనే సూచన కూడా ఉంది.

జనవరిలో మరో డీఎస్సీ!

(మొదటి పేజీ తరువాయి)

విద్య, ఇంటర్మీడియట్, కళాశాల విద్య ఉన్నతాధికారులతో గురువారం మంత్రి లోకేశ్ సమీక్ష నిర్వహించారు. ప్రతి ఏటా డీఎస్సీ నిర్వహించి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేస్తామన్న హామీకి కట్టుబడి ఉన్నామని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. 2026 జనవరిలో నోటిఫికేషన్, మార్చిలో డీఎస్సీతో పాటు స్పెషల్ డీఎస్సీ రాత పరీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి కొత్త ఉపాధ్యాయులు విధుల్లో చేరేలా ప్రణాళిక అమలు చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలి

విద్యార్థుల్లో కనీస అభ్యసన సామర్థ్యాలపై లక్ష్య సాధనకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని మంత్రి లోకేశ్ ఆదేశించారు. పదో తరగతి విద్యార్థులకు డిసెంబరు కల్లా సిలబస్ పూర్తి చేసి, ఆ తర్వాత 100 రోజుల ప్రణాళిక ద్వారా మెరుగైన ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. రాష్ట్రానికి కొత్తగా మంజూరైన 11 జవహర్ నవోదయ విద్యాలయాలకు సంబంధించిన పనులను త్వరగా ప్రారంభించేందుకు కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, ఆ రోజున నిర్వహించనున్న 'స్టూడెంట్ అసెంబ్లీ'కి ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్పీకర్‌తో పాటు తాను కూడా హాజరవుతానని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 78 మంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను మెరుగైన విద్యా ప్రమాణాలపై అధ్యయనానికి సింగపూర్‌కు పంపించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

హైస్కూళ్లలో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

వచ్చే విద్యా సంవత్సరం విద్యార్థులకు సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద అందించాల్సిన స్టూడెంట్ కిట్స్‌పై లోకేశ్ చర్చించారు. మధ్యాహ్న భోజన పథకానికి సంబంధించి కడప స్మార్ట్ కిచెన్ మోడల్‌ను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైస్కూళ్లలో కంప్యూటర్ ల్యాబ్‌లు, ఇతర కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపట్టాలన్నారు. అమరావతిలో రూ.100 కోట్ల వ్యయంతో ప్రతిష్ఠాత్మకంగా చేపట్టనున్న సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి సంబంధించి డిజైన్ కోసం హ్యాకథాన్ నిర్వహించి, మెరుగైన మోడల్‌ను ఎంపిక చేయాలని పేర్కొన్నారు. జిల్లా, అసెంబ్లీ నియోజకవర్గాల్లో లైబ్రరీల ఆధునికీకరణకు ప్రణాళికలు రూపొందించాలన్నారు. స్థానిక సంస్థల నుంచి లైబ్రరీ సెస్సును రాబట్టేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేసి, మెరుగైన ఫలితాలు రాబట్టేందుకు వంద రోజుల ప్రణాళికను అమలు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా హైస్కూలు ప్లస్‌లను మెరుగుపర్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రి చర్చించారు. త్వరలో ప్రారంభించబోయే 'కలలకు రెక్కలు' పథకం విధివిధానాలపైనా సమావేశంలో చర్చించారు. ఉపాధ్యాయుల సమస్యలకు సంబంధించి 423 వినతులు తమ దృష్టికి రాగా, ఇప్పటికే 200 పరిష్కరించామని, మిగిలిన వినతులు విధానపరమైన, ఆర్థిక పరమైన అంశాలకు సంబంధించినవని అధికారులు తెలిపారు.

పోలీసు ఖాళీలు 11,639

- భర్తీకి అనుమతి కోరుతూ ప్రభుత్వానికి డీజీపీ లేఖ
- అనుమతి లభిస్తే త్వరలో నోటిఫికేషన్

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): 'సైబర్ నేరాలు సవాలు విసురుతున్నాయి. సోషల్ మీడియా ద్వారా అశాంతి సృష్టించే యత్నాలు జరుగుతున్నాయి. ఇతర నేరాల కట్టడి పోలీసు శాఖకు ఎంతో కీలకం. రాష్ట్రంలో శాంతి భద్రతలు పరిరక్షించేందుకు సిబ్బంది శ్రమిస్తున్నారు. అయినా ఇంకా పోలీసుల అవసరం ఉంది. భర్తీకి అవకాశాలు పరిశీలించగలరు' అంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని డీజీపీ హరీశ్ కుమార్ గుప్తా ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు పోలీసు శాఖలో భర్తీ చేయాల్సిన పోస్టుల వివరాలతో గత నెల 29న రాష్ట్ర హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్‌కు ఆయన లేఖ రాశారు. పోలీసు శాఖలోని వివిధ విభాగాల్లో సివిల్, ఆర్మ్‌డ్ రిజర్వ్, స్పెషల్ ఆర్మ్‌డ్ రిజర్వ్, ఏపీఎస్పీ, సీపీఎల్, పీటీఓ, కమ్యూనికేషన్స్‌లో ఈ ఏడాది ఆగస్టు 31నాటికి 11,639 ఖాళీలు చూపించారు. సివిల్ పోలీస్ విభాగంలో 315 ఎస్ఐలు, 3,580 సివిల్ కానిస్టేబుల్, 96 ఆర్ఎస్ఐ పోస్టులు, 2,520 ఏపీఎస్పీ కానిస్టేబుళ్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన రాగానే రాష్ట్ర వ్యాప్తంగా పోలీస్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదలయ్యే అవకాశముంది. కాగా, వైసీపీ ప్రభుత్వంలో 2022 నవంబరులో నోటిఫికేషన్ జారీ చేసినా ఒక్క పోస్టు కూడా భర్తీ చేయాలేదు. దానికి సంబంధించి కూటమి ప్రభుత్వం వచ్చాక ఇటీవలే 6,100 కానిస్టేబుల్ పోస్టులు భర్తీ చేసింది. ఇప్పుడు ఏకంగా 11వేలకు పైగా పోస్టులతో మరో నోటిఫికేషన్ విడుదలైతే ఇటు నిరుద్యోగులకు, అటు పోలీసు శాఖకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.

హైదరాబాద్‌లో 220 కిలోల ఎపిడ్రిన్ స్వాధీనం

- దీని ధర దేశీయ మార్కెట్లో రూ.10 కోట్లు.. అంతర్జాతీయ మార్కెట్లో రూ.70 కోట్లు
- జీడిమెట్లలో ఈగల్ బృందాల ఆపరేషన్.. నలుగురు అరెస్టు

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అత్యంత ప్రమాదకరమైన ఎపిడ్రిన్ మత్తుమందు తయారీ ముఠా గుట్టురట్టయింది. నలుగురిని హైదరాబాద్ ఈగల్ బృందాలు జీడిమెట్లలో అరెస్టు చేశాయి. వీరి వద్ద నుంచి 220 కిలోల ఎపిడ్రిన్‌ను స్వాధీనం చేసుకున్నారు. దేశీయ మార్కెట్‌లో దీని విలువ రూ.10 కోట్లు, అంతర్జాతీయ మార్కెట్లో రూ.70 కోట్లు ఉంటుందని ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య తెలిపారు. ఈగల్ డైరెక్టర్ వివరాల ప్రకారం... కాకినాడకు చెందిన వత్సవాయి శివరామకృష్ణ పరమావర్మ గతంలో కొన్నాళ్లు సిరిస్ తదితర కెమికల్ కంపెనీల్లో పనిచేశారు. ఆ తర్వాత రియల్ ఎస్టేట్ వ్యాపారం చేయగా నష్టాలు వచ్చాయి. ఈ నేపథ్యంలో గతంలో రెండుసార్లు అల్ప్రాజోలం తదితర మత్తుమందులు అమ్ముతూ పట్టుబడ్డాడు. నాలుగేళ్ల క్రితం వర్మ కాకినాడకు వెళ్లి ఆక్వా వ్యాపారం ప్రారంభించారు. కాకినాడకే చెందిన అనిల్ సైతం చాలా ఏళ్లుగా వివిధ రసాయన పరిశ్రమల్లో పనిచేస్తున్నాడు. వర్మ, అనిల్ పాత మిత్రులు కావడంతో గత ఏడాది వీరిద్దరు కలిసి మత్తుమందుల తయారీని ప్రారంభానికి పథకం రచించారు. తాను పనిచేస్తున్న పీఎస్ఎం లైఫ్ సైన్సెస్ సంస్థలో డ్రగ్స్ తయారీకి కావాల్సిన అన్ని వసతులున్నాయని, దీని యజమానులైన వెంకటకృష్ణ, ప్రసాద్‌లతో మాట్లాడుదామని అనిల్ చెప్పడంతో అందరూ ఓ హోటల్‌లో కలిశారు. మంచి కమీషన్ ఇస్తామని వర్మ చెప్పడంతో వెంకటకృష్ణ, ప్రసాద్‌లు అంగీకరించారు. దూలపల్లిలోని పీఎస్ఎం లైఫ్ సైన్సెస్‌లో ఎపిడ్రిన్ తయారీకి ఒప్పందం కుదిరింది. వర్మ ఇచ్చిన ఫార్ములా ప్రకారం అనిల్ 220 కిలోల ఎపిడ్రిన్ సిద్ధం చేశాడు. అమ్మకానికి వర్మ తన ఇంట్లో పలువురితో ఇటీవల సమావేశమయ్యారు. ఇదిలా ఉండగా.. గతంలో మత్తుమందుల కేసుల్లో పట్టుబడి బెయిల్‌పై బయటకు వచ్చిన వారి కదలికలను ఈగల్ బృందాలు గమనిస్తున్నాయి. ఈ క్రమంలో వర్మ కదలికలపై అనుమానంతో అతడిని ఈగల్ బృందాలు వెంటాడాయి. గురువారం జీడిమెట్లలోని వర్మ ఇంట్లో సమావేశమైన ముఠా సభ్యులను అరెస్టు చేశాయి. ఈ కేసులో వర్మ, అనిల్, వెంకట కృష్ణ, ప్రొడక్షన్ వర్కర్ దొరబాబును అరెస్టు చేశామని, ప్రసాద్ పరారీలో ఉన్నట్టు సందీప్ శాండిల్య తెలిపారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

విజయ్ ఇంటికి బాంబు బెదిరింపు



స్థానిక నీలాంగరైలో వున్న 'తమిళగ వెట్రి కళగం' (టీవీకే) అధినేత, ప్రముఖ సినీ నటుడు విజయ్ నివాసానికి వచ్చిన బాంబు బెదిరింపు కలకలం రేపింది. గురువారం ఉదయం పోలీసు కంట్రోల్ రూమ్‌కు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేసి.. విజయ్ ఇంట్లో బాంబులు పెట్టాం, అవి కొద్ది సేపట్లో పేలుతాయని బెదిరించాడు. దీంతో హుటాహుటీన పోలీసులు, బాంబ్ స్క్వాడ్ నిపుణులు, జాగిలాలతో కలిసి విజయ్ ఇంటికి పరుగులుపెట్టారు. అక్కడ క్షుణ్ణంగా తనిఖీ చేశాక, ఎలాంటి బాంబు లేదని నిర్ధారించారు. అది కేవలం బెదిరింపేనని తేల్చారు. బాంబు బెదిరింపునకు పాల్పడిన వ్యక్తి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

-చెన్నై, (ఆంధ్రజ్యోతి)



పాత్రను ఆస్వాదిస్తూ నటించాను

- శ్రీనిధి శెట్టి

'నాకు రొమాంటిక్ స్టోరీస్ చేయడం ఇష్టం. అందుకే 'తెలుసు కదా' కథ వినగానే హీరోయిన్‌గా చేసేందుకు అంగీకరించాను. ఇది నా కెరీర్‌లో తొలి పూర్తిస్థాయి ప్రేమకథా చిత్రం. అందుకే పాత్రను ఆస్వాదిస్తూ నటించాను' అని శ్రీనిధి శెట్టి చెప్పారు. సిద్ధు జొన్నలగడ్డకు జోడీగా ఆమె నటించిన చిత్రం 'తెలుసు కదా'. రాశీ ఖన్నా మరో కథానాయిక. ప్రముఖ స్టైలిస్ట్ నీరజ కోనను దర్శకురాలిగా పరిచయం చేస్తూ పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతీప్రసాద్ నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 17న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శ్రీనిధి శెట్టి మీడియాతో సినిమా విశేషాలను పంచుకున్నారు.

- ముక్కోణపు ప్రేమకథ నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది. ఈ తరహా కథలతో గతంలో చాలా సినిమాలు వచ్చాయి. కానీ ఇందులో ఓ కొత్త కోణాన్ని స్పృశించాం. అది ప్రేక్షకులను సంభ్రమాశ్చర్యాలకు గురి చేస్తుంది. తెరపై అందమైన ప్రణయ భావనల్ని ఆవిష్కరిస్తుంది. భావోద్వేగాలతో పాటు వాణిజ్యహంగులు కలబోసిన చిత్రం ఇది. ప్రేక్షకులు మంచి రొమాంటిక్ డ్రామాని ఫీల్ అవుతారు.
- నీరజ గారు చాలా ప్యాషన్‌తో సినిమా చేశారు. ఆమె విజన్ కచ్చితంగా ప్రేక్షకులకు కనెక్ట్ అవుతుంది. వినోద భరితంగా నడిపిస్తూనే భావోద్వేగభరితంగా ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. పతాక ఘట్టాలే సినిమాకు హైలెట్. కథలో బిగి చివరి వరకూ కొనసాగేలా అందమైన సన్నివేశాలను అల్లుకోవడంలో ఆమె విజయం సాధించారు.
- సిద్ధూకి అన్ని విభాగాలపై పట్టు ఉంది. తన టైమింగ్ అద్భుతం. రాశీ ఖన్నా చాలా క్రమశిక్షణ గల నటి. తన డైట్, వర్కౌట్ అన్నీ పద్ధతిగా ఉంటాయి. పీపుల్ మీడియా ప్రొడక్షన్ హౌస్‌లో పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నాను. వెంకటేశ్, త్రివిక్రమ్ గారి సినిమాలో హీరోయిన్‌గా నా పేరు వినిపిస్తోంది. ఆ అవకాశం నాకే దక్కాలని కోరుకుంటున్నాను.

ప్రతి ఒక్కరినీ హాయిగా నవ్విస్తుంది



- నిహారిక ఎన్.ఎం

"మిత్రమండలి' చిత్రంలో నా పాత్ర లలితంగా ఉంటుంది. ఈ సినిమాలో కథ, కథనం చాలా కొత్తగా ఉండడంతో పాటు థియేటర్‌కు వచ్చిన ప్రతి ఒక్కరినీ హాయిగా నవ్విస్తుంది' అని నిహారిక ఎన్. ఎం అన్నారు. ప్రియదర్శికి జోడీగా ఆమె నటించిన చిత్రమిది. విజయేందర్ దర్శకుడు. బీవీ వర్క్స్ పతాకంపై బన్నీ వాస్ సమర్పిస్తున్నారు. కల్యాణ్ మంథిన, భాను ప్రతాప్, డా. విజయేందర్‌రెడ్డి తీగల నిర్మించారు. ఈ చిత్రం ఈ నెల 16న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిహారిక ఎన్.ఎం మీడియాతో ముచ్చటించారు.

- ఈతరం యువతీ యువకుల ప్రేమకథ నేపథ్యంలో వస్తున్న పూర్తి వినోదాత్మక చిత్రమిది. ఒక స్నేహబృందం జీవితంలో జరిగిన సంఘటలను వినోదాత్మకంగా చూపించాము. అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పించే అంశాలతో దర్శకుడు చిత్రాన్ని తీర్చిదిద్దారు.
- ఇన్‌ఫ్లూయన్సర్‌గా నటన నాకు కొత్త కాదు. కానీ సినిమాల్లో నటించడం మాత్రం చాలా కొత్త అనుభూతిని, ఆనందాన్నిచ్చింది. ఇందులో నా పాత్ర చిత్రణ నవ్యపంథాలో సాగుతుంది. ప్రియదర్శి చాలా అద్భుతమైన నటుడు, మంచి వ్యక్తి. మా దర్శకనిర్మాతలు నన్ను తమ కుటుంబ సభ్యురాలిలా చూసుకున్నారు. నాకు ఎక్కువగా కామెడీ చిత్రాల్లో అవకాశాలు వస్తున్నాయి. వైవిధ్యమైన పాత్రలు పోషించి నటిగా మంచి పేరు తెచ్చుకోవాలనేది నా కోరిక.

నేను గర్వించే సినిమా

- సాయికుమార్



"అరిషడ్వర్గాల నేపథ్యంలో 'అరి' అనే సినిమా చేస్తున్నాం' అని మా దర్శకుడు జయశంకర్ చెప్పినప్పుడు కొత్తగా అనిపించింది. ఆరు పాత్రలతో జయశంకర్ ఈ చిత్రాన్ని అద్భుతంగా తెరకెక్కించారు. 'అరి' లాంటి గొప్ప చిత్రం చేసినందుకు నటుడిగా గర్వపడుతున్నాను' అని సాయికుమార్ అన్నారు. ఆయన ప్రధాన పాత్రధారిగా శ్రీనివాస్ రామిరెడ్డి, శేషురెడ్డి మారంరెడ్డి తదితరులు నిర్మించిన చిత్రమిది. నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో దర్శకుడు జయశంకర్ మాట్లాడుతూ 'మంచి సందేశంతో పాటు వినోదం మేళవించి తీసిన చిత్రమిది. సినిమాలోని పాత్రలతో ప్రేక్షకులు అనుభూతి చెందుతారు. మనం ఆధునికంగా ఎంత ఎదిగినా మన సంస్కృతి, సంప్రదాయాల గొప్పతనాన్ని మరచి పోకూడదనే అంశాన్ని ఈ తరానికి తెలియజెప్పాలనేదే మా ప్రయత్నం' అని తెలిపారు. నిర్మాత శ్రీనివాస్ రామిరెడ్డి మాట్లాడుతూ 'మనలోనే అరిషడ్వర్గాలు అనే శత్రువులు ఉంటాయి. వాటిని జయించినప్పుడే మనిషికి ప్రశాంతత లభిస్తుంది. మనిషి ఎలా జీవించాలి, ఎలా జీవించకూడదు అనే పాయింట్‌తో దర్శకుడు 'అరి' చిత్రాన్ని తీర్చిదిద్దారు' అని చెప్పారు.

మైనార్టీ యువతకు ఖతార్‌లో ఉద్యోగావకాశాలు

» 13న విజయవాడలో ఇంటర్వ్యూలు: మంత్రి ఫరూక్

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నిరుద్యోగ మైనార్టీ యువతకు కూటమి ప్రభుత్వం తరఫున ఖతార్ దేశంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్టు మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఓవర్సీస్ మాన్పవర్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్(ఓఎంసీఏపీ) ద్వారా దోహాలో హోమ్ కేర్ నర్స్(రిజిస్టర్డ్ నర్స్) ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానించినట్లు తెలిపారు. అర్హులైన యువతీ యువకులు http://naipunyam. ap.gov.in లింక్ ద్వారా ఈనెల 12లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. 13న ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279 నెంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

ఉద్యోగాల భర్తీకి ఏపీపీఎస్సీ నోటిఫికేషన్లు

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): పలు ఉద్యోగ నోటిఫికేషన్ల ఫలితాలను ఏపీపీఎస్సీ గురువారం విడుదల చేసింది. ఫిషరీస్ డెవలప్‌మెంట్ ఆఫీసర్, వైద్య ఆరోగ్య శాఖలో లైబ్రేరియన్, భూగర్భ జలవనరుల శాఖలో అసిస్టెంట్ కెమిస్ట్, గిరిజన సంక్షేమ శాఖలో అసిస్టెంట్ ట్రైబల్ వెల్ఫేర్ ఆఫీసర్ పోస్టుల ఫలితాలను విడుదల చేసింది. అలాగే ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్, ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ పోస్టుల నోటిఫికేషన్లలో మెయిన్స్‌కు ఎంపికైన వారి జాబితాలు ప్రకటించింది.

ఇన్‌చార్జ్ చైర్మన్‌గా సి.శశిధర్

ఏపీపీఎస్సీ సభ్యుడు సి.శశిధర్‌ను కమిషన్‌కు ఇన్‌చార్జ్ చైర్మన్‌గా నియమిస్తూ సాధారణ పరిపాలన శాఖ ఉత్తర్వులు జారీచేసింది. కూటమి ప్రభుత్వంలోనే ఆయన సభ్యునిగా నియమితులయ్యారు.

చెత్త నుంచి విద్యుత్ తయారీకి 4 ప్లాంట్లు

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో చెత్త నుంచి విద్యుత్ తీసే మరో నాలుగు ప్లాంట్లు ఏపీలో ఏర్పాటు కానుండడం గర్వించదగిన విషయమని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. దీనికి సంబంధించి జిందాల్, ఆంటోని లారా ఏజెన్సీలతో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఒప్పందం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నెల్లూరు, కాకినాడల్లో ప్లాంట్ల ఏర్పాటుకు జిందాల్ ఏజెన్సీతోను, కర్నూలు, కడప వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌ల ఏర్పాటుకు ఆంటోనీ లారా ఏజెన్సీతో ఒప్పందం చేసుకున్నారు.

అత్యాచార బాధితులకు సకాలంలో పరిహారం

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ ఎస్టీ అత్యాచార బాధితులకు సకాలంలో పరిహారం అందేలా చూడాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఇందుకు సంబంధించి రూ.31.54 కోట్లు విడుదల చేయగా.. రూ.27.47 కోట్లు చెల్లించారని, మిగతా నిధులు కూడా సకాలంలో చెల్లించాలని సూచించారు. ఎస్సీఎస్టీ అత్యాచార నిరోధక చట్టంపై ప్రజల్లో అవగాహనకు ప్రతినెలా 30న సివిల్ రైట్స్ డేను నిర్వహించాలని, మూడు నెలలకోసారి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాలను నిర్వహించి సమీక్షించాలని ఆదేశించారు.

సర్వే ఆఫ్ ఇండియాతో ఏపీ కార్స్ అనుసంధానం!

రాష్ట్రంలో భూముల సర్వేకోసం ఉపయోగిస్తోన్న కార్స్ నెట్‌వర్క్‌ను త్వరలో సర్వే ఆఫ్ ఇండియా(ఎస్ఓఐ) పరిధిలోని నెట్‌వర్క్‌తో అనుసంధానించనున్నారు. దీంతోపాటు 70 కార్స్ స్టేషన్ల నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతను కూడా కేంద్ర సంస్థకే అప్పగించనున్నారు. ఈ మేరకు ఎస్ఓఐతో రాష్ట్ర ప్రభుత్వంత్వరలో అవగాహన ఒప్పందం కుదుర్చుకోనుంది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఒప్పందంపై సంతకం చేసే బాధ్యతను సర్వే డైరెక్టర్‌కు అప్పగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

వంద రోజుల్లో పరిష్కరిస్తా

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లిపోతానని ప్రకటించారు. గత వైసీపీ ప్రభుత్వం మాదిరిగా పరిశ్రమలను కూటమి సర్కారు భయపెట్టదని స్పష్టం చేశారు. పారిశ్రామికవేత్తలను బెదిరించడం వైసీపీ చేసే పని అని మండిపడ్డారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలని, లేదంటే అభివృద్ధి ముందుకు వెళ్లదని అన్నారు. కాకినాడ జిల్లాలో తన సొంత నియోజకవర్గం పిఠాపురం పరిధిలోని ఉప్పాడలో గురువారం ఆయన మత్స్యకారులతో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. సముద్రంలో కలుస్తున్న పారిశ్రామిక వ్యర్థ జలాల ప్రాంతాలను మరో మూడు రోజుల్లో బోటులో వెళ్లి పరిశీలిస్తానని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో నక్కపల్లి, కాకినాడ సెజ్‌లు, దివీస్, అరబిందో తదితర పరిశ్రమలు వైఎస్ హయాంలో వచ్చినవేనని.. కూటమి పార్టీలు ప్రారంభించినవి కాదని.. వీటి ద్వారా వెదజల్లే జల, వాయు కాలుష్యంపై ఆడిట్ చేయిస్తానని తెలిపారు. అంతకుముందు ఉదయం కాకినాడ కలెక్టరేట్‌లో పలువురు మత్స్యకార ప్రతినిధులతో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. వారితో చర్చించి సమస్యలు తెలుసుకున్నారు. సాయంత్రం బహిరంగ సభలో ప్రసంగించారు. ఆ సందర్భంగా ఇంకా ఏమన్నారంటే..



ఉప్పాడలో సభలో మాట్లాడుతున్న డిప్యూటీ సీఎం పవన్, పక్కన వర్మ, ఎంపీ ఉదయ్ తదితరులు

- మత్స్యకారులు చెబుతున్న సమస్యలపై నాకూ ఆవేదన ఉంది. వారిలో నేనూ ఒకడిగానే భావిస్తా. వారికి న్యాయం చేయలేనప్పుడు.. అది కుదరనప్పుడు రాజకీయాలు వదిలి వెళ్లిపోతా.
- 4 రోజులు ధర్నా చేస్తే ఐదో రోజు పరిష్కారం కాదు. వైసీపీవారిలా భయపెట్టి పారిశ్రామికవేత్తలను పారిపోయేలా చేయం. ఓఎన్‌జీసీ అందిస్తున్న నష్టపరిహారం, పరిశ్రమలతో మాట్లాడి.. ఎలా పరిహారమివ్వాలి.. నెలనెలా ఇవ్వాలా, ఒకేసారి ఇవ్వాలా అనేది నిర్ణయించాలి.
- ఉప్పాడ తీరం ఏటా 25-30 మీటర్లు కోతకు గురవుతోందని అమిత్‌షా దృష్టికి తీసుకెళ్లా. ఉప్పాడలో రక్షణ గోడ నిర్మాణానికి రూ.323 కోట్లు ఇవ్వడానికి కేంద్రం సానుకూలంగా ఉంది.

\- పవన్ కల్యాణ్

తాగునీటిని బాటిళ్లలో తాగాల్సిన పరిస్థితి

పరిశ్రమల నుంచి విడుదలయ్యే రసాయన, జల, శబ్ద, వాయి కాలుష్యంవల్ల చాలా ఇబ్బందులు ఉన్నాయి. మత్స్యకారులు, ఎన్‌జీవో ప్రతినిధులు ఇదే విషయాన్ని నాకు వివరించారు. తామంతా పరిశ్రమలకు వ్యతిరేకం కాదని, కానీ అవి తమ ఉపాధి, జీవనోపాధిని దెబ్బతీయకూడదని చెప్పారు. ఇది చాలా మంది ఆలోచనాధోరణి. గోదావరి జిల్లాలు, నెల్లూరు తదితర ప్రాంతాల్లో ఆక్వాకల్చర్ వల్ల ప్రభుత్వానికి రూ.1.30 లక్షల కోట్ల ఆదాయం వస్తోంది. ప్రత్యక్షంగా 3.72 లక్షల మందికి, పరోక్షంగా 15 లక్షల మందికి ఉపాధి లభిస్తోంది. ఇది ఒకవైపు అభివృద్ధి.. అదే సమయంలో ఆయా ప్రాంతాల్లో తాగునీరు కలుషితమైంది. రక్షిత తాగునీటిని బాటిళ్లల్లో తాగాల్సిన పరిస్థితి.

సంఘాల నేతలతో చర్చించా

ఉప్పాడ కొత్తపల్లి మండలంలో మత్స్యకారులు నాలుగు రోజులు ధర్నాలు, ఆందోళనలు చేసిన విషయం నా దృష్టికి వచ్చింది. సమస్య పరిష్కారానికి కలెక్టరేట్‌లో మత్స్యకార సంఘాల నేతలతో చర్చించా. నక్కపల్లి సెజ్, దివీస్, అరబిందో, డెక్కన్ తదితర పరిశ్రమల నుంచి సముద్రంలో కలుస్తున్న కాలుష్యం వల్ల వేట దొరకడం లేదని వారు చెప్పారు. అంతర్వేది, మచిలీపట్నం నిజాంపట్నం తదితర ప్రాంతాలకు వేటకు వెళ్తే ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. వీటన్నిటినీ పరిష్కరించడానికి వంద రోజులు గడువు ఇవ్వండి. సముద్రంలో ఎంతశాతం కాలుష్యం కలుస్తోందో ఆడిట్ చేయకుంటే తెలియదు కదా! వ్యర్థాలు ఎక్కడ వదులుతున్నారు.. అవి సముద్రంలో ఎక్కడ కలుస్తున్నాయో మూడ్రోజుల్లో బోటులో వెళ్లి పరిశీలిస్తా. ఇతర ప్రాంతాల్లో వేట విషయంలో మంత్రి కొల్లు రవీంద్ర, రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆధ్వర్యంలో సమావేశాలు జరిగాయి. ఇతర ప్రాంతాల వారు అక్కడకు వెళ్లి వేట సాగించే విషయంలో సానుకూలంగా ఉన్నారు. కానీ రింగు వలలు వినియోగించకూడదని చెబుతున్నారు.

పదవీకాలం పూర్తయ్యేలోగా రక్షణ గోడ

ఏదో ఒక మాట చెప్పేసి మీతో చప్పట్లు కొట్టించుకుని వెళ్లిపోవచ్చు. కానీ నేనలా అనుకోవడం లేదు. నిజం కురచ, అబద్ధం పొడవు. మీకు బాసటగా నిలబడతా. ఉప్పాడ రక్షణ గోడను నా పదవీకాలం పూర్తయ్యేలోగా పూర్తి చేస్తా. అవసరమైతే అమిత్‌షా, మోదీతో మాట్లాడతా. పారిశ్రామిక కాలుష్యం, ఇతర విషయాల్లో పరిశ్రమలు, మత్స్య శాఖలతో పాటు సంబంధిత మంత్రులందరితో మాట్లాడాలి. పీసీబీతో పరిశీలన జరిపాలి. ఇవన్నీ జరిగితేనే పూర్తి స్థాయి పరిష్కారం లభిస్తుంది. మీరు తిడితే పడతాను. మీ ఇంట్లో కుటుంబ సభ్యుడిని, నన్ను కాకపోతే ఎవరినంటారు? మిమ్మల్ని ఎగదోసి పబ్బం గడుపుకొనే నాయకులను నమ్మొద్దు. వారు పరిశ్రమలతో ఎంతో కొంత మాట్లాడుకుని పక్కకు తప్పుకొంటారు. నాపై నమ్మకం ఉంచండి. డిప్యూటీ సీఎంగా, పిఠాపురం ఎమ్మెల్యేగా కాదు. మీలో ఒకడిగా ఉన్నాను. తిట్లు, దెబ్బలు తినడానికి సిద్ధంగా ఉన్నా. ఎక్కడికీ పారిపోను. నియోజకవర్గంలో చేపట్టే కాలుష్య నియంత్రణ మోడల్‌ను భవిష్యత్‌లో రాష్ట్రమంతా అమలు చేస్తాం.

రాష్ట్ర యువతకు
విదేశీ కొలువులు

» ఓంక్యాప్ ద్వారా ఐదేళ్లలో లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యం

» నైపుణ్యాభివృద్ధిపై సమీక్షలో మంత్రి లోకేశ్

» రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు నామ్‌టక్ సంస్థ ముందుకొచ్చినట్లు వెల్లడి

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో ఓవర్సీస్ మ్యాన్‌పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (ఓంక్యాప్) ద్వారా లక్ష బ్లూకాలర్ ఉద్యోగాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్ శాఖల మంత్రి లోకేశ్ తెలిపారు. ఇందుకు నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ అధికారులు తగిన రూట్‌మ్యాప్‌ను రూపొందించి, ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు. గురువారం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో ఉండవల్లి నివాసంలో మంత్రి సమీక్ష నిర్వహించారు. నర్సింగ్, వెల్డర్లు, ట్రక్కర్లు, బిల్డింగ్ వర్కర్లకు యూరప్‌తోపాటు జర్మనీ, ఇటలీల్లో మంచి డిమాండ్ ఉందని తెలిపారు. నర్సింగ్, ఐటీఐ, పాలిటెక్నిక్ విద్యనభ్యసించిన యువతీ యువకులకు ఆయా భాషల్లో శిక్షణ ఇచ్చి విదేశాల్లో ఉద్యోగాలు లభించేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రస్తుతం ఓంక్యాప్ ద్వారా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 2,774 మంది నర్సింగ్ అభ్యర్థులు విదేశీ భాషల్లో శిక్షణ పొందుతున్నారని అధికారులు తెలిపారు. జర్మనీ, ఇతర విదేశీ భాషల్లో శిక్షణ కోసం డీఈఎఫ్ఏ, డీఈఎల్‌సీ (యూరోపియన్ లాంగ్వేజ్ సర్టిఫికేషన్), జర్మన్ లాంగ్వేజెస్ ఎసెస్‌మెంట్ సెంటర్‌ను రాష్ట్రంలో ఏర్పాటు చేయడానికి ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. నైపుణ్యం పోర్టల్‌పై లోకేశ్ సమీక్షించారు. ఇందులో 23 విభాగాల డాటాబేస్‌ను ఏకీకతృతం చేసినట్లు చెప్పారు. రాష్ట్రంలోని 4,639 భారీ, మధ్యతరహా పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వర్క్‌ఫోర్స్‌ను సిద్ధం చేయాలన్నారు. వచ్చే నెలలో పోర్టల్‌ను ప్రారంభించే సమయానికి ఉద్యోగాలకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని యువతకు అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. ఆర్సెలర్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్స్ అనుబంధ సంస్థ నామ్‌టక్ (న్యూ ఏజ్ మేకర్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) రాష్ట్రంలో నైపుణ్య శిక్షణ కేంద్రం ఏర్పాటుకు ముందుకొచ్చినట్లు తెలిపారు.



స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి లోకేశ్

పాలిటెక్నిక్ కళాశాలలను తీర్చిదిద్దాలి

మిషన్ మోడల్‌లో 83 ప్రభుత్వ ఐటీఐల అభివృద్ధికి చర్యలు చేపట్టాలని లోకేశ్ చెప్పారు. వాటిలో మౌలిక వసతులు, ఆధునికీకరణ పనుల కోసం రూ.322 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు అధికారులు తెలిపారు. పీఎం వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన, పీఎం ఇంటర్న్‌షిప్‌లలో ఏపీని అగ్రస్థానంలో నిలపాలని మంత్రి కోరారు. 87 పాలిటెక్నిక్‌లలో 646 టీచింగ్, 2,183 నాన్ టీచింగ్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారులు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాలలను మెరుగ్గా తీర్చిదిద్దేందుకు దేశంలో విజయవంతమైన మోడల్‌ను అధ్యయనం చేయాలని లోకేశ్ ఆదేశించారు. హబ్ అండ్ స్పోక్ మోడల్‌లో విశాఖ, అనంతపురం, చిత్తూరు జిల్లాల్లో 3 హబ్‌లు, వాటికి అనుబంధంగా 13 స్పోక్స్‌లలో ఐటీఐల అభివృదికి ప్రణాళికలను త్వరగా సిద్ధం చేయాలన్నారు.

స్టార్టప్‌ల వృద్ధిలో దేశంలోనే టాప్‌గా ఉండాలి

» ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాలి

» నేడు క్యాబినెట్ ముందుకు 'క్వాంటమ్' పాలసీ

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే లక్ష్యమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. గురువారం ఉండవల్లిలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖపై సమీక్ష నిర్వహించారు. స్టార్టప్‌ల వృద్ధిలో దేశంలో అగ్రస్థానంలో ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వాట్సప్ గవర్నెన్స్‌ను సమర్థంగా అమలు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్ పాలసీని శుక్రవారం మంత్రివర్గం ఆమోదించనుందని చెప్పారు. పెట్టుబడులు పెట్టిన, కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఐటీ, ఎలక్ట్రానిక్స్ పరిశ్రమలకు త్వరలోనే రాయితీలు చెల్లిస్తామన్నారు. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్, ఇన్నోవేషన్ సొసైటీ, స్పేస్ అప్లికేషన్స్ సెంటర్‌పైనా చర్చించారు. పెట్టుబడులకు ఆసక్తి చూపిన సంస్థలతో ఒప్పందాలు కార్యరూపం దాల్చి కార్యకలాపాలు చేపట్టేంత వరకూ సంప్రదింపులు జరుపుతూనే ఉండాలని సూచించారు. గూగుల్, టీసీఎస్, ఏఎన్ఎస్ఆర్ వంటి కంపెనీలు త్వరితగతిన కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐదేళ్లలో ఐటీ, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో ఐదు లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే లక్ష్యమని, ప్రపంచంలో టాప్-100 కంపెనీల యాజమాన్యాలతో నిత్యం సంప్రదింపులు జరపాలని సూచించారు.

రోడ్లు.. వంతెనలు ధ్వంసం!

31 వేల కి.మీ. పరిధిలో పాడైన రహదారులు

» రాష్ట్రవ్యాప్తంగా 3,338 వంతెనలు ధ్వంసం

» తాజా పరిస్థితిపై మంత్రి జనార్దన్‌రెడ్డి సమీక్ష

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని రహదారులు, వంతెనలు భారీగా దెబ్బతిన్నాయి. ఒకవైపు పాడైన రోడ్లకు ప్రభుత్వం మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకొస్తోంది. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో దాదాపు 31వేల కి.మీ. పరిధిలో రహదారులు దెబ్బతిన్నాయి. ఇక వంతెనల పరిస్థితి మరీ దారుణంగా మారింది. రాష్ట్రవ్యాప్తంగా 3,338 వంతెనలు ధ్వంసమైతే వాటిలో 828 మరమ్మతులకు కూడా పనికిరానంతగా పాడయ్యాయి. వీటిని పూర్తిగా పునర్నిర్మించాల్సిందేనని ఆర్అండ్‌బీ విభాగం నివేదించింది. రహదారుల పరిస్థితిపై ఇక్కడి ఆర్అండ్‌బీ ఈఎన్‌సీ కార్యాలయంలో మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి గురువారం సమీక్షించారు. ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి. కృష్ణబాబు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు. దెబ్బతిన్న రహదారులు, వంతెనలు, మరమ్మతు పనులపై అధికారులు ప్రజంటేషన్లు ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లా ప్రధాన రహదారులు 24,117 కి.మీ., స్టేట్ హైవేస్ 7,737 కి.మీ. మేర దెబ్బతిన్నాయి. ఈ పనులు చేపట్టేందుకు తక్షణం రూ.500 కోట్లు అవసరమని కృష్ణబాబు తెలిపారు. మరో 4,229 కి.మీ. రహదారుల నిర్మాణం, విస్తరణ, అభివృద్ధి కోసం రూ.2వేల కోట్లు అవసరమన్నారు. వంతెనల నిర్మాణానికి రూ.3,850 కోట్లు కావాలని, 16వ ఆర్థిక సంఘం నుంచి ఈ నిధులు కోరదామని ఆయన ప్రతిపాదించారు. కాగా, ఆర్అండ్‌బీ వద్ద ఖాళీగా ఉన్న స్థలాలను పీపీపీ విధానంలో అభివృద్ధి చేసే అంశంపై ప్రభుత్వంతో చర్చిస్తామని మంత్రి చెప్పారు. జగన్ సర్కారు నిధులను మళ్లించడంతో నిలిచిపోయిన ఎన్‌డీబీ ప్రాజెక్టుల పనులను తిరిగి ప్రారంభించడానికి కాంట్రాక్టర్ల సమావేశం ఏర్పాటుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ఈఎన్‌సీలకు జిల్లాల పర్యవేక్షణ బాధ్యతలు

రహదారుల ప్యాచ్‌వర్క్‌లు, పునర్నిర్మాణ, విస్తరణ, అభివృద్ధి పనులను ఈఎన్‌సీ, సీఈలు క్షేత్రస్థాయిలో పర్యటించి పర్యవేక్షించాలని మంత్రి జనార్దన్‌రెడ్డి ఆదేశించారు. ఈ మేరకు వారికి ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన పని విభజన చేస్తూ కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు.

భారీగా ఐఏఎస్‌ల
బదిలీలు

» సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా చక్రధరరావు వ్యవసాయ డైరెక్టర్‌గా జిలానీ

» ఒకే రోజు 29 మందికి పోస్టింగులు

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం భారీ ఎత్తున అఖిల భారత సర్వీసు అధికారుల బదిలీలు చేపట్టింది. కొన్ని కీలక శాఖలకు విభాగాధిపతు(హెచ్‌వోడీ)లను, ఏడు జిల్లాలకు కొత్త జాయింట్ కలెక్టర్లను నియమించింది. మొత్తం 29 మందిని బదిలీ చేయగా ఇద్దరు అధికారులకు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేశ్‌కుమార్ మీనా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కేవీఎన్ చక్రధర్‌బాబును సెకండరీ హెల్త్ డైరెక్టర్‌గా నియమించింది. మంజీర్ జిలానీని మార్క్‌ఫెడ్ నుంచి బదిలీ చేసి వ్యవసాయ శాఖ డైరెక్టర్‌గా నియమించింది. ఆయనకు ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్, మార్క్‌ఫెడ్‌ల ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. వ్యవసాయ శాఖలో ఉన్న ఎస్.డిల్లీరావును బదిలీ చేసి పౌరసరఫరాల సంస్థ వైస్‌చైర్మన్-ఎండీగా నియమించింది. కొంత మంది జూనియర్ ఐఏఎస్‌లను సచివాలయంలో డిప్యూటీ సెక్రటరీ స్థానాల్లో ప్రభుత్వం నియమించింది. సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ సెక్రటరీగా సి.విష్ణుచరణ్, మెడికల్ అండ్ హెల్త్-ఎస్.ఎస్.శోభిక, గృహనిర్మాణం డిప్యూటీ సెక్రటరీగా బీఎస్‌వీ త్రివినాగ్‌కు పోస్టింగ్‌లు లభించాయి. సాంఘిక సంక్షేమ కార్యదర్శిగా ఉన్న ప్రసన్న వెంకటేశ్‌కు లిడ్‌క్యాప్ వైస్‌చైర్మన్-ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. శాప్ ఎండీ ఎస్.భరణి యువజన సర్వీసుల శాఖ ఎండీగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తారు.

ఐఏఎస్‌ల బదిలీలు.. పోస్టింగులు

అధికారి పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
కేవీఎన్ చక్రధర్ బాబు	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	సెకండరీ హెల్త్ డైరెక్టర్
డా.మంజీర్ జిలానీ	మార్క్‌ఫెడ్ ఎండీ	వ్యవసాయ డైరెక్టర్
పి.రవిసుభాష్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఏపీపీఎస్సీ కార్యదర్శి
శివశంకర్ లోతేటి	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	చైర్మన్-ఎండీ, ఏపీఎస్‌పీడీసీఎల్
ఎస్.డిల్లీరావు	వ్యవసాయ డైరెక్టర్	పౌరసరఫరాల సంస్థ వీసీ-ఎండీ
పి.రంజిత్ బాషా	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఇంటర్ విద్య డైరెక్టర్
పి.అరుణ్‌బాబు	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	గృహనిర్మాణ సంస్థ వీసీ-ఎండీ
జె.వి.మురళి	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	సీసీఎల్ఏ అదనపు కార్యదర్శి
చేతన్ టీఎస్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	సీసీఎల్ఏ సంయుక్త కార్యదర్శి
బి.నవ్య	జేసీ, కర్నూలు	వేర్ హౌసింగ్ కార్పొరేషన్ వీసీ-ఎండీ
ప్రవీణ్ ఆదిత్య సీవీ	మారిటైమ్ బోర్డు సీఈవో	ఎయిర్‌పోర్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ
కేఎస్ విశ్వనాథన్	విశాఖ మెట్రోపాలిటన్ కమిషనర్	సమాచార-పౌరసంబంధాల శాఖ డైరెక్టర్
ఆర్.గోవింద రావు	సర్వే సెటిల్‌మెంట్ అదనపు డైరెక్టర్	పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్
ఎస్.చిన్నరాముడు	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఎస్సీ కమిషన్ కార్యదర్శి
జి.ఎస్.ఎస్.ప్రవీణ్‌చంద్	సీఆర్‌డీఏ అదనపు కమిషనర్	ట్రాన్స్‌కో జాయింట్ ఎండీ
భావన	కాకినాడ మున్సిపల్ కమిషనర్	బాపట్ల జేసీ
సి.విష్ణుచరణ్	నంద్యాల జేసీ	సాంఘిక సంక్షేమం డిప్యూటీ సెక్రటరీ
ఎస్.ఎస్.శోభిక	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	వైద్య ఆరోగ్యం డిప్యూటీ సెక్రటరీ
అభిషేక్ కుమార్	శ్రీసత్యసాయి జేసీ	మారిటైమ్ బోర్డు సీఈవో
కొల్లాబత్తుల కార్తీక్	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	నంద్యాల జేసీ
శుభమ్ బన్సల్	తిరుపతి జేసీ	డైరెక్టర్, ఇండస్ట్రీస్
అభిషేక్ గౌడ ఎంజే	అల్లూరి జిల్లా జేసీ సీతారామరాజు	ఏలూరు జేసీ
నూరుల్ ఖమర్	ఆర్థిక శాఖ డిప్యూటీ సెక్రటరీ	కర్నూలు జేసీ
రాహుల్ మీనా	కాకినాడ జేసీ	రాజమండ్రి మున్సిపల్ కమిషనర్
అపూర్వ భరత్	ఏటిపాక సబ్ కలెక్టర్	కాకినాడ జేసీ
మంత్రి మౌర్య భరద్వాజ్	ఆదోని సబ్ కలెక్టర్	శ్రీసత్యసాయి జేసీ
బీఎస్‌వీ త్రివినాగ్	మార్కాపురం సబ్ కలెక్టర్	గృహనిర్మాణం డిప్యూటీ సెక్రటరీ
కె.మురళీధర్ (ఐఆర్ఎస్)	పోస్టింగ్ కోసం ఎదురుచూపు	ఏపీ డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ
తిరుమని శ్రీపూజ	పీటీడీఏ పీవో, పాడేరు	అల్లూరి జేసీ

ఈబీ5తో గ్రీన్‌కార్డు సులభం

» 7 కోట్ల పెట్టుబడితో కుటుంబ సభ్యులకూ పౌరసత్వం

» 'ఆంధ్రజ్యోతి'తో ఇమిగ్రేషన్ అటార్నీ ఇలియా ఫిష్‌కిన్



విజయవాడ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): అమెరికాలో స్థిరపడాలనుకున్న భారతీయులకు అక్కడి ప్రభుత్వం అమలు చేస్తున్న ఈబీ 5 పథకం ఒక సువర్ణ అవకాశమని 'ది న్యూయార్క్ ఇమిగ్రేషన్ ఫండ్' అటార్నీ ఇలియా ఫిష్‌కిన్ వెల్లడించారు. ఈ స్కీంలో పెట్టుబడిదారుల కుటుంబానికి గ్రీన్‌కార్డు వస్తుందని తెలిపారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధించిన తాజా షరతుల నేపథ్యంలో అక్కడికి వెళ్లాలనుకుంటున్న భారతీయులు ఆందోళన చెందుతున్న విషయం తెలిసిందే. వారి అపోహలు, ఆందోళనలు తొలగించేందుకు ఈబీ5 ఐవీఈ ఇమిగ్రేషన్ సర్వీస్ రెండు తెలుగు రాష్ట్రాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికి ఇలియా ఫిష్‌కిన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. 'అమెరికా ప్రభుత్వం పెట్టుబడిదారులకు మార్గనిర్దేశన చేయడానికి ఇమిగ్రేషన్ సర్వీసు ప్రాంతీయ కేంద్రాలను ప్రారంభించింది.వివిధ దేశాల నుంచి పెట్టుబడులతో వచ్చే వారికి ఈ ప్రాంతీయ కేంద్రాలు అవగాహన కల్పిస్తాయి. ఏ పెట్టుబడిదారుడైనా ఈ కేంద్రాల ద్వారా మాత్రమే రావాలి. కుటుంబంలో ఒక వ్యక్తి పెట్టుబడి పెడితే భార్యభర్తలతోపాటు 21 ఏళ్లలోపు వివాహం కాని పిల్లలకూ అమెరికా ప్రభుత్వం గ్రీన్‌కార్డు మంజూరు చేస్తుంది. దీనిపై వివిధ వర్గాలకు అవగాహన కల్పించడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టాం. అమెరికాలో ఎక్కువ నిరుద్యోగ శాతం ఉన్న ప్రాంతాల్లో పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. ఆ ప్రాంతాల్లో కనీసం రూ.7 కోట్ల వరకు పెట్టుబడి పెట్టడంతోపాటు 10 మందికి ఉపాధి అవకాశాలను చూపించాలి. అటువంటి వారికి గ్రీన్‌కార్డు చాలా సులభంగా వస్తుంది" అని ఫిష్‌కిన్ వివరించారు. ఆయనతోపాటు ఈబీ5 ఐబీఈ భాగస్వామి పి.సుబ్బరాజు ఉన్నారు.

గోడ కూల్చివేత ఖర్చు చెల్లించండి

» వారంలోగా 48.21 లక్షలను జీవీఎంసీ వద్ద జమ చేయండి

» 17.46 కోట్ల నష్టపరిహారం.. నివేదికపై అభిప్రాయం చెప్పండి

» నేహారెడ్డి, అవ్యాన్ రియల్టర్స్‌కు హైకోర్టు ఆదేశం

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి కుమార్తె నేహారెడ్డి, ఆమె కంపెనీ అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీకి హైకోర్టు ఝలక్ ఇచ్చింది. విశాఖ జిల్లా భీమునిపట్నం పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా సముద్రానికి అతి సమీపంలో నిర్మించిన కాంక్రీట్ గోడను కూల్చేందుకు ఇప్పటి వరకు అయిన రూ.48.21 లక్షల ఖర్చును తదుపరి విచారణలోగా జీవీఎంసీ వద్ద జమ చేయాలని ఆదేశించింది. కాంక్రీట్ నిర్మాణం కారణంగా ప్రకృతికి నష్టం జరిగిందని, అందుకుగాను సంబంధిత కంపెనీ నుంచి రూ.17.46 కోట్ల నష్ట పరిహారం రాబట్టాలని కేంద్ర అటవీ-పర్యావరణ శాఖ కమిటీ ఇచ్చిన నివేదికపై స్పందన తెలపాలని అవ్యాన్ రియల్టర్స్‌కు స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈనెల 16కు వాయిదా వేసింది. ఈ మేరకు చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, జస్టిస్ ఆర్.రఘునందనరావులతో కూడిన ధర్మాసనం గురువారం ఉత్తర్వులిచ్చింది. సీఆర్‌జెడ్ నిబంధనలు ఉల్లంఘించి రెస్టోబార్‌లు నిర్మాణం చేశారని ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ(ఏపీసీజెడ్ఎంఏ) మెంబర్ సెక్రెటరీ, జీవీఎంసీ కమిషనర్, విశాఖ జిల్లా కలెక్టర్‌తో కూడిన కమిటీ ఇచ్చిన నివేదికపై స్పందన తెలపాలని రెస్టోబార్ యాజమాన్యాలకు ధర్మాసనం స్పష్టం చేసింది. సముద్రానికి అతిసమీపంలో నేహారెడ్డి కంపెనీ కాంక్రీట్ నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదంటూ జనసేన కార్పొరేటర్ పీఎల్‌వీఎన్ మూర్తి యాదవ్ పిల్ వేసిన విషయం తెలిసిందే. నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన 4 రెస్టోబార్లను తొలగించడంతో పాటు సహజ ఆవాసాలను పునరుద్ధరించేలా ఆదేశాలివ్వాలని గ్రామాభివృద్ధిసేవా సంఘం అధ్యక్షుడు గంటా నూకరాజు కూడా పిల్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యాలు గురువారం మరోసారి విచారణకు రాగా.. గోడ నిర్మాణం కారణంగా ప్రకృతికి రూ.17.46 కోట్లు నష్టం జరిగిందని ఎంవోఈఎఫ్ కమిటీ అంచనా వేసిందని కేంద్రం తరఫున ఏఎస్‌జీ చల్లా ధనంజయ తెలిపారు. గోడ కూల్చివేతకు ఇప్పటివరకు రూ 48.21 లక్షలు ఖర్చు చేశామన్నారు. ఈ సొమ్ము చెల్లించాలని అవ్యాన్ రియల్టర్స్‌కు నోటీసులు ఇచ్చినా స్పందన లేదని ఎస్‌జీపీ ఎస్.ప్రణతి తెలిపారు.

సుభిక్షంగా ఉంటే ఓర్వలేని జగన్

» పర్యటనల పేరుతో రాష్ట్రంలో అరాచకం: మంత్రి అనగాని

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రం సుభిక్షంగా ఉంటే ఓర్వలేని సైకో జగన్... పర్యటనల పేరుతో అరాచకం సృష్టిస్తున్నారని మంత్రి అనగాని సత్యప్రసాద్ మండిపడ్డారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జగన్ నర్సీపట్నం పర్యటనపై ఆయన స్పందించారు. 'విశాఖకు పెద్ద ఎత్తున ప్రాజెక్టులు వస్తుంటే జగన్ సహించలేకపోతున్నారు. అందుకే ప్రశాంతంగా ఉన్న ఉత్తరాంధ్రలో చిచ్చుపెట్టేందుకే పర్యటనలు చేస్తున్నారు. జగన్‌రెడ్డి తన పాలనలో ఏ ఒక్క ప్రాజెక్టునూ పూర్తి చేయలేదు. ఒక్క మెడికల్ కాలేజీని కూడా పూర్తి చేయలేదు. మెడికల్ కాలేజీల నిర్మాణానికి రూ.8,500 కోట్లు ఖర్చు చేయాల్సి ఉండగా కేవలం రూ.1,500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. ఇదే పద్ధతిలో వాటిని పూర్తి చేయాలంటే మరో 17 ఏళ్లు పడుతుంది. దానివల్ల మనం రెండు వేల పీజీ సీట్లను కోల్పోతాం. మెడికల్ కాలేజీలపై చిత్తశుద్ధిలేని ఆయన ఇప్పుడు వెళ్లి వాటిని పరిశీలిస్తామనడం సిగ్గుచేటు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో మేనేజ్మెంట్ కోటాను మొట్ట మొదట తీసుకొచ్చిందే జగన్‌రెడ్డి. అలాంటి వ్యక్తి పీపీపీ మోడల్‌పై అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. పీపీపీ మోడల్ ద్వారా మెడికల్ కాలేజీల్లో 220 మెడికల్ సీట్లు అదనంగా వస్తాయి. వీటిల్లో 110 ఉచిత సీట్లు ఉన్నాయి. ప్రజాసంక్షేమం కోసం మాత్రమే ప్రభుత్వం పీపీపీ విధానాన్ని అమలు చేస్తోంది. ఐదు కిలోమీటర్ల దూరానికే హెలికాప్టర్‌లో వెళ్లే జగన్ విశాఖలో మాత్రం అరాచకం చేసేందుకే రోడ్డు పర్యటన చేస్తున్నారు' అని సత్యప్రసాద్ మండిపడ్డారు.

పీపీపీ అంటే ఆయనకు అర్థం తెలియదు

» విశాఖ ఉక్కు కోసం మొసలి కన్నీరు: చింతకాయల విజయ్

విశాఖపట్నం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో మెడికల్ కళాశాలల సందర్శన పేరుతో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి బూటకపు పర్యటనలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ విమర్శించారు. గురువారం విశాఖలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 'అనకాపల్లిలో వైద్య కళాశాల అని 2021లో ప్రకటించిన జగన్, ఆ తరువాత దానిని నర్సీపట్నానికి మార్చారు. నర్సీపట్నం కళాశాలకు రూ.11 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. జగన్ సీఎంగా ఉండగానే ఆ కళాశాల నిర్మాణం నిలిచిపోయింది. పబ్లిక్-ప్రైవేటు పార్టనర్‌షిప్ అంటే జగన్‌కు అర్థం తెలియదు. ఆయన హయాంలో పనులు ప్రారంభించిన వైద్య కళాశాలలను ఏనాడైనా జాతీయ మెడికల్ కౌన్సిల్ అధికారులు సందర్శించిన సందర్భాలు ఉన్నాయా? వైద్య కళాశాలలకు సంబంధించి కేంద్రానికి పంపిన ఎల్‌వోపీలో నర్సీపట్నం మెడికల్ కళాశాల లేదని జగన్ గుర్తుంచుకోవాలి. జగన్‌కు సరైనోడు మంత్రి నారా లోకేశే. జగన్‌కు దమ్ముంటే పులివెందుల వదిలి విశాఖ వచ్చి పోటీ చేయాలి. 2029లో జరగనున్న ఎన్నికల్లో గెలిచేది కూడా కూటమే. త్వరలో వైసీపీ పార్టీ కాలిపోతుంది' అని విజయ్ వ్యాఖ్యానించారు.

భోగాపురం ఎయిర్‌పోర్టు పీపీపీకి ఇవ్వలేదా?

» యాత్ర విఫలంతో ఫ్రస్టేషన్‌లో జగన్: మంత్రి పార్థసారథి

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): గంగవరం పోర్టు, భోగాపురం ఎయిర్‌పోర్టు, మచిలీపట్నం పోర్టును వైసీపీ హయాంలో పీపీపీ విధానంలో ఇవ్వలేదా? అని మంత్రి పార్థసారథి.. జగన్‌ను నిలదీశారు. గురువారం ఆయన టీడీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జగన్ నర్సీపట్నం యాత్ర విఫలమైందన్నారు. ఆయన పర్యటనకు ప్రజల నుంచి స్పందన లేకపోవడంతో ఆ ఫ్రస్ట్రేషన్‌తో విలేకరుల సమావేశంలో అరుపులు, పెడబొబ్బలు పెట్టారని ఎద్దేవా చేశారు. వైసీపీ నాయకులకు లంచాలు ఇవ్వలేక నర్సీపట్నం మెడికల్ కాలేజీ నిర్మాణాన్ని కాంట్రాక్టరు ఆపేశారని, ఆ కాలేజీపై జగన్ పెట్టిన ఖర్చు రూ.10.76 కోట్లు మాత్రమేనని తెలిపారు.

జగన్ పర్యటన రాజకీయ డ్రామా: మంత్రి అచ్చెన్న

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ నర్సీపట్నం పర్యటన రాజకీయ డ్రామా అని, అది ప్రజల్ని తప్పుదారి పట్టించే ప్రయత్నం తప్ప, ప్రజా ప్రయోజనం లేదని మంత్రి అచ్చెన్నాయుడు విమర్శించారు. జగన్ నర్సీపట్నం వస్తుంటే.. వైసీపీ నేతలు పార్టీని వీడుతున్నారని ఎద్దేవా చేశారు. మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్‌తో సహా వెయ్యి మంది వైసీపీని వీడి టీడీపీలో చేరారని తెలిపారు. ఈమేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రూపాయి కూడా ఖర్చు చేయని జగన్.. డాక్టర్ అవ్వాలనే పేద విద్యార్థుల కలలకు మోకాలడ్డుతున్నారు. వైసీపీ పాలనలోనే ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రైవేట్ కోటాకు 50శాతం సీట్లు కేటాయించారు. ప్రజలకు వైద్య విద్య అవకాశాలను విస్తరించేందుకే పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలను స్థాపించాలని కూటమి ప్రభుత్వం నిర్ణయిస్తే.. పేదలకు మేలు చేసే విధానాలను కూడా జగన్ వ్యతిరేకించడం దారుణం' అని మండిపడ్డారు.

50% మెడికల్ సీట్లు ప్రైవేటుకు కేటాయించింది ఎవరు?

» జగన్‌కు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా బహిరంగ లేఖ

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లో ప్రైవేటు కోటాకు 50 శాతం సీట్లు కేటాయిస్తూ జీవోలు 107, 108, 133లను విడుదల చేసింది వైసీపీ ప్రభుత్వమేనని, ఈ విషయాన్ని జగన్ కాదనగలరా? అని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ప్రశ్నించారు. గురువారం జగన్‌కు ఈమేరకు ఆయన బహిరంగ లేఖ రాశారు. 'ప్రభుత్వ మెడికల్ కాలేజీల నిర్మాణాలకు రాష్ట్ర నిధులు రూపాయి కూడా జగన్ ప్రభుత్వం చేయలేదు. వాటిపై చేసిన ఖర్చు రూ.1550 కోట్లు కేంద్ర ప్రభుత్వ నిధులే?. జగన్ పాలనలో మెడికల్ కాలేజీల నిర్మాణం పూర్తయింది 18 శాతమే. అదే తీరులో నిర్మాణాలు సాగితే 1750 మెడికల్ సీట్లు మురిగిపోయే ప్రమాదం ఉంది. పీపీపీ విధానం వల్ల రాష్ట్ర విద్యార్థులకు ప్రభుత్వ కోటాలో 110 సీట్లు అదనంగా వస్తాయి. గంగవరం పోర్టును ప్రైవేటుకు అమ్మేసిన జగన్ నేడు పీపీపీ విధానంపై మాట్లాడటం సిగ్గుచేటు' అని పేర్కొన్నారు.

అల్లర్లు చేయడమే జగన్ లక్ష్యం: ఎమ్మెల్యే నక్కా

కూటమి ప్రభుత్వం ఎలాంటి మంచి కార్యక్రమాలు చేపట్టినా అడ్డుకోవడం జగన్ రెడ్డికి పరిపాటిగా మారిందని, ప్రజాదరణ కోల్పోయిన ఆయన పర్యటన పేరిట అల్లర్లు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నారని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్యే నక్కా ఆనంద్‌బాబు ఒక ప్రకటనలో విమర్శించారు. పీపీపీ విధానంలో మెడికల్ కాలేజీలు నిర్మిస్తే తప్పేంటని న్యాయస్థానాలే చెబుతున్నా, అజ్ఞాని జగన్‌కు చెవికెక్కడం లేదన్నారు.

జగన్ డైరెక్షన్‌లోనే అంబేడ్కర్ విగ్రహంపై దాడి: ప్రతిభా భారతి

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): జగన్ అండదండలు లేకుండా చిత్తూరు జిల్లాలో అంబేడ్కర్ విగ్రహంపై వైసీపీ నాయకులు దాడి చేసే సాహసం చేయరని ఉమ్మడి అసెంబ్లీ మాజీ స్పీకర్ కావలి ప్రతిభాభారతి అన్నారు. గురువారం ఆమె టీడీపీ కేంద్ర కార్యాలయంలో మాట్లాడారు. పక్కా ప్రణాళికతో అంబేడ్కర్ విగ్రహానికి నిప్పు పెట్టి రాజకీయం చేయాలనుకున్నారని, ఆ కుట్రను టీడీపీపైకి నెట్టి రాజకీయ లబ్ధి పొందాలని చూశారని మండిపడ్డారు.

అలజడులకు జగన్ యత్నాలు: పీతల సుజాత


అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అలజడులు సృష్టించి, విధ్వంసాలు చేయాలని వైసీపీ నేతలతోపాటు, జగన్‌రెడ్డి ప్రయత్నిస్తున్నారని మాజీ మంత్రి పీతల సుజాత ఆరోపించారు. గురువారం అమరావతి సచివాలయంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ 'వైసీపీ పాలనలో మాస్క్ అడిగిన నర్సీపట్నానికి చెందిన డాక్టర్ సుధాకర్‌ను దారుణంగా హింసించి, పిచ్చివాడనే ముద్ర వేసి, చంపేశారు. అందుకే నర్సీపట్నంలో జగన్ కార్యక్రమం అట్టర్‌ఫ్లాప్ అయ్యింది' అని అన్నారు.

కేసుల నుంచి తప్పించుకునేందుకే: మాణిక్కం ఠాగూర్

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ప్రధాని మోదీని పొగడడంలో పవన్ కల్యాణ్‌కు, జగన్‌కు తేడా లేదని మరోసారి రుజువయిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్ అన్నారు. ప్రభుత్వాధినేతగా మోదీ పాతికేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా జగన్ స్పందించిన తీరుపై ఆయన ఎక్స్ వేదికగా స్పందించారు. 'మీరు వైఎస్ఆర్ ఇంటి పేరును పంచుకోవచ్చుగాక... కాని ఆయన విలువలు, విజన్‌ను అందిపుచ్చుకోలేదు. మీ దృష్టి మొత్తం మీ తలపై వేలాడుతున్న 12 కేసుల నుంచి తప్పించుకోవడంపైనే ఉంది కానీ... ప్రజా సేవపై ఏమాత్రం లేదన్నది సుస్పష్టం' అని ఠాగూర్ పేర్కొన్నారు.

టాప్-5 (సీఎంలు)

చంద్రబాబు నాయుడు	15 సంవత్సరాలు (రికార్డు కొనసాగుతోంది)
కాసు బ్రహ్మానందరెడ్డి	7సంవత్సరాల 221 రోజులు
ఎన్టీఆర్	7 సంవత్సరాల 194 రోజులు
వైఎస్ రాజశేఖరరెడ్డి	5సంవత్సరాల 111 రోజులు
నీలం సంజీవరెడ్డి	5సంవత్సరాల 51 రోజులు



సీఎంగా చంద్రబాబు పదవీకాలం

తొలిసారి: 1995 సెప్టెంబరు 1 నుంచి 1999 అక్టోబరు 11
రెండోసారి: 1999 అక్టోబరు 11 నుంచి 2004 మే 13
మూడోసారి: 2014 జూన్ 4 నుంచి 2019 మే 29
నాలుగో సారి: 2024 జూన్ 12 నుంచి....

నారావారిపల్లె నుంచి

మారుమూల కుగ్రామమైన నారావారిపల్లెలో 1950 ఏప్రిల్ 20న చంద్రబాబు జన్మించారు. 1974లో ఎస్వీ యూనివర్సిటీలో ఆర్థిక శాస్త్రంలో పీజీ పూర్తి చేశారు. అప్పుడే విద్యార్థి నాయకుడిగా పనిచేశారు. 1978లో రాజకీయ రంగప్రవేశం చేసి తొలిసారి చంద్రగిరి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ఆ తర్వాత 17 ఏళ్లకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు తొలిసారి ముఖ్యమంత్రి అయ్యారు.



పట్టుగూళ్లతో తయారు చేసిన బొకే, మల్బరీ పట్టు వస్త్రాన్ని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబుకు అందజేశారు. మల్బరీ పట్టు వస్త్రాన్ని ఆసక్తిగా పరిశీలించిన చంద్రబాబు దాని గురించి అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రానికి వచ్చే అతిథులకు పట్టుగూళ్ల బొకేలను అందించాలని సీఎంను మంత్రి అచ్చెన్న కోరారు.

పదిహేనేళ్ల పరుగు!

ముఖ్యమంత్రిగా చంద్రబాబు అరుదైన రికార్డు

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

ఎలాంటి రాజకీయ కుటుంబ నేపథ్యం లేదు! తిరుపతికి కాస్తంత దూరంలో సరైన రోడ్డు కూడా లేని ఓ కుగ్రామంలో నడక మొదలు పెట్టారు. విద్యార్థి నేతగా ప్రస్థానం ప్రారంభించారు. ముఖ్యమంత్రి అయ్యారు. ఆయనే... చంద్రబాబు నాయుడు! తన ప్రజా రాజకీయ జీవితంలో ఆయన మరో మైలురాయి దాటనున్నారు. శుక్రవారంతో (అక్టోబరు 10) ముఖ్యమంత్రి పదవిలో ఆయన 15 ఏళ్ల కాలాన్ని పూర్తి చేసుకోనున్నారు. దేశంలో సుదీర్ఘ కాలం ముఖ్యమంత్రులుగా చేసిన వారి జాబితా పెద్దదే ఉంటుంది. కానీ, దక్షిణ భారతంలో అలాంటి ఘనత కొందరికే దక్కింది. కరుణానిధి 18 ఏళ్ల 362 రోజులపాటు సీఎంగా పదవిలో ఉన్నారు. పుదుచ్చేరి సీఎంగా ఎన్.రంగస్వామి 16 ఏళ్లకుపైగా ఆ పదవిలో ఉన్నారు. వారిద్దరి తర్వాత ఇప్పుడు దక్షిణాదిలో చంద్రబాబు మాత్రమే '15 ఏళ్ల రికార్డు'ను అధిగమించారు. ఎంజీ రామచంద్రన్, ఈకే నయనార్, జయలలిత, రామకృష్ణ హెగ్డే వంటి నాయకులు కూడా తమ జీవిత కాలంలో 15 ఏళ్లపాటు సీఎంగా కొనసాగలేదు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అత్యధిక కాలం సీఎంగా పని చేసిన రికార్డు కూడా చంద్రబాబు ఖాతాలోనే ఉంది. ఆయన ఉమ్మడి ఏపీకి 8 ఏళ్ల 255 రోజులు సీఎంగా చేశారు. నవ్యాంధ్ర సీఎంగా ఆయన పదవీకాలం నేటికి ఆరేళ్లా 110 రోజులు! వెరసి... 15 ఏళ్లపాటు సీఎంగా ఉన్న అరుదైన ఘనతను సొంతం చేసుకున్నారు.

సంస్కరణలకు ఆద్యుడు..

'ప్రజలకు సుపరిపాలన అందించడం అంటే జనాకర్షక పథకాలు అందించినంత తేలిక కాదు. అది అత్యంత క్లిష్టమైన కర్తవ్యం' అన్న సింగపూర్ వ్యవస్థాపక ప్రధాని లీక్వాన్‌యూ మాటలంటే చంద్రబాబుకు అత్యంత ఇష్టం. లీక్వాన్ యూ సింగపూర్ ప్రధాని అయ్యే నాటికి అది ఓ సంక్షుభిత దేశంగా ఉంది. దేశాన్ని ఏ విధంగా అభివృద్ధి చేయాలో ప్రజల ముందు ఆయన ఓ విజన్ ఉంచారు. దాన్ని తు.చ. తప్పకుండా అమలు చేశారు. దాని ఫలితమే నేటి సింగపూర్. లీక్వాన్ యూలోని ఈ విజనే చంద్రబాబును ఆకర్షించింది. విజన్-2020.. విజన్ -2047 అలా రూపుదిద్దుకున్నవే. చంద్రబాబు సీఎంగా తీసుకునే నిర్ణయాలకు తొలుత తీవ్ర వ్యతిరేకత వస్తుంది. వాటి ఫలాలు మాత్రం భవిష్యత్తు తరాలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని మళ్లీమళ్లీ రుజువవుతోంది. ఇబ్బడి ముబ్బడిగా ఇంజనీరింగ్ కాలేజీలు మంజూరు చేస్తున్నారని నాడు గగ్గోలు పెట్టారు. నేడు తెలుగునాట ఇంటికో ఇంజనీరు ఉన్నాడంటే అది బాబు చలువే అంటారు. హైదరాబాద్ నేడు ఐటీ హబ్‌గా లక్షల మందికి ఉపాధి చూపుతోందంటే... మాదాపూర్ కొండల్లో హైటెక్ సిటీకి చంద్రబాబు వేసిన పునాదే కారణం. 1999లో విద్యుత్తు సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. దీనిపై తీవ్రస్థాయిలో వ్యతిరేకత వచ్చింది. దీనివల్ల రాజకీయంగా టీడీపీ నష్టపోయింది. కానీ... నాటి విద్యుత్తు సంస్కరణల ఫలితంగా కోతలు, ఓల్టేజీ సమస్యలు తెలియని రోజులు వచ్చాయి. నదుల అనుసంధానాన్ని చేపట్టి... గోదావరి నీటిని కృష్ణా జలాలతో కలిపారు. 'అమరావతి' పేరుతో ఒక బృహత్ నగరాన్నే నిర్మిస్తున్నారు. ఇలాంటి పెద్ద కలలు కనడం... వాటిని సాకారం చేసేందుకు నిరంతరం కృషి చేయడం... సంపద సృష్టించడం... సంక్షేమం అమలు చేయడం! సీఎంగా చంద్రబాబు అనుసరిస్తున్న మార్గమిదే!

సంక్షోభాలే సోపానాలు..

సంక్షోభాలను ఎదుర్కోవడం... సంస్కరణలతో ముందుకు సాగడం! సీఎంగా చంద్రబాబు పంథా ఇదే! టీడీపీలో నెలకొన్న సంక్షోభాన్ని నిలువరించి పార్టీని.. పార్టీ క్యాడర్‌ను నిలబెట్టుకునేందుకు అనివార్య పరిస్థితుల్లో ఎన్టీఆర్‌తో విభేదించి 1995 సెప్టెంబరు1న చంద్రబాబు తొలిసారి సీఎంగా పదవీబాధ్యతలు చేపట్టారు. పెనుసంక్షోభం నుంచి పార్టీని నిలబెట్టారు. ఆ తర్వాత 2004 ఎన్నికల్లో ఓటమి తర్వాత సుదీర్ఘ కాలం అధికారానికి టీడీపీ దూరంగా ఉండిపోయింది. పదేళ్లపాటు అధికారంలో లేకున్నా... పార్టీని పదిలంగా కాపాడుకుంటూ వచ్చారు. 2014లో విభజిత నవ్యాంధ్రలో గెలిచి మళ్లీ ముఖ్యమంత్రి అయ్యారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక... గతంలో ఎన్నడూ చూడని నిర్బంధాన్ని టీడీపీ నాయకత్వం చూసింది. ఏకంగా చంద్రబాబును అరెస్టు చేసి జైలుకు పంపారు. అలాంటి సంక్షోభాన్ని సైతం అధిగమించి 2024లో భారీ మెజార్టీతో కూటమితో కలిసి టీడీపీ తిరిగి అధికారంలోకి వచ్చింది.

మార్కెట్ కమిటీల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

» రాష్ట్రంలోని రైతుబజార్ల ఆధునికీకరణ
» రైతుసేవా కేంద్రాల పునర్వ్యవస్థీకరణ
» 4 జిల్లాల్లో బర్లీ పొగాకుకు క్రాప్ హాలిడే
» 'ఆధార్'తోనే ఎరువుల పంపిణీ
» యూరియా సరఫరాపై రికార్డుల నిర్వహణ
» పక్కా ప్రణాళికతో రబీ సీజన్‌కు సిద్ధంకండి
» వ్యవసాయ, అనుబంధ శాఖల సమీక్షలో సీఎం
» పంటలకు మద్దతు ధరలపై పోస్టర్ విడుదల

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనకు మాస్టర్ ప్లాన్ రూపొందించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. ఇందుకోసం రాష్ట్రంలోని 218 మార్కెట్ కమిటీల స్థలాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాష్ట్ర సచివాలయంలో వ్యవసాయ, అనుబంధ శాఖలపై గురువారం సీఎం సమీక్షించారు. మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయ అనుబంధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఉన్నతాధికారులు హాజరయ్యారు. సీఎం మాట్లాడుతూ రైతులకు లాభం రావాలి. వినియోగదారులకు ప్రయోజనం కలగాలి. ఇందుకోసం వ్యవసాయ, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పని చేయాలి. రాష్ట్రంలో రైతుబజార్లను ఆధునీకరించాలి. మొబైల్ రైతుబజార్లు ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలి. మార్కెట్ కమిటీలను, రైతుబజార్లను అనుసంధానం చేసేలా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి' అని చెప్పారు. రానున్న రబీ సీజన్ కోసం 23లక్షల టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు సీఎంకు చెప్పారు. దీనిపై సీఎం స్పందిస్తూ 'రబీ సాగు కోసం భూసార పరీక్షలు చేసి, ఆ డేటా ప్రకారం సూక్ష్మపోషకాలు వేసుకునేలా రైతుల్ని ప్రోత్సహించాలి. ఆధార్ అథెంటికేషన్ చేసి, ఎరువులు సరఫరా చేయాలి' అని చెప్పారు.

లాభదాయక పంటలకు ప్రోత్సాహం

ఈ నెల 11న ప్రధానమంత్రి మోదీ ప్రారంభించనున్న 'ధన-ధాన్య కృషి యోజన' కింద లాభదాయక పంటలను ప్రోత్సహించాలని సీఎం అధికారులను ఆదేశించారు. పట్టు పరిశ్రమ విషయంలో బిల్‌గేట్స్ ఫౌండేషన్ సహకారం తీసుకోవాలన్నారు. హెచ్‌డీ బర్లీ పొగాకును రైతులు తక్కువ ధరకు అమ్ముకోకుండా చూడాలన్నారు. నాలుగు జిల్లాల్లో బర్లీ పొగాకుకు క్రాప్ హాలిడే ప్రకటించాలని సూచించారు. ఉల్లి, టమాటా, మిర్చి, మామిడి పంటలకు ధరలు తగ్గకుండా ప్రణాళికలు వేసుకోవాలని చెప్పారు. కాఫీ గింజలకు సోకిన బెర్రీబోరర్ తెగులు నివారణకు జీవామృతం వినియోగించాలని, రైతులకు టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని సూచించారు. ఈ సందర్భంగా జీలుగు ఉత్పత్తులను సీఎం పరిశీలించారు. గిరిజన ప్రాంతాల్లో తయారు చేసిన జీలుగు బెల్లాన్ని ఆయన రుచిచూశారు. అరకు కాఫీ తరహాలోనే జీలుగు ఉత్పత్తులను ప్రోత్సహించాలన్నారు. వెదురు ఉత్పత్తులతో గిరిజన రైతులకు ఎక్కువ ఆదాయం వచ్చే మార్గాలను పరిశీలించాలన్నారు. 2025-26లో వివిధ పంటలకు మద్దతు ధరలను ప్రకటిస్తూ పోస్టర్‌ను సీఎం విడుదల చేశారు. నాణ్యమైన పట్టుగూళ్లతో తయారు చేసిన ఉత్పత్తులను కూడా సీఎం పరిశీలించారు.

సీఎం కాన్వాయ్ అంబులెన్స్‌కు ఇన్సూరెన్స్ మరిచారు!

» నాలుగేళ్లుగా రూ.2.81 లక్షలు పెండింగ్
» ఆర్టీవో అధికారుల నోటీసులతో వెలుగులోకి!

(ఆంధ్రజ్యోతి-విజయవాడ)

ముఖ్యమంత్రి చంద్రబాబుకు కేటాయించిన కాన్వాయ్‌లోని అంబులెన్సులకు ఇన్సూరెన్స్ చెల్లించని విషయం వెలుగులోకి వచ్చింది. విజయవాడ జీజీహెచ్ పరిధిలో ఐదు అంబులెన్సులు ఉండగా, వీటిలో రెండు సీఎం కాన్వాయ్‌లోనివి. వీటికి గతంలో పనిచేసిన వెహికల్ సీనియర్ అసిస్టెంట్, గుమస్తా ఇన్సూరెన్స్ చెల్లించలేదని తెలిసింది. కొంతకాలంగా ఇన్సూరెన్స్ చెల్లించకపోవడంతో సీఎం అంబులెన్సుతోపాటు ప్రత్యామ్నాయంగా వాడే అంబులెన్సులకు నాలుగేళ్లుగా సుమారు రూ.2.81 లక్షల బకాయి ఉన్నట్టు ఆర్టీవో అధికారులు నోటీసులు పంపినట్టు సమాచారం. ఈ అంబులెన్సులకు పొల్యూషన్, ఇన్సూరెన్స్, ఇతర ట్యాక్సులు చెల్లించలేదని తెలిసింది. దీనిపై అధికారులను, గతంలో పనిచేసిన గుమస్తాను ప్రశ్నించగా.. అంబులెన్సులకు సంబంధించిన సీబుక్(ఆర్‌సీ)లు ఎక్కడ పెట్టారో తెలియదని చెప్పినట్టు తెలుస్తోంది. ఈ రికార్డుల విషయంలో తప్పులను గుర్తించిన సీనియర్ అసిస్టెంట్ స్థాయిలో కొత్తగా వచ్చిన అధికారిణి, విధుల్లో చేరేందుకు నిరాకరించినట్టు తెలుస్తోంది. రికార్డుల విషయమై గతంలో పని చేసిన సీనియర్ అసిస్టెంట్ స్థాయి అధికారిని ఆమె ప్రశ్నించగా.. తనకేం తెలియదని, తనకు తెలిసినంత వరకు రికార్డులు అక్కడే ఉన్నాయని, ఇన్సూరెన్స్ వివరాలు తన వరకు రాలేదని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పినట్టు తెలిసింది. దీంతో ఈ విషయం తేలేవరకూ విధుల్లోకి రానని ఆమె చెప్పినట్టు తెలిసింది. దీనిపై సంబంధిత అధికారులను వివరణ కోరగా, ఇన్సూరెన్స్ చెల్లించకపోవడం వాస్తవమేనని, సీనియర్ అసిస్టెంట్‌ను రికార్డులు అడుగుతున్నామని చెప్పారు.

ఓఎంసీ అక్రమాల గుట్టు తేల్చేందుకు.. జస్టిస్ సుధాంశు కమిటీ

» సుప్రీం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్ర-కర్ణాటక మధ్య ఉన్న అటవీప్రాంతంలో గాలి జనార్దన్‌రెడ్డికి చెందిన ఓబుళాపురం మైనింగ్ కంపెనీ (ఓఎంసీ) సాగించిన అక్రమ తవ్వకాల నిగ్గుతేల్చేందుకు రాష్ట్రప్రభుత్వం నిపుణుల కమిటీని నియమించింది. సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల మేరకు.. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాంశు ధూలియా చైర్మన్‌గా ఈ కమిటీని ఏర్పాటు చేస్తూ సీఎస్ విజయానంద్ ఉత్తర్వులు(జీవో 167) ఇచ్చారు. ఇందులో అటవీ, గనులు, సర్వే, రెవెన్యూ శాఖల అధికారులతో పాటు కేంద్ర సాధికార కమిటీ ప్రతిపాదించిన అధికారి, కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ సీనియర్ అధికారి సభ్యులుగా ఉంటారని తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గతంలో అనంతపురం జిల్లా డీ హీరేహళ్ మండలం పరిధిలోని అటవీప్రాంతం వెంట ఉన్న ఇనుప ఖనిజాన్ని ఓఎంసీకి లీజుకిచ్చింది. అయితే లీజు ప్రాంతాన్ని దాటి అటవీ ప్రాంతంలో కూడా ఓఎంసీ అక్రమంగా తవ్వేసింది. వీటిపై సీబీఐ కేసు నమోదుచేసి విచారణ చేసింది. ఓఎంసీకి లీజుకిచ్చిన భూములేమిటి.. అటవీప్రాంతంలో ఏ మేరకు తవ్వకాలు చేశారు.. అక్రమ మైనింగ్ ఏ మేరకు జరిగింది.. ఓఎంసీ పాల్పడిన ఇతర అక్రమాలేమిటో గుర్తించేందుకు నిపుణుల కమిటీని ఏర్పాటు చేయాలని సుప్రీం ధర్మాసనం గత నెల 19న రాష్ట్రాన్ని ఆదేశించిన విషయం తెలిసిందే.



సిటీ క్లబ్ షాపింగ్ కాంప్లెక్స్ మీద ఏర్పాటుచేసిన డాక్టర్ సుధాకర్ ఫ్లెక్సీ

మాస్కులు ఇవ్వలేక హత్యలు చేసేవాళ్లు మెడికల్ కాలేజీల గురించి మాట్లాడటమా?

» నర్సీపట్నంలో డాక్టర్ సుధాకర్ ఫొటోతో ఫ్లెక్సీలు.. జగన్ పర్యటన నేపథ్యంలో ఏర్పాటు

నర్సీపట్నం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ పర్యటన నేపథ్యంలో నర్సీపట్నంలో డాక్టర్ సుధాకర్ ఫొటోతో ఫ్లెక్సీలు వెలిశాయి. పట్టణంలోని పలు కూడళ్లలో గుర్తుతెలియని వ్యక్తులు వీటిని ఏర్పాటుచేశారు. కరోనా సమయంలో డాక్టర్ సుధాకర్ నర్సీపట్నం ఆస్పత్రిలో ఎన్-95 మాస్కుల కొరతపై ప్రభుత్వాన్ని నిలదీశారు. దీంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. ఆ తర్వాత విశాఖలో రోడ్డుపై ఆయన్ను పోలీసులు అదుపులోకి తీసుకుని చేతులు వెనక్కి విరిచి, ఆటోలో కేజీహెచ్‌కు, అక్కడ నుంచి మానసిక వైద్యశాలకు తరలించిన ఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపింది. ఈ ఉదంతంపై సీబీఐ విచారణ కోరుతూ హైకోర్టులో వంగలపూడి అనిత అప్పట్లో పిల్ వేశారు. కేసు విచారణలో ఉండగానే డాక్టర్ సుధాకర్ మరణించారు. గురువారం మాకవరపాలెంలో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల భవనాల పరిశీలనకు జగన్ వస్తున్న నేపథ్యంలో డాక్టర్ సుధాకర్ ఫొటోతో ఫ్లెక్సీలు వెలిశాయి. 'వైఎస్సార్‌సీపీ నెవర్ ఎగైన్.. మాస్కులు ఇవ్వలేక హత్యలు చేసేవాళ్లు మెడికల్ కాలేజీల గురించి మాట్లాడటమా?, ప్రజలారా తస్మాత్ జాగ్రత్త' అనివాటిపై ముద్రించారు.

జగన్.. అదే తీరు!

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్నారు. వాస్తవానికి జగన్ రోడ్డు పర్యటనకు తొలుత పోలీసులు అనుమతి ఇవ్వలేదు. ఆ తరువాత షరతులతో కూడిన అనుమతులు జారీచేశారు. కానీ వైసీపీ నాయకులు, శ్రేణులు మాత్రం పోలీసుల ఆంక్షలను పట్టించుకోకుండా విశాఖ విమానాశ్రయం నుంచి మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం వరకూ రోడ్‌షో నిర్వహించారు. దాదాపు 50కిపైగా వాహనాలతో జగన్ కాన్వాయ్ సాగింది. ఉదయం 11.30 గంటలకు ఎయిర్‌పోర్టులో జగన్‌ను కలిసేందుకు, స్వాగతం పలికేందుకు వైసీపీ నేతలు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. వారిని ప్రవేశ ద్వారం వద్ద పోలీసులు నిలువరించారు. పార్టీ నేతలు ముందుగా ఇచ్చిన జాబితాలో పేర్లు ఉన్నవారిని మాత్రమే లోపలకు అనుమతించారు. అయితే పోలీసుల కళ్లుగప్పి చాలామంది ఎయిర్‌పోర్టు లోపలకు చొరబడ్డారు. అక్కడి నుంచి జగన్ జాతీయ రహదారిపైకి రాగానే పార్టీ నేతలు, కార్యకర్తలంతా ఆయన వాహనానికి అడ్డంగా వెళ్లి కరచాలనం చేసేందుకు ఎగబడ్డారు. దీంతో జాతీయ రహదారిపై విమానాశ్రయం కూడలి నుంచి ఎన్ఏడీ జంక్షన్ వైపు ట్రాఫిక్ భారీగా నిలిచిపోయింది. పోలీసుల చొరవతో అక్కడి నుంచి ముందుకు కదలిన జగన్ కాకానినగర్ వద్ద స్టీల్‌ప్లాంటు కార్మికులు, యూనియన్ నేతల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. రోడ్డుపైనే వాహనం ఆపడంతో ట్రాఫిక్ చాలాసేపు నిలిచిపోయింది. గోపాలపట్నం పెట్రోల్ బంకు వద్ద వైసీపీ కార్యకర్తలతో జగన్ కరచాలనం చేస్తున్న సమయంలో వాహనాలు భారీగా నిలిచిపోవడంతో అంబులెన్స్ ట్రాఫిక్‌లో చిక్కుకుపోయింది. కారు పైనుంచి కార్యకర్తలకు అభివాదం చేయడంలో నిమగ్నమైన జగన్ నిలిచిపోయిన అంబులెన్స్‌ను పట్టించుకోలేదు. ఇక కొత్తూరు(అనకాపల్లి), కశింకోట, తాళ్లపాలెం జంక్షన్ వద్దకు స్థానిక వైసీపీ నేతలు భారీగా జనాన్ని తరలించారు. దీంతో కశింకోట నుంచి తాళ్లపాలెం వరకు జాతీయ రహదారిపై వందలాది వాహనాలు నిలిచిపోయాయి. తమ ఆదేశాలను ఉల్లంఘించి కాన్వాయ్‌తోనే వెళ్లేందుకు యత్నించినా, జగన్ వాహనాన్ని ఆపేందుకు నేతలు, కార్యకర్తలు రోడ్డుపైకి వచ్చినా పోలీసులు సహనంతోనే విధులు నిర్వర్తించారు.

గో బ్యాక్ జగన్!

» నర్సీపట్నంలో దళిత సంఘాల నిరసన

జగన్ పర్యటనను నిరసిస్తూ నర్సీపట్నంలో దళిత సంఘాలు ప్రదర్శన నిర్వహించాయి. దళిత సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో తొలుత ఎన్టీఆర్ మినీ స్టేడియంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేశారు. అనంతరం ప్లకార్డులతో అబీద్ సెంటర్‌లో మానవహారంగా ఏర్పడ్డారు. ఆ తరువాత అంబేడ్కర్ విగ్రహానికి పాలతో అభిషేకం చేశారు. 'గో బ్యాక్ జగన్' అంటూ నినాదాలు చేశారు. దళిత నాయకుడు మరిడియ్య మాట్లాడుతూ మాకవరపాలెం మండలంలో మెడికల్ కళాశాల నిర్మాణ పనులు జరగడం లేదని, ఫేక్ జీవోలు చూపిస్తూ ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. మెడికల్ కళాశాల నిర్మాణానికి అనుమతి ఉందా అని ఆయన ప్రశ్నించారు. కరోనా సమయంలో మాస్క్ అడిగినందుకు దళిత వైద్యుడు సుధాకర్‌ను ఇబ్బందులు పెట్టి, ఆయన మరణానికి కారణమయ్యారని ఆరోపించారు. అటువంటి వ్యక్తి ఏ మొహం పెట్టుకుని నర్సీపట్నం వస్తున్నారని నిలదీశారు.

పీపీపీ రద్దు చేసేవరకూ పోరాటం

» 28న నియోజకవర్గాల్లో ధర్నాలు: జగన్

మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల 28న రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల్లో ధర్నాలు చేస్తామని మాజీ సీఎం జగన్ చెప్పారు. పీపీపీ విధానం రద్దు చేసే వరకూ పోరాటం చేస్తామని అన్నారు. అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం భీమబోయినపాలెంలో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కాలేజీని ఆయన గురువారం సాయంత్రం పరిశీలించారు. మెడికల్ కాలేజీలను ప్రైవేటుపరం చేయబోమని ప్రకటించేంత వరకూ సీఎం చంద్రబాబును వదలిపెట్టేది లేదని అన్నారు. దీనిపై గ్రామస్థాయిలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించి సంతకాల సేకరణ చేపడతామని తెలిపారు. ప్రతి నియోజకవర్గం నుంచి 50 వేలకు తక్కువ కాకుండా రాష్ట్రవాప్తంగా కోటి సంతకాలు సేకరిస్తామని చెప్పారు. కోటి సంతకాలతో నవంబరు 24న గవర్నర్‌ను కలుస్తామని పేర్కొన్నారు. పేదవాడికి వైద్యం, వైద్య విద్య అందకుండా చేయడం కోసమే చంద్రబాబు మెడికల్ కాలేజీలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తున్నారని జగన్ ఆరోపించారు. అమరావతిలో రూ.లక్ష కోట్లు ఖర్చు పెట్టేందుకు ఉత్సాహం చూపుతున్న చంద్రబాబు పేదల వైద్యం కోసం ఏడాదికి వెయ్యి కోట్లు ఖర్చు చేసేందుకు వెనుకాడుతున్నారని విమర్శించారు. భీమబోయినపాలెంలో మెడికల్ కళాశాల నిర్మాణానికి జీవో లేదని తప్పుడు మాటలు చెబుతూ స్పీకర్ అయ్యన్నపాత్రుడు తన పదవికే తలవంపులు తెస్తున్నారని జగన్ విమర్శించారు.



నర్సీపట్నం అబీద్ సెంటర్‌లో మానవహారం

'మద్యం' బెయిల్ పిటిషన్లపై

విచారణ ఆపండి

- మా తుది నిర్ణయం వరకు ఆగండి
- ఏసీబీ కోర్టుకు హైకోర్టు సూచన
- దర్యాప్తును బలహీన పర్చేలా ఏసీబీ కోర్టు ఉత్తర్వులు
- విస్మయం కలిగించేలా న్యాయాధికారి తీరు
- మిథున్‌రెడ్డి బెయిల్ ఉత్తర్వుల్లోని పలు అంశాల అమలును నిలుపుదల చేయండి
- సీఐడీ తరపున సీనియర్ న్యాయవాది లూథ్రా వాదన

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): సీఐడీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై తాము నిర్ణయం తీసుకొనేంతవరకు మద్యం కేసులో బెయిల్ పిటిషన్లపై విచారణ జరపకుండా వేచి ఉండాలని ఏసీబీ కోర్టు న్యాయాధికారికి హైకోర్టు సూచించింది. గురువారం సీఐడీ/సిట్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు విన్న అనంతరం హైకోర్టు ఆదేశాలు ఇచ్చింది. మద్యం కుంభకోణం కేసులో వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు ఇచ్చిన తీర్పులోని పలు అంశాలు కేసు దర్యాప్తు మొత్తాన్ని బలహీనపర్చేలా ఉన్నాయని వాదనల సందర్భంగా లూథ్రా కోర్టు దృష్టికి తెచ్చారు. ఏసీబీ కోర్టు న్యాయాధికారి వైఖరి విస్మయానికి గురి చేస్తోందని చెప్పారు. మిథున్‌రెడ్డి విషయంలో దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదని, చార్జిషీట్ దాఖలు చేయలేదని, అయినా కూడా బెయిల్ ఉత్తర్వుల్లో కేసు దర్యాప్తు ముగిసినట్లు ఏసీబీ కోర్టు పేర్కొందని తెలిపారు. దర్యాప్తు పూర్తి కాలేదని చెప్పి నిందితులు బాలాజీ గోవిందప్ప, ధనుంజయ్‌రెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డిలకు ఏసీబీ కోర్టు డీఫాల్ట్ బెయిల్ మంజూరు చేసి, మిథున్‌రెడ్డి విషయంలో మాత్రం దర్యాప్తు పూర్తి అయ్యినట్లు భిన్న వైఖరి తీసుకుందని పేర్కొన్నారు. మిథున్‌రెడ్డి మొదటి బెయిల్ పిటిషన్‌ను ఏసీబీ కోర్టు ఆగస్టు 18న కొట్టివేసిందని, పదిరోజులు కూడా గడవక ముందే బెయిల్ కోసం మరో పిటిషన్ వేశారని చెప్పారు. రెండు పిటిషన్ల మధ్య పరిస్థితుల్లో ఎలాంటి మార్పు లేనప్పటికీ ఏసీబీ కోర్టు బెయిల్ ఇచ్చిందన్నారు. ఎలాంటి షరతులు విధించకుండా మిథున్‌రెడ్డి పాస్‌పోర్ట్ విడుదలకు ఏసీబీ కోర్టు ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. మిథున్‌రెడ్డి బెయిల్ ఉత్తర్వుల్లోని అంశాలను ఆధారంగా చేసుకొని తమకూ బెయిల్ మంజూరు చేయాలని ఇతర నిందితులు కోరే అవకాశం ఉందన్నారు. ఈ కేసులోని కొందరు నిందితుల బెయిల్ పిటిషన్లు ఏసీబీ కోర్టులో సోమవారం విచారణకు వస్తున్నాయని హైకోర్టు దృష్టికి తెచ్చారు. ఈనేపథ్యంలో బెయిల్ ఉత్తర్వుల్లో ప్రస్తావించిన పలు అంశాల అమలును నిలుపుదల చేయాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామని తెలిపారు. ఈ వాదనలు పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి.. సీఐడీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై తాము నిర్ణయం తీసుకొనేంతవరకు బెయిల్ పిటిషన్లపై విచారణ జరపకుండా వేచి ఉండాలని ఏసీబీ కోర్టు న్యాయాధికారికి సూచించారు. తదుపరి విచారణను ఈనెల 15కు వాయిదా వేశారు. మిథున్‌రెడ్డికి బెయిల్ మంజూరు చేస్తూ ఏసీబీ కోర్టు సెప్టెంబరు 29న ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని కోరుతూ సీఐడీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. గురువారం ఈవ్యాజ్యం మరోసారి విచారణకు రాగా మిథున్‌రెడ్డి తరపు న్యాయవాది నాగార్జున రెడ్డి స్పందిస్తూ.. వాదనలు వినిపించేందుకు సమయం ఇవ్వాలని కోరారు.



బార్బడోస్‌కు భారత్ కానుక

ఇది బార్బడోస్ అసెంబ్లీ స్పీకర్ స్థానం! దీని వెనుక ఒక చరిత్ర ఉంది. 1966లో బార్బడోస్‌కు స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా భారత్ దీనిని ఆ దేశానికి బహూకరించింది. ఇరుదేశాల మధ్య స్నేహం, సౌభ్రాతృత్వాలకు చిహ్నంగా... దీనిపై 'ఫ్రమ్ ది పీపుల్ ఆఫ్ ఇండియా టు ది పీపుల్ ఆఫ్ బార్బడోస్' అని లిఖించారు. బార్బడోస్‌లో జరుగుతున్న కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో పాల్గొనేందుకు వెళ్లిన రాష్ట్ర శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ఈ స్థానంపై ఆసీనులై ఇలా ఫొటో దిగారు.



పారదర్శకతకు ప్రతీక భారత పార్లమెంటు

- దేశ భవిష్యత్తును తీర్చిదిద్దడంతో కీలకపాత్ర
- బార్బడోస్ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో స్పీకర్ అయ్యన్న

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): భారత పార్లమెంటు, దేశంలోని శాసనసభలు పారదర్శకత, స్వతంత్రతకు ప్రతీకలని ఏపీ శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. బార్బడోస్(కరేబియన్)లో గురువారం జరిగిన 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ సదస్సులో 'ప్రజాస్వామ్య మనుగడకు వ్యవస్థల బలోపేతం' అనే అంశంపై ఆయన మాట్లాడారు. 'చైతన్యవంతమైన ప్రజాస్వామ్యం ఎప్పుడూ మార్పునకు సిద్ధంగా ఉంటుంది. రాజ్యాంగంలో జరిగిన సవరణల సంఖ్యే ఒక దేశం మార్పును స్వీకరించే శక్తిని సూచిస్తుంది. భారత రాజ్యాంగాన్ని 75 ఏళ్లలో 100 సార్లు సవరించుకున్నాం. భారత్ మొదటి సాధారణ ఎన్నికల్లోనే అందరికీ ఓటు హక్కు కల్పించింది. ఆ ఎన్నికల్లో 17 కోట్లకుపైగా ఓటర్లు నమోదయ్యారు. 2024లో జరిగిన 18వ లోక్‌సభ ఎన్నికల్లో ఈ సంఖ్య 97 కోట్లకు చేరుకుంది. ఈ 18 సాధారణ ఎన్నికల్లో తమ ఓట్లతో 8 సార్లు ప్రభుత్వాలను మార్చిన ఘనత భారత ప్రజలకు దక్కుతుంది. అది కూడా పూర్తి శాంతియుతంగా జరిగింది. ఈ ఉదాహరణ ఒక్కటే భారత ప్రజాస్వామ్య సంస్థల బలాన్ని చాటుతుంది' అని పేర్కొన్నారు. బార్బడోస్, భారత్ సంబంధాలు 1960వ దశకంలోనే మొదలయ్యాయన్నారు. కాగా, అయ్యన్న తన ప్రసంగంలో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ చెప్పిన మాటలను తెలుగులో చెప్పి, దాని అర్థాన్ని ఆంగ్లంలో చెప్పారు. 'మా నాయకుడు ఎన్టీఆర్.. సమాజమే దేవాలయం.. ప్రజలే దేవుళ్లు అంటూ భారత రాజ్యాంగం ఆత్మను నాలుగు తెలుగు మాటల్లో అద్భుతంగా చెప్పారు.' అని అయ్యన్న పేర్కొన్నారు.



ఖండాలు దాటిన కల్తీ కథ!

(మొదటి పేజీ తరువాయి)

ఒక్కొక్కటి బయటపడుతున్నాయి. వైఎస్ సునీల్ రెడ్డి, వైఎస్ అనిల్ రెడ్డి 2013లో ఆఫ్రికాలోని కామెరూన్‌లో రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్ పేరుతో మద్యం వ్యాపారం ప్రారంభించారు. ఆ తర్వాత మద్యంతో పాటు వివిధ వ్యాపారాలను ఆఫ్రికా అంతటా విస్తరించారు. టాంజానియా, ఐవరీకోస్ట్, ఘనా, జాంబియా, మొజాంబిక్ దేశాల్లో మద్యం, మైనింగ్ ఇతరత్రా వ్యాపారాలు ప్రారంభించారు. పేద ప్రజలకు తక్కువ ధరకే మద్యం అమ్ముతున్నామంటూ అదో ప్రజాసేవలా కలరింగ్ ఇస్తూ మద్యం సామ్రాజ్యాన్ని విస్తరించారు. రాయల్ విస్కీ, రాయల్ జిన్, రాయల్ రమ్, జెడ్ జిన్ బ్రాండ్లను అక్కడ విక్రయిస్తున్నారు. ప్రమాణాలు పాటించి సీసాల తరహాలో మద్యం ఉత్పత్తి చేస్తే నిరాటంకంగా వ్యాపారం సాగేదే. కానీ అధిక ఆదాయార్జన లక్ష్యంగా షాంపూ ప్యాకెట్లు(సాచెట్) తరహాలో మద్యం అమ్మడం ప్రారంభించారు. 2013లో కామెరూన్‌లో రెడ్డీస్ గ్లోబల్ మద్యం ఉత్పత్తి ప్రారంభించగా... ఏడాది కాలంలోనే సాచెట్ ప్యాకెట్ల మద్యం తాగి ఆ దేశ ప్రజలు అనేక మంది చనిపోయారు. అయితే ఫలానా కంపెనీ అని పేరు ప్రస్తావించకుండా అన్ని కంపెనీల సాచెట్ తరహా మద్యం ఉత్పత్తిని ఆ దేశ ప్రభుత్వం నిషేధించింది. 2016 నాటికి సాచెట్ తరహా మద్యం ఎక్కడా ఉండకూడదని స్పష్టంచేసింది. అయినా ఆదాయమే లక్ష్యంగా రెడ్డీస్ గ్లోబల్ కంపెనీ మద్యం ఉత్పత్తిని కొనసాగించింది. దీంతో 2020 తర్వాత ఈ తరహా కల్తీ మద్యం మాకొద్దంటూ ఆ దేశ ప్రజలు రోడ్డెక్కారు. పలు నగరాల్లో ప్లకార్డులు ప్రదర్శించారు. చివరికి ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) కూడా జోక్యం చేసుకుని కల్తీ మద్యం నివారణకు ప్రయత్నాలు మొదలుపెట్టింది.





కామెరూన్‌లోని రెడ్డీస్ గ్లోబల్ ఇండస్ట్రీస్‌లో కల్తీ మద్యం తయారీకి ఉపయోగిస్తున్న డ్రమ్ములు, లేబుళ్లు

కామెరూన్‌లో దందాకు తెర

సాచెట్ తరహా మద్యం ఉత్పత్తి ఆపేయాలని కామెరూన్ ప్రజలు రోడ్డెక్కినా రెడ్డీస్ గ్లోబల్ కంపెనీ పట్టించుకోలేదు. ఈ క్రమంలోనే ఈ ఏడాది ఆ దేశంలో కొందరు యువకులు ఎవరు ఎక్కువ మద్యం తాగుతారంటూ పోటీలు పెట్టుకున్నారు. సాచెట్ ప్యాకెట్ల మద్యం తాగి ఒక యువకుడు అక్కడికక్కడే మరణించగా, మరొక యువకుడు సాయంత్రం చనిపోయాడు. ఆ మద్యం తాగిన వారంతా అనారోగ్యం పాలయ్యారు. ఈ ఘటన ఆ దేశంలో వైరల్ అయ్యింది. వద్దన్నా కల్తీ మద్యం తయారు చేస్తున్నారంటూ కామెరూన్ ప్రజలు పెద్దఎత్తున ఉద్యమానికి దిగారు. దీనిని తీవ్రంగా పరిగణించిన ఆ దేశ ప్రభుత్వం రెడ్డీస్ గ్లోబల్ కంపెనీలో తనిఖీలు చేపట్టింది. ఆ దేశ గనులు, పరిశ్రమలు, సాంకేతిక అభివృద్ధి మంత్రి ఫుహ్ కాలిస్టస్ జెంట్రీ కంపెనీని పరిశీలించారు. నిబంధనలకు విరుద్ధంగా మద్యం ఉత్పత్తి చేస్తున్నారని గుర్తించి వెంటనే డిస్టిలరీని మూసివేశారు. దీంతో కామెరూన్‌లో జగన్ సోదరుల మద్యం దందాకు తెరపడింది. అయితే రెడ్డీస్ కంపెనీ తనకు అనుకూలంగా మరోలా ప్రచారం చేసుకుంది. ఇది కార్పొరేట్ కంపెనీల కుట్రని, పేదలకు తక్కువ ధరకు మద్యం దొరక్కుండా చేస్తున్నాయని, ఆంధ్రా నుంచి ఆఫ్రికా వెళ్లి అక్కడి ప్రజలకు సేవ చేస్తున్నట్లుగా కలరింగ్ ఇచ్చింది.

ఇక్కడ నకిలీపై గగ్గోలు

కమీషన్ల కోసం పాపులర్ బ్రాండ్లను రాష్ట్రం నుంచి తరిమేసి తక్కువ ఖర్చుతో నాసిరకం మద్యం ఉత్పత్తి చేసిన ఘనత గత జగన్ ప్రభుత్వానిదే. గత ప్రభుత్వంలో విషపూరిత మద్యం తాగి ఎంతో మంది చనిపోయారు. జే బ్రాండ్లలో ప్రమాదకర విషపూరిత రసాయనాలు ఉన్నాయని లేబొరేటరీలు కూడా నిర్ధారించాయి. అయితే ఆ నివేదికలను గత ప్రభుత్వం అధికార బలంతో తొక్కిపెట్టింది. వైసీపీ ప్రభుత్వంలో తయారు చేసిన మద్యంపై వచ్చినన్ని ఆరోపణలు గతంలో ఎప్పుడూ రాలేదు. కమీషన్ల రూపంలో వేల కోట్లు దోపిడీ చేశారు. నకిలీ మద్యం తయారీకి కూడా గత ప్రభుత్వంలోనే నాంది పడింది. అయితే ఇవన్నీ మరిచిపోయి కూటమి ప్రభుత్వంపై వైసీపీ రాద్ధాంతం చేస్తోంది. కూటమి ప్రభుత్వం వల్లే నకిలీ మద్యం బాగోతం జరిగిందంటూ గగ్గోలు పెడుతోంది. వాస్తవానికి ఈ ప్రభుత్వం నకిలీ మద్యం దొరికిన వెంటనే అప్రమత్తమైంది. ములకలచెరువులో నకిలీ మద్యం పట్టుబడగా దాని ఆనవాళ్లు ఎక్కడున్నాయో అన్ని చోట్లా తనిఖీలు చేసి నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకుంది.

కల్తీ ఆల్కహాల్ ఉత్పత్తి

రెడ్డీస్ కంపెనీ మద్యం ఉత్పత్తిలో ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. కల్తీ చేసిన ఆల్కహాల్ ఉత్పత్తి జరుగుతోంది. ఈ విషయంలో ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుంది. అక్రమ ఆల్కహాల్ ఉత్పత్తిలో భాగస్వామ్యమైన వ్యక్తులను గుర్తించి, శిక్షించేందుకు దేశవ్యాప్తంగా తనిఖీలను ముమ్మరం చేస్తాం. నిబంధనలు పాటించాలని కొంతకాలంగా ఈ కంపెనీకి సూచించాం. అయినా పాటించకపోవడంతో మూసివేయాలనే నిర్ణయం తీసుకున్నాం.

- ఈ ఏడాది మార్చిలో తనిఖీల సందర్భంగా కామెరూన్ మంత్రి ఫుహ్ కాలిస్టస్ జెంట్రీ

గుట్టువిప్పిన కట్టా రాజు!

- నకిలీ మద్యం నగదు ఎవరికి చేరిందో వాంగ్మూలం
- తయారీ కేంద్రం మేనేజర్ అతనే
- జనార్దన్‌రావు కోసం బెంగళూరు ఎయిర్‌పోర్టులో రెండు ప్రత్యేక బృందాలు
- జయచంద్రా రెడ్డినీ అదుపులోకి తీసుకునే ప్రయత్నాలు

రాయచోటి/ములకలచెరువు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం రేపుతున్న నకిలీ మద్యం కేసులో ఎక్సైజ్ అధికారులు దూకుడు పెంచారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన్‌రావు అనుచరుడు, నకిలీ మద్యం తయారీ కేంద్రం మేనేజర్ కట్టా రాజు వాంగ్మూలంతో కేసు మలుపు తిరిగింది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో నకిలీ మద్యం తయారీ కేంద్రం గుట్టును ఎక్సైజ్ అధికారులు రట్టు చేసిన సంగతి తెలిసిందే. ఇక్కడ తయారు చేసిన మద్యాన్ని జనార్దన్ రావు విజయవాడ శివారులోని ఇబ్రహీంపట్నంలో విక్రయించినట్లు ఇప్పటికే గుర్తించారు. ఈ కేసులో ఆయననే ఏ1గా చేర్చారు. మద్యం తయారీ కేంద్రం మేనేజర్ కట్టా రాజును పోలీసులు అరెస్టు చేశారు. నకిలీ మద్యం ద్వారా వచ్చిన నగదును ఎవరెవరి ఖాతాలకు ఎంత పంపారో కట్టా రాజు తన వాంగ్మూలంలో పేర్కొన్నట్లు తెలిసింది. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలో ఉన్న జనార్దన్ రావు ఏ క్షణమైనా లొంగిపోతాడనే ప్రచారం జరుగుతుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఆయనను అదుపులోకి తీసుకునేందుకు బెంగళూరు ఎయిర్‌పోర్టుకు రెండు ప్రత్యేక బృందాలు వెళ్లాయి. ఈ కేసులో నిందితుడు జయచంద్రారెడ్డిని అదుపులోకి తీసుకునేందుకు బెంగళూరుకు వెళ్లారు. ఆయన పీఏ రాజేశ్ కదలికలపైనా నిఘా పెట్టారు. వీరు విదేశాలకు వెళ్లకుండా లుకౌట్ నోటీసులు పంపినట్లు తెలుస్తోంది.

సీఐ హిమబిందురెడ్డి సస్పెన్షన్

ములకలచెరువు ఎక్సైజ్ సీఐ హిమబిందురెడ్డిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు వెలువడ్డాయి. నకిలీ మద్యం తయారీ, విక్రయాల తతంగం ఆమెకు తెలిసే జరిగిందన్న ఆరోపణలు ఉండడంతో మూడు రోజుల క్రితం విజయవాడలోని ఎక్సైజ్ కమిషనరేట్‌కు బదిలీ చేశారు. ఇప్పటి వరకు జరిగిన విచారణలో ఆమె పాత్రపై మరిన్ని ఆధారాలు లభించడంతో సస్పెండ్ చేస్తూ ఎక్సైజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేసినట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్ తెలిపారు.

నేటి నుంచి వైద్యం బంద్!

- సమ్మెలోకి నెట్‌వర్క్ ఆస్పత్రులు
- సీఎంతో మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తాం
- ఆరోగ్య సేవలు కొనసాగించండి
- ఆస్పత్రులకు మంత్రి సత్యకుమార్ వినతి

అమరావతి, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో శుక్రవారం నుంచి వైద్య సేవలు బంద్ కానున్నాయి. 10నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ పరిధిలోని నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిపివేస్తున్నట్లు ఏపీ స్పెషాలిటీ ఆస్పత్రుల అసోసియేషన్ (ఆషా) గతనెల 25నే అధికారులకు లేఖ రాసింది. భారీ బకాయిల నేపథ్యంలో ఆస్పత్రులు నడపలేని పరిస్థితికి వచ్చామని, వెంటనే రూ.2,700 కోట్లు విడుదల చేయాలని అభ్యర్థించింది. లేదంటే అక్టోబరు 10 నుంచి వైద్య సేవలు అందించలేమని స్పష్టంచేసింది. ఆరోగ్యశాఖ అధికారులు నెట్‌వర్క్ ఆస్పత్రుల యాజమాన్యాలతో అనేకసార్లు సంప్రదింపులు జరిపినా ఫలితంలేదు. దీంతో యాజమాన్యాలు వైద్య సేవలు నిలిపివేసేందుకు సిద్ధమయ్యాయి. సమ్మెకు దిగడానికి కారణాలు, తమ ఆవేదనను వ్యక్తీకరిస్తూ నెట్‌వర్క్ ఆస్పత్రుల అసోసియేషన్ తాజాగా ఓ లేఖ విడుదల చేసింది. తమకు ఎన్టీఆర్ వైద్య సేవ ట్రస్ట్ నంచి రావలసిన బకాయిలు రూ.2,700 కోట్ల పైమాటేనని, ఇవి ఏ నెలకా నెల పెరుగుతున్నాయో తప్ప తగ్గడం లేదని వాపోయింది. ఆస్పత్రులు ఇక నడవలేని పరిస్థితుల్లో ఉన్నాయని తెలిపింది. ప్రభుత్వ పెద్దలకు, ట్రస్ట్ ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పించినా పరిష్కరించలేదన్నారు. వారం రోజులుగా జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు ఎంపీలను కలిసి తమ ఆవేదనను విన్నవిస్తూనే ఉన్నామని చెప్పారు. 'బకాయిల విడుదల కోసం ప్రభుత్వ పెద్దలను కలిసి ఎన్నిసార్లు విన్నవించినా, అదిగో చేస్తాం.. ఇదిగో చేస్తామని చెబుతున్నారే తప్ప..ఆ దిశగా ఎలాంటి ప్రయత్నమూ కనిపించడం లేదు. ఆస్పత్రుల బకాయిల గురించి మంత్రి సత్యకుమార్ అసెంబ్లీలో ప్రకటించారు. కానీ చేతల్లో మాత్రం ఫలితం కనిపించడం లేదు. ఈ నేపథ్యంలో గత నెల 25న సమావేశమైన ఆషా రాష్ట్ర కార్యవర్గం భవిష్యత్ కార్యాచరణను ప్రకటించింది. శుక్రవారం నుంచి ఎన్టీఆర్ వైద్య సేవ పథకం కింద వైద్య సేవలను నిలిపివేయాలని నిర్ణయించింది' అని తెలిపారు. తమ ఆందోళన కారణంగా సామాన్య ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకూడదన్న ఉద్దేశంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. ఏడాదిగా తాము పడుతున్న ఆర్థిక ఇబ్బందులను ప్రజలంతా అర్థం చేసుకోవాలని కోరారు.

వైద్య సేవలు ఆపొద్దు: మంత్రి

నెట్‌వర్క్ ఆస్పత్రులు సమ్మెకు వెళ్తుండడంపై వైద్య ఆరోగ్యమంత్రి సత్యకుమార్ స్పందించారు. సీఎం చంద్రబాబుతో మాట్లాడి సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని మీడియాకు తెలిపారు. వైద్య సేవలను ఆపొద్దని ఆస్పత్రులకు విన్నవించారు. కూటమి ప్రభుత్వం వచ్చేనాటికి రూ.2,500 కోట్ల బకాయిలున్నాయని, కూటమి ప్రభుత్వం వచ్చాక అందించిన సేవలకు కూడా కలిపి ఇప్పటి వరకూ రూ.3,800 కోట్లు చెల్లించామని గుర్తుచేశారు. ప్రస్తుతం రూ.670 కోట్ల బిల్లులను ట్రస్ట్ అధికారులు సీఎఫ్ఎంఎస్‌కు అప్‌లోడ్ చేశారని, మరో రూ.2.000కోట్ల బిల్లులు స్క్రూటినీ దశలో ఉన్నాయన్నారు. బిల్లులు చెల్లించకుండా ఆస్పత్రులు నడవడం అసాధ్యమని తమకు తెలుసని.. ఇటీవలే రూ.250 కోట్లు విడుదల చేశామని చెప్పారు. ఆస్పత్రుల యాజమాన్యాలు కూడా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని అర్థం చేసుకుంటాయని భావిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిల కారణంగా ఈ ఇబ్బందికర పరిస్థితి వచ్చిందన్నారు.

జగన్ ఆరోపణలపై విచారణకు సిద్ధం

- నకిలీ మద్యంపై విష ప్రచారం... నిరూపించలేకపోతే విచారణను ఎదుర్కొంటారా
- ములకల చెరువు కేసులో అద్దేపల్లిపై లుక్ అవుట్ నోటీసు: మంత్రి కొల్లు

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): 'నకిలీ మద్యంపై జగన్ విష ప్రచారం చేస్తున్నారు. ప్రతి మూడు బాటిళ్లలో ఒకటి నకిలీ మద్యం ఉందని ఆయన చేసిన ఆరోపణలపై విచారణకు మేం సిద్ధం. నిరూపించలేకపోతే విచారణ ఎదుర్కొవడానికి జగన్ సిద్ధమా?' అని మంత్రి కొల్లు రవీంద్ర నిలదీశారు. గురువారం అమరావతి సచివాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. 'ఏ కారణంతో చనిపోయినా నకిలీ మద్యంతో ముడిపెట్టి ప్రచారం చేస్తున్నారు. జగన్ తప్పుడు ఆరోపణలు చేస్తూ ఆయన మీడియాలో తప్పుడు కథనాలు రాయిస్తున్నారు. నిజా నిజాలు నిగ్గు తేలుస్తాం. నిరాధార కథనాలు రాసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుంది. వారిపై బీఎన్ఎస్ 353 కింద, అలాగే తప్పుడు వార్తలు, ప్రసారాలు ద్వారా ప్రభుత్వ ప్రతిష్ఠను దెబ్బతీసే ప్రయత్నం చేసిన వారిపై బీఎన్ఎస్ 356 కింద కేసులు నమోదు చేసి చట్టప్రకారం చర్యలు తీసుకుంటాం. ములకల చెరువులో నకిలీ మద్యం కేసులో కీలక నిందితుడు అద్దేపల్లి ఆచూకీ కోసం లుక్ అవుట్ నోటీసులు జారీ చేస్తాం. నకిలీ మద్యం వ్యవహారంలో అధికారులతో సహా ఎవరున్నా కఠిన చర్యలు తప్పవు. ఈ కేసుతో సంబంధం ఉన్న వైసీపీ నేత కొడాలి శ్రీనివాసరావుపై జగన్ ఇప్పటికీ ఎందుకు చర్యలు తీసుకోలేదో చెప్పాలి' అని మంత్రి కొల్లు ప్రశ్నించారు.

మెడికల్ కాలేజీల్లో జగన్ భారీ అవినీతి!

- ఒక్కో కళాశాలకు కాంట్రాక్టర్ల నుంచి 100 కోట్లు ముడుపులు: సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణంలో అప్పటి సీఎం జగన్ భారీగా అవినీతికి పాల్పడ్డారని మంత్రి సత్యకుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఒక్కో కళాశాలకు రూ.వంద కోట్ల చొప్పున ముడుపులు తీసుకున్నారని ధ్వజమెత్తారు. 'రూ.400 కోట్లు ఖర్చయ్యే దానికి రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లకు పరిపాలనా అనుమతులు ఇచ్చారు. ఎక్కువ మొత్తంలో నిధులు కేటాయిస్తూ పరిపాలనా అనుమతులు ఇవ్వడం వెనుక ముడుపుల బాగోతం నడిచింది. ఇచ్చిన కమీషన్లు తిరిగి ఇవ్వాలని కాంట్రాక్టర్లు ఒత్తిడి చేస్తుండడంతో దిక్కుతోచక.. పీపీపీ విధానంలో కళాశాలల నిర్మాణానికి ముందుకొచ్చే వారిని బెదిరిస్తూ, ఉత్తుత్తి పర్యటనలకు సిద్ధమయ్యారు' అని మంత్రి మండిపడ్డారు.

జగన్ బంధువుల భూకబ్జాలు

- పేదల పేరిట పట్టాలు.. విచారణలో బయటపడ్డ నిజాలు
- వాటి స్వాధీనానికి కడప కలెక్టర్ ఆదేశం

కడప, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ హయాంలో జరిగిన కబ్జాల నుంచి ప్రభుత్వ భూములకు విముక్తి లభిస్తోంది. పులివెందుల, తొండూరు, సింహాద్రిపురం, లింగాల తదితర గ్రామాల పరిధిలో జగన్ సన్నిహిత బంధువుల భూ అక్రమాలపై 'ఆంధ్రజ్యోతి' గతంలో అనేక కథనాలు ప్రచురించింది. ప్రభుత్వం మారిన తర్వాత దీనిపై విచారణకు ఆదేశించింది. వైఎస్ వివేకా హత్య కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న దేవిరెడ్డి శివశంకర్‌రెడ్డి, ఆయన కుటుంబీకులు... జగన్ పెద్దనాన్న అయిన వైఎస్ ప్రతాప్‌రెడ్డి కుమారుడు వైఎస్ మదన్‌మోహన్‌రెడ్డి తదితరులు పాల్పడిన భూ ఆక్రమణలు, పేదల పేరుతో డీకేటీ పట్టా భూములు పొందడంపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గురువారం ఆదేశించారు. శివశంకర్‌రెడ్డి కుమారుడు డాక్టర్ చైతన్యరెడ్డికి కడప నగరంలో ఆసుపత్రి ఉంది. అయినప్పటికీ... వారి కుటుంబ సభ్యులు పేదల పేరుతో లింగాల మండలంలోని దొండ్లవాగులో సర్వే నంబరు-15లో ఒక్కొక్కరి పేరిట 5 ఎకరాల భూములు తీసుకున్నారు. ఈ భూములను 2020 మేలో రిజిస్టర్ కూడా చేసుకున్నట్లు రికార్డుల్లో ఉన్నాయి. ఈ భూముల్లో చీనీ, నిమ్మ సాగు చేస్తున్నారు. ఇక... వైఎస్ మధుసూదన్ రెడ్డి తొండూరు మండలం మల్లెల గ్రామంలో పెద్దఎత్తున భూములు ఆక్రమించి ఎస్టేట్ నిర్మించుకున్నట్లు తేలింది. ఇక్కడ ఉన్న చెరువుల్లో బోర్లు వేసి పైపులైన్ల ద్వారా ఎస్టేట్‌కు సాగునీరు అందిస్తున్నారు. ఇవన్నీ ప్రభుత్వ భూములే అని నిర్ధారణ అయ్యింది. తొండూరు మండలంలోని మల్లెల, లింగాల మండలంలోని దొండ్లవాగులో ఆక్రమిత భూములను స్వాధీనం చేసుకోవాలని కడప కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ గురువారం రాత్రి అధికారులను ఆదేశించారు.

తెలంగాణలో స్థానిక ఎన్నికలకు బ్రేక్!

- బీసీలకు 42% రిజర్వేషన్ల జీవోపై హైకోర్టు స్టే
- 50% మించరాదన్న వాదనతో ఏకీభవించిన హైకోర్టు

హైదరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఉత్కంఠ భరితంగా మారిన స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను తెలంగాణ హైకోర్టు నిలిపేసింది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్రప్రభుత్వం జారీ చేసిన జీవో 9పై స్టే విధిస్తూ గురువారం మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. జీవోపై స్టే ఇవ్వడంతో ఎన్నికల ప్రక్రియ నిలిచిపోయింది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం దాటరాదని సుప్రీంకోర్టు విధించిన పరిమితిని ప్రభుత్వం ఉల్లంఘించిందన్న పిటిషనర్ల వాదనలతో హైకోర్టు ఏకీభవించింది. దీనిపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్ దాఖలు చేయడానికి ప్రభుత్వానికి 4వారాలు, ప్రభుత్వ కౌంటర్‌కు ప్రత్యుత్తరం ఇవ్వడానికి పిటిషనర్లకు 2వారాల సమయం ఇచ్చింది. విచారణను ఆరు వారాలకు వాయిదా వేసింది. బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా బీసీ నాయకులు, బీసీ సంఘాలు దాఖలు చేసిన దాదాపు 60 ఇంప్లీడ్ పిటిషన్‌లను విచారణకు స్వీకరిస్తున్నట్లు హైకోర్టు పేర్కొంది. స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీచేసిన జీవోను సవాల్ చేస్తూ బుట్టెంగారి మాధవరెడ్డి, తదితరులు దాదాపు 10పిటిషన్‌లు దాఖలు చేశారు. బుధవారం వాదనలు ముగియక పోవడంతో గురువారం మధ్యాహ్నం 2.15 గంటల నుంచి చీఫ్ జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం విచారణ కొనసాగించింది. రాష్ట్ర ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపించారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచే మరో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది రవివర్మ వాదించారు. రిజర్వేషన్లు 50శాతానికి మించరాదని రాజ్యాంగంలో ఎక్కడా లేదని, ఇది కేవలం సుప్రీంకోర్టు ఇచ్చిన రూలింగ్ మాత్రమేనన్నారు. 15శాతం కూడా లేని ఇతర కులాలకు 33 శాతం ఓపెన్ క్యాటగిరీ ఉన్నప్పుడు పిటిషనర్లకు అభ్యంతరం ఉండాల్సిన అవసరం లేదని వ్యాఖ్యానించారు. వాదనలు విన్న ధర్మాసనం జీవో 9పై స్టే విధిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

చెవిరెడ్డి పేరిట 18 కోట్ల వసూళ్లు!

- కంటెయినర్ల వ్యాపారం అంటూ మాయ

పటాన్‌చెరు, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వైసీపీ నేత, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పేరు చెప్పి గృహిణుల నుంచి ఓ మహిళ రూ.18కోట్ల మేర వసూళ్లు చేసిన ఘటన హైదరాబాద్‌లో గురువారం వెలుగు చూసింది. పోలీసులు, బాధితుల కథనం ప్రకారం.. సికింద్రాబాద్ సీతాఫల్‌మండిలో నివాసమున్న విద్య అనే మహిళ రెండేళ్ల క్రితం ఈ వసూళ్లకు పాల్పడింది. చెవిరెడ్డి పేరు చెప్పి కంటెయినర్ల వ్యాపారం చేస్తున్నామని, తమ వ్యాపారంలో పెట్టుబడులు పెడితే రెట్టింపు డబ్బులు వస్తాయని నమ్మబలికింది. దీంతో మహిళలు రూ.లక్షల్లో డబ్బు, ఇంట్లోని బంగారం ఆమెకు ఇచ్చారు. ఈ విధంగా విద్య రూ.18కోట్ల మేర వసూలు చేసింది. తర్వాత విద్య సీతాఫల్‌మండీలోని ఇల్లు ఖాళీచేసి పటాన్‌చెరు ఏపీఆర్ గ్రాండియా కాలనీలోని విల్లాకు మకాం మార్చింది. గురువారం ఆమె ఇంటికి వెళ్లిన బాధిత మహిళలపై భర్త దిద్ది రాజశేఖర్, అతని సోదరులు రంజిత్, శివ, నిఖిల్, విద్య కుమారుడు అభి, పనిమనిషి స్వప్న కలిసి కట్టెలు, సుత్తి, ఇనుపరాడ్లతో దాడి చేశారు. ఈ దాడిలో కళమ్మ తలకు బలమైన గాయమైంది. అనంతరం బాధితులు పటాన్‌చెరు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

విస్కీ తాగుతూ యువకుడు మృతి

- ల్యాబ్‌కు 'రాయల్ లేన్సర్' సీసాలు.. కల్తీ మద్యం కాదు: అధికారులు

ఏలూరు క్రైం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఒక బ్రాందీ షాపు పర్మిట్ రూమ్‌లో రూ.99 మద్యం తాగుతూ ఒక యువకుడు మృతి చెందాడు. గురువారం జరిగిన ఈ ఘటన ఏలూరు నగరంలో కలకలం రేపింది. యువకుడు తాగిన మద్యం బ్రాండ్ బాటిల్స్‌ను పోలీస్, ఎక్సైజ్ అధికారులు సీజ్ చేసి ఆర్ఎఫ్ఎస్ఎల్ ల్యాబ్‌కు పంపించారు. పోలీసులు తెలిపిన మేరకు... ఏలూరు జిల్లా చింతలపూడికి చెందిన మేకా అనిల్ (30) భార్య, పిల్లలను ఒదిలి కొంతకాలంగా ఏలూరులో ఉంటూ తాపీ పనులకు వెళ్తున్నాడు. అతనికి అతిగా మద్యం తాగే అలవాటు ఉంది. విజయవిహార్ సెంటర్ సమీపంలో ఎస్ఆర్ వైన్స్ కు(షాపు నంబర్ 4) గురువారం ఉదయం 10.39 గంటలకు అనిల్ వచ్చాడు. రూ.99 రాయల్ లేన్సర్ విస్కీ తీసుకుని గ్లాసులో వాటర్ ప్యాకెట్ నీళ్లు కలుపుకుని తాగుతూ కూలబడిపోయాడు. అదే సమయంలో ఇంకో వ్యక్తి అతడి జేబులోని సెల్‌ఫోన్ తీసుకుని వెళ్లిపోయాడు. గంట తరువాత అతను మరణించినట్లు షాపు నిర్వాహకులు గమనించి పోలీసులకు సమాచారమిచ్చారు. టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ ప్రభుకుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ ఆవులయ్య మాట్లాడుతూ... 'కల్తీ మద్యం అని అపోహపడాల్సిన అవసరం లేదు. సంబంధిత బాటిల్స్‌లో నాణ్యమైన మద్యమే ఉంది' అని పేర్కొన్నారు.





యువకుడు తాగిన మద్యం బాటిల్, మృతి చెందిన మేకా అనిల్

పెద్దిరెడ్డి పీఏ మిమ్మల్నెందుకు కలిశారు?

- ఫైళ్లు దహనం చేస్తారని మీకు తెలియదా?
- మాజీ ఆర్డీవో మురళిని ప్రశ్నించిన సీఐడీ
- అన్నిటికీ మౌనమే సమాధానం.. ముగిసిన కస్టడీ

తిరుపతి క్రైం, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా మదనపల్లె ఆర్డీవో కార్యాలయంలో ఫైళ్ల దహనం కేసులో నిందితుడు మాజీ ఆర్డీవో మురళి రెండు రోజుల సీఐడీ కస్టడీ గురువారం ముగిసింది. రెండు రోజుల విచారణలోనూ సీఐడీ అధికారుల ప్రశ్నలకు అతడు మౌనంగానే ఉన్నట్లు తెలిసింది. సీఐడీ డీఎస్పీ వేణుగోపాల్, ఆయన బృందం 100కు పైగా ప్రశ్నావళి సిద్ధం చేసి మురళిని విచారించారు. ఫైళ్ల దహనం చేస్తారనే విషయం మీకు ముందుగా తెలియదా? అప్పటి మంత్రి పెద్దిరెడ్డి వ్యక్తిగత కార్యదర్శి, ఆయన ప్రధాన అనుచరుడు మిమ్మల్ని పలుసార్లు ఎందుకు కలిశారు? అనే ప్రశ్నలకు ఆయన మౌనంగా ఉండిపోయినట్లు తెలిసింది. గౌతమ్‌తేజ ఫైళ్ల దహనం కేసులో ప్రధాన సూత్రధారి కాదా? అని ప్రశ్నించగా.. అది ఆయన్నే అడగాలని అన్నట్లు సమాచారం. ఫ్రీహోల్డ్ భూముల విషయంలో ఒక అధికారిగా మీ పాత్ర లేదా అన్న ప్రశ్నకు తనకేమీ తెలియదని, ప్రశ్నలు వేసి ఇబ్బంది పెట్టొద్దని చెప్పినట్లు సమాచారం. కస్టడీ ముగియడంతో శుక్రవారం ఆయనకు వైద్య పరీక్షలు నిర్వహించి జైలుకు తరలించనున్నారు.

కల్తీ మద్యం దందాపై సీబీఐతో దర్యాప్తు జరిపించండి

- అమిత్ షాకు వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి లేఖ

న్యూఢిల్లీ, అక్టోబరు 9(ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం దందాపై సీబీఐతో విచారణ జరిపించాలని వైసీపీ ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం ఈ మేరకు ఆయన కేంద్ర హోం మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. 'నా పార్లమెంటరీ నియోజకవర్గం రాజంపేట పరిధిలోని ములకలచెరువులో కల్తీ చేసిన ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ తయారీ, అమ్మకాలు వ్యవస్థీకృత కార్యకలాపాలుగా మారాయి. ఇది ఇటీవలి పోలీసుల దాడులతో వెల్లడయింది. ఈ ఘటనపై తక్షణమే కేంద్రం దర్యాప్తు జరపాలి. కల్తీ మద్యంతో ఏపీ, పొరుగు రాష్ట్రాల్లో ఇప్పటికే అనేక మరణాలు సంభవించాయి' అని ఎంపీ పేర్కొన్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.